www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 27-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 150 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: నవమి రా 1.34 తదుపరి దశమి; నక్షత్రం: రోహిణి మ. 3.38 తదుపరి మృగశిర; వర్జ్యం: ఉ.7.49-9.18, రా.9.17-10.54; దుర్ముహూర్తం: ఉ.8.32-9.22, రా.10.16-11.01; అమృతఘడియలు: మ.12.28-2.03; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.04; సూర్యాస్తమయం: 6.28 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మన రోడ్లపైనా డ్రైవర్ రహిత కార్లు

దేశానికి ఆదర్శంగా ఐఐటీహెచ్ పరిశోధనలు

కొనియాడిన ఐటీ మంత్రి శ్రీధర్ బాబు

టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డితో

కలిసి డ్రైవర్ రహిత వాహనాల పరిశీలన

జపాన్ సహకారంతో 'టీ-హాన్' పరిశోధనలు

14



డ్రైవర్ రహిత వాహనంలో శ్రీధర్‌బాబు, జగ్గారెడ్డి



సివిల్స్ అభ్యర్థులకు చెక్కు అందిస్తున్న సీఎం

దీక్షలు మీరే చేయొచ్చుగా!

హరీశ్, కేటీఆర్‌కు పదవులు పోగానే విద్యార్థులు గుర్తుకొస్తున్నారా?

అభ్యర్థులూ.. వారి కుట్రలో పడొద్దు

90 రోజుల్లో 30 వేల కొలువులు ఇచ్చాం

35 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ

10-15 రోజుల్లో వర్సిటీలకు వీసీలు

రాజీవ్ సివిల్స్ అభయహస్తం కింద సివిల్స్ అభ్యర్థులకు సాయంలో సీఎం రేవంత్

ప్రిలిమ్స్ పాసైన 135 మందికి రూ.లక్ష

హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్లలో ఉద్యోగాలు ఇవ్వనివారు.. తాము ఉద్యోగ నియామకాలకు పరీక్షలు నిర్వహిస్తుంటే వాయిదా వేయాలంటూ ధర్నాలు చేయిస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఉద్దేశపూర్వకంగా విద్యార్థులను రెచ్చగొట్టి లబ్ధి పొందుతున్నారని ఆరోపించారు. గతంలో రెచ్చగొట్టి, పిల్లల ప్రాణాలు బలి తీసుకొని పదవులు పొందారని, ఇప్పుడు పదవులు పోగానే మళ్లీ విద్యార్థులు, వారి ప్రాణాలు గుర్తుకొస్తున్నాయని మండిపడ్డారు. "మళ్లీ ఆమరణ దీక్షలకు

మిగతా 3వ పేజీలో...

తప్పెవరిది..

శిక్ష ఎవరికి?

అధికారులు అడ్డదారి తొక్కి అనుమతులిస్తే కొనుగోలుదారులు ఎవరిని నమ్మాలి?

హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ ఆమోదం లభించిందన్న ధైర్యంతో ఇళ్లు, ఫ్లాట్లు, ప్లాట్లు కొనేవారి పరిస్థితేంటి?



ప్రగతినగర్‌లో కూల్చివేసిన నిర్మాణం (ఫైల్)

బ్యాంకులు లోన్లు ఇవ్వడానికీ ఆధారం అవే!

కొన్నాక హైడ్రా వచ్చి కూల్చేస్తే ఏంచేయాలి?

లోన్ తీర్చకుంటే బ్యాంక్ ఊరుకుంటుందా?

రుణాల ఎగవేతతో బ్యాంకులూ నష్టాల్లోకి

అధికార్లపై సర్కారు చర్యలెందుకు తీసుకోదు?

తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్న సామాన్యులు

హైదరాబాద్ చందానగర్‌లో జీహెచ్ఎంసీ అనుమతులతో నిర్మించిన జీ+3, జీ+4 భవనాలను ఇటీవలే హైడ్రా కూల్చేసింది! ఆ భవనాలు ఈర్ల చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) పరిధిలో ఉన్నందునే కూల్చేశామని హైడ్రా చెబుతోంది! అంతేకాదు.. ఆ భవనాల నిర్మాణ పనులు పూర్తి కాకముందే పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ఆక్యుపేషన్ సర్టిఫికెట్ ఇవ్వడం గమనార్హం.

ప్రగతినగర్‌లో.. హెచ్ఎండీఏ అనుమతులతో స్టిల్ట్ ప్లస్ ఐదంతస్తులతో నిర్మించిన 3 భవనాలను హైడ్రా నేలమట్టం చేసింది! ఇక్కడా.. ఆ విభాగం చెప్పిన మాట అదే.. ఆ భవనాలు ఎర్రకుంట చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయని!!

చెరువులను పునరుద్ధరించాలన్న సర్కారు ఆలోచన మంచిదే! నిబంధనలను మీరి అడ్డగోలుగా నిర్మించిన అక్రమ కట్టడాలను చట్టప్రకారం కూల్చివేయడాన్నీ ఎవరూ తప్పు పట్టరు! కానీ.. అవి అడ్డగోలు నిర్మాణాలని తెలిసీ అనుమతులు ఇచ్చిన అధికారులపై మరి చర్యలు ఏవి? బిల్డర్లు, అధికారులు కుమ్మక్కై కట్టిన ఇళ్లు, ఫ్లాట్లను జీహెచ్ఎంసీ/ హెచ్ఎండీఏ/ రెరా అనుమతులు ఉన్నాయి అనే భరోసాతో కొన్న సామాన్యుల పరిస్థితి ఏంటి? వాటిని చూపి బ్యాంకుల్లో లోన్లు తీసుకున్నాక.. హైడ్రా వచ్చి కూల్చేస్తే రుణాలు ఎలా తీర్చాలి? సామాన్యులు చేతులెత్తేస్తే.. బ్యాంకులకూ నష్టమే కదా? ఇక్కడ తప్పెవరిది? శిక్ష ఎవరికి?

13

ఒవైసీ ఆక్రమణలను కూల్చే దమ్ముందా..?

బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి సవాల్

పేదలకు ఇబ్బంది కలిగిస్తే ఊరుకోం

బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం

కూల్చివేతలు.. పులి మీద స్వారీనే

రేవంత్ పులి దిగితే.. తినేస్తుంది

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

లిడ్ క్యాప్ స్థలంలో ఇళ్ల కూల్చివేత

అడ్డుకున్న బాధితులు


రాయదుర్గంలో ఉద్రిక్తత

రాజకీయ హైడ్రామా!

పార్టీల పరస్పర ఆరోపణ

తప్పుటట్టలేని పరిస్థితి

రహస్యాలు బయటకు



72 సేవలపై స్టాంప్ డ్యూటీ!

ఫ్రాంచైజీ, కాపీరైట్స్, ప్రకటనలు, కార్పొరేట్ ఒప్పందాలపైనా ఫీజులు

ఆన్‌లైన్ చేసి, రాబడి పెంచుకోవడంపై దృష్టి

రిజిస్ట్రేషన్ సేవల్లో మార్పులకు సర్కారు సిద్ధం!

భూముల విలువలను శాస్త్రీయంగా పెంచాలి

ప్రజలకు భారంగా పరిణమించకూడదు

అధికారులకు మంత్రి పొంగులేటి సూచన

మహారాష్ట్ర, ఎంపీ, కర్ణాటకకు బృందాలు

హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందించే రిజిస్ట్రేషన్ సేవల్లో మార్పు రావాలని, అదే సమయంలో ఆదాయాన్నీ పెంచుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటైన స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ పరిధిలో ఉన్న అన్ని ఆదాయ మార్గాలపైనా దృష్టి సారిస్తోంది. అనేక డాక్యుమెంట్లకు స్టాంప్ డ్యూటీని వర్తింపజేయాలని యోచిస్తోంది. సాధారణంగా రిజిస్ట్రేషన్లంటే క్రయవిక్రయాలు, గిఫ్ట్ డీడ్‌లు, డెవలప్‌మెంట్ అగ్రిమెంట్లు మాత్రమే మనకు కనిపిస్తాయి. కానీ, తనఖా, లీజ్ అగ్రిమెంట్స్, ఫ్రాంచైజీ లీజ్ వంటివి అనేకం ఉన్నాయి. రిజిస్ట్రేషన్ చట్టంలోని నిబంధనల ప్రకారం 72 రకాల డాక్యుమెంట్ల ద్వారా కూడా ఆదాయాన్ని

మిగతా 12వ పేజీలో...

సీఎంఆర్ఎఫ్ స్వాహా

1 30 ఆస్పత్రులపై క్రిమినల్ కేసులు!.. సీఐడీ విచారణ వేగవంతం

1 చిన్న క్లినిక్‌లలోనూ పెద్ద సర్జరీలు.. వైద్యుడు, రోగి లేకున్నా కేస్ షీట్లు

1 అనుమానం రాకుండా బిల్లులు.. ఒక్కోటిగా బయటపడుతున్న బాగోతాలు

1 నిధులు జమయిన ఖాతాలపై దృష్టి.. సహకరించిన అధికారులపైనా ఆరా

కరీంనగర్ క్రైం/మిర్యాలగూడ అర్బన్/హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వైద్యం చేయకుండానే ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) సొమ్ము స్వాహా చేశారన్న ఆరోపణలపై మొత్తం 30 ఆస్పత్రులపై సీఐడీ అధికారులు క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలిసింది. హైదరాబాద్‌తోపాటు ఉమ్మడి వరంగల్, నల్లగొండ, కరీంనగర్, రంగారెడ్డి జిల్లాల్లోని ఆయా ఆస్పత్రులు అక్రమంగా సీఎంఆర్ఎఫ్ పొందినట్లు గుర్తించిన అధికారులు.. రెండు, మూడు రోజులుగా కేసులు నమోదు చేస్తూ వస్తున్నారు. తాజాగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మూడు, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని నాలుగు ప్రైవేట్ ఆస్పత్రులపై కేసులు నమోదు చేసినట్లు సమాచారం. ఈ మేరకు అధికారుల దర్యాప్తులో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. వాస్తవానికి సీఎంఆర్ఎఫ్ స్వాహా చేశారన్న ఆరోపణలపై గత ఏడాది ఏప్రిల్‌లో సెంట్రల్ క్రైం స్టేషన్(సీసీఎస్) పోలీసులు విచారణ చేపట్టారు. అప్పట్లోనే కొన్ని ఆస్పత్రుల నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నా.. రాజకీయ ఒత్తిళ్లతో వదిలేశారు. ఆ తర్వాత ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అధికారులు సైతం సంబంధిత ఫైల్‌ను పక్కనపెట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి వచ్చాక అప్పటి అక్రమాల లెక్క తేల్చాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు

మిగతా 12వ పేజీలో...





యూపీఐ తరహాలో..

యూఎల్ఐ

రుణాల కోసం తీసుకురానున్న ఆర్బీఐ

ఒక్క సమ్మతితో వెంటనే మంజూరు

ప్రస్తుతం 2 రాష్ట్రాల్లో.. త్వరలో దేశవ్యాప్తం

ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ వెల్లడి

2

రూ.35కే క్షయ పరీక్ష

కొత్త టెక్నాలజీని అభివృద్ధి చేసిన ఐసీఎంఆర్

మూడు దశల్లో వ్యాధి నిర్ధారణ

రెండున్నర గంటల్లో 1500 శాంపిల్స్ పరీక్ష

2

మరో డీఎస్సీ?

ఉపాధ్యాయ ఖాళీలపై ప్రభుత్వం కసరత్తు

జిల్లాల వివరాల సేకరణలో అధికారులు


డిసెంబరు లేదా జనవరిలో నోటిఫికేషన్

జూన్, జూలైలోపు నియామకాలు పూర్తి



హైదరాబాద్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఖాళీల భర్తీ కోసం మరో డీఎస్సీ ప్రకటించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి ఖాళీలు ఎన్ని ఉన్నాయనే అంశంపై అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. ఇప్పటికే 11,062 పోస్టుల భర్తీకి డీఎస్సీ నిర్వహించి ప్రాథమిక కీని విడుదల చేశారు. సెప్టెంబరు మొదటి వారంలో ఫలితాల వెల్లడికి చర్యలు తీసుకుంటున్నారు. అనంతరం అక్టోబరు నెలాఖరు నాటికి జిల్లాల వారీగా నియామకాలను పూర్తి చేయాలని భావిస్తున్నారు. అవి కాగానే కొత్త డీఎస్సీని ప్రకటించాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. డిసెంబరు లేదా జనవరిలో నోటిఫికేషన్ జారీ చేసి, జూన్, జూలైలోపు నియామకాలను పూర్తి చేసేలా ప్రణాళిక ఖరారు చేయాలని భావిస్తున్నారు. ఆ లోపు టెట్‌ను కూడా నిర్వహించే అవకాశం ఉంది. కొత్త డీఎస్సీ కోసం రాష్ట్రంలో భర్తీ చేయాల్సిన ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య ఏ మేరకు ఉండవచ్చనే అంశంపై అధికారులు జిల్లాల వారీగా సమాచారం సేకరిస్తున్నారు. పాఠశాలల సంఖ్య, అందులోని విద్యార్థులు, ఖాళీల వివరాలను పరిశీలిస్తున్నారు. ఇప్పటికే ప్రకటించిన డీఎస్సీ ద్వారా నియమితులయ్యే ఉపాధ్యాయులు అందుబాటులోకి వచ్చిన తర్వాత.. ఇంకా ఎన్ని ఖాళీలు

మిగతా 3వ పేజీలో...



పోలీసులు పట్టుకున్న డ్రగ్స్

రూ. 8.5 కోట్ల విలువైన.. డ్రగ్స్ సీజ్

సంగారెడ్డి ఫ్యాక్టరీలో తయారీ!

ముగ్గురిని అరెస్టు చేసిన హెచ్-న్యూ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఆమ్‌ఫెటమైన్ డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్న ఓ ముఠాను హెచ్-న్యూ పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు ఇప్పటికే జైలులో ఉండగా.. ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి.. వారి నుంచి రూ.8.5 కోట్ల విలువ చేసే 8.5 కిలోల ఆమ్‌ఫెటమైన్ డ్రగ్స్‌ను సీజ్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హైదరాబాద్ పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలకు చెందిన డ్రగ్ పెడ్లర్ కుంచాల నాగరాజు.. అతని అనుచరులు

మిగతా 14వ పేజీలో...

మాలీవుడ్‌లో కీచకులు

పరిశ్రమను కుదిపేస్తున్న జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్

ఒక్కరోజే పలువురు నిర్మాతలు, నటులపై 'మీ టూ' ఆరోపణలు

నటుడు సిద్దిఖీ నా దృష్టిలో క్రిమినల్: రేవతి సంపత్

నన్ను ఇండస్ట్రీలో లేకుండా చేస్తానని బెదిరించాడు

దర్శకుడు తులసీదాస్‌పై నటి గీతావిజయన్ నిప్పులు

రంజిత్ బాలకృష్ణ నన్ను హోటల్ గదికి రమ్మన్నాడు

తీవ్రస్థాయిలో మండిపడ్డ బెంగాలీ నటి శ్రీలేఖ మిత్ర

ఐదుగురి వేధింపులు తట్టుకోలేక తాను చెన్నైకి

వెళ్లిపోయానంటూ నటి మీను మునీర్ ఆవేదన

నిందితులపై వెంటనే చర్యలు తీసుకోవట్లేదు

నేను ఐదేళ్ల కెరీర్ కోల్పోయా: చిన్మయి ఆవేదన

10



శ్రీలేఖ



మీను మునీర్

మిస్టరీ లవ్ స్టోరీ!

ఏపీలో ఎన్నికలకు ముందు తతంగం

ముంబై నటితో వైసీపీ నేత చెట్టపట్టాల్

ఆపై చీటింగ్ ఫిర్యాదు.. ముంబైకి పోలీసులు

నటి, తల్లిదండ్రుల అరెస్టు.. 14 రోజులు జైల్లో

పెళ్లి ఊసెత్తబోమని రాసిచ్చాక కేసు క్లోజ్


ఇదే ఎపిసోడ్‌లో మరో బడా పారిశ్రామికవేత్త!?

ఆయనపై గతంలో రేప్ కేసు పెట్టిన నటి

దారికి తెచ్చుకునేందుకే ఇక్కడ తప్పుడు కేసు?

అరెస్టు తర్వాత రేప్ కేసు వాపస్ తీసుకున్న నటి

12



ఒక ఆంధ్రా పారిశ్రామిక వేత్త! పైగా... వైసీపీ నేత! అందులోనూ అప్పటి ముఖ్యమంత్రి జగన్‌కు బాగా సన్నిహితుడు! అటు వైపు.. ముంబైలో ఓ మోస్తరు నటి, సెలబ్రిటీ మహిళ! ఇద్దరి మధ్యా ప్రేమలాంటి ఒక వ్యవహారం... ఆ తర్వాత వివాదం! కథ అనేక మలుపులు తిరిగింది. 'ఆమె నన్ను బ్లాక్ మెయిల్ చేస్తోంది' అంటూ ఆయన ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేయడమే ఆలస్యం! పోలీసులు ఆగమేఘాల మీద ముంబైకి వెళ్లి ఆ మహిళను, ఆమె తల్లిదండ్రులనూ పట్టుకొచ్చి అరెస్టు చేసేశారు. చిన్న చిన్న కేసులకే భారీ హడావుడి చేసే పోలీసులు... ఈ మొత్తం వ్యవహారాన్ని సైలెంట్‌గా నడిపారు. చివరికి... రెండు పక్షాల మధ్య రాజీ కుదిరింది. కేసు క్లోజ్! జాతీయ స్థాయిలో పేరున్న బడా పారిశ్రామికవేత్త పాత్ర కూడా ఉన్న ఈ తతంగం ఫిబ్రవరిలో జరిగింది. ఇప్పుడు అనుకోని పరిస్థితుల్లో వెలుగులోకి వచ్చింది!



బాబు భద్రత 'గాలి'లో దీపమా?

ఏపీ సీఎంకు కేటాయించిన హెలికాప్టర్‌పై సందేహాలు.. పనితీరు అంచనాలో వైఫల్యం

ముంబై నుంచి వస్తూ పుణె వద్ద ప్రమాదం

తక్కువ ఎత్తులోంచి కూలినా పూర్తిగా ధ్వంసం

ఏవియేషన్ అధికారుల నిర్లక్ష్యమని విమర్శలు

చంద్రబాబు ఉన్నప్పుడు జరిగి ఉంటే?

14

పాక్‌లో నరమేధం

21 మంది టెర్రరిస్టులు సహా 73 మంది మృతి

బలూచిస్తాన్‌లో పోలీస్ స్టేషన్లు, రైల్వే లైన్లు, హైవేలే లక్ష్యంగా దాడులు

2

రూ.35కే క్షయ నిర్ధారణ పరీక్ష

కొత్త టెక్నాలజీని అభివృద్ధి చేసిన ఐసీఎంఆర్

న్యూఢిల్లీ, ఆగస్టు 26: ప్రపంచానికి సవాలు విసురుతున్న రోగాల్లో క్షయ ఒకటి. దీని నిర్ధారణ ఖర్చుతో కూడుకున్నది. ప్రస్తుతం సాంప్రదాయ పద్ధతుల ద్వారా టీబీని నిర్ధారించడానికి 42 రోజులు పడుతోంది. అయితే కేవలం రూ.35 ఖర్చుతోనే రోగి కఫాన్ని పరీక్షించి క్షయ వ్యాధిని నిర్ధారించే కొత్త సాంకేతిక వ్యవస్థను ఐసీఎంఆర్‌కు చెందిన అసోంలోని డిబ్రూగఢ్ ప్రాంతీయ కార్యాలయం అభివృద్ధి చేసింది. 'సీఆర్ఐఎస్‌పీఆర్ కేస్-బేస్డ్ టీబీ డిటెక్షన్ సిస్టమ్' అని పిలిచే ఈ చిన్న పరికరం చాలా తేలికైంది. మూడు దశల్లో క్షయ నిర్ధారణ చేసే ఈ పరికరంతో రెండున్నర గంటల్లో ఏకబిగిన 1,500 శాంపిల్స్‌ను పరీక్షించవచ్చని ఐసీఎంఆర్ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే ఉన్న కొన్ని టీబీ నిర్ధారణ పద్ధతులు మెరుగైన ఫలితాలను అందిస్తున్నా సమయం, ఖర్చు ఎక్కువగా ఉంటోందని ఐసీఎంఆర్ అధికారి ఒకరు చెప్పారు. వీటిని పరిగణనలోకి తీసుకుంటే సీఆర్ఐఎస్‌పీఆర్-కేస్12ఏ ఆధారిత వ్యాధి నిర్ధారణ వ్యవస్థ మంచి పరిష్కారాన్ని అందిస్తుందన్నారు. దీనికి విస్తృత మార్కెట్‌ను కల్పించేందుకు అర్హులైన సంస్థలు, కంపెనీలు, తయారీదారులకు ఈ టెక్నాలజీని బదిలీ చేయాలని ఐసీఎంఆర్ భావిస్తోంది. ఆసక్తి ఉన్న కంపెనీలు, సంస్థలు ముందుకురావాలని ఆహ్వానించింది. వీటి తయారీకి ముందుకొచ్చే సంస్థలకు ఐసీఎంఆర్ మార్గదర్శకత్వం,సాంకేతిక సహకారం అందిస్తుందని ఆ అధికారి తెలిపారు.


గంజాయిలోని రసాయనంతో వృద్ధాప్యం వెనక్కి!



జర్మనీ, ఇజ్రాయెల్ పరిశోధకుల తాజా అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 26: గంజాయి వ్యసనం ఆరోగ్యానికి ప్రమాదకరం! కానీ, అదే గంజాయిలోని టెట్రాహైడ్రోక్యానబినోల్ (టీహెచ్‌సీ) అనే రసాయనాన్ని అతి తక్కువ మోతాదులో దీర్ఘకాలంపాటు వైద్యుల పర్యవేక్షణలో ఔషధంలా వాడితే.. అది వృద్ధాప్యం వల్ల మెదడులో వచ్చే మార్పులను రివర్స్ చేస్తుందని, వయసు మీరే ప్రక్రియను ఆలస్యం చేస్తుందని (యాంటీ ఏజింగ్ ఎఫెక్ట్) తాజా అధ్యయనంలో వెల్లడైంది. జర్మనీకి చెందిన యూనివర్సిటీ ఆఫ్ బాన్, యూనివర్సిటీ హాస్పిటల్ బాన్, ఇజ్రాయెల్‌కు చెందిన హిబ్రూ వర్సిటీ పరిశోధకులు.. ఎలుకల మెదళ్లపై ఈ అధ్యయనం చేశారు. వృద్ధాప్యం వల్ల ఆ ఎలుకల మెదళ్లలో వచ్చే సాధారణ సమస్యలను టీహెచ్‌సీ నయం చేయగలిగినట్టు వారు గుర్తించారు. సాధారణంగా మనుషుల్లో వయసు పెరిగే కొద్దీ మతిమరపు, మెదడు చురుగ్గా పనిచేయకపోవడంవంటి సమస్యలువస్తుంటాయి. ఆ సమస్యలకు చెక్‌పెట్టే ఔషధాల రూపకల్పనకు ఈ అధ్యయన ఫలితాలు దోహదం చేస్తాయని వైద్యనిపుణులు భావిస్తున్నారు.

లోకం తీరు



ఉక్రెయిన్‌పై భీకర దాడులు

- 200కు పైగా క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించిన రష్యా
- బ్రిటన్ జర్నలిస్టు సహా 13 మంది దుర్మరణం

కీవ్, ఆగస్టు 26: ఉక్రెయిన్‌పై రష్యా విరుచుకుపడింది. తమదేశంలోకి చొచ్చుకువస్తున్న ఉక్రెయిన్‌కు చెక్ పెడుతూ.. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు 200కు పైగా క్షిపణులు, 100కు పైగా డ్రోన్లు, రాకెట్లతో దాడులు జరిపింది. ఈ దాడుల్లో ఉక్రెయిన్ వ్యాప్తంగా కీలక నగరాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. రాజధాని కీవ్ నగరంలో తాగునీటి సరఫరా, విద్యుత్తు వ్యవస్థలు అతలాకుతలమయ్యాయి. ఇంధన కేంద్రాలే లక్ష్యంగా రష్యా దాడులకు పాల్పడడంతో.. చాలా చోట్ల విద్యుత్తు అంతరాయాలేర్పడ్డాయి. ఈ దాడుల్లో 13 మంది మృతిచెందగా.. డజన్ల కొద్దీ పౌరులు గాయపడ్డారు. మృతుల్లో బ్రిటన్ జర్నలిస్టు(రాయిటర్స్) కూడా ఉన్నారు. ఆదివారం అర్ధరాత్రి దాటాక రష్యా దాడులు ప్రారంభమైనట్లు ఉక్రెయిన్ వర్గాలు తెలిపాయి. సోమవారం ఉదయం వరకు కొనసాగిన బాంబింగ్.. రష్యా దురాక్రమణ తర్వాత అతిపెద్ద దాడులని పేర్కొన్నాయి. 127 బాలిస్టిక్, 102 క్రూయిజ్ క్షిపణులతోపాటు.. 109 డ్రోన్లతో రష్యా దాడులకు పాల్పడినట్లు ఉక్రెయిన్ అధికారిక వార్తా సంస్థ 'ఉక్రిఇన్ఫాం' తెలిపింది. ఉక్రెయిన్ వైమానిక దళం 99 రష్యన్ డ్రోన్లను కూల్చివేసినట్లు తెలిపింది. రష్యా దాడుల్లో వేర్వేరు ప్రాంతాల్లో మొత్తం 13 మరణాలు నమోదయ్యాయని, డజన్ల కొద్దీ పౌరులు గాయపడ్డారని అధికారులు వివరించారు. తూర్పు ఉక్రెయిన్‌లోని డోనెట్స్క్ ప్రాంతంలో.. ఓ హోటల్‌పై జరిగిన క్షిపణి దాడిలో.. బ్రిటిష్ జర్నలిస్టుల బృందం(రాయిటర్స్)లోని ఓ సభ్యుడు మరణించాడని, మరో ఐదుగురు పాత్రికేయులు గాయపడ్డారని వెల్లడించారు. ఇదే హోటల్‌లో మరో 7 మరణాలు నమోదైనట్లు తెలిపారు. ఈ దాడి అత్యంత హేయమైనదని, రష్యాకు తప్పక గుణపాఠం చెప్తామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ హెచ్చరించారు.


రష్యాలో 38 అంతస్తుల భవనంపై 9/11 తరహాలో ఉక్రెయిన్ డ్రోన్ దాడి



దాదాపు 23 ఏళ్ల క్రితం.. 2001 సెప్టెంబరు 11న న్యూయార్క్‌లోని జంట హర్మ్యాలను అల్‌ఖాయిదా ఉగ్రవాదులు విమానాలతో ఢీకొట్టారు గుర్తుందా? అచ్చం అలాగే.. ఉక్రెయిన్ డ్రోన్ ఒకటి సోమవారం రష్యాలోని సారటోవ్‌లో 38 అంతస్తుల నివాసభవనాన్ని ఢీకొట్టింది. ఈ దాడిలో ఒక మహిళ సహా నలుగురికి గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆ మహిళ పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. కాగా.. ఉక్రెయిన్ డ్రోన్ దాడి వీడియో సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయ్యింది. ఉక్రెయిన్ డ్రోన్ దాడుల నేపథ్యంలో సారటోవ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల రాకపోకలపై ఆంక్షలు విధించారు.

సూసైడ్ డ్రోన్‌ను పరీక్షించిన కిమ్





న్యూఢిల్లీ, ఆగస్టు 26: ఉత్తర కొరియా శనివారం శక్తిమంతమైన ఒక ఆత్మాహుతి డ్రోన్‌ను పరీక్షించింది. ఈ విషయాన్ని ఆ దేశ మీడియా సోమవారం వెల్లడించింది. పరీక్షల్లో భాగంగా దక్షిణ కొరియాకు చెందిన కే-2 యుద్ధ ట్యాంకును పోలి ఉన్న ఓ వాహనాన్ని ఈ డ్రోన్‌తో పేల్చివేశారు. దీన్ని అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ స్వయంగా పర్యవేక్షించారు. తమ యుద్ధ సన్నద్ధతను మరింత మెరుగుపర్చుకోవడానికి ఈ సూసైడ్ డ్రోన్లు దోహదపడతాయని, వీటి తయారీని వేగవంతం చేస్తామని కిమ్ చెప్పారు. అమెరికా, దక్షిణ కొరియా సంయుక్తంగా సైనిక విన్యాసాలు నిర్వహిస్తున్న వేళ కిమ్ ఈ సూసైడ్ డ్రోన్‌ను పరీక్షించడం విశేషం.

కుప్పకూలిన 35 అడుగుల శివాజీ విగ్రహం

- ముంబైలో ప్రారంభించిన 8 నెలలకే నేలమట్టం

ముంబై, ఆగస్టు 26: మహారాష్ట్రలో ప్రారంభించిన 8 నెలలకే ఛత్రపతి శివాజీ మహరాజ్ 35 అడుగుల భారీ విగ్రహం కుప్పకూలింది. ఈ ఘటన సోమవారం సింధుదుర్గ్ జిల్లా మాల్వాన్‌లో జరిగింది. గత సంవత్సరం డిసెంబరు 4న నౌకదళ దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ ఈ విగ్రహాన్ని మాల్వాన్‌లోని రాజ్‌కోట్ కోటలో ప్రారంభించారు. గత రెండు మూడు రోజులుగా జిల్లాలో ఎడతెరిపిలేని వానలు కురుస్తున్నాయని, బలమైన గాలుల ధాటికి విగ్రహం నేలమట్టం అయినట్లు ఉన్నతాధికారులు భావిస్తున్నారు. కాగా, ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఈ ఘటన జరిగిందని ప్రతిపక్షాలు విమర్శించాయి. అయితే, శివాజీ విగ్రహాన్ని సాధ్యమైనంత త్వరగా తిరిగి అక్కడే ఏర్పాటు చేస్తామని సీఎం శిందే తెలిపారు.

ఉబెర్‌కు 2,716 కోట్ల జరిమానా

హేగ్, ఆగస్టు 26: ప్రయాణ సేవలు అందించే ఉబెర్‌పై డచ్ డేటా ప్రొటెక్షన్ అథారిటీ (డీపీఏ) కొరడా ఝళిపించింది. తగినంత రక్షణ లేకుండా అమెరికాకు యూరోపియన్ డ్రైవర్ల వ్యక్తిగత వివరాలను బదిలీ చేసినట్టు ఆరోపిస్తూ ఉబెర్‌పై 32.4 కోట్ల డాలర్ల (సుమారు రూ.2,716 కోట్లు) జరిమానాను డచ్ డీపీఏ సోమవారం విధించింది. అయితే ఈ నిర్ణయం లోపభూయిష్టంగా ఉందని, అసాధారణమైన జరిమానా పూర్తిగా అన్యాయమైందని, దీనిపై అప్పీల్‌కు వెళ్తామని ఉబెర్ తెలిపింది.

కంగనా... నోరు జారొద్దు: బీజేపీ



న్యూఢిల్లీ, ఆగస్టు 26: రైతుల నిరసనలపై బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను ఆ పార్టీ అధిష్ఠానం తప్పు పట్టింది. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు చేయవద్దంటూ ఆమెను మందలించింది. రైతుల నిరసనల విషయంలో ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోకపోతే దేశంలో బంగ్లాదేశ్ వంటి పరిస్థితులు ఏర్పడేవని ఆదివారం కంగన వ్యాఖ్యానించారు. ఈ కుట్రలో చైనా, అమెరికా ప్రమేయం ఉందని ఆరోపించారు. కేంద్రం రద్దు చేసిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు ఆందోళన చేసినపుడు అత్యాచార ఘటనలు జరిగాయని, శవాలు చెట్లకు వేలాడాయన్నారు. దీనిపై తీవ్ర విమర్శలు రావడంతో సోమవారం బీజేపీ స్పందించింది. ఆమె వ్యాఖ్యలతో పార్టీకి సంబంధం లేదని స్పష్టం చేసింది. పార్టీ తరఫున విధాన పరమైన అంశాలపై మాట్లాడే అధికారం కంగనకు లేదంది. కంగన వ్యాఖ్యలు రైతులను తీవ్రంగా అవమానించేలా ఉన్నాయని, రైతు వ్యతిరేకతే మోదీ ప్రభుత్వ డీఎన్‌ఏ అని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్ విమర్శించారు.

పాకిస్థాన్‌లో నరమేధం!

ఉగ్రదాడుల్లో 73 మంది మృతి.. 38 మంది పౌరులు.. 14 మంది పోలీసులు

- 21 మంది ఉగ్రవాదులు కూడా హతం
- బలూచిస్థాన్‌లో పోలీస్ స్టేషన్లు, రైల్వే లైన్లు, హైవేలే లక్ష్యంగా ఉగ్ర దాడులు
- బస్సులు ఆపి, ప్రయాణికులపై కాల్పులు
- దాడులు మా పనే: బీఎల్‌ఏ





ఉగ్రవాదులు నిప్పు పెట్టడంతో కాలిపోయిన వాహనాలు

కరాచీ, ఆగస్టు 26: పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో ఉగ్రవాదులు రెచ్చిపోయారు. పోలీస్ స్టేషన్లు, రైల్వే లైన్లు, హైవేలపై విచక్షణారహితంగా దాడులకు పాల్పడ్డారు. వేర్వేరు చోట్ల జరిపిన దాడుల్లో మొత్తం 73 మంది మరణించారు. మృతుల్లో 14 మంది సైనికులు, పోలీసులు ఉన్నట్లు స్థానిక అధికారులు తెలిపారు. 21 మంది ఉగ్రవాదులను కూడా హతమార్చినట్లు చెప్పారు. బలూచిస్థాన్‌లోని ముసాఖెల్ జిల్లాలో సోమవారం కొందరు ఉగ్రవాదులు ప్రధాన హైవేలపై బస్సులు, ట్రక్కులను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడినట్లు తెలిపారు. వాహనాలను అడ్డగించి, ప్రయాణికులను కిందకు దింపి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 23 మంది మరణించారు. ఖలాత్ జిల్లాలో జరిగిన కాల్పుల ఘటనలో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. బస్సులు, ట్రక్కులను అడ్డుకొని, ప్రయాణికులను కిందకు దింపి, వారి గుర్తింపు కార్డులను తనిఖీ చేసి కాల్పులు జరిపినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. పంజాబ్ ప్రావిన్స్ నుంచి వచ్చేవారే లక్ష్యంగా ఈ దాడులు జరిగినట్లు వెల్లడించారు. అక్కడి నుంచి వచ్చేవారు తమ వనరులను దోచుకుంటున్నారన్న ఆగ్రహంతోనే ఈ దాడులకు పాల్పడుతున్నట్లు చెప్పారు. మృతుల్లో అత్యధికులు దక్షిణ పంజాబ్ ప్రాంతానికి చెందినవారు కాగా, మరికొందరు ఖైబర్ పఖ్తున్వాకు చెందిన వారని తెలిపారు. బలూచిస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో ఈ నెల 24, 25 తేదీల్లో కూడా ఉగ్రదాడులు జరిగినట్లు తెలిపారు. ముసాఖెల్ హైవేపై 35కు పైగా వాహనాలకు నిప్పు పెట్టినట్లు చెప్పారు. మరో ఘటనలో పాకిస్థాన్-ఇరాన్ మధ్యనున్న రైల్వే మార్గంలో క్వెట్టాను పాక్‌తో అనుసంధానించే వంతెనను మందుపాతరలతో ధ్వంసం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడిలో ఐదుగురు మరణించినట్లు చెప్పారు. ఈ దాడులకు తామే బాధ్యులమని బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ) ప్రకటించింది. మిలిటరీ శిబిరాలపై ఆత్మాహుతి దాడులు కూడా చేశామని వెల్లడించింది. అయితే ఈ దాడులను అధికారులు ధ్రువీకరించలేదు. బలూచిస్థాన్‌లో జరిగిన వేర్వేరు దాడుల్లో మొత్తం 73 మంది ప్రాణాలు కోల్పోయినట్లు బలూచిస్థాన్ ప్రావిన్స్ ప్రభుత్వ అధికార ప్రతినిధి తెలిపారు. కాగా, బీఎల్‌ఏ దాడులను పాక్ అధ్యక్షుడు ఆసిఫ్ జర్దారీ, ప్రధాని షెహబాజ్ షరీఫ్‌లు తీవ్రంగా ఖండించారు. బాధ్యులను వదిలిపెట్టబోమన్నారు. ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలిస్తామని ప్రకటించారు. బలూచిస్థాన్ సీఎం సర్ఫరాజ్ బుగ్టి కూడా.. ఈ దాడులను పిరికిపంద చర్యగా అభివర్ణించారు.

యూపీఐ తరహాలో.. రుణాల కోసం యూఎల్ఐ

- ఒక్క సమ్మతితో వెంటనే రుణాలు
- త్వరలో దేశమంతా అందుబాటులోకి
- ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్



బెంగళూరు, ఆగస్టు 26: యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్(యూపీఐ) మాదిరిగా.. సులభతర రుణాల కోసం యూనిఫైడ్ లెండింగ్ ఇంటర్‌ఫేస్(యూఎల్ఐ)ని పరిచయం చేయనున్నట్లు భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ వెల్లడించారు. 2016 డిజిటల్ చెల్లింపుల కోసం తీసుకువచ్చిన యూపీఐ విజయవంతమవ్వడంతో.. చిరు వ్యాపారులు, ఎంఎస్ఎంఈలు, గ్రామీణులకు ఎలాంటి ఆటంకాల్లేకుండా రుణాలు తీసుకోవడానికి యూఎల్ఐని గత ఏడాది రెండు రాష్ట్రాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ విధానం విజయవంతమైందని, దాంతో.. దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఆర్‌బీఐ ఆవిర్భవించి 90 ఏళ్లవుతున్న సందర్భంగా సోమవారం బెంగళూరులో 'డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్' అనే అంశంపై ఏర్పాటు చేసిన గ్లోబల్ కాన్ఫరెన్స్‌లో ఆయన ప్రారంభోపన్యాసం చేస్తూ.. ఈ విషయాన్ని వెల్లడించారు. "ఆర్‌బీఐ పరిధిలో పనిచేసే భారత జాతీయ చెల్లింపుల సంస్థ(ఎన్‌పీసీఐ) ద్వారా యూపీఐని అందుబాటులోకి తీసుకువచ్చాం. నగదు రహిత చెల్లింపులకు ఈ విధానం ఎంతగానో ఉపకరిస్తోంది. ఒక్క క్యూఆర్ కోడ్ లేదా యూపీఐ ఐడీ లేదా మొబైల్ నంబర్‌తో చెల్లింపులు చేసే వెసులుబాటును కల్పించింది. ఆర్థిక సేవల డిజిటలీకరణను విజయవంతం చేసింది. ఇదే స్ఫూర్తితో కేవలం ఒక సమ్మతి(కన్సెంట్)తో గ్రామీణులు, చిరు వ్యాపారులు, ఎంఎస్ఎంఈలు రుణాలు తీసుకునేందుకు యూఎల్ఐ దోహదపడుతుంది" అని ఆయన వివరించారు. యూఎల్ఐ ప్లాట్‌ఫారంతో బహుళ డేటా సర్వీస్ ప్రొవైడర్లు, రుణదాతలు, వివిధ రాష్ట్రాల భూరికార్డుల డిజిటల్ సమాచారంతో అనుసంధానమై ఉంటాయని వివరించారు. "క్రెడిట్ అర్హత మదింపు కోసం పట్టే సమయాన్ని యూఎల్ఐ తగ్గిస్తుంది. యూపీఐ మాదిరిగానే.. అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేస్(ఏపీఐ) ఆధారంగా యూఎల్ఐ పనిచేస్తుంది. అంటే.. బ్యాంకింగ్, నాన్-బ్యాంకింగ్ ఆర్థిక సంస్థలు ఈ ఏపీఐ ఆధారంగా రుణాలను అందజేయవచ్చు. ఈ ఏపీఐ ద్వారా.. రుణాలు తీసుకునేవారి ఆర్థిక, ఆర్థికేతర డేటా ఒకే చోట లభ్యమవుతుంది. పైలట్ ప్రాజెక్టు విజయవంతమైంది. దేశవ్యాప్తంగా యూఎల్ఐ అందుబాటులోకి వస్తే.. మరో డిజిటల్ విప్లవానికి నాంది పలికినట్లవుతుంది" అని ఆయన వ్యాఖ్యానించారు.

ఇజ్రాయెల్-హమాస్ చర్చలు విఫలం

కాల్పుల విరమణ, బందీల విడుదలపై కైరోలో చర్చలు

ఎలాంటి నిర్ణయం లేకుండానే ముగింపు.. ఇజ్రాయెల్‌పై ప్రతీకారం తప్పదన్న ఇరాన్

జెరుసలేం, ఆగస్టు 26: ఇజ్రాయెల్-హమాస్‌ల మధ్య గత పది నెలలుగా సాగుతున్న భీకర యుద్ధానికి ముగింపు పలికేలా ఇరు దేశాల మధ్య చర్చలకు శ్రీకారం చుట్టినా ఏమాత్రం ఫలించలేదు. కాల్పుల విరమణ, బందీల విడుదల వంటి కీలక అంశాలు సహా ఇతర అంశాలపై ఈజిప్టు రాజధాని కైరోలో చేపట్టిన చర్చలు విఫలమయ్యాయి. ఆదివారం ఇరు పక్షాలు ఎలాంటి తుది ఒప్పందం చేసుకోకుండానే చర్చలు ముగించాయి. ఈ చర్చలు వారాంతాల్లో కొనసాగుతాయని, ఇజ్రాయెల్, హమాస్‌లకు మధ్యవర్తులుగా ఉన్న అమెరికా, ఖతార్, ఈజిప్ట్ బృందాలతో ద్వితీయ శ్రేణి బృందం కైరోలోనే చర్చలు జరుపుతుందని అమెరికాకు చెందిన ఓ అధికారి తెలిపారు. గత గురువారం ప్రారంభమైన చర్చలు ఆదివారం వరకు సాగాయని, ఈ చర్చలు నిర్మాణాత్మకంగా ఉండడంతోపాటు తుది ఆచరణయోగ్యమైన ఒప్పందాలను చేరుకునే దిశగా సాగాయని వివరించారు. అయితే ఈ చర్చలు అర్ధంతరంగా ముగియడానికి ఆదివారం ఇజ్రాయెల్, లెబనాన్ మిలిటెంట్ గ్రూప్ హిజ్బొల్లా మధ్య యుద్ధం మరింత భీకరంగా మారడేమనని అమెరికా అధికారి తెలిపారు. ఇదిలావుంటే.. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ మాత్రం.. యుద్ధం ముగిసిపోలేదని నొక్కి చెప్పారు. కాగా ఇజ్రాయెల్‌పై ప్రతీకారం తీర్చుకుని తీరతామని ఇరాన్ మరోసారి స్పష్టం చేసింది. ఈ మేరకు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘి పేర్కొన్నారు. టెహ్రాన్‌లో ఇజ్రాయెల్ జరిపిన దాడికి ప్రతీకారం కచ్చితంగా ఉంటుందన్నారు.



ఎర్ర సముద్రంలో ట్యాంకర్‌కు నిప్పు

ఎర్ర సముద్రంలో మరోసారి ఉద్రిక్తత నెలకొంది. గ్రీక్ జాతీయ పతాకంతో ప్రయాణిస్తున్న చమురు ట్యాంకర్‌పై యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు నిప్పుపెట్టారు. ఈ దాడిలో 1.5 లక్షల టన్నుల క్రూడ్ ఆయిల్ ఉన్న చమురు ట్యాంకర్ కాలిపోయింది. అయితే ట్యాంకర్ నుంచి భారీ ఎత్తున చమురు లీక్ కాలేదని, గత కొన్ని వారాల్లో ఇదే అతిపెద్ద దాడి అని యూరోపియన్ యూనియన్‌కు చెందిన నౌకా కమాండ్ సోమవారం తెలిపింది. చమురు ట్యాంకర్ ధ్వంసంతో రూ.లక్ష కోట్ల వ్యాపారం దెబ్బతిందని పేర్కొంది.

నేను వెళ్లేసరికే ఆమె చనిపోయి ఉంది

- పాలీగ్రాఫ్ పరీక్షలో ఆర్జీ కర్ ఆస్పత్రి హత్యాచార నిందితుడు సంజయ్ రాయ్



కోల్‌కతా, ఆగస్టు 26: కోల్‌కతా హత్యాచార ఘటన నిందితుడు సంజయ్ రాయ్.. పాలీగ్రాఫ్ పరీక్షలో ఒకదానికొకటి సంబంధం లేని సమాధానాలు చెప్పాడు. జాతీయ మీడియాలో వచ్చిన కథనాల ప్రకారం.. కోల్‌కతాలోని ప్రెసిడెన్సీ జైల్లో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న అతడికి ఇటీవల సీబీఐ పాలీగ్రాఫ్ పరీక్షలు నిర్వహించింది. అందులో.. తాను ఈ నెల 9న రాత్రి తాను ఆస్పత్రికి వెళ్లేసరికే సెమినార్ హాలులో యువ వైద్యురాలు చనిపోయి కనిపించిందని.. భయంతో పారిపోయానని సంజయ్ చెప్పాడు. అయితే, ఆధారాలు చూపించడంతో అసలు తాను అక్కడ లేనంటూ బుకాయించాడు. విచారణ సందర్భంగా సీబీఐ ప్రశ్నలకు ఏదో ఆలోచిస్తూ.. హడావుడి పడ్డాడు. అవాస్తవాలు, పొంతన లేకుండా మాట్లాడాడు. ఈ నెల 10న సంజయ్‌ను కోల్‌కతా పోలీసులు అరెస్టు చేసిన సమయంలో హత్యాచారం చేసింది తానేనంటూ అంగీకరించినట్లుగా కథనాలు వచ్చాయి. ఫోరెన్సిక్ వైద్య బృందం విచారణ సందర్భంగానూ ఆస్పత్రిలో ఆ రోజు ఏం జరిగిందో వివరంగా చెప్పాడని సీబీఐ పేర్కొంది. కానీ, కోర్టుకు తీసుకెళ్లాక తనను కొందరు కేసులో ఇరికించారంటూ మాట మార్చాడు. కాగా, సంజయ్‌కు మళ్లీ పాలీగ్రాఫ్ పరీక్షలు చేయనున్నారు. మరోవైపు ఆర్జీ కర్ ఆస్పత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్, వైస్ ప్రిన్సిపల్ సంజయ్ సహా మరో నలుగురికి సోమవారం నుంచి రెండో దఫా పాలీగ్రాఫ్ పరీక్షలు చేస్తున్నారు.

బెంగాల్లో 48వేల రేప్ కేసులు పెండింగ్

- మమతపై కేంద్రం ఫైర్.. సీఎంకు కేంద్రమంత్రి లేఖ

న్యూఢిల్లీ, ఆగస్టు 26: పశ్చిమ బెంగాల్ సీఎం మమత తీరుపై కేంద్రప్రభుత్వం విరుచుకుపడింది. ఆ రాష్ట్రానికి తాము 123 ఫాస్ట్‌ట్రాక్/పోక్సో కోర్టులు మంజూరు చేస్తే కేవలం ఆరు మాత్రమే ఏర్పాటు చేశారని ఆక్షేపించింది. అది కూడా గత ఏడాదే అందుబాటులోకి తెచ్చారని పేర్కొంటూ కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణాదేవి ఘాటుగా ఆమెకు లేఖ రాశారు. దేశవ్యాప్తంగా రోజుకు సగటున 90 రేప్ కేసులు నమోదవుతున్నాయని.. దోషులకు 15 రోజుల్లోనే కఠిన శిక్షలు విధించేలా పార్లమెంటులో చట్టం చేయాలని మమత ప్రధాని మోదీకి ఇటీవల లేఖ రాశారు. దీనిపై అన్నపూర్ణాదేవి తీవ్రంగా స్పందించారు. బెంగాల్లో 48,600 అత్యాచార, పోక్సో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తుచేశారు. కష్టాల్లో ఉన్న మహిళలు, పిల్లలను ఆదుకోవడానికి కేంద్రం.. 181, 112, 1098, 1930 హెల్ప్‌లైన్ నంబర్లు అందుబాటులోకి తెస్తే.. ఎన్ని సార్లు గుర్తుచేసినా మమత సర్కారు వీటిని అమలు చేయలేదన్నారు.

జమ్మూలో బీజేపీ అభ్యర్థులపై రగడ

- 15 మందితో 'తొలి దశ' జాబితా
- కాంగ్రెస్-ఎన్‌సీ సీట్ల పంపకం ఖరారు
- ఎన్‌సీకి 51, కాంగ్రెస్‌కు 32 సీట్లు
- మరో 5 చోట్ల స్నేహపూర్వక పోటీ..



ఫరూక్ అబ్దుల్లాతో కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్

న్యూఢిల్లీ, ఆగస్టు 26: కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూ కశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల వేడి రాజుకుంది. సోమవారం 44 మందితో బీజేపీ తొలి జాబితాను ప్రకటించింది. అయితే పలువురు కీలక నేతలకు టికెట్లు దక్కకపోవడంతో కార్యకర్తలు ఆ పార్టీ ప్రధాన కార్యాలయం వద్ద నిరసనలు చేపట్టారు. దీంతో కొద్ది గంటల్లోనే ఆ జాబితాను బీజేపీ ఉపసంహరించుకుంది. చివరకు కేవలం తొలిదశ ఎన్నికలు జరిగే అసెంబ్లీ స్థానాల కోసం 15 మందితో ఓ జాబితాను మళ్లీ ప్రకటించింది. బీజేపీ కార్యాలయం వద్ద జరిగిన నిరసనల్లో ఓ కార్యకర్త మాట్లాడుతూ.. 'మాకు ఓటు హక్కు వచ్చినప్పటి నుంచి బీజేపీతోనే ఉన్నాం. జమ్మూ నార్త్‌లో ఒమీ ఖజూరియా అందరికీ తెలిసిన వ్యక్తి.. ఆయన్ను కాదని కాంగ్రెస్ నుంచి పార్టీలో చేరిన శ్యామ్‌లాల్ శర్మకు టికెట్ ఇచ్చారు. ఖజూరియాకు టికెట్ ఇస్తేనే బీజేపీలో ఉంటాం' అని తేల్చి చెప్పారు. ఇటు కాంగ్రెస్-నేషనల్ కాన్ఫరెన్స్ మధ్య సీట్ల పంపకం ఖరారైంది. మొత్తం 90 స్థానాల్లో ఎన్‌సీ 51, కాంగ్రెస్ 32 స్థానాల్లో పోటీ చేయనున్నాయి. మరో 5 చోట్ల ఇరు పార్టీలు స్నేహపూర్వక పోటీకి దిగాలని.. అలాగే సీపీఎంకు ఒక సీటు, పాంథర్స్ పార్టీకి ఒక సీటు ఇవ్వాలని నిర్ణయించాయి. సీట్ల పంపకాలపై నెలకొన్న విభేదాలను పరిష్కరించుకునేందుకు ఎన్‌సీ నేతలతో కాంగ్రెస్ సీనియర్ నేతలు జరిపిన చర్చలు ఫలించాయి. ఎన్‌సీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా, ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా నివాసాలకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, మరో నేత సల్మాన్ ఖుర్షీద్, జమ్మూ కశ్మీర్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ భరత్ సోలంకి వెళ్లి సుదీర్ఘ మంతనాలు జరిపారు.

లద్దాఖ్‌లో 5 కొత్త జిల్లాలు..

కేంద్ర పాలిత ప్రాంతం లద్దాఖ్‌లో 5 కొత్త జిల్లాల ఏర్పాటుకు కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించారు. 'ప్రధాని నరేంద్ర మోదీ విజన్ మేరకు లద్దాఖ్ అభివృద్ధికి 5 కొత్త జిల్లాలను ఏర్పాటు చేయాలని కేంద్ర హోంశాఖ నిర్ణయించింది. కొత్తగా ఏర్పాటు చేసే జన్‌స్కర్, ద్రాస్, షామ్, నుబ్రా, చాంగ్‌థాంగ్ జిల్లాలతో పాలన మరింత పటిష్ఠమవుతుంది. ప్రతీ ఇంటికి ప్రభుత్వ ఫలాలు అందుతాయి' అని షా 'ఎక్స్'లో పేర్కొన్నారు. దీనిపై ప్రధాని మోదీ స్పందిస్తూ.. 'లద్దాఖ్ ప్రజల శ్రేయస్సు, మెరుగైన పాలనకు ఇదో ముందడుగు. కొత్త జిల్లాలతో ప్రజలకు అవకాశాలు, సేవలు మరింత చేరువవుతాయి' అని వెల్లడించారు.

25 మంది నక్సలైట్ల లొంగుబాటు

- వారిలో ఐదుగురిపై రూ. 28 లక్షల రివార్డు
- ఇన్‌ఫార్మర్ నెపంతో యువకుడి హత్య

బీజాపూర్/చర్ల, ఆగస్టు26: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో సోమవారం 25మంది నక్సలైట్లు పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిలో ఐదుగురి తలలపై భారీస్థాయిలో రూ.28 లక్షల నగదు రివార్డు ఉన్నట్లు బీజాపూర్ ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. లొంగిపోయిన వారిలో శాంబాటి మడ్కం (23), జ్యోతిపూనెం (27)తోపాటు మహేశ్ తేలం ఉన్నారని, వారి ఒక్కొక్కరి తలపై రూ.8లక్షల నగదు రివార్డు ఉందన్నారు. 2012 నుంచి ఉద్యమంలో క్రియాశీలకంగా ఉన్న శాంబాటి మడ్కం 2020, 2021లో జరిగిన విఎంపా, టేకులగూడెం దాడుల్లో కీలక పాత్ర పోషించినట్లు చెప్పారు. ఆ దాడుల్లో 39మంది పోలీసులు అమరులైనట్లు తెలిపారు. బీజాపూర్ జిల్లా పిడియాలో ఈ ఏడాది మేనెలలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో జ్యోతి, మహేశ్ పాల్గొన్నట్లు తెలిపారు. మావోయిస్టు భావజాలం, ఉద్య మ నేతలు దౌర్జన్యాల పట్ల నిరాశతోపాటు ఇటీవల పోలీసులు ప్రవేశపెట్టిన లాల్‌వర్రాట్, పునరావాసం పథకాలకు ఆకర్షితులై వారు లొంగిపోయినట్లు చెప్పారు. బీజాపూర్ జిల్లాలో ఇప్పటివరకు 170మంది నక్సలైట్లు లొంగిపోగా, 346 మంది అరెస్టయినట్లు ఎస్పీ తెలిపారు. కాగా, ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడని ఛత్తీస్‌గఢ్ భైరంగఢ్ జిల్లాకు చెందిన ఓ యువకుడిని మావోయిస్టులు హత్య చేశారు.

కశ్మీర్‌ను ఢిల్లీ నుంచి పాలించడమేమిటి?

- రాష్ట్ర హోదాను వెంటనే పునరుద్ధరించాలి: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, ఆగస్టు 26: జమ్మూ-కశ్మీర్‌ను ఢిల్లీ నుంచి పాలించడంలో అర్థం లేదని కాంగ్రెస్ నాయకుడు, విపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. దీన్ని కేంద్రపాలిత ప్రాంతంగా మార్చడం సరికాదని, వెంటనే రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని డిమాండు చేశారు. గత వారం జమ్మూ-కశ్మీర్‌లో పర్యటించిన ఆయన శ్రీనగర్‌లో అక్కడి విద్యార్థినులతో ముచ్చటించారు. ఈ సంభాషణల వీడియో సోమవారం విడుదలయింది. జమ్మూ-కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను రద్దు చేయడం తమకెవరికీ నచ్చలేదని అన్నారు. ఈ సందర్భంగా ప్రధానిని విమర్శిస్తూ "మోదీతో వచ్చిన సమస్య ఏమిటంటే ఆయన ఎవరి మాటా వినరు. తప్పని చెప్పినా ఒప్పుకోరు. ఆయన చెప్పేదే నిజమని నమ్ముతారు" అని వ్యాఖ్యానించారు. రాష్ట్ర హోదా ఉంటేనే నిజమైన ప్రజా ప్రతినిధులు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. అందువల్ల రానున్న ఎన్నికల్లో ఈ అంశంపై చర్చ జరగాలన్నారు. కాగా, రాహుల్ ఎవరితో ముచ్చటించినా పెళ్లెప్పుడంటూ వారు అడగడం ఇటీవల కాలంలో సర్వసాధారణంగా మారింది. కశ్మీరీ విద్యార్థినులు కూడా ఆ 54 ఏళ్ల కాంగ్రెస్ నేతను ఇదే ప్రశ్న వేశారు. "20-30 ఏళ్లుగా ఈ ఒత్తిడిని ఎదుర్కొంటున్నా" అంటూ ఆయన నవ్వుతూ సమాధానం ఇచ్చారు. "ఏమైనా ప్లాన్లు ఉన్నాయా?" అని వారు మళ్లీ అడిగారు. "ప్లాన్లు ఏమీ లేవుగానీ...ఒక వేళ జరిగితే..." అంటూ మధ్యలోనే ఆపేశారు. "అప్పుడు తప్పకుండా మమ్మల్ని పిలవండి" అని వారంతా కోరారు. "తప్పకుండా" అని రాహుల్ సమాధానం ఇవ్వడంతో అందరూ కలిసి గట్టిగా నవ్వేశారు.



(మొదటి పేజీ తరువాయి)

ఉంటాయన్న దానిపై అధ్యయనం చేస్తున్నారు. కాగా, పాఠశాలల్లో ఖాళీలు ఉన్నా.. వాటిని భర్తీ చేయడంలో సమస్యలు తలెత్తే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య పడిపోతోంది. దాంతో చాలాచోట్ల ఉపాధ్యాయ పోస్టులు ఉన్నా.. అందుకుతగ్గట్లుగా విద్యార్థులు లేరు. ఇలాంటి సందర్భంలో క్రమబద్ధీకరణను అమలు చేయాలి. ఉపాధ్యాయులను విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న ఇతర పాఠశాలలకు బదిలీ చేయాల్సి ఉంటుంది. కానీ, ఇప్పటి వరకు అలాంటి ప్రయత్నం జరగడం లేదు. ఈ పనిచేసిన తర్వాతనే ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటే ప్రయోజనం అన్న అభిప్రాయం వినిపిస్తోంది.

వీసీల నియామకానికి త్వరలో సెర్చ్ కమిటీల భేటీలు

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు కొత్త వైస్ ఛాన్సలర్ల

మరో డీఎస్సీ?

(వీసీ)ను నియమించడానికి వీలుగా సెర్చ్ కమిటీ సమావేశాలను పూర్తి చేయాలని విద్యా శాఖ అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం వర్సిటీలకు ఐఏఎస్ అధికారులు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. వీసీల నియామకం కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ కూడా ఇచ్చింది. ప్రొఫెసర్ల నుంచి వచ్చిన దరఖాస్తులను వడపోసి వీసీలను ఎంపిక చేయాల్సి ఉంది. దీనికోసం ప్రభుత్వం విశ్వవిద్యాలయాల వారీగా సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేసింది. 2,3 రోజుల్లో ఈ కమిటీల సమావేశం షెడ్యూల్ వెలువడే అవకాశం ఉంది. దరఖాస్తులను పరిశీలించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించనున్నారు. వీరిలో ఒకరిని ఆయా యూనివర్సిటీలకు వీసీలుగా ఎంపిక చేసి ఆ జాబితాను ప్రభుత్వం గవర్నర్ ఆమోదానికి పంపనుంది. ఇదంతా పూర్తి కావడానికి కనీసం నెల రోజుల సమయం పడుతుంది.

కాగా, విశ్వవిద్యాలయాల వీసీలతో పాటు, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్, ఇతర సభ్యుల నియామకంపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టినట్లు సమాచారం. ప్రస్తుత చైర్మన్, సభ్యులు గత ప్రభుత్వంలో నియమితులైనవారు. చైర్మన్‌గా ప్రొఫెసర్ లింబాద్రిని కొనసాగిస్తూ, కొత్త సభ్యులను నియమించే ప్రతిపాదన కూడా ప్రభుత్వం వద్ద ఉన్నట్లు సమాచారం. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఉన్నత విద్యా మండలిలో కొత్తవారిని నియమించాలని భావించారు. వివిధ ప్రవేశ పరీక్షల నిర్వహణ, ప్రవేశాలను దృష్టిలో ఉంచుకుని వాయిదా వేశారు. ప్రస్తుతం దాదాపు అన్ని ప్రవేశ పరీక్షలు పూర్తయి, ప్రవేశాలు చివరి దశకు చేరాయి. విశ్వవిద్యాలయాలకు కొత్త వీసీలను కూడా నియమిస్తుండడంతో.. ఉన్నత విద్యా మండలి నియామకాలను కూడా చేపట్టాలనే ఉద్దేశంలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.

దీక్షలు మీరే చేయొచ్చుగా!

(మొదటి పేజీ తరువాయి)

పిల్లలందరూ ఎందుకు? మీరున్నరు కదా.. బావబామ్మర్దులిద్దరు ఆమరణ దీక్షలు చేయొచ్చు కదా! ఉద్యోగాలు వాయిదా వేయాలని కోరితే మీకే నష్టం. మీరు ఏ సూచనలు చేసినా.. వినడానికి, మంచి సూచన ఉంటే స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నాం" బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావునుద్దేశించి సీఎం వ్యాఖ్యానించారు. పరీక్షలు వాయిదా వేయించాలనే వారి కుట్రలో విద్యార్థులు పడొద్దని, సొంతంగా ఆలోచన చేయాలని సూచించారు. సోమవారం సచివాలయంలో సింగరేణి కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో సివిల్స్ మెయిన్స్ పరీక్ష రాయడానికి అర్హత సాధించిన 135 మంది అభ్యర్థులకు 'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకం కింద రూ.లక్ష ఉపకార వేతనం అందించే కార్యక్రమానికి సీఎం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. "పదేళ్లలో రూ.లక్ష రుణమాఫీ చేయలేదని, తాము నెల రోజుల్లోనే రూ.2 లక్షల దాకా రుణమాఫీ చేశామని తెలిపారు. నిరుద్యోగ యువకులు, యూనివర్సిటీలు, రైతులే తమ ప్రభుత్వ ప్రాధాన్యతలని పేర్కొన్నారు.

ఇంటర్వ్యూలకు ఎంపికైతే మళ్లీ సాయం

సివిల్స్ మెయిన్స్‌కు ఎంపికయ్యాక ఇంటర్వ్యూకు అర్హత సాధించిన వారికి మళ్లీ సాయం చేస్తామని సీఎం చెప్పారు. మెయిన్స్‌లో ఉత్తీర్ణులై తెలంగాణ ప్రతిష్ఠను పెంచాలని, ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్‌లుగా ఎంపికై దేశంలో ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. "భవిష్యత్తుకు మీరే పునాదులు. మీరు ఆదర్శంగా నిలవాలి. మీరు ఎంపికైతే.. గ్రామానికి, రాష్ట్రానికి గర్వకారణం. గతంలో ఎస్‌ఐ ఫలితాల్లో 50 శాతం మంది నల్లగొండ జిల్లా వారే విజయం సాధించేవారు. 30 ఏళ్లుగా ఒకరిని చూసి.. మరొకరు పోటీ పడుతూ ఎస్‌ఐ పోస్టుల్లో సగం పోస్టులను నల్లగొండ జిల్లా ప్రజలే దక్కించుకునేవారు. మీరు సివిల్స్‌కు పోటీ పడి, ఉద్యోగాలు సాధిస్తే.. ఆ



సివిల్స్ మెయిన్స్ అభ్యర్థులకు ఉపకార వేతనాలను అందజేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, చిత్రంలో భట్టి, పొన్నం

ప్రభావం మీ సమీపంలోని వారందరిపై ఉంటుంది. మీ తల్లిదండ్రులకు , గ్రామానికి, రాష్ట్రానికి గౌరవం పెరుగుతుంది" అని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి 175 మంది మెయిన్స్‌కు ఎంపికయ్యారని, వారిలో 135 మందికి ఉపకార వేతనాలు ఇస్తున్నామని తెలిపారు. తెలంగాణలో విద్య సర్టిఫికెట్ కోర్సులకు పరిమితమవుతోందని, ఇంజనీరింగ్ సర్టిఫికెట్ తీసుకొని బయటికి వస్తున్నా.. నైపుణ్యాలు ఉండటం లేదని రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. "పరిశ్రమలకు తగ్గ నైపుణ్యం కలిగిన మానవ వనరులు దొరకడం లేదని, నియామకాల కోసం ఎవరూ రావడం లేదని పరిశ్రమలు చెబుతున్నాయి. అందుకే విద్యార్థులకు, పరిశ్రమలకు మధ్య అంతరాన్ని తగ్గించడానికి, చదువుతోపాటు శిక్షణ కోసం, ఐఎస్‌బీ, ట్రిపుల్ ఐటీ నమూనాలో యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీని ఏర్పాటు చేశాం" అని రేవంత్ అన్నారు.

నిరుద్యోగ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం..

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయిందే నియామకాల కోసమని సీఎం రేవంత్ అన్నారు. "90 రోజుల్లోనే 30 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చాం. 35 వేల గ్రూప్-1, గ్రూప్-2, టీచర్ ఉద్యోగ నియామకాల కోసం నోటిఫికేషన్లు ఇచ్చాం. నిరుద్యోగ సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నాం" అని రేవంత్‌రెడ్డి అన్నారు. రానున్న 10-15 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా యూనివర్సిటీలకు వీసీలను నియమిస్తామని, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులను కూడా భర్తీ చేస్తామన్నారు. ప్రతి నియోజకవర్గంలో 20-25 ఎకరాల్లో యంగ్ ఇండియా సమీకృత గురుకుల విద్యాలయాలు నిర్మిస్తామని తెలిపారు. గత ప్రభుత్వంలో ఫాంహౌస్‌లు ఎలా కట్టుకున్నారో, ఆర్థికంగా ఎలా ఎదిగారో, ఉద్యమం ముసుగులో టీవీలు, పేపర్‌లు, పదవులు, ఆస్తులు, బంగళాలు ఎలా వచ్చాయో మీరు కళ్లారా చూశారంటూ విద్యార్థులనుద్దేశించి వ్యాఖ్యానించారు. కొత్త సచివాలయం నిర్మించాక గతంలో తనను, సీతక్కను లోపలికి రానివ్వలేదని సీఎం రేవంత్ తెలిపారు. "ఈ సచివాలయం తెలంగాణ ప్రజలది. దూరం నుంచి పోతే ఇదేదో పరాయి ఆస్తిలాగా ఉంటది. లోపలికి వస్తే విశ్వాసం పెరుగుతుంది. మనమేదో గడీల బయటి నుంచి వెళ్లిపోయే బానిసల్లా కాకుండా బాజాప్తాగా లోపలికి వస్తే కాన్ఫిడెన్స్ పెరుగుతుందనే సచివాలయంలో విద్యార్థులతో కార్యక్రమాలు పెట్టాం. ఇది గతంలో లాగా కొద్దిమందికి పరిమితమైన గడీ కాదు" అని రేవంత్ అన్నారు.

2028 ఒలింపిక్ క్రీడలే లక్ష్యం..

ఒలింపిక్స్‌లో ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదని, చిన్న చిన్న దేశాలు చాలా పతకాలు సాధిస్తే... మనకు అవమానం జరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 2028 ఒలింపిక్స్‌లో తెలంగాణ అత్యధిక పతకాలు సాధించడమే లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో 15 ఏళ్లుగా నిరుపయోగంగా మారిన క్రీడా స్టేడియాలను మళ్లీ వినియోగంలోకి తెస్తామని తెలిపారు. "గత పదేళ్లలో పౌల్ట్రీఫామ్‌ల కన్నా అధ్వాన్నంగా గురుకులాలు పెట్టారు. 200 మంది విద్యార్థులుంటే రెండు బాత్‌రూమ్‌లు లేవు. మౌలిక వసతులు కల్పించలేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు విద్యనందించడానికి 20-25 ఎకరాల్లో రూ.100 కోట్లు వెచ్చించి వంద నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా సమీకృత గురుకుల విద్యాలయాలు ఏర్పాటు చేస్తాం" అని సీఎం ప్రకటించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాష్ట్రంలోని మేధోసంపత్తిని ప్రోత్సహించడంలో భాగంగానే ఉపకార వేతనం అందిస్తున్నట్లు తెలిపారు. గతంలో రాష్ట్రాన్ని పాలించిన వారెవరూ ఈ ఆలోచన చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, సింగరేణి సీఎండీ ఎన్.బలరాం, సీఎస్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.



సీఎంకు వినతి పత్రం అందజేస్తున్న మాల సామాజిక వర్గ ప్రతినిధులు

ఎస్సీ వర్గీకరణపై కమిటీ!

- నివేదిక ఆధారంగా అందరికీ న్యాయం జరిగేలా చూస్తా
- మాల సామాజికవర్గ ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలుకు సంబంధించి కమిటీని నియమిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆ కమిటీ నివేదిక ఆధారంగా అందరికీ న్యాయం జరిగేలా చూస్తానని సోమవారం తనను కలిసిన మాల మహానాడు, మాల సామాజికవర్గ ప్రతినిధులతో అన్నారు. మాల సామాజికవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులైన ఎంపీ గడ్డం వంశీ, ఎమ్మెల్యేలు వివేక్ వెంకటస్వామి, మట్టా రాగమయి, వంశీకృష్ణ, నాగరాజు, మాల మహానాడు నేత చెన్నయ్య తదితరులు సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఎస్సీ వర్గీకరణలో మాలలకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. న్యాయస్థానం సూచనలకు అనుగుణంగా మాల, మాదిగలకు తగిన న్యాయం జరిగేలా చూడాలన్నారు.

నేటి నుంచి గవర్నర్ జిల్లాల పర్యటన

- 29 వరకు ఉమ్మడి వరంగల్, యాదాద్రి జిల్లాల్లో..
- యాదగిరిగుట్ట, రామప్ప సహా పలు ఆలయాల సందర్శన

వరంగల్/భువనగిరి అర్బన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ యాదాద్రి భువనగిరి, ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో పర్యటించనున్నారు. మంగళవారం నుంచి 3రోజుల పాటు (ఈ నెల 29 వరకు) పలు ఆలయాలు, చారిత్రక కట్టడాలను సందర్శించనున్నారు. ఈ పర్యటనలో యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయంతో పాటు వేయి స్తంభాల గుడి, భద్రకాళి, పద్మాక్షమ్మ ఆలయాలను గవర్నర్ సందర్శిస్తారు.మంగళ, బుధ, గురువారాల్లో ములుగు, హనుమకొండ కలెక్టరేట్, ఒబులకేశ్వాపూర్‌లలో రచయితలు, కళాకారులతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు పొందిన వారితో భేటీ అవుతారు. గురువారం రాత్రి 8 గంటలకు రాజ్‌భవన్‌కు చేరుకుంటారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో ఆయా జిల్లాల కలెక్టర్లు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

విద్యుత్తు సంస్థల్లో డైరెక్టర్ల భర్తీ ఎన్నడో?

- 16 పోస్టులకు 50కి పైగా దరఖాస్తులు
- భారీగా పైరవీలు చేసుకుంటున్న ఆశావహులు

హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విద్యుత్తు పంపిణీ సంస్థల్లో డైరెక్టర్లను ఎప్పుడు భర్తీ చేస్తారో తెలియడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే డిస్కమ్‌లలోని డైరెక్టర్లందరినీ తొలగించింది. కొత్త డైరెక్టర్ల నియామకం కోసం డిస్కంలు నోటిఫికేషన్లు ఇవ్వడం, దరఖాస్తులు స్వీకరించడం వేగంగా జరిగిపోయాయి. కానీ, నియామకాలు మాత్రం జరగడం లేదు. ఇక ట్రాన్స్‌కో, జెన్‌కోల్లో ప్రస్తుతం పనిచేస్తున్న వారిని తొలగించి.. కొత్త నియామకాలు జరిగేదాకా ఇన్‌చార్జి డైరెక్టర్లను కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నాలుగు సంస్థల్లో కలిపి 16 డైరెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటి కోసం 50 వరకు దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటి దాకా దక్షిణ డిస్కమ్‌లో ఏడుగురు డైరెక్టర్లు ఉండగా.. ఆ సంఖ్యను నాలుగుకు కుదించారు. ఇక డైరెక్టర్ పోస్టుకు దరఖాస్తు చేసేవారు 62 ఏళ్లలోపు ఉండి, సంబంధిత సబ్జెక్ట్‌లో డిగ్రీతోపాటు 15 ఏళ్ల అనుభవం, రాష్ట్ర/కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల్లో 25 ఏళ్ల వృత్తిపరమైన అనుభవం కలిగి ఉండాలని నిబంధన పెట్టారు. డైరెక్టర్‌గా నియమితులయ్యేవారిని కనిష్ఠంగా రెండేళ్ల పాటు పదవిలో కొనసాగించేలా నిబంధనలు రూపొందించారు. దరఖాస్తుల స్వీకరణ ముగిసి నాలుగు నెలలవుతోంది. అయితే పలు సంఘాలు డైరెక్టర్ల వయోపరిమితిని 65 ఏళ్లకు పెంచాలని ప్రభుత్వానికి నివేదించాయి. అంతేగాక పెద్దఎత్తున పైరవీలు కూడా చేస్తున్నాయి. మరోవైపు ట్రాన్స్‌కో, జెన్‌కోలో డైరెక్టర్లుగా పనిచేస్తున్న చాలా మంది మరికొంత కాలం నియామక ప్రక్రియ ఆగితే బాగుంటుందనే ఆశతో ఉన్నారు.

నేడు ఐదుగురు అధికారులను క్రాస్ ఎగ్జామినేషన్ చేయనున్న కమిషన్

హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు విచారణలో భాగంగా సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో)కు చెందిన ఐదుగురు అధికారులను కమిషన్ మంగళవారం క్రాస్ ఎగ్జామినేషన్ చేయనుంది. వివిధ బ్యారేజీల డిజైన్లలో పాల్గొన్న బస్వరాజు, నరేందర్, రాజశేఖర్, దయాకర్ రెడ్డి, ఎం.సత్యనారాయణరెడ్డిని వారు సమర్పించిన అఫిడవిట్‌లలోని అంశాల ఆధారంగా కమిషన్ ఓపెన్ కోర్టులో ప్రశ్నించనుంది. కాగా, జస్టిస్ పినాకి చంద్రఘోష్ విచారణ ప్రక్రియను ముగించుకొని ఈ నెల 28న కోల్‌కతాకు తిరిగి వెళ్లనున్నారు.



మలన్నసాగర్‌లోకి గోదావరి పరవళ్లు

మల్లన్నసాగర్‌లోకి గోదావరి జలాలు

- రెండో విడత ఎత్తిపోతల ప్రక్రియ ప్రారంభం
- సెప్టెంబరు 1 వరకు కొనసాగింపు

తొగుట, ఆగస్టు 26: మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లోకి గోదావరి జలాల ఎత్తిపోతలను సోమవారం ఇరిగేషన్ అధికారులు ప్రారంభించారు. సెప్టెంబరు 1 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని మల్లన్నసాగర్ డీఈ చెన్ను శ్రీనివాస్ తెలిపారు. యాసంగికి నీరందించేందుకు రిజర్వాయర్‌లో 12 టీఎంసీల పైచిలుకు నీటిని నిల్వ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందుకనుగుణంగానే ఎల్లంపల్లి నుంచి వచ్చే వరదను మిడ్‌మానేరు మీదుగా అన్నపూర్ణ రిజర్వాయర్, రంగనాయకసాగర్ ద్వారా మల్లన్నసాగర్‌లోకి రెండో విడత నీటిని ఎత్తిపోసే ప్రక్రియను ప్రారంభించారు. ప్రస్తుతం 10.30టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. నాలుగు పంపుల ద్వారా నీటిని ఎత్తిపోసి మల్లన్నసాగర్‌లో నిల్వ చేయడం వల్ల కొండపోచమ్మ రిజర్వాయర్‌తో పాటు, దుబ్బాక ప్రధాన కాలువ, సిద్దిపేట, సిరిసిల్ల నియోజకవర్గాల్లోని 95 చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలను నింపనున్నారు. మొత్తంగా 1 లక్షా 25 వేల ఎకరాలకు సాగు నీరందించడానికి అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.

రైస్‌మిల్లర్ల వద్ద భారీగా సీఎంఆర్!

- 36 లక్షల టన్నుల మేర పేరుకుపోయిన బకాయిలు
- సీఎంఆర్ టార్గెట్ పూర్తి చేయడంలో జాప్యం చేస్తున్న మిల్లర్లు



హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైస్ మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను తిరిగివ్వడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. గతేడాది (2023-24)కి సంబంధించిన సీఎంఆర్ టార్గెట్‌ను పూర్తి చేయడంలో రైస్‌మిల్లర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారు. నిరుడు రెండు సీజన్ల (వానాకాలం, యాసంగి)కు కలిపి 36.19 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం బకాయిలు మిల్లర్ల వద్దనే ఉన్నాయి. ఇందులో వానాకాలం బియ్యం బకాయిలు 13.88 లక్షల టన్నులు కాగా, యాసంగి బకాయిలు 22.31 లక్షల టన్నులున్నాయి. పౌరసరఫరాల సంస్థ రైతుల నుంచి కొన్న ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ కోసం రైస్‌మిల్లర్లకు అప్పగించింది. బాయిల్డ్ రైస్ 68 శాతం, రా రైస్ అయితే 67 శాతం రికవరీ చొప్పున బియ్యం తిరిగి అప్పగించాలి. అయితే మిల్లర్లు నిర్ణీత గడువులోగా టార్గెట్ పూర్తి చేయడం లేదు. 6 నెలల్లోపు సీఎంఆర్ టార్గెట్ పూర్తి చేయాల్సి ఉండగా తీవ్ర జాప్యం చేస్తున్నారు. కొందరు రైస్‌మిల్లర్లు ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యం... కస్టమ్ మిల్లింగ్ రైస్ కోటాలో ప్రభుత్వానికి అప్పగించొచ్చనే ఉద్దేశంతో సీఎంఆర్ టార్గెట్ పూర్తి చేయడం లేదు. ఇక ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని అమ్ముకునేవారు కొందరుంటే, బియ్యంగా మార్చాక బహిరంగ మార్కెట్లో అమ్ముకునే మిల్లర్లు కొందరున్నారు. చౌక డిపోల్లో బియ్యం పంపిణీ జరిగే తొలి పక్షం (ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 15 వరకు) సీఎంఆర్ డెలివరీ ఎక్కువ ఉంటోంది. వినియోగదారులు, రేషన్ డీలర్స్, దళారుల వద్ద పీడీఎస్ బియ్యం కొని రీ-సైక్లింగ్ చేసి బస్తాలు మార్చి ఎఫ్‌సీఐకి డెలివరీ చేస్తున్నారు. ప్రతి నెల రెండో పక్షంలో పీడీఎస్ బియ్యం లభ్యత లేకపోవడంతో సీఎంఆర్ డెలివరీ తక్కువ ఉంటోంది.

కవితకు బెయిల్ వచ్చేనా?

- నేడు సుప్రీంకోర్టులో ఢిల్లీ మద్యం కేసు విచారణ



న్యూఢిల్లీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి.. తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్‌పై మంగళవారం సర్వోన్నత న్యాయస్థానంలో విచారణ జరగనుంది. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ కేసును విచారించనుంది. కవిత తొలుత తన కుమారుడికి పరీక్షలు ఉన్నందున మధ్యంతర బెయిల్ ఇవ్వాలని రౌస్ అవెన్యూ కోర్టును కోరగా.. న్యాయమూర్తి నిరాకరించిన విషయం తెలిసిందే.! ఆ తర్వాత ఈడీ, సీబీఐ కేసుల్లో సాధారణ బెయిల్ ఇవ్వాలని ట్రయల్ కోర్టులో పిటిషన్ వేసినా.. నిరాశే ఎదురైంది. ట్రయల్ కోర్టు తీర్పును హైకోర్టులో సవాల్ చేశారు. హైకోర్టు సైతం బెయిల్ ఇవ్వడానికి నిరాకరించింది. ఈ నేపథ్యంలోనే సీబీఐ కవితతోపాటు మరో నలుగురిపై అభియోగాలు మోపుతూ సప్లిమెంటరీ చార్జిషీట్ దాఖలు చేసింది. అయితే, ఆ అభియోగాల్లో తప్పులున్నాయని, తనకు మద్యం పాలసీతో సంబంధమే లేదని, తనను కేసులో ఇరికించారని ఆరోపిస్తూ కవిత మరోసారి ట్రయల్ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ తర్వాత ఉపసంహరించుకున్నారు. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ.. ఈ నెల 7న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కవిత తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపిస్తూ.. కవితకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరగా ధర్మాసనం తిరస్కరించింది. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాతే బెయిల్ ఇస్తామని చెప్పింది. ఈ నెల 20న మరోసారి వాదనలు జరిగాయి. సీబీఐ, ఈడీ కౌంటర్ దాఖలు చేసిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం మరోసారి తేల్చిచెప్పింది. అయితే.. ఈ కేసులో సీబీఐ కౌంటర్ దాఖలు చేసిందని, ఈడీ కౌంటర్ దాఖలు చేయడానికి సమయమివ్వాలని అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు న్యాయస్థానాన్ని కోరారు. ఇరువర్గాల వాదనల అనంతరం గురువారంలోపు కౌంటర్ దాఖలు చేయాలని ఈడీ తరఫు న్యాయవాదిని.. శుక్రవారంలోపు రిజాయిండర్ దాఖలు చేయాలని కవిత తరఫు న్యాయవాదిని ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణ ఈనెల 27కు వాయిదా వేసింది. అయితే.. ఈడీ గురువారమే 150 పేజీలతో కౌంటర్ దాఖలు చేసినట్లు తెలిసింది.

ఢిల్లీకి కేటీఆర్, హరీశ్, గంగుల

ఢిల్లీ మద్యం కేసులో కవిత బెయిల్‌పై మంగళవారం వాదనలు జరగనున్న నేపథ్యంలో ఆమె సోదరుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్ రావు, గంగుల కమలాకర్, రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్యేలు ఢిల్లీకి చేరుకున్నారు. కవిత తరఫున వాదనలను వినిపిస్తున్న న్యాయవాదులతో కేటీఆర్, హరీశ్ భేటీ అయినట్లు తెలిసింది. కవితకు బెయిల్ వచ్చే అవకాశాలు, కోర్టులో లేవనెత్తాల్సిన అంశాలు, దర్యాప్తు సంస్థలు దాఖలు చేసిన కౌంటర్లు తదితర అంశాలపై వీరు చర్చించినట్లు సమాచారం. కవితకు మంగళవారం బెయిల్ తప్పనిసరిగా వస్తుందనే ఆశలో కేటీఆర్, హరీశ్ రావుతో పాటు బీఆర్ఎస్ శ్రేణులు ఉన్నారు.

పోలవరం బ్యాక్‌వాటర్‌పై ఒడిశా పేచీ

- 58 లక్షల క్యూసెక్కుల వరద ప్రకారం భూసేకరణకు డిమాండ్
- ఏకీభవించని కేంద్ర జలసంఘం, ఏపీ

అమరావతి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌పై ఒడిశా రాష్ట్రం పేచీ పెడుతోంది. 58 లక్షల క్యూసెక్కుల వరదను పరిగణనలోకి తీసుకుని భూసేకరణ జరపాలని డిమాండ్ చేస్తోంది. దీనిని ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేంద్ర జలసంఘం కూడా అంగీకరించడం లేదు. తప్పుడు తడక భూసేకరణ లెక్కలతో ప్రాజెక్టును అమలు చేస్తున్నారని, ముంపుపై మళ్లీ సర్వే జరపాలంటూ కేంద్రానికి వ్యతిరేకంగా ఒడిశా ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ వ్యవహారంలో ఏకాభిప్రాయానికి రావాలని ఏపీ, ఒడిశా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌లను కోర్టు ఆదేశించింది. ఇందుకోసం కేంద్ర జలసంఘం ఈ రాష్ట్రాలతో నాలుగు దఫాలు సమావేశాలు జరిపింది. అలాగే బ్యాక్‌వాటర్‌పై రాష్ట్ర జలవనరుల శాఖ సంయుక్త సర్వే కూడా నిర్వహించింది. అయినా ఒడిశా పదే పదే సుప్రీంకోర్టులో భూసేకరణ అంశంపై అభ్యంతరాలు చెబుతోంది. ఈ నేపథ్యంలోనే బుధవారం ఢిల్లీలో జరిగే 4 రాష్ట్రాల సమావేశానికి ఏపీ జలవనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, పోలవరం చీఫ్ ఇంజనీర్ నరసింహమూర్తి, అంతర్రాష్ట్ర వ్యవహారాల చీఫ్ ఇంజనీర్ కె.శ్రీనివాస్ హాజరవుతున్నారు.

కేంద్ర గ్రాంట్లు ఎప్పుడొచ్చేనో?

- ఈ ఆర్థిక సంవత్సరంలో 4 నెలలు గడిచినా నయా పైసా రాలే..
- ఈసారి రూ.21,636 కోట్ల గ్రాంట్లు అంచనా వేసిన సర్కారు
- ఈ నెల్లోనైనా కొన్ని నిధులు వస్తాయన్న ఆశతో ఎదురుచూపు



హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి కేంద్ర గ్రాంట్లు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 4 నెలలు గడిచినా కేంద్ర గ్రాంట్ల కింద రాష్ట్రానికి నయా పైసా రాకపోవడం ప్రభుత్వాన్ని కలవరపెడుతోంది. ప్రతి నెలా ఎంతో కొంత సొమ్మును విడుదల చేసే కేంద్రం ఈసారి నిధుల విడుదలను ఇంకా ప్రారంభించనేలేదు. దీంతో అంచనావేసిన మేరకు గ్రాంట్లు విడుదలవుతాయో లేదోనన్న సందిగ్ధత నెలకొంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రాంట్లను భారీగా అంచనా వేసినా అవి లక్ష్యం మేర రాకపోయేవి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అలాంటి భారీ అంచనాలకు పోకుండా తక్కువ మొత్తంలోనే అంచనా వేసినా ఇప్పటివరకు కేంద్రం నుంచి పైసా రాలేదు. కేంద్ర గ్రాంట్లు, కాంట్రిబ్యూషన్ల కింద ఈసారి రూ.21,636 కోట్లు వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో అంచనా వేసింది. అయితే ఏప్రిల్, మే, జూన్, జూలై నెలలకు సంబంధించి నిధులేమీ రాలేదు. ఆగస్టు నెల కూడా పూర్తి కావొస్తుంది. ఈ నెలలోనైనా కొన్ని నిధులు వస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది. కేంద్ర గ్రాంట్లు, పన్నుల్లో వాటాలు రాష్ట్రానికి కొంత మేర ఊరటనిస్తుంటాయి. పన్నుల్లో వాటాగా కేటాయించే నిధులు ఎలాగూ వస్తాయి. కానీ గ్రాంట్ల విషయంలోనే ప్రతిసారి రాష్ట్రానికి కోతలు పడుతున్నాయి. రెండేళ్లుగా భారీ కోతలు పడటంతో ఈసారి లక్ష్యం మేర నిధులు వస్తాయని ప్రభుత్వం ఆశలు పెట్టుకుంది. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి కింద రాష్ట్రంలోని తొమ్మిది ఉమ్మడి జిల్లాలకు రూ.1,800 కోట్లు రావాల్సి ఉంది. ఈ గ్రాంట్లలో కొన్ని నిధులైనా విడుదలైతే ప్రభుత్వానికి పెద్ద ఊరటే లభించనుంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'అమెరికా యుద్ధం'

పశ్చిమాసియాలో వేడెక్కిన పరిస్థితులను చూస్తున్న అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు మూడో ప్రపంచయుద్ధం తప్పదనిపిస్తోందట. క్షిపణులతో దాడులు చేసుకుంటున్న దేశాలతో చర్చలు జరపాల్సిన కమలాహారిస్ తీరిగ్గా బస్సులో తిరుగుతూ ఎన్నికల ప్రచారం చేసుకుంటోందనీ, నిద్రముఖం బైడెన్ కాలిఫోర్నియా బీచ్‌లో నిద్రపోతున్నాడనీ ట్రంప్ విమర్శించారు. మూడోప్రపంచ యుద్ధం వస్తోందంటూ ట్రంప్ హెచ్చరించడం గత పదేళ్ళకాలంలో ఇది ముప్పైరెండోసారి అని ఓ సర్వే సంస్థ లెక్కలు వేసింది. కమల నాయకత్వంలో అమెరికా క్షేమంగా ఉండబోదని, మనందరినీ ఆమె అణుయుద్ధంవైపు తీసుకుపోతోందనీ, ప్రపంచంలోని నియంతలు ఆమెను లెక్కచేయరనీ అమెరికన్లను హెచ్చరించడం ట్రంప్ లక్ష్యం. నవంబరు 5న జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో వీరిద్దరిలో ఎవరు గెలిచినా, ఇజ్రాయెల్‌తో ఎంత ప్రేమగా ఉంటారో తెలియనిదేమీ కాదు.

జో బైడెన్ తప్పుకోకుండా, అధ్యక్ష అభ్యర్థిగానే కొనసాగివుండివుంటే, ఎన్నికల ప్రచారం ఇంత వేడిగా సాగేది కాదేమో. విమర్శలతోపాటు విధానాల ప్రస్తావనలు, హామీలు కూడా ప్రచారంలో వినవస్తున్నాయి. డెమోక్రాటిక్ పార్టీ కన్వెన్షన్ ఆఖరురోజున కమలాహారిస్ చేసిన ప్రసంగం ఆకర్షణీయంగా ఉంది. ట్రంప్ అధికారంలోకివస్తే దేశాన్ని నాశనం చేస్తాడన్న విమర్శతో పాటు, పార్టీ, జాతి, లింగం, భాష ఇత్యాది భేదాలేవీ లేకుండా ప్రతీ ఒక్క అమెరికన్ శ్రేయస్సు కోసం తాను కృషిచేస్తానని ఆమె ప్రకటించారు. గతంలో దేశం చవిచూసిన విభజన, విద్వేషం తన ఏలుబడిలో ఉండబోవని హామీ ఇచ్చారు. అధికారం దక్కితే పట్టపగ్గాల్లేకుండా వ్యవహరించడం ట్రంప్‌కు అలవాటంటూ కొన్ని ఘట్టాలను ఆమె ఉదహరించారు. ప్రజాస్వామ్యం మీద ఏమాత్రం విశ్వాసం లేని, నిలకడలేని వ్యక్తి అంటూ, అధికార బదిలీ సందర్భంగా ఆయన తన పార్టీ కార్యకర్తలను కాపిటల్ హిల్ మీద దాడులకు పురిగొల్పిన ఘట్టాన్ని గుర్తుచేశారు. పార్టీ నామినేషన్‌ను ఆమోదిస్తున్న ఈ సందర్భాన్ని తన భావజాలాన్నీ, నేపథ్యాన్నీ వివరించేందుకు ఉపయోగించుకున్నారు. భారతదేశంనుంచి వలసవచ్చిన తన తల్లిప్రయాణాన్ని, తల్లిదండ్రుల జీవితాన్ని వివరించారు ఆమె. శ్రామికులు అధికంగా ఉండే ప్రాంతంలో పెరగడం, మధ్యతరగతి నేపథ్యం, పొదుపుగా బతకడం, ఉన్నదానిలో సర్దుకోవడం వంటి ప్రస్తావనలు ఓటర్ల మనసు గెలుచుకోవడానికి ఉపకరిస్తాయని ఆమె ఆశిస్తున్నట్టుంది. తన విధానాలను వివరిస్తున్నప్పుడు కూడా ఆరోగ్యం, నివాసం, రోజువారీ అవసరాలు, ఖర్చులు ఇత్యాది విషయాలపైనే ఆమె దృష్టిపెట్టారు. చైనాను నెంబర్ వన్ కానివ్వనంటూ అమెరికన్లను ఉత్సాహపరిచారు కానీ, గాజాయుద్ధం, ఉక్రెయిన్‌కు సాయం అంశాల్లో మార్పేమీ ఉండబోదని ఆమె ప్రసంగం సారాంశం. పాలస్తీనియన్ల బాధలు వర్ణనాతీతం అంటూ ఎప్పటిలాగానే కాస్తంత జాలిపడ్డారంతే.

ఒబామాలు, క్లింటన్లు సహా అనేకమంది దిగ్గజాల మద్దతుతో కమలాహారిస్ మరింత శక్తిమంతురాలైనారు. నెలరోజుల క్రితం వరకూ డెమోక్రాట్లలో ఈ మాత్రం ఉత్సాహం లేదు. ట్రంప్‌మీద హత్యాయత్నం జరిగి, రక్తమోడుతున్న మొఖంతో ఆయన గాలిలోకి తన పిడికిలి విసిరిన దృశ్యం చూసిన తరువాత డెమోక్రాట్లు పూర్తిగా నీరుకారిపోయారు. దీనికి కాస్తంత ముందు ట్రంప్‌తో జరిగిన చర్చలో బైడెన్ బాగా తడబడి ట్రంప్‌కు ఎక్కడలేని శక్తీ ఇచ్చారు. పార్టీ నాయకుల ఒత్తిళ్ళమేరకు, విధిలేక బరినుంచి తప్పుకోవాల్సివచ్చినప్పటికీ ఆ నిర్ణయంతో బైడెన్ పార్టీని గట్టిపోటీకి సిద్ధంచేశారు. జారిపోయి, పారిపోయిన డెమోక్రాట్లు ఇప్పుడు కొత్తనాయకత్వంలో తిరిగి యుద్ధరంగంలోకి అడుగుపెట్టి మంచిపోరాట పటిమను ప్రదర్శించడం ట్రంప్‌ను ఆత్మరక్షణలో పడవేసింది. ఆమె జెండర్‌ను, మూలాలను ప్రస్తావించడం, అవహేళన చేయడం ఆరంభించారు. ఫాసిస్టులు, కమ్యూనిస్టులు అమెరికాను ఆక్రమించుకోవడానికి కుట్రపన్నుతున్నారని హెచ్చరిస్తూ, కమలకు ముందు కామ్రేడ్ అనే పదాన్ని చేర్చి మరీ సంబోధిస్తున్నారు. ట్రంప్ వస్తే దేశానికి ఎంత ప్రమాదమో కమల చెబుతున్నారు. ఆయనకు అధికార కాంక్షతప్ప, దేశం మీద ప్రేమలేదని ఆమె హెచ్చరిస్తున్నారు. జూన్‌లో జరిగిన ప్రెసిడెన్షియల్ డిబేట్‌లో బైడెన్‌ను వెనక్కునెట్టేసిన ట్రంప్, వచ్చేనెల చర్చలో కమలను ఎలా ఎదుర్కొంటారో చూడాలి. ప్రస్తుతానికి ఎన్నికల సర్వేల్లో కమలాహారిస్ ఓ మెట్టు పైనే ఉన్నప్పటికీ, ఎన్నికలకు మరో రెండునెలలు ఉన్నందున గాలి ఎటువైపు బలంగా తిరుగుతుందో ఇప్పుడే చెప్పలేం. 'మేకింగ్ అమెరికా గ్రేట్' అన్నమాటనే నమ్ముతారో, బహుళత్వాన్నే బలపరుస్తారో చూడాలి.

ఎన్నికలు కశ్మీర్‌ను గట్టెక్కించగలవా?



పదేళ్ల తర్వాత జమ్ము కశ్మీర్ శాసనసభకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఇది అమిత ఆనంద దాయక పరిణామం. సుప్రీంకోర్టు విధించిన గడువు (సెప్టెంబర్ 30) మూలంగానే అక్కడ ఈ ఎన్నికలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఎన్నికలైనా కశ్మీర్‌ను నిరంతర సంక్షోభం నుంచి బయటపడేలా చేయగలవా, జమ్మూ కశ్మీర్ ప్రాంతాలు రెండు మతాలకు ప్రాతినిధ్యం వహించేవిగా కాకుండా తోబుట్టువులుగా బతికే రోజులను ఆవిష్కరిస్తాయా? టెర్రరిజం నుంచి కశ్మీర్‌ను విముక్తం చేయగలుగుతాయా?

2019లో జమ్మూ కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని (ఆర్టికల్ 370) రద్దు చేసి దానిని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విడదీసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కొంత కాలానికి రాష్ట్ర హోదాను తిరిగి ఇవ్వగలమని పదే పదే హామీ ఇచ్చారు. చివరికి దానిని నెరవేర్చకుండానే శాసన సభ ఎన్నికలు జరిపిస్తున్నారు. కేవలం ఎన్నికలే ప్రజాస్వామ్యం కాదు. అవి దానికి ముఖద్వారం మాత్రమే. సమానతకు, సమనీతికి, స్వేచ్ఛకు, మానవ హక్కులకు ప్రజాస్వామ్యం హామీగా నిలుస్తుంది. దానికి దారి దీపం వంటి ఎన్నికల వ్యవస్థ స్వచ్ఛతను హరించే పాలకుల వల్ల ఏమి జరుగుతుందో కశ్మీర్, హర్యానా షెడ్యూల్ ప్రకటన సందర్భంలో వెల్లడయింది.

బీజేపీ కూటమికి విజయావకాశాలు తక్కువగా ఉన్న మహారాష్ట్రలో వాటిని పెంచుకోడానికి అవసరమైన సమయం కోసం అక్కడ ఎన్నికలను కేంద్ర పాలకులు వాయిదా వేయించుకోగలిగారు. హర్యానాతో బాటు జరగవలసిన ఆ రాష్ట్ర ఎన్నికలను పండగల సాకు చూపి ఆవలకు జరిపించగలిగారు. ఇటువంటి అవసరాలను దృష్టిలో ఉంచుకునే కేంద్ర ఎన్నికల కమిషనర్ల నియామక వ్యవస్థను చెప్పుచేతల్లో పెట్టుకున్నారు. గత పార్లమెంటులో తమకున్న స్పష్టమైన మెజారిటీని ఉపయోగించుకుని ముగ్గురు సభ్యుల నియామక కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి చోటు లేకుండా చేశారు. ఎన్నికల నిర్వహణ మీద కూడా దీని ప్రభావం పడుతున్నది. మొన్నటి లోక్‌సభ ఎన్నికల ప్రచార ఘట్టంలో ప్రధాని మోదీ ఎంతగా నియమోల్లంఘనకు పాల్పడ్డారో తెలిసిందే. అయినా ఎన్నికల కమిషన్ కళ్ళప్పగించి చూసిందే గాని ఏమీ చేయలేకపోయింది.

జమ్మూ కశ్మీర్‌లో టెర్రరిజం నిర్మూలన ఇంకా జరగలేదు. ఇప్పుడు అది కొత్తగా జమ్మూ ప్రాంతానికి వ్యాపించి పేట్రేగుతున్నది. ఆ రాష్ట్ర ప్రత్యేక ప్రతిపత్తిని హరించిన తర్వాత త్వరలోనే ఎన్నికలు జరిపి ప్రజామోదం పొందుతామని బీజేపీ చెప్పింది. 2021లోనే ప్రధాని మోదీ ఇందుకు హామీ ఇచ్చారు. శాసనసభ నియోజకవర్గాల హద్దుల పునర్నిర్ణయ ప్రక్రియ పూర్తి కాగానే జమ్మూ కశ్మీర్లో ఎన్నికలు జరిపిస్తామని ప్రకటించారు. కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి రద్దు చేసి, రాష్ట్రాన్ని కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించిన తర్వాత మొట్టమొదటిసారిగా మాజీ ముఖ్యమంత్రులు సహా ఆ ప్రాంత కీలక నాయకులతో సమావేశమైనప్పుడు ప్రధాని ఈ హామీ ఇచ్చారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత మొదటిసారిగా గత మార్చిలో ప్రధాని కశ్మీర్ పర్యటనకు వెళ్లారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆ రాష్ట్ర ప్రజల అభిమానాన్ని సంపాదించడం కోసం ఆయన ఈ యాత్రకు వెళ్లారు. 370 రద్దు వల్ల కశ్మీర్ ప్రజలు స్వతంత్రంగా ఊపిరి పీల్చుకోగలుగుతున్నారని బానిసత్వం నుంచి బయటపడ్డారని వారి హృదయాలను గెలుచుకుంటానని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. అయితే ఇంతకాలం అక్కడ ఎన్నికలు జరిపించడం కంటే, ఆ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించేలా చేసుకోడానికే ప్రాధాన్యమిస్తూ కమలనాథులు పావులు కదిపారు. నియోజకవర్గాల పునర్విభజనను కూడా ఇందుకు దుర్వినియోగం చేశారు. అధిక జనాభా గల కశ్మీర్ లోయలో అదనంగా ఒకే ఒక నియోజకవర్గాన్ని కలిపి జమ్మూ ప్రాంతానికి ఆరు కొత్త నియోజక వర్గాలను చేర్చిన పునర్విభజన ప్రక్రియ విమర్శలకు గురి అయింది. హిందూ ప్రాంతమైన జమ్మూకి అధిక నియోజకవర్గాలను చేర్చడం వెనుక బీజేపీ కుట్ర ఉన్నదని కశ్మీర్ నాయకులు, మేధావులు ఆరోపించారు. దేశమంతటా నియోజకవర్గాల పునర్విభజన 2026లో జరగవలసి ఉండగా జమ్మూ కశ్మీర్‌లో అందుకు తొందరేల వచ్చిందనే ప్రశ్న తలెత్తింది.

ఇటువంటి చర్యల ద్వారా బీజేపీ కశ్మీర్ లోయ ప్రజలకు మరింత దూరమైంది. మొన్న జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కశ్మీర్ లోయలో బీజేపీ పోటీ చేయలేకపోడం ఇందుకు ప్రబల నిదర్శనం. కశ్మీర్ లోయలో మూడు లోక్‌సభ స్థానాలున్నాయి. మొన్నటి ఎన్నికల్లో అందులో రెండింటిని నేషనల్ కాన్ఫరెన్స్ గెలుచుకోగా ఒకటి ఇండిపెండెంట్ కైవసమయింది. జమ్మూలోని రెండు స్థానాల్లో బీజేపీ గెలిచింది. కశ్మీర్‌ను చావబాది చెవులు మూశామని దేశమంతటా జబ్బలు చరుచుకునే బీజేపీ తన చర్యకు లోయ ప్రజల మద్దతు కూడగట్టలేకపోయిన వాస్తవం కళ్ళకు కడుతున్నది. తన ఆశయ సాధన కోసం లోక్‌సభలో మెజారిటీ సిద్ధించగానే ఆర్టికల్ 370 రద్దును జరిపించివేసి ఆ తర్వాత దానికి అక్కడి ప్రజల మద్దతు కూడగట్టాలని వేసుకున్న పథకం బెడిసికొట్టింది. గవర్నర్ ఉండే రాష్ట్ర అసెంబ్లీకి లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్‌జి) గల కేంద్రపాలిత ప్రాంత (యుటి) అసెంబ్లీకి చాలా తేడా ఉంది. ఎల్‌జి అదుపాజ్ఞలలోని యుటి శాసనసభకు ఆ ప్రాంత మనుగడకు సంబంధించిన కీలక అంశాలపై శాసనాలు చేసే అధికారం ఉండదు. అవి కేంద్రానికే దఖలుపడి ఉంటాయి. విద్య సాంస్కృతిక వ్యవహారాల వంటి కొద్ది అంశాలకే కేంద్ర పాలిత ప్రాంత అసెంబ్లీ పరిమితమై ఉంటుంది. కశ్మీర్ ఎల్‌జి అధికారాలను అపరిమితంగా పెంచుతూ మొన్న జూలైలోనే కేంద్రం చట్టాన్ని సవరించింది. పోలీసులు శాంతిభద్రతలు, నియామకాలు, బదిలీలపై అంతిమ అధికారాన్ని లెఫ్టినెంట్ గవర్నర్‌కు కట్టబెట్టింది. అందుకే లెఫ్టినెంట్ గవర్నర్ పాలనలోని కేంద్ర పాలిత ప్రాంత శాసనసభ ఎన్నికల్లో పోటీచేయడం నామోషీ అనుకొని వాటికి దూరంగా ఉండడానికి ప్రధాన రాజకీయ పార్టీలైన నేషనల్ కాన్ఫరెన్స్, పిడిపిలు మొదట్లో నిర్ణయించుకున్నాయి. ఇప్పుడు అవి మనసు మార్చుకున్నాయి. ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని బరిలో దిగుతున్నాయి. నేషనల్ కాన్ఫరెన్స్ కాంగ్రెస్‌తో పొత్తు కుదుర్చుకున్నది. మరో ప్రధాన రాజకీయపక్షం పిడిపి కూడా బీజేపీతో కలిసి పోటీ చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. ఇండియా కూటమి భాగస్వామిగా కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్‌లతో పొత్తుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించింది. అక్కడ కేంద్ర పాలన విధించడానికి ముందు వరకు ఆ పార్టీ బీజేపీతో కలిసి అప్పటి రాష్ట్ర ప్రభుత్వాన్ని నడిపింది. ఆర్టికల్ 370, 35ఎ (జమ్మూ కశ్మీర్ శాశ్వత పౌరుల హక్కుల పరిరక్షణ)లను పునరుద్ధరింప జేస్తానన్న వాగ్దానాన్ని నేషనల్ కాన్ఫరెన్స్ తన ఎన్నికల ప్రణాళికలో చేర్చడం గమనించవలసిన అంశం.. అయిదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ద్వారా ఇచ్చిన తన తాజా తీర్పులో కశ్మీర్ స్వయం ప్రతిపత్తిని, ప్రత్యేక హక్కుల రద్దును ధ్రువీకరించినప్పటికీ అంతకు ముందు మూడు సార్లు ఆర్టికల్ 370ను సుప్రీంకోర్టు సమర్థించిన విషయాన్ని మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా గుర్తుచేస్తున్నారు. ఈ ఆర్టికల్ పునరుద్ధరణకు రాజకీయంగా పోరాడుతామని ఆయన ప్రకటించారు. హర్యానా, జమ్మూ కశ్మీర్ శాసనసభల్లోని ఎన్నికలు జరుగుతున్న స్థానాల సంఖ్య ఒకటే (90). కాని హర్యానాలో ఒకే ఒక్క రోజులో పోలింగ్ ముగిసిపోనుండగా కశ్మీర్‌లో మూడువిడతల్లో జరుగనుండడం గమనించదగినది. ప్రశ్నకు, ప్రతిపక్షానికి ఆస్కారం లేని లెఫ్టినెంట్ గవర్నర్ పాలనలోనూ జమ్మూ కశ్మీర్‌ను దారికి తెచ్చుకోలేకపోడం స్పష్టంగా కనిపిస్తున్న బీజేపీ వైఫల్యం.

> ప్రజలను వేధింపులకు గురిచేసి వారి స్వేచ్ఛలను కాలరాస్తున్నారనే అభిప్రాయం ఉన్న చోట వారు స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాలు తక్కువగా ఉంటాయి. ఎక్కడైనా, ఎప్పుడైనా మిలిటరీ పరిష్కారం ఒక్కటే చాలదు. ప్రజల హృదయాలను గెలుచుకోవాలి. ప్రస్తుత కశ్మీర్ ఎన్నికల ఘట్టం స్వాగతించదగినదే. ఏదో ఒక స్థాయి ప్రజాప్రాతినిధ్య వ్యవస్థ వల్ల ఆ ప్రాంతం ఆ మేరకు గాలి పీల్చుకోగలుగుతుంది.


1989 నుంచి 2019 వరకు అక్కడ కశ్మీర్‌లో ఎన్నికల స్వచ్ఛతపై అంతర్జాతీయ ప్రజాస్వామిక పర్యవేక్షకులు అనుమానం వ్యక్తం చేస్తూనే ఉన్నారు. భద్రతా దళాలు, ప్రజలను భయపెట్టి పోలింగ్ బూత్‌లకు తరుముతున్నాయనే ఆరోపణ తరచూ వినిపిస్తుంది. జమ్మూ కశ్మీర్ జనాభా 1.56 కోట్లు, ఓటర్లు 87.09 లక్షలు, పురుష ఓటర్లు 44.46 లక్షలు, స్త్రీలు 42.62 లక్షలు. మొదటిసారి ఓటు హక్కు పొందినవారు 3.71 లక్షల మంది. ప్రజలను వేధింపులకు గురిచేసి వారి స్వేచ్ఛలను కాలరాస్తున్నారనే అభిప్రాయం ఉన్న చోట వారు స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాలు తక్కువగా ఉంటాయి. ఎక్కడైనా, ఎప్పుడైనా మిలిటరీ పరిష్కారం ఒక్కటే చాలదు. ప్రజల హృదయాలను గెలుచుకోవాలి. ప్రస్తుత కశ్మీర్ ఎన్నికల ఘట్టం స్వాగతించదగినదే. ఏదో ఒక స్థాయి ప్రజాప్రాతినిధ్య వ్యవస్థ వల్ల ఆ ప్రాంతం ఆ మేరకు గాలి పీల్చుకోగలుగుతుంది.

• జి. శ్రీరామమూర్తి
(సీనియర్ జర్నలిస్ట్)

కులగణన వెనుక కుట్ర కోణం!

స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా ఎప్పుడూ గుర్తుకురాని కులగణన అంశం కేంద్రంలో బీజేపీ అధికారంలోకి పదేపదే వస్తుండడంతోనే ఎందుకు మొదలైంది అనేది ఆలోచించాల్సిన అంశం. భారత్‌లో వందలాది కులాలు ఉన్నాయి. అందులో అధిక భాగం హిందువులే కావడం గమనార్హం. వాస్తవానికి భారత ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, జూన్ 2011లో దేశవ్యాప్తంగా ఇంటింటికి సమగ్ర గణన ద్వారా సామాజిక, ఆర్థిక, కుల గణన (SECC) 2011ను ప్రారంభించింది. ఇటీవల బిహార్‌లో జేడీయూ నేతృత్వంలోని నితీశ్ కుమార్ ప్రభుత్వం ఓబీసీ జన గణనను చేపట్టింది. దేశంలో ఉన్న ముస్లింలంతా ఓటు బ్యాంక్‌గా మారడంతో ఆయా రాజకీయ పార్టీలు వారి ఓట్ల కోసం నానా అవస్థలు పడుతున్నాయి. తద్వారా వారి ఓట్లు 20శాతం దాకా గంపగుత్తగా పడితే చాలు తమ పార్టీల గెలుపు సులువవుతుందని భావిస్తూ బహిరంగంగా వారికి మద్దతు పలుకుతున్నాయి. ఇక క్రిస్టియన్‌లు కూడా అంతే. మైనార్టీ జపం చేసే పార్టీల వెంట వెళుతున్నారు. ఇక మిగిలింది 75శాతం పైగా ఉన్న హిందువులు, ముఖ్యంగా ఓబీసీలు ఇటీవల ఐక్యమవుతుండడంతో బీజేపీ అధికారంలోకి వస్తోందని, కాబట్టే హిందువులు ఒకటిగా కాకుండా చూడాలనే కుట్రలో భాగంగా ఈ పార్టీలు కులగణన అంశాన్ని నెత్తినెట్టుకుంటున్నాయి. కులాల పేరుతో, రిజర్వేషన్ల పేరుతో హిందువులైన ఓబీసీలను విడగొట్టి బీజేపీ నుంచి దూరం చేయాలని భావిస్తున్నారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. అందుకే కావచ్చు ఇటీవల రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో బహిరంగంగా హిందువులు హింసావాదులు అంటూ తీవ్ర విమర్శలు చేయడమే కాకుండా ఓబీసీల కులగణన అంశాన్ని లేవనెత్తారు. ఆయన అదే సమయంలో ఇతర మతాలలో ఉన్న కులాల జన గణన కూడా జరగాలని అనకపోవడం గమనార్హం.

అచ్చం ఇలాంటి కుట్రే స్వాతంత్ర్యానికి పూర్వం జరిగింది. అదే మెకాలే విద్యావిధాన ప్రవేశం. భారత్‌లో ఎక్కువ కాలం తమ పాలన సాగించాలంటే ఏం చేయాలనే అంశంపై అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం లండన్‌లో మేధావుల అభిప్రాయం కోరింది. దీంతో ఈ విషయంపై అధ్యయనం చేసిన లార్డ్ మెకాలే భారత్‌లో అప్పటికే అమలవుతున్న విద్యా విధానాన్ని సమూలంగా మార్చాలని, వారికి గత వైభవ చరిత్ర తెలియకుండా చేయాలని, పటిష్టమైన ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీయాలని ఒక నివేదిక అందజేశారు. భారత్‌లో బ్రిటిష్ వారికి పూర్వమే పటిష్టమైన గురుకులాల ద్వారా నూరు శాతం జనాభా విద్యావంతులు. రతనాలు, బంగారం రాశులుగా పోసి మార్కెట్లో అమ్మే ఘనమైన ఆర్థిక వ్యవస్థ ఉందని మెకాలే నివేదించారు. దీనిని బట్టి భారతదేశం ఎంత సంపన్నమైన, వైభవోపేతమైనదో అర్థం చేసుకోవచ్చు. కాబట్టి అపారమైన దేశభక్తి కలిగిన భారతీయులు తమ చరిత్రను మరిచిపోయేలా అక్కడి చరిత్రను వక్రీకరించాలని, అదే అక్కడి విద్యార్థులకు బోధించాలని, అలా వారు వారి సంస్కృతీ సంప్రదాయాలను పూర్తిగా మరిచిపోయేలా చేయాలని నివేదించడంతో బ్రిటిష్ ప్రభుత్వం భారత్‌లో అప్పటివరకున్న గురుకులాల వ్యవస్థను రూపుమాపి కొత్తగా మెకాలే విద్యావిధానాన్ని ప్రవేశపెట్టింది. దురదృష్టకరమైన విషయమేంటంటే స్వాతంత్ర్యానంతరం అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ పార్టీ దశాబ్దాలపాటు అదే విద్యావిధానాన్ని కొనసాగించింది. కాబట్టే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఘనమైన భారత చరిత్రను నూతన విద్యా విధానంలో అమలులోకి తేవాలనుకుంటే స్వార్థంతోనే ప్రతిపక్షాలు అడ్డుపడుతున్నాయి. సెక్యులరిజానికి దెబ్బ, హిందూ మతతత్వం పెరుగుతుంది అంటూ మైనార్టీలను అనవసరంగా భయపెడుతూ కేంద్ర ప్రభుత్వ సదాశయానికి మోకాలడ్డుతున్నారు. ఇలాగే ఓట్ల కోసం మరెన్నో కుట్రలు చేస్తున్నారు.



> దృఢమైన ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉంటే తమ ఆటలు సాగవని కొన్ని విదేశీ శక్తులు మన దేశంలో కుట్రలు చేస్తున్నాయి. అశాంతి రేకెత్తించి ప్రజల్లో వ్యతిరేకత పెంచి, వచ్చే ఎన్నికల్లో అయినా తమ కనుసన్నల్లో మెసలే డమ్మీ నాయకత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని ప్రయత్నిస్తున్నాయి.

ఇటీవల పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పొరుగు దేశం నుంచి వచ్చే ముస్లింలందరికి తమ రాష్ట్రంలో ఆశ్రయం కల్పిస్తామనడమే కాకుండా, దశాబ్దాలుగా భారత్‌లో నివసిస్తున్న విదేశీయులను ఎలా పంపిస్తామన్నట్లుగా బహిరంగంగా మాట్లాడారంటే ఆమె వారి ఓట్ల కోసం ఎంతగా దిగజారుతున్నారో తెలుస్తోంది. తన స్వార్థం కోసం దేశ హితాన్నే పణంగా పెడుతున్నారు. వెంటనే స్పందించిన హోం మంత్రి అమిత్ షా ఆమె మాటలను ఖండిస్తూ, వందల ఏళ్ల పాటు ఇక్కడే ఉండి పరిపాలించిన బ్రిటిష్ వారిని మన దేశం నుంచి ఎందుకు పారదోలామని ఎదురు ప్రశ్నించాల్సి వచ్చింది. కాంగ్రెస్ ఇప్పటికీ మమత వ్యాఖ్యలను ఖండించకపోవడం గమనార్హం. పశ్చిమ బెంగాల్‌లోని 24 పరగణా జిల్లాలో సద్దాం సర్దార్ అనే వ్యక్తి ఇంటిపై పోలీసులు దాడి చేయగా అతని ఇంట్లోని బెడ్ రూమ్ నుంచి బంగ్లాదేశ్ దాకా ఒక భారీ సొరంగం బయటపడిందంటే ఆ రాష్ట్రంలో అరాచకశక్తులు ఎలా పేట్రేగిపోతున్నాయో అర్థం చేసుకోవచ్చు.

దశాబ్దాలపాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పాలనలో దేశం ప్రతి విషయంలో విదేశాలపై ఆధారపడే దుస్థితి ఉండేది. చివరికి పీపీఈ కిట్ కూడా తయారు చేసుకోలేని పరిస్థితి. కరోనా సమయంలో బీజేపీ ప్రభుత్వం వేగంగా స్పందించి దేశంలోనే వాక్సిన్‌లు తయారు చేయించి హిందూ, ముస్లిం, క్రిస్టియన్ అనే తేడా లేకుండా 140 కోట్ల మంది భారతీయులను కాపాడడమే కాకుండా 100కి పైగా విదేశాలకు ఉచితంగా వాక్సిన్ సరఫరా చేయగలిగింది. ఇది విదేశీ మెడికల్ మాఫియాకు నచ్చని అంశం. "మనదేశంలో తయారైన వాక్సిన్ సరిగ్గా పనిచేస్తుందని ఏంటి నమ్మకం? ఫైజర్ లాంటి విదేశీ కంపెనీలు తయారు చేసిన వాక్సిన్ వాడాలి" అని రాహుల్‌గాంధీ పదేపదే కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చారంటే ఆయన ఆలోచనను సులువుగా అర్థం చేసుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వం స్వదేశీ వ్యాక్సిన్ తయారు చేయడానికి ఎన్నో రకాల ఒత్తిడులు తట్టుకొని నిలబడాల్సి వచ్చింది అన్న సుప్రీంకోర్టు రిటైర్డ్ ప్రధాన న్యాయమూర్తి రమణ మాటలను బట్టి మోదీ ప్రభుత్వం దేశ స్వావలంబన కోసం ఎంత దృఢంగా కృషి చేస్తుందో అర్థం చేసుకోవచ్చు.

ఇలాంటి దృఢమైన ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉంటే తమ ఆటలు సాగవనే కొన్ని విదేశీ శక్తులు మన దేశంలో కుట్రలు చేస్తూ, అశాంతి రేకెత్తించి ప్రజల్లో వ్యతిరేకత పెంచి, వచ్చే ఎన్నికల్లో అయినా తమ కనుసన్నల్లో మెసలే డమ్మీ నాయకత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని ప్రయత్నిస్తున్నాయి. ఇలాంటి కుట్రదారుల ఆటలు సాగకుండా చేసి కులాలు, రిజర్వేషన్ల పేరుతో హిందువులు విడిపోకుండా దేశ హితం కోరే ప్రభుత్వాన్ని కాపాడుకోవలసిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉంది.

○ శ్యామ్‌సుందర్ వరయోగి

బీసీ యువతరమా, కదలిరమ్మ!

పంచాయతీ నుంచి పార్లమెంటు దాకా బీసీల రిజర్వేషన్ల సాధన, కులగణన కోసం ఉద్యమించే సమయం ఆసన్నమైంది. ఈ చారిత్రక సందర్భంలో బీసీ విద్యార్థి యువత చారిత్రక పాత్రను పోషించే సమయం వచ్చింది. తెలుగు నేల మీద ఎగిసిన ఎన్నెన్నో ఉద్యమాలకు, విప్లవాలకు ప్రాణాలిచ్చి ప్రాణం పోసిన బీసీ యువకుల వారసత్వం చరిత్ర పుటల్లో నిక్షిప్తంగానే ఉంది. మారోజు వీరన్న శంఖం ఊది మొదలుపెట్టిన బీసీ అస్తిత్వ పోరాటాలన్నీ ఇపుడు తిరిగి మొలకెత్తవలసిన సమయం వచ్చింది. రైల్వేస్టేషన్లలో చేతిపనులు చేసి చదువుకుని దేశ రాజకీయ చిత్రపటంలో పాలక రంగంలో రెండవ స్థానానికి ఎదిగిన శివశంకర్ తన ఆత్మకథలో 'అదొక్కటే ముగింపు' అన్న సారాంశాన్ని బీసీ యువతరం తమ మెదళ్ళకెక్కించుకోవాలి. మహాత్మ జ్యోతిబా ఫూలే బహుజనుల కోసం చేసిన పోరాటాలను, తమిళనాడులో రామస్వామి పెరియార్ నేతృత్వంలో కదిలిన ద్రవిడ కజగంల చరిత్రను గుర్తు తెచ్చుకోవాలి. న్యాయ శాఖమంత్రిగా అంబేద్కర్ రాజీనామా చేసి పార్లమెంట్ మెట్ల మీద కండ్ల నీళ్ళు ఎందుకు పెట్టుకున్నాడో ప్రతి బీసీ యువతరం ఊరూరా తిరిగి చాటింపు వేసి చెప్పాలి. రాం మనోహర్ లోహియా, సోషలిస్టు ఉద్యమాల నుంచి యూపీ, బిహార్‌లలో ఏ విధంగా బీసీలు ముఖ్యమంత్రులయ్యారో, విశ్వవిద్యాలయాల ప్రాంగణాల నుంచి పల్లె రచ్చబండల దాకా చర్చల కుంపట్లు రాజేసి చెప్పే బాధ్యతను యువతరం భుజస్కంధాలపై వేసుకోవాలి. మండల్ కమిషన్ పుట్టుకకు జరిగిన ఉద్యమ నేపథ్యాలను, ఆ కమిషన్‌ను అమలు జరపాలని పార్లమెంటు ముందు రెండు వారాలు దీక్ష చేసిన కన్షీరాం, దేశవ్యాప్తంగా ఎగిసిన ఉద్యమాలను, అన్ని పార్టీలలో అగ్రవర్ణ నాయకత్వాలు పన్నిన కుట్ర రాజకీయాలను బీసీ యువతరం విప్పి చెప్పాలి. బీసీ ఉద్యమాలు చేపట్టి తమిళనాడు రాష్ట్రం సాధించుకున్న హక్కుల్ని చాటి చెప్పాలి. తమిళ బీసీ అస్తిత్వ స్ఫూర్తి నేటి ఉద్యమానికి ఎంత అవసరమో బీసీ యువతరమే విశ్లేషించి వాడవాడలా చాటి చెప్పాలి.



బీసీ విద్యార్థి యువత తమ చదువులు తాము చదువుకుంటూ, ఉద్యోగాల కోసం పోటీ పరీక్షల్లో పోటీ పడుతూనే, తమ జాతుల కులాల హక్కుల కోసం సమాంతర పోరాటం చేయక తప్పదు. బీసీల హక్కుల సాధన అన్నదాన్ని నిరంతర ఉద్యమంగా ముందుకు తీసుకుపోవాలి. పల్లె నుంచి పట్నం దాకా పట్నాల నుంచి మహానగరాల దాకా ఎక్కడి వాళ్ళు అక్కడనే ఉండి, తమ రోజువారి పనులు కొనసాగిస్తూనే, స్థానిక సంస్థల నుంచి పార్లమెంటు దాకా రిజర్వేషన్ల సాధన, కులగణనపై సమాంతర బీసీ ఉద్యమాన్ని నిర్మించేందుకు యువతరం కీలక భూమికై నిలవాలి. రాజ్యాంగంలోని 16(4), 15(4), 243, 340 ఆర్టికల్స్‌ను క్షుణ్ణంగా అధ్యయం చేసి, వాటిని ప్రతి ఒక్కరికి అర్థమయ్యేలా చెప్పి, రెండు కోట్ల మంది బీసీలను ఒక్కతాటిపైకి తెచ్చే పని చేయాలి. బీసీ యువత విద్యార్థులు నిర్మించబోయే ఉద్యమానికి తెలంగాణ రాష్ట్రంలోని 1 లక్ష మంది బీసీ ఉపాధ్యాయులు, వేలాది మంది బీసీ లెక్చరర్లు, ప్రొఫెసర్లు భావజాల ఆయుధాలను అందిస్తారు. "మేమెంతో మాకంత" అన్న నినాదం సమాజాన్ని ముక్కలు చేసే ఉద్యమం కాదని, అది రాష్ట్రాన్ని దేశాన్ని అభివృద్ధి చేసే ఉద్యమమని వాడవాడలా చాటి చెప్పాలి.

పాలించే లక్షణాలు బీసీలకు లేవా? అన్న ప్రశ్న ప్రతి బీసీ ఇంటి గడప దగ్గర లేవాలి. బీసీలకు దక్కాల్సిన అధికారిక వాటాల్ని ఎవరు తన్నుకుపోతున్నారో పూసగుచ్చినట్లు చెప్పాలి. "పంచాయతి నుంచి పార్లమెంటు దాకా బీసీలకు సమవాటాకై పోరు" అన్న ఏకవాక్య నినాద ఉద్యమం ప్రతి బీసీ స్వప్నం కావాలి. సామాజిక న్యాయం కోసం బీసీ యువత గొంతును విప్పి ప్రళయగర్జనలు చేయాలి. బీసీ యువత "మరో బీసీ ప్రపంచం కోసం" నడుంకట్టి ముందుకు సాగాలి. బీసీ ఉద్యమాన్ని సిద్ధాంతీకరించడానికి బీసీ మేధావులు, విద్యావంతులతో లోతుగా అధ్యయనాన్ని చేయించే కార్యక్రమాన్ని చేపట్టాలి. ఉద్యమ భావజాల వ్యాప్తికి బీసీ నవతరం, యువతరం పూనుకోవాలి. పంచాయతీ నుంచి పార్లమెంటుదాకా బీసీల సమవాటా కోసం జరుగుతున్న ఉద్యమానికి బీసీ యువతరం కదిలిరావాలి. మీకోసం... మీ బీసీ ప్రపంచం ఎదురుచూస్తోంది.

– జూలూరు గౌరీశంకర్
తెలంగాణా రాష్ట్ర తొలి బీసీ కమిషన్ సభ్యులు

కోల్‌కతా ఘటన ఏం చెబుతోంది?

కోల్‌కతాలో యువ మహిళా డాక్టర్ హత్యాచార ఘటన తరువాత దేశవ్యాప్తంగా వ్యాపిస్తున్న ప్రకంపనలు కొత్త సవాళ్లకు తెరలేపుతున్నాయి. సభ్య సమాజం ఇలాంటి అమానుష ఘటనలు జరిగినప్పుడు స్పందించే విషయంలో ఎలా ఉండాలన్న చర్చ సర్వత్రా జరుగుతున్నది. కోల్‌కతా ఘటనను సమాజం ఒక మహిళపై జరిగిన హత్యాచార ఘటనగా చూడాలా ఒక డాక్టర్‌పై జరిగిన వికృత దాడిగా చూడాలా లేక రెండు రాజకీయ పార్టీల మధ్య రాజకీయ అంశంగా పరిగణించాలా అన్నది తేల్చుకోవాల్సిన కీలక సందర్భమిది.

ఘటనకు కారకులుగా విమర్శలు ఎదుర్కొంటున్న వాళ్లలో అదే వృత్తిలో ఉన్న యువకులు ఉన్నారనే ప్రచారం సాగుతున్నది. ఘటన అనంతర పరిణామాలు మరింత జుగుప్సాకరమైన రీతిలో బహిర్గతం అయ్యాయి. అదే హస్పిటల్‌పై మూక దాడి జరిగింది. ఘటన అనంతరం "దొంగే దొంగ దొంగ" అన్నట్లుగా చోటు చేసుకున్న పరిణామాలు కూడా ఉన్నాయి. ఘటనపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ దేశవ్యాప్త నిరసనతో గళాన్ని వినిపించిన తరువాత సుప్రీంకోర్టు ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించింది. ఇదంతా ఒక పరిణామ క్రమంలో వివరించాల్సిన అంశం.

దేశ రాజధానిలో నిర్భయ అనే ఘటన జరిగింది. ఆ ఘటన యుక్త వయస్సులో ఉన్న మహిళ స్వతంత్ర దేశంలో స్వేచ్ఛగా సంచరించడం కష్టమనే అంశాన్ని వెలుగులోకి తెచ్చింది. బస్సులో ప్రయాణిస్తున్న యువతిపై ఒక మైనర్‌తో సహా నలుగురు హత్యాచారానికి పాల్పడి ఆమె మృతి చెందిందనుకుని చీకట్లోకి తప్పుకున్న తరువాత ఆ ఘటన వెలుగు చూసింది. నిర్భయ మృతి తర్వాత దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న హత్యాచారాలను అరికట్టడానికి ఉపకరించే రీతిలో నిర్భయ చట్టం వచ్చింది.

ఈ ఘటన ఉత్తర భారతదేశంలో జరిగిన అనేక ఘటనలను ప్రభావితం చేసి నిర్భయ చట్టం ద్వారా శిక్షలు విధించగలిగే విధంగా ఉపయోగపడింది. నిర్భయ చట్టం అమలులోకి వచ్చిన తరువాత కూడా ఆంధ్రప్రదేశ్‌లో దిశ ఘటన జరిగింది. ఆ ఘటనలో వెటర్నరీ విద్యార్థి అమానుషంగా హత్యకు గురైంది. హత్యకు పూర్వం అత్యాచారానికి ఒడిగట్టిన తీరు సమాజంలో ప్రకంపనలు రేపింది. ఒక నిర్భయ, ఒక దిశ లాంటి ఘటనలు చట్టాల రూపంలో న్యాయ వ్యవస్థలకు అనుసంధానంగా కొత్త లక్ష్యాలను నిర్దేశించేందుకు ఉపకరించాయి. ఇవన్నీ జరుగుతున్న క్రమంలోనే తాజాగా బెంగాల్‌లో యువ డాక్టర్‌పై అత్యంత పాశవికమైన రీతిలో హత్యాచారానికి పూనుకోవడం మహిళలకు ఎదురవుతున్న సవాళ్లకు పరాకాష్ఠగా నిలుస్తున్నది.

నిర్భయ ఘటన ఉత్తర భారత్‌లోని ఢిల్లీలో జరిగింది. దిశ ఘటన దక్షిణ భారతంలోని హైదరాబాద్‌లో చోటుచేసుకుంది. తాజాగా మహిళా డాక్టర్ ఘటన తూర్పు భారతంలోని కోల్‌కతాలో జరిగింది. ప్రాంతాలతో ప్రమేయం లేకుండా సమాజంలో చెడు వెల్లువెత్తుతున్న తీరుకు ఈ మూడు ఘటనలు అద్దంపడుతున్నాయి. సామాజికంగా మహిళ అణచివేయబడుతున్న వర్గంగా కొనసాగుతూనే ఉంది. ఢిల్లీ ఘటన జరిగిన నాడు దేశ వ్యాప్త నిరసనలు మహిళా లోకం వెల్లువెత్తిన ఆగ్రహానికి దర్పణం పట్టాయి. దిశ చట్టం అమలయ్యే రీతిలో అప్పటి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఘటన ఉపయోగపడింది. కోల్‌కతాలో ఇప్పటి ఘటన సమగ్ర కార్యాచరణకు ఊతమందించాలి. 'ఆకాశంలో సగం' అని సమాజం పరిగణిస్తున్న మహిళలపై హత్యాచారాలు జరిగినప్పుడు వాటిని ఎదుర్కొనేందుకు సమాజం యావత్తు ముక్తకంఠంతో ముందుకు రావాలి.

ఇన్‌స్టంట్ జస్టిస్ తరహాలో కనిపించే శిక్షా ప్రక్రియ నిర్భయ లాంటి చట్టాలు లేనప్పుడే అమలైంది. చట్టాన్ని ఎవరూ చేతిలోకి తీసుకోవాలని సభ్య సమాజం కోరుకోదు. అయితే ఘటనల తీవ్రతను పరిగణనలోకి తీసుకున్నప్పుడు ఆలస్యమైన న్యాయం 'అన్యాయ'మే అవుతుందనే నానుడిని దృష్టిలో పెటుకుని ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా కొత్త చట్టాలను అమలుపర్చడానికి అవకాశాలు ఉండాలి. దిశ ఘటనలో కూడా తీర్పుతో ప్రమేయం లేకుండా సీన్ రిక్రియేషన్ సందర్భంలో నిందితుల ఎన్‌కౌంటర్ జరిగింది. సమాజంలో చట్టాన్ని, న్యాయాన్ని పరిరక్షించాలని కోరుకునే రాజ్యాంగబద్ధులైన ప్రజలు కోల్‌కతా ఘటనలో సత్వర న్యాయాన్ని ఆకాంక్షిస్తారు. అయితే ఆ సత్వర న్యాయం వెనువెంటనే లభించగలిగే ప్రాక్టికల్ పరిస్థితులు ఇప్పుడు ఉన్నట్లు కనిపించడం లేదు. కోల్‌కతా ఘటన వెనుక రాజకీయ, అవినీతిపరమైన ఒత్తిళ్లు ఉన్నాయనే ప్రచారం కూడా సాగుతోంది. రాజకీయ అంశాలు ప్రధానంగా ఏదైనా ఘటన చోటుచేసుకున్నప్పుడు సిసలైన న్యాయం లభించడం కష్టమే. కానీ, ఆ సిసలైన న్యాయం కోసం యావత్ సమాజం ముక్తకంఠంతో నిలదీస్తూ ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలి. కోల్‌కతా ఘటన కేవలం ఒక మహిళా డాక్టర్‌పై జరిగిన ఘటన కాదు. ఇది యావత్ సమాజంలో మహిళల మనుగడను ప్రశ్నార్థకం చేసిన అత్యంత కీలక సమస్య.

విధి నిర్వహణలో ఉన్న వైద్యురాలిపై జరిగిన దాడిగా మనం కోల్‌కతా ఘటనను చూసినప్పుడు అందుకు సంబంధించిన విషయాన్ని కూడా ప్రధానంగా చర్చ చేయాలి. వైద్యులపై ఆస్పత్రుల్లో దాడులు జరిగిన ఘటనలు అనేకం మనం చూస్తూనే ఉన్నాం. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లోనూ ఈ ఘటనల పరంపర కనిపిస్తూనే ఉన్నది. ముఖ్యంగా యుద్ధాలతో సతమతమవుతున్న యెమన్, సిరియా, గాజా లాంటి ప్రాంతాల్లోనూ మెక్సికో, ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, పాకిస్తాన్, కాంగో, సూడాన్ తదితర దేశాల్లోనూ హస్పిటళ్లపై దాడులు జరగడాన్ని వరల్డ్ మెడికల్ అసోసియేషన్ తీవ్రంగా పరిగణించింది. ఈ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా 23 దేశాల్లో 701 దాడుల ఘటనలు నమోదైనట్లు పేర్కొన్నది. ఈ ఘటనలు యుద్ధాలు జరుగుతున్న దేశాల్లో చోటు చేసుకుంటున్నాయి. అలాగే రోగుల కుటుంబాలు దాడులు చేసిన ఘటనలు కూడా అడపాదడపా నమోదవుతూనే ఉన్నాయి. వీటిని అరికట్టడానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రైవేట్ నర్సింగ్ హోమ్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమల్లోకి తెచ్చారు. ఇది హాస్పిటల్స్‌పై దాడులను అరికట్టే రీతిలో ప్రామాణికంగా నిలవాలని యూపీఏ ప్రభుత్వం భావించింది. ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్న క్రమంలోనే ప్రభుత్వాలు మారడంతో సమగ్ర చట్ట రూపకల్పన ఆచరణాత్మకం కాలేదు. కోల్‌కతా ఘటన ఇలాంటి సమగ్ర చట్ట రూపకల్పనకు మూలంగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పోలీసుల విధులను ఆటంకపర్చినప్పుడు ఎలాంటి చట్టాలైతే అమల్లో ఉన్నాయో డాక్టర్లు విధి నిర్వహణలో ఉన్నప్పుడు అవరోధాలు సృష్టిస్తే కూడా అంతే కఠినమైన చట్టాలు అమల్లోకి రావాలి. ఇది దేశవ్యాప్తంగా కోల్‌కతా ఘటన నేపథ్యంలో ఆందోళనకు గురవుతున్న మహిళా డాక్టర్లకు స్వాంతన కలిగించాలి.



> విధి నిర్వహణలో ఉన్న వైద్యురాలిపై జరిగిన దాడిగా మనం కోల్‌కతా ఘటనను చూసినప్పుడు అందుకు సంబంధించిన విషయాన్ని కూడా ప్రధానంగా చర్చ చేయాలి. పోలీసుల విధులను ఆటంకపర్చినప్పుడు ఎలాంటి చట్టాలైతే అమల్లో ఉన్నాయో డాక్టర్లు విధి నిర్వహణలో ఉన్నప్పుడు అవరోధాలు సృష్టిస్తే కూడా అంతే కఠినమైన చట్టాలు అమల్లోకి రావాలి. ఇది దేశవ్యాప్తంగా కోల్‌కతా ఘటన నేపథ్యంలో ఆందోళనకు గురవుతున్న మహిళా డాక్టర్లకు స్వాంతన కలిగించాలి.

కోల్‌కతా ఘటన భిన్నపార్శ్వాల్లో సమాజాన్ని దిశా నిర్దేశం చేసేందుకు అవకాశాలిస్తున్నది. మహిళలపై జరుగుతున్న దాడులు ఒక ప్రాంతానికో, ఒక ప్రత్యేక వృత్తికో, ఒక జాతికో పరిమితమైన ఘటనలు కాదు. అవి సమాజం యావత్తూ సంఘటితంగా ఉద్యమించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తున్నాయి. మణిపూర్‌లో ఘటన జరిగితే ఈశాన్య రాష్ట్రాలకు పరిమితమై, కోల్‌కతాలో ఘటన జరిగితే తూర్పు భారతానికి పరిమితమై, ఉత్తరప్రదేశ్‌లో ఘటన జరిగితే ఉత్తర భారతానికి పరిమితమై నిరసనలు పలచబడరాదు. కోల్‌కతా ఘటన సమాజంలోని సంఘటిత స్వభావ ఆవశ్యకతను స్పష్టంగా మన ముందు ఉంచుతున్నది. వైఎస్సార్ తీసుకొచ్చిన తరహాలో వైద్యుల రక్షణ చట్టాన్ని కూడా అమలుపర్చాలనే అంశాన్ని గుర్తుచేస్తున్నది. చట్ట పరిధిలో సత్వర న్యాయం కఠినంగా అమలవ్వాల్సిన అవసరాన్ని నిర్ధారిస్తున్నది. లేకుంటే 'ఆకాశంలో సగం' మరిన్ని సవాళ్లలో మగ్గిపోగలదు.

■ డాక్టర్ కడియం కావ్య
వరంగల్ ఎంపీ

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA
మంగళవారం 27 ఆగస్టు 2024

'వైద్యో నారాయణో హరి' అంటూ వైద్యుడిని దేవుడితో సమానంగా భావించే సంప్రదాయం మనది. ఆపదలో ఉన్నవారికి కళ్లెదుట కనిపించే ప్రాణదాతలు వైద్యులే. కాని నేడు అలాంటి వైద్యులకే రక్షణ లేకుండా పోతోంది. కోల్‌కత్తాలోని ఆర్‌జీకర్ మెడికల్ కాలేజీలో మహిళా జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటన దేశాన్ని కుదిపేస్తోంది. ప్రాణదాతల మానప్రాణాలకే భద్రత కరువైందనే ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో జూనియర్ డాక్టర్‌లు ఎదుర్కొంటున్న సమస్యలపై వరంగల్ నగరంలోని కాకతీయ మెడికల్ కాలేజీ, ఎంజీఎం అస్పత్రిని 'ఆంధ్రజ్యోతి' సందర్శించగా వారు అనేక విషయాలను వెల్లడించారు. ఆస్పత్రుల్లో కనీస సౌకర్యాలు కూడా లేకపోవటంతో ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 36 గంటల డ్యూటీతో ఒత్తిడి పెరిగినా తట్టుకుంటున్నామని, కానీ, అసౌకర్యాలతో మానసికంగా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు.





మహిళ సెక్యూరిటీ గార్డును నియమించాలి

- డాక్టర్ లోహిత, పీజీ విద్యార్థిని, వరంగల్ కేఎంసీ

మెడికల్ కాలేజీల్లో చదివే విద్యార్థినుల వసతి గృహాల వద్ద పురుష సెక్యూరిటీ గార్డులను నియమిస్తున్నారు. రాత్రివేళ డ్యూటీ నుంచి రావాలన్నా.. ఎమెర్జెన్సీ కేసు వస్తే అస్పత్రికి పోవాలన్నా పురుష సెక్యూరిటీ గార్డులు ఉండటం ఇబ్బందికరంగా ఉంది. లేడీస్ హాస్టల్ వద్ద మహిళా గార్డులను నియమించాలి. రాత్రివేళ రోగులతో వచ్చే వారిని బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించి లోపలికి పంపించాలి.

విధులకు భయం భయంగా..

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో జూనియర్ వైద్యుల అవస్థలు
- నిరంతర 36గంటల విధులతో పాట్లు
- చెప్పుకోలేని సమస్యల్లో జూనియర్ మహిళా డాక్టర్లు
- టాయిలెట్లు, రెస్ట్‌రూమ్‌లు కూడా లేని దైన్యం
- అర్ధరాత్రి ఆకతాయిల వేధింపులతో సతమతం
- పనిచేసే చోట సీసీ కెమెరాలు కరువు
- సౌకర్యాలు కల్పించాలని జూడాల డిమాండ్
- కోల్‌కత్తా ఘటనతో నగరంలోని ఆస్పత్రులపై 'ఆంధ్రజ్యోతి' ఫోకస్

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు మెడికల్ కాలేజీల్లో వైద్య విద్యార్థినుల బాధలు వర్ణణాతీతం. అసౌకర్యాల నడుమ విధులు నిర్వర్తిస్తున్నారు. కనీసం మూత్రశాలలు కూడం ఉండడం లేదు. విశ్రాంతి తీసుకునేందుకు రెస్ట్‌రూమ్ ఉండదు. అర్ధరాత్రి వేళ బయటకు వెళితే సీసీ కెమెరాలు, సెక్యూరిటీ లేనే లేదు. ఆస్పత్రుల్లో ఎంబీబీఎస్, పీజీ విద్యార్థులతో ఏకధాటిగా రెండు, మూడు రోజులు పనిచేయించటంతో వారిపై పనిభారం, మానసిక ఒత్తిడి ఎక్కువవుతోంది. అసౌకర్యాలు, అభద్రత మధ్య మహిళా జూడాలు భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు.

సౌకర్యాలెక్కడ?

ప్రభుత్వాస్పత్రుల్లో మహిళ జూనియర్ వైద్యుల బాధలు చెప్పలేకుండా ఉన్నాయి. విధులు చేసే ప్రదేశంలో కనీస సౌకర్యాలు లేకుండా పోయాయి. 36గంటలు డ్యూటీ చేసే జూనియర్ వైద్యులకు ప్రత్యేకంగా విశ్రాంతి గది అంటూ లేదు. కునుకు వస్తే డ్యూటీ టేబుల్‌పైనే నిద్రపోవాలి. కనీసం కాలకృత్యాలకు కూడా ప్రత్యేకంగా బాత్‌రూమ్‌లు లేవు. నర్సులకు కేటాయించిన రూమ్‌లలో అందరితో కలిసి వాడుకోవాలి. నర్సులు, వార్డుబాయ్‌లు, మగ డాక్టర్స్‌తో కలిసే నర్సుల రూమ్‌లోనే రెస్ట్ తీసుకోవా లి. మహిళలకు వచ్చే సమస్యలు వచ్చినా.. సెఫ్టీ రూమ్‌లు లేక అవస్థలు పడాల్సిందేనని ఓ లేడీ జూనియర్ డాక్టర్ వాపోయారు.

భద్రత కరువు


13 ఎకరాల్లో విస్తరించి ఉన్న వరంగల్ ఎంజీఎంలో కేవలం 10 సీసీ కెమెరాలే ఉన్నా యి. వీటిలో సగానికి పైగా పని చేయవు. ప్రతీరోజు 2,500- 3,000 మంది రోగులు ఓపీకి వ స్తుంటారు. రాత్రిపూట 70మంది వరకు మహిళా జూనియర్ డాక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు. కానీ, ఎంజీఎంలో రాత్రిపూట 14మం ది వరకే సెక్యూరిటీ సిబ్బంది డ్యూటీ చేస్తున్నారు. వీరిలో అందరూ మగ సెక్యూరిటీగార్డులే.. చాలావరకు మద్యం తాగి రాత్రి డ్యూటీకి వస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏ మాత్రం రక్షణ లేకుండా వేలాది మంది రోగులకు తమ ప్రాణాలను పణంగా పెట్టి జూనియర్ మహిళ డాక్టర్లు వైద్య సేవలు అందించాల్సి వస్తోం ది. ఇక రాత్రిపూట ఎంజీఎం నుంచి కేఎంసీలోని వసతి గృహానికి స్కూటీపై వెళ్లాలంటే కూడా భయపడుతున్నారు. కేఎంసీ ప్రధాన గేటు నుంచి హాస్టల్ వర కు చుట్టూ చెట్లే. కనీసం విద్యుత్ లైట్లు ఉండవు. గుంతలు పడిన రోడ్డు.. అర్ధరాత్రి పూట ఆస్పత్రిలో డ్యూటీ చేయ లే క.. హాస్టల్‌రూమ్‌కు వెళ్లలేక



మిగతా 7వ పేజీలో..

ఆధ్యాత్మిక, చారిత్రక సందర్శన కోసం..

- నేడు ఉమ్మడి వరంగల్ జిల్లాకు గవర్నర్ రాక
- నేటి నుంచి 29వ తేదీ వరకు పర్యటన
- రామప్ప, వేయిస్తంభాలు, పద్మాక్షమ్మ, భద్రకాళి ఆలయాల్లో పూజలు
- లక్నవరంతో పాటు వరంగల్ కోటను సందర్శించనున్న జిష్ణుదేవ్‌వర్మ
- రచయితలు, కళాకారులు, ఉన్నతాధికారులతో పరిచయ కార్యక్రమం
- విస్తృత ఏర్పాట్లు చేసిన ఆయా జిల్లాల కలెక్టర్లు



7

తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఈ నెల 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ఆలయాల దర్శనం, చారిత్రక కట్టడాల పరిశీలనకు రానున్నారు. తన పర్యటనలో యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయంతో పాటు చారిత్రాత్మక వేయిస్తంభాల గుడి, భద్రకాళి, పద్మాక్షమ్మ ఆలయాలను దర్శించుకోనున్నారు. లక్నవరం, వరంగల్ కోటను తన పర్యటనలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ సందర్శించనున్నారు. అలాగే వివిధ రంగాల్లో ప్రతిభను కనబరిచి అవార్డులు పొందిన వారితో పాటు ఆయా జిల్లాల ఉన్నతాధికారులు, కవులు, కళాకారులు, రచయితలతో గవర్నర్ భేటీ కానున్నారు. మూడు రోజుల పాటు సాగే గవర్నర్ పర్యటనకు ములుగు, హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

వీసీల నియామకంలో జాప్యం తగదు

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి



మాట్లాడుతున్న మణికంఠ రెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 26: రాష్ట్రంలోని యూనివర్సిటీల వీసీల నియామకంలో ప్రభుత్వం చేస్తున్న కాలయాపన తగదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ అన్నారు. సోమవారం హనుమకొండలోని హోటల్ హరిత కాకతీయలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి జాప్యం చేయకుండా వర్సిటీలకు వీసీలను నియమించాలన్నారు. అన్ని హామీలను అమలు చేస్తున్నామంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విద్యార్థుల హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలన్నారు. రాష్ట్రంలో విద్యారంగం సతమతవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గురుకులాల్లో విద్యార్థుల మరణాలు బాధాకరమని, మరణాలపై ప్రభుత్వం విచారణ చేపట్టాలన్నారు. రాష్ట్రంలోని అన్ని గురుకులాల్లో మౌలిక వసతులను మెరుగుపరచాలన్నారు. విద్యాశాఖను తన వద్దనే ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. సమస్యల పరిష్కారంలో ఎందుకు కాలయాపన చేస్తున్నారని వారు ప్రశ్నించారు. ఇన్‌చార్జి వీసీతో వర్సిటీల్లో విద్యాప్రమాణాలు తగ్గుతున్నాయన్నారు. సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించి అద్దె భవనాల్లో కొనసాగుతున్న హాస్టళ్లకు కొత్త భవనాలు నిర్మించి పెరిగిన నిత్యావసరాలకు అనుగుణంగా విద్యార్థులకు మెస్ చార్జీలు చెల్లించాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఊట్కూరి ప్రణీత్, భాషబోయిన సంతోష్, జిల్లా నాయకులు రవితేజ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



కదులుతున్న డొంక

- ఉమ్మడి వరంగల్ జిల్లాకు తాకిన సీఎంఆర్ఎఫ్ నిధుల స్కామ్
- నగరంలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో సీఐడీ అధికారుల బృందాల తనిఖీలు

వరంగల్ మెడికల్, ఆగస్టు 26: ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నిధుల స్వాహా కుంభకోణం ఉమ్మడి వరంగల్ జిల్లాను తాకింది. ఈ భారీ స్కామ్‌లో నగరంలోని పలు కార్పొరేట్ ఆస్పత్రులు భాగస్వామ్యమైనట్లు ప్రాథమికంగా గుర్తిస్తున్నారు. తొలుత రాష్ట్ర రాజధానిలో ఈ వ్యవహారం వెలుగులోకి రాగా, లోతుగా విచారణ జరిగింది. ఈ క్రమంలో ఈ మూలాలు వరంగల్ ఉమ్మడి జిల్లాకు కూడా తాకినట్లు తెలుస్తోంది. హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఓ కార్పొరేట్ ఆస్పత్రితోపాటు నగరంలోని పలు ప్రయివేట్ ఆస్పత్రులు, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కొన్ని ఆస్పత్రుల పేర్లు

మిగతా 8వ పేజీలో..

ముకుందా.. ముకుందా..

- భక్తి శ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు
- శ్రీకృష్ణుడిగా దర్శనమిచ్చిన రుద్రేశ్వరుడు, భద్రకాళి అమ్మవారు

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 26: పవిత్ర శ్రావణమాసంలో బహుళ అష్టమి సోమవారం రోజు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను జిల్లా ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. నగరంలోని భద్రకాళి, వేయిస్తంభాల ఆలయాల్లో శ్రీకృష్ణ అవతారంలో ఇలవేల్పు దైవాలను కొలువుదీర్చి భక్తుల దర్శనానికి అనుమతించారు. ప్రతీ ఇంటా కూడా శ్రీకృష్ణుడి చిత్రపటాలను ఉంచి భక్తి శ్రద్ధలతో శ్రీకృష్ణుడి జయంతి వేడుకలను జరుపుకున్నారు. ప్రసిద్ధ వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో రుద్రేశ్వరుడు శ్రీకృష్ణుడిగా దర్శనమివ్వడం విశేషం. శివప్రీతికర సోమవారం సుప్రభాత సేవా అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ఉత్తిష్ట గణపతికి ఆరాధన, రుద్రేశ్వరుడికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, 150 మంది పుణ్య దంపతులతో సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహింపజేశారు. అనంతరం 51 కిలోల పెరుగన్నంతో మహాన్నపూజ నిర్వహించారు. శ్రీకృష్ణ జయంతిని పురస్కరించుకొని రుద్రేశ్వరుడిని కృష్ణుడిగా సాక్షాత్కరింపజేసి భక్తులకు కనువిందు చేశారు. 11 రకాల నవధాన్యాలతోపాటు, 11 రకాల పదార్థాలను మహానివేదనగా సమర్పించి భక్తులకు పంపిణీ చేశారు. మణికంఠ శర్మ, సందీప్‌శర్మ, ప్రణవ్‌శర్మ, కాశి లింగాచారి, శ్రవణ్ తదితరులు వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఎన్.మధుకర్, రామకృష్ణ, రజిత తదితర ఆలయ సిబ్బంది పర్యవేక్షణలో ఆదాయ పన్నుశాఖ అధికారులు రాజేశ్వర్, హనుమకొండ సీఐతోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు వేడుకల్లో పాల్గొన్నారు.



శ్రీకృష్ణుడిగా రుద్రేశ్వరుడు



శ్రీకృష్ణ అలంకారంలో భద్రకాళి అమ్మవారు

అదే విధంగా హనుమకొండలోని మరో ప్రసిద్ధ సిద్దేశ్వరాలయంలో శ్రీకృష్ణ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు సిద్ధేశుని సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో భాగంగా సిద్దేశుడిని శ్రీకృష్ణుడిగా అలంకరింపజేసి కార్యక్రమాలు నిర్వహించారు. కాజీపేట ఫాతిమానగర్‌లో నాన్యా తండాలో జరిగిన వేడుకల్లో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోపిక, కృష్ణుడి వేషాధారణతో నిర్వహించిన ఉట్టికొట్టే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. హనుమకొండలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీ కడియం కావ్య పాల్గొని పిల్లలకు ప్రోత్సాహం అందించారు. నగరంలోని ఇంటింటా శ్రీకృష్ణ అష్టమి వేడుకలు జరిగాయి.

నేడు వైష్ణవ కృష్ణాష్టమి

శ్రీకృష్ణ జయంతి వేడుకలు సోమవారం స్మార్తులు జరుపుకోగా, రోహిణి నక్షత్రంతో కూడిన అష్టమి తిథి మంగళవారం రోజు శ్రీవైష్ణవ కృష్ణాష్టమి వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీ. ఈ క్రమంలో మంగళవారం నగరంలోని అదాలత్ శ్రీవెంకటేశ్వరాలయం, ఎక్సైజ్‌కాలనీలోని వెంకటేశ్వరాలయం, రెవెన్యూ రామాలయం, శ్రీరంగనాయకుడి ఆలయమైన పెద్ద కోవెలలో మంగళవారం వేడుకలు జరగనున్నాయి.

అధిక ధరలకు ఎరువులు

- జిల్లాలో కొందరు వ్యాపారుల దోపిడీ
- పట్టించుకోని వ్యవసాయశాఖ అధికారులు



హనుమకొండ శివారులో వరినాట్లు వేస్తున్న అన్నదాతలు

బాలసముద్రం, ఆగస్టు 26: హనుమకొండ జిల్లాలో ఎరువుల డీలర్లు వ్యాపారులు ఎమ్మార్పీ ధరల కంటే రైతుల వద్ద ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలన్నర కావస్తోంది. రైతులకు నాణ్యమైన ఎరువులు అందించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో జిల్లాలో వ్యాపారులు, డీలర్లు అన్నదాతలకు నాసిరకం ఎరువులు, విత్తనాలు అందిస్తున్నట్లు జిల్లాలోని పలువురు రైతులు పేర్కొంటున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవటంలేదని నామమాత్రపు తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు.

యూరియా రూ.266, డీఏపీ రూ.1350కే విక్రయించాలి

రైతులు పత్తి, వరి, మిరప, ఇతర పంటలకు ఎరువులను వాడుతుంటారు. యూరియా ఎమ్మార్పీ రూ.266 ఉండగా, మార్కెట్‌లో వ్యాపారులు రూ.310, 320లకు అమ్ముతూ ఇతర స్ప్రే మందులను అంటకడుతున్నట్లు రైతులు చెబుతున్నారు. డీఏపీ రూ.1,350 ధరకు విక్రయించాల్సి ఉండగా, ప్రైవేటు వ్యాపారులు రూ.1450 నుంచి రూ.1500లకు అధిక ధరలు విక్రయాలు చేస్తూ రైతులకు ఇచ్చే బిల్లులపై ఎమ్మార్పీ ధర నమోదు చేసి ఇస్తున్నట్లు కొందరు రైతులు పేర్కొంటున్నారు. ఇదేంటని నిలదీస్తే వ్యాపారులు దురుసుగా మాట్లాడుతూ 'ఇష్టం ఉంటే తీసుకో.. లేకుంటే లేదు.. రశీదు కూడా ఇవ్వం..' అంటూ రైతులను బెదిరింపులకు పాల్పడుతున్నట్లు రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు డీలర్ల నుంచి మామూళ్లు తీసుకుని పట్టించుకోవడంలేదని, ఇప్పటికైనా జిల్లా వ్యవసాయఅధికారులు అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుని రైతులకు ఎమ్మార్పీ ధరలకు నాణ్యమైన ఎరువులు అందించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

- జిల్లా వ్యవసాయాధికారి రవీందర్‌సింగ్

జిల్లాలో అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. యూరియా, డీఏపీ, పొటాషియం, మార్క్‌ఫెడ్, ప్రైవేటు వ్యాపారుల వద్ద స్టాక్ ఉంది. ఎవరైనా అధిక ధరకు విక్రయిస్తే రైతులు వెంటనే ఫిర్యాదు చేయాలి. ఇతర వివరాలకు సెల్:7288994448 నెంబర్‌కు రైతులు సంప్రదించవచ్చు.



పొలంలో వేసేందుకు రైతు సిద్ధం చేసిన యూరియా



అత్యాచార ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలి

బాలసముద్రం, ఆగస్టు 26: కోల్‌కత్తాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన అత్యాచార ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టి విద్యార్థినులకు రక్షణ కల్పించాలని తెలంగాణ జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ దుబ్బాల శ్రీనాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిలా పార్కులో సోమవారం సాయంత్రం ఆర్జీకార్ ఆస్పత్రిలో అత్యాచారానికి గురై ప్రాణాలు కోల్పోయిన మెడికల్ విద్యార్థినికి న్యాయం జరిపించాలని కోరుతూ జూనియర్ డాక్టర్లు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించి ఏకశిలా పార్కులో కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కాకతీయ మెడికల్ కాలేజ్ జూనియర్ డాక్టర్లు లోకేష్, డాక్టర్ కశ్యాబ్, డాక్టర్ కావ్య, డాక్టర్ నిఖిల్, డాక్టర్, అశ్రాఫ్, డాక్టర్ అమిత్, డాక్టర్ భవ్య, డాక్టర్ నవనీత్ తదితరులు పాల్గొన్నారు.



ఏకశిలా పార్కులో జరిగిన సమావేశంలో పాల్గొన్న జూనియర్ డాక్టర్లు

ఉరివేసుకుని విద్యార్థిని ఆత్మహత్య


బానోత్ నిఖిత (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 26 : ఉరివేసుకుని విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన మహబూబాబాద్ మండలం రోటిబండతండా శివారు దూద్యతండాలో సోమవారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. దూద్యతండాకు చెందిన బానోత్ రమేష్-జ్యోతి దంపతులు వ్యవసాయం సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వారికి కుమారుడు, కుమార్తె సంతానం. కుమార్తె నిఖిత (16) మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యనభ్యసిస్తోంది. ఆదివారం సెలవుదినం కావడంతో నిఖిత తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయ బావి వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో మధ్యాహ్నం ఇంటికి వెళ్లి అన్నం తీసుకురమ్మని కూతురుకు తల్లి చెప్పింది. అక్కడ్నుంచి ఇంటికి వెళ్లిన నిఖిత ఎంతసేపటికి అన్నం తీసుకుని పొలం వద్దకు రాకపోవడంతో తల్లి వ్యవసాయ పొలం నుంచి ఇంటి వద్దకు వెళ్లింది. అప్పటికి నిఖిత ఫోన్ పట్టుకుని ఉండడంతో కొప్రొద్రికురాలైన తల్లి ఇంతసేపటికి అన్నం ఎందుకు తీసుకురాలేదని కుమార్తెను మందలించింది. ఆ తర్వాత తల్లి అన్నం తీసుకుని పొలం వద్దకు వెళ్లింది. సాయంత్రం వ్యవసాయ పనులు ముగించుకుని తల్లిదండ్రులు ఇంటికి వచ్చి చూసే సరికి నిఖిత ఇంట్లో ఉరివేసుకుని విఘత జీవిగా కన్పించింది. దీంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. తండ్రి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య

డోర్నకల్ (మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 26 : అత్తింటి వారి వరకట్న వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అందనాలపాడులో సోమవారం చోటు చేసుకుంది. డోర్నకల్ సీఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం. అందనాలపాడుకు చెందిన కనక మహేందర్ అనే వ్యక్తికి సూర్యాపేట జిల్లా మోతె మండలం మామిండ్లగూడెంకు చెందిన నవిలే కృష్ణ కుమార్తె మౌనిక (26)ను ఇచ్చి గతేడాది వివాహం జరిపించారు. పెళ్లి సమయంలో రూ.5 లక్షల నగదు, 5 తులాల బంగారం కట్నంగా ఇచ్చారు. కొంతకాలం సాఫీగా కాపురం సాగింది. ఆ తర్వాత భర్త, అత్తామామలు, అడప డుచులు కలిసి మౌనికను అదనపు కట్నం తీసుకురావాలి వేధింపులకు గురి చేస్తున్నారు. దీంతో మనోవేదనకు గురైన మౌనిక ఈనెల 22న ఇంట్లో ఉన్న బీపీ మాత్రలను ఎక్కువ మోతాదులో వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇది గమనించిన కుటుంబసభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం వెం టనే ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు సూచన మేరకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కార్పొరేట్ ఆస్పత్రికి తరలిం చారు. అక్కడ ఆరోగ్య పరిస్థితి విషమించి మౌనిక మృతి చెందింది. తన కుమార్తె మృతికి ఆమె భర్త, అత్తా అడపడుచునే కారణమని మౌనిక తండ్రి నవిలే కృష్ణ డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదు మేరకు మౌనిక భర్త కనకం మహేందర్‌తో పాటు అతని తల్లి సత్యవతి, సోదరి స్వప్నతోపాటు ఆమె భర్త తిరుపతయ్య, బంధువులు జయమ్మ, ఏసుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.


అప్పులబాధతో వ్యాపారి ఆత్మహత్య


సుద్దాల కార్తీక్(ఫైల్)

కమలాపూర్, ఆగస్టు 26: అప్పుల బాధతో వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కమలాపూర్ మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ హరికృ ష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సుద్దాల కార్తీక్(38) కొన్నేళ్లుగా సూపర్‌మార్కెట్ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. కొద్దినెలలుగా అప్పులబాధ ఎక్కువ అవడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. ఈ క్రమంలోనే అనారోగ్యానికి గురయ్యాడు. అప్పుల బాధలు ఎక్కువవడం.. అనారోగ్య పరిస్థితులు తట్టుకోలేక సోమ వారం కార్తీక్ ఉరివేసుకుని చనిపోయినట్లు అతడి భార్య అర్చన పోలీసుల ఫిర్యాదులో తెలిపింది. అర్చన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హరికృష్ణ తెలిపారు.

4.7 కిలోల గంజాయి పట్టివేత

కాజీపేట, ఆగస్టు 26: యువకులు గంజాయి సేవిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. కాజీపేట ఎస్సై నవీన్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాజీపేటలో ఆదివారం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బడల శ్రవణ్ కుమార్, కిలారి శోభన్ కుమార్, సయ్యద్ షకీల్, పోలీసులను చూసి పారిపోతుండగా వారిని అదుపులోకి తీసుకుని తనిఖీలు చేశారు. వారి వద్ద ప్లాస్టిక్ కవర్‌లలో 4.7కిలో గంజాయి పట్టుబడింది. వీరి స్నేహితులైన సయ్యద్ సాహెద్ అలీ, భైరబోయిన శ్రవణ్‌ల వద్ద ఆ గంజాయి కొనుగోలు చేసినట్లు చెప్పారు. పట్టుబడ్డ వారివద్ద దొరికిన గంజాయి విలువ రూ 1, 17,500 ఉంటుందని పోలీసులు తెలిపారు. గంజాయితో పట్టుబడ్డ వారిపై సోమవారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని, గంజాయి సప్లయ్ చేసే సయ్యద్ సాహెద్ అలీ, భైరబోయిన శ్రవణ్‌లు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



















హనుమకొండ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లిం ఐక్యవేదిక సభ్యులు

వైద్య విద్యార్థినిపై హత్యాచారం చేసిన నిందితులను ఉరితీయాలి

హనుమకొండ చౌరస్తాలో ముస్లిం ఐక్య వేదిక అధ్వర్యంలో నిరసన

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 26: కోల్‌కత్తా నగరంలో వైద్య విద్యార్థినిపై హత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను ఉరితీయాలని ముస్లిం ఐక్యవేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ ఎం.డి. నయిమోద్దీన్ డిమాండ్ చేశారు. సోమవారం ముస్లిం ఐక్య వేదిక ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో హనుమకొండ చౌరస్తాలో వైద్య విద్యార్థి హత్యాచార ఘటనను నిరసిస్తూ ర్యాలీ, నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నయీమోద్దీన్ పాల్గొని మాట్లాడారు. దేశంలో రోజురోజుకూ మహిళలపై హత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దుండగులు చిన్నపిల్లను సైతం వదిలిపెట్టం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ అనిస్‌సిద్ధిఖీ మాట్లాడుతూ.. వైద్య విద్యార్థినిపై హత్యాచారం చేసిన నిందితులకు శిక్ష విధించేలా కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజమహ్మద్, షేక్‌బాబా, మోసిన్, ఎంఎ రషద్, తాసిమ్, గౌస్, యాకూబ్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్మగ్లర్‌పై పీడీ యాక్టు


పీడీ యాక్ట్ ఉత్తర్వులు అందిస్తున్న పోలీసులు

వరంగల్ క్రైం, ఆగస్టు 26: గంజాయి స్మగ్లర్‌పై వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సోమవారం పీడీ యాక్టు నమోదు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వరంగల్ మీదుగా మహారాష్ట్రకు గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న భూపాలపల్లి జిల్లా గోరికొత్తపల్లి ప్రాంతానికి చెందిన గజ్జి సహదేవ్‌రాజ్‌పై సీపీ పీడీ యాక్ట్ నమోదు చేశారు. ఈ ఉత్తర్వులను శాయంపేట సీఐ రంజిత్‌రావు, దామెర ఎస్ఐ అశోక్ నిందితుడికి పరకాల సబ్ జైలులో అందచేసి చర్లపల్లి జైలుకు తరలించారు. పీడీ యాక్టు అందుకున్న నిందితుడు సహదేవ్‌రాజ్.. జూన్ 8న మరో ఇద్దరితో కలిసి ఆంధ్రప్రదేశ్ నుంచి మహారాష్ట్రకు గంజాయిని తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్, దామెర పోలీసులు కలిసి పట్టుకున్నారు. వీరి నుంచి రూ.50లక్షల విలువైన గంజాయి, ఒక కారు స్వాధీనం చేసుకుని జైలుకు తరలించారు. కాగా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే పీడీ యాక్టు నమోదు చేస్తామని సీపీ అంబర్ కిషోర్ ఝా ఈ సందర్భంగా హెచ్చరించారు.

యూనిఫైడ్ పెన్షన్ కాదు, పాత పెన్షన్ కావాలి

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 26: ప్రభుత్వం యూనిఫైడ్ పెన్షన్ ఇస్తానంటోందని, కావాల్సింది పాత పెన్షన్ అని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఇది సీపీఎస్‌కు మరో రూపమే తప్ప.. పాత పెన్షన్ విధానం కాదని ఆయన పేర్కొన్నారు. కొత్త సీసాలో పాత సారాయి వంటిదే యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ అని తెలిపారు. ప్రభుత్వ పునరాలోచించి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఆయన కోరారు.

ఆధ్యాత్మిక, చారిత్రక సందర్శన కోసం..

నేడు ఉమ్మడి జిల్లాకు గవర్నర్ రాక ● నేటి నుంచి 29వ తేదీ వరకు పర్యటన ● విస్తృత ఏర్పాట్లు చేసిన ఆయా జిల్లాల కలెక్టర్లు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)



రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ తన మూడు రోజుల పర్యటన కోసం ఉమ్మడి వరంగల్ జిల్లాను మంగళవారం రానున్నారు. తొలుత ఏజెన్సీ ప్రాంతమైన ములుగు నుంచి తన పర్యటన ప్రారంభిస్తారు. 27వ తేదీన ములుగు జిల్లాలోని చారిత్రత్మక కట్టడం, యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయాన్ని గవర్నర్ సందర్శించనున్నారు. శ్రీరామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. యునెస్కో గుర్తింపు పొందిన రామప్పను 2022 డిసెంబరు 28న రాష్ట్రపతి ద్రౌపదిముర్ము సందర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ పథకం కింద మంజూరు చేసిన నిధులతో చేపట్టే పనులకు రాష్ట్రపతి శంకుస్థాపనలు చేశారు. రాష్ట్రపతితో పాటు అప్పటి గవర్నర్ తమిళిసై కూడా రామప్పను సందర్శించారు. మంగళవారం జిష్ణుదేవ్‌వర్మ రామప్పకు వస్తుండటంతో యునెస్కో గుర్తింపు పొందిన తరువాత చారిత్రాత్మక కట్టడాన్ని దర్శించుకున్న రెండో గవర్నర్ కానున్నారు. అలాగే పక్కనే ఉన్న భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని కోటగుళ్లను గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ సందర్శించనున్నారు. కాకతీయులకాలంలో నిర్మించిన కోటగుళ్ల అందాలను వీక్షించటంతో పాటు ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నారు. అలాగే తనపర్యటనలో రెండో రోజు 28వ తేదీ బుధవారం మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6.30గంటల వరకు చారిత్రాత్మక వేయిస్తంభాల ఆలయం, భద్రాకాళి దేవాలయం, పద్మాక్షమ్మ ఆలయాలను గవర్నర్ దర్శించుకోన్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. వీటితో పాటు వరంగల్ నగరంలో ఉన్న ఇతర ప్రముఖ ఆలయాలను గవర్నర్ సందర్శించే అవకాశం ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

లక్నవరం, వరంగల్ కోటకు..

గవర్నర్ తన పర్యటనలో లక్నవరం సరస్సును సందర్శించనున్నారు. తొలి రోజు 27వ తేదీన రాత్రి 7గంటలకు లక్నవరంలోని గెస్ట్‌హౌస్‌కు చేరుకుని అక్కడే బస చేయనున్నారు. ఏజెన్సీ ప్రాంతమైన లక్నవరం గెస్ట్‌హౌస్‌లో రాత్రిబస చేయనున్న తొలి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మనే కావటం విశేషం. 28వ తేదీ బుధవారం ఉదయం 6 గంటల నుంచి 9గంటల వరకు లక్నవరం ప్రకృతి అందాలను వీక్షించనున్నారు. ఊయల వంతెనపై పర్యటిస్తారు. సాయంత్రం 6 గంటలకు వరంగల్ కోటను గవర్నర్ సందర్శించనున్నారు. కాకతీయుల కాలం నాటి అపురూప శిల్ప సంపదను పరిశీలించనున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం వరంగల్ కోటలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టింది. వాటిని గవర్నర్ పరిశీలించనున్నారు.

అవార్డు గ్రహీతలు, ఉన్నతాధికారులతో భేటీ

తన పర్యటనలో గవర్నర్ వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచి అవార్డులు పొందిన వారిని కలువనున్నారు. జిల్లాకు 25మంది చొప్పున జిల్లా కలెక్టర్ ఎంపిక చేసిన వారిని గవర్నర్ సత్కరించనున్నారు. వారితో కొద్దిసేపు రచనలు, కవిత్వం, సాహిత్యంపై ముచ్చటించనున్నారు. అలాగే ములుగు, హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లా కలెక్టరేట్‌లలో ఉన్నతాధికారులతో గవర్నర్ భేటీ కానున్నారు. జిల్లాల అభివృద్ధిలో అధికారుల పాత్రపై చర్చించనున్నారు. అధికారులతో కలిసి లంచ్ చేయనున్నారు. 27వ తేదీ ములుగు జిల్లా కలెక్టరేట్ నుంచి ప్రారంభమయ్యే గవర్నర్ పర్యటన.. 29వ తేదీ మధ్యాహ్నం జనగామ జిల్లా ఒబుళకేశ్వాపూర్ వద్ద ముగుస్తుంది. అక్కడి నుంచి మధ్యాహ్నం 2.10గంటలకు గవర్నర్ రోడ్డు మార్గాన భువనగిరి జిల్లా కొలనుపాకు వెళ్లటంతో మూడు రోజుల గవర్నర్ పర్యటన ముగుస్తుంది.

తొలిరోజు గవర్నర్ పర్యటన ఇలా..

27వ తేదీ మంగళవారం ఉదయం 7గంటలకు తన నివాసగృహం నుంచి గవర్నర్ రోడ్డుమార్గాన బయలుదేరి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్టలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి ఉదయం 8గంటలకు చేరుకుంటారు. స్వామి వారిని దర్శించుకుని అక్కడి నుంచి ఉదయం 8.45లకు రోడ్డు మార్గాన బయలుదేరి 11.30గంటలకు ములుగు జిల్లా కలెక్టరేట్‌కు చేరుకోనున్నారు. 12 గంటల వరకు విశ్రాంతి తీసుకుంటారు. మధ్యాహ్నం 1గంటలకు ఉన్నతాధికారులతో పరిచయం కార్యక్రమం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1గంట నుంచి 3గంటల వరకు రచయితలు, ఆర్టిస్టులతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు పొందిన వారితో సమావేశం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయాన్ని పరిశీలించనున్నారు. పక్కనే ఉన్న భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని గణపేశ్వరాలయంను గవర్నర్ సందర్శించనున్నారు. అక్కడి నుంచి గోవిందరావుపేట మండలంలోని లక్నవరం సరస్సు సాయంత్రం 6.30గంటలకు చేరుకుని అక్కడే రాత్రి బస చేయనున్నారు. కాగా, గవర్నర్ పర్యటన నేపథ్యంలో లక్నవరంలో సోమవారం మంత్రి సీతక్క ఏర్పాట్లు పరిశీలించారు.

కేంద్ర ప్రభుత్వం వెంటనే కులగణనను చేపట్టాలి


ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న కొంగర అనిల్‌కుమార్, డీఎస్. ప్రభాకర్

వడ్డెపల్లి, ఆగస్టు 26: కేంద్ర ప్రభుత్వం వెంటనే కులగణనను చేపట్టాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహాసేన (ఎస్ఎస్‌బీఎం) జాతీయ అధ్యక్షుడు కొంగర అనిల్‌కుమార్, జాతీయ ఉపాధ్యక్షుడు డీఎస్. ప్రభాకర్, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు దామెర కరుణ డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలను ఒకేతాటిపైకి తీసుకొచ్చి రాజ్యాధికారాన్ని సాధించేందు కోసం తమ సంస్థ కృషి చేస్తుందని అన్నారు. కులగణన చేపట్టాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సెప్టెం బరు 7న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించే మహాధర్నాలో అన్ని కులాలకు చెందిన వారంతా పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో ఎస్ఎస్‌బీఎం రాష్ట్ర అధ్యక్షుడు గాదెపాక అనిల్, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్, వివిధ ప్రజా సంఘాల నాయకులు వస్కుల విజయ్‌కుమార్, ఇమ్మడి బాబు, నద్దునూరి సంపత్, ఇసంపెల్లి అబ్రహం, ఎం.డి. సుబాన్, కరుణాకర్, గడ్డం ప్రతాప్, మంద కుమార్ తదితరులు పాల్గొన్నారు.

29న వక్తృత్వ పోటీలు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 26: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 29న అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బూర భిక్షపతి, డాక్టర్ మార్య శంకర్ నారాయణ సోమవారం ఒక ప్రటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు హనుమకొండ లష్కర్ బజార్‌లోని బీఈడీ కళాశాలలో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. 9వ తరగతి నుంచి పీజీ చదివే విద్యార్థులు విద్యా సంస్థకు ఇద్దరు చొప్పున పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు. 'ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు భాష ఆవశ్యకత' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

నేటి నుంచి ఐదేళ్ల ఇంటిగ్రేటేడ్ కోర్సుల పరీక్షలు

కేయూ క్యాంపస్, ఆగస్టు 26: కాకతీయ యూనివర్సిటీ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులైన బయో టెక్నాలజీ, కెమిస్ట్రీ కోర్సుల పరీక్షలు ఆగస్టు 27 మంగళవారం నుంచి జరుగుతాయని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 27, 28, 29, 31. సెప్టెంబరు 2, 4, 6వ తేదీల్లో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. విద్యార్థులకు పరీక్షల కేంద్రాన్ని కేయూ క్యాంపస్‌లోని కెమిస్ట్రీ విభాగంలో ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇతర వివరాలకు వర్సిటీ ప్రిన్సిపాల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పీడీఎస్ రైస్ పట్టివేత

రూ.8వేల విలువైన 5 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

హసన్‌పర్తి, ఆగస్టు 26: మండలంలోని జయగిరిలో నిబంధనలకు విరుద్ధంగా లబ్ధిదారుల వద్ద నుంచి సేకరించి అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం.. మండలంలోని జయగిరికి చెందిన దండుగుల సాయిలు, దండుగుల కొమురమ్మలు ఇదే గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ పోలు అశోక్‌లు సోమవారం మడిపల్లిలో ఇంటింటికి తిరిగి కిలో రూ.8 చొప్పున కొని కోళ్లఫామ్‌లలో రూ.16చొప్పున అమ్ముతున్నారు. లబ్ధిదారుల నుంచి 10 ప్లాస్టిక్ బ్యాగులలో సుమారు 5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని సేకరించి తరలిస్తున్నారు. ఈ క్రమంలో మడిపల్లిలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు పి.రాజయియ్య, వి.విద్యాసాగర్‌లకు అనుమానాస్పదంగా ఆటో కనిపించగా వారిని చూపి పారిపోయే ప్రయత్నం చేశారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు వారిని వెంబడించి అదుపులోకి తీసుకొని విచారించగా పీడీఎస్ రైస్ తరలిస్తున్నట్లు అంగీకరించినట్లు తెలిపారు. పీడీఎస్ రైస్‌ను అక్రమంగా తరలిస్తున్న ఆటో డ్రైవర్ పోలు అశోక్‌తో పాటు రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్న దండుగుల సాయిలు, దండుగుల కొమురమ్మలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 8 క్వింటాళ్ళ పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు.

ఆనాడు అడవిలోనే రామప్ప!

- సుమారు 500 ఏళ్లపాటు కారడవిలో..
- 1951లో పురావస్తు శాఖ ఆధీనంలోకి..
- ప్రాకారానికి జీవం పోసిన ఎస్‌కే యాజ్దనీ
- 1960లో రాజమౌళి తొలిపూజ


44 యేళ్ల కిందటి రామప్ప దేవాలయం (పాత చిత్రం)


రామప్పలో మొదటగా పూజలు చేసిన పూజారి రాజమౌళి (సర్కిల్‌లో)

వెంకటాపూర్(రామప్ప), ఆగస్టు 26: ప్రపంచ వారసత్వ కట్టడంగా యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం ఒక్కప్పుడు మసకబారి ఉండేది. చరిత్ర కాలగర్భంలో నుంచి ప్రస్తుతం భారతదేశానికే తలమానికమైన ఖ్యాతిని గడించింది రామప్ప. క్రీస్తుశకం 1213వ శతాబ్దంలో కాకతీయ సామంతరాజులు ఏలిన కాలంలో ప్రధాన దైవం శివుడు, ఉత్సవ దైవం రామలింగేశ్వరుడితో నిర్మితమైంది రామప్ప దేవాలయం. ఆ తర్వాత కాలగమనంలో నిర్లక్ష్యానికి గురైంది. కొన్ని వందల సంవత్సరాలు రామప్ప దేవాలయం నిర్వహణ లేక రామలింగేశ్వరుడికి పూజలు లేక, ధూప దీప, నైవేద్యాలు లేక నిర్లక్ష్యానికి గురైంది. తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాలను ఏలిన నిజాంపాలనలో ఈరామప్ప దేవాలయం వెలుగులోకి వచ్చింది. 1900 సంవత్సరంలో అప్పటి ముస్లిం రాజుల వద్ద పనిచేసే ఆసిఫ్ జాహీల్ తెలంగాణలోని ములుగు ప్రాంతానికి వేటకు వచ్చాడు. ఆసమయంలో కారడవిలో రామప్ప దేవాలయం ఆయన కంటపడింది. ఆయన దాన్ని వెలుగులోకి తీసుకువచ్చాడు. రామప్ప ఆలయం అంచు (చూరు) పడిపోకుండా డంగుసున్నంతో చుట్టూ దిమ్మెలు ఏర్పాటు చేయించి, చుట్టుపక్కల ప్రాంతాలను శుభ్రం చేసి పడిపోకుండా రామప్పను కాపాడినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. అప్పటి నుంచి వెలుగులోకి వచ్చిన రామప్ప దేవాలయాన్ని కేంద్ర పురావస్తుశాఖ సుమారు 1951లో తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఎన్నో ఇబ్బందులనోర్చి ప్రస్తుతం ప్రపంచ ముఖచిత్రంలో చోటు సంపాదించుకుంది రామప్ప.

ప్రాకారానికి జీవం పోసింది ఇతడే..

1951లో కేంద్ర పురవస్తుశాఖ ఆధీనంలోకి వెళ్లిన రామప్ప దేవాలయం 1911లో నిజాంపాలనలో కేంద్రపురావస్తుశాఖ మొదటి డైరెక్టర్ ఉన్న ఎస్‌కే యాజ్దనీ రామప్ప ఆలయాన్ని సందర్శించారు. ఆలయంపై భాగంలో ఉన్న నక్షత్రాకారపు ప్రాకారం కూలిపోయో దశలో ఉండడాన్ని పసిగట్టిన ఆయన.. వెంటనే రామప్ప ఆలయానికి దక్షిణ భాగానికి రెండు వైపులా 7 స్తంభాలు, ఉత్తర భాగంలో మూడు స్తంభాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆ మేరకు స్తంభాలను నిలబెట్టి నక్షత్రాకారపు ప్రాకారాన్ని ఈ తరానికి అందించారు. ఈరోజుల్లో ఆయన చూపిన చొరవే రామప్ప ఆలయం ప్రపంచ దృష్టిని ఆకర్శిస్తోంది.

1960లో తొలిపూజ

కేంద్ర పురవస్తుశాఖ ఆధీనంలోకి రామప్ప ఆలయం వచ్చాక 1960లో తొలిపూజ జరిగినట్లు స్థానిక ప్రజలు చెబుతున్నారు. రామప్ప ఆలయంలో పూజలు చేయడానికి పూజారులు లేకపోవడంతో పాలంపేట గ్రామానికి చెందిన రాష్ట్ర మాజీ జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వీరమళ్ల ప్రకాశ్ తండ్రి అలనాటి అస్సల్దార్ మాల్‌పటేల్ వీరమళ్ల రాజనర్సింహ పటేల్ ఆధ్వర్యంలో స్టేషన్ ఘన్‌పూర్ మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన అవునూరిమఠం రాజమౌళి ద్వారా పూజలు జరిపినట్లు చరిత్రతో పాటు స్థానికులు చెబుతున్నారు.


2001లో రామప్ప గోపురానికి జీర్ణోద్ధరణ

17వ శతాబ్దంలో భూకంపం సంభవించినప్పుడు రామప్ప దేవాలయంలో గల గర్భగుడిలో ఉన్న శివలింగం ఒకపక్క ఒరిగడంతో అప్పటి నుంచి ఎలాంటి మరమ్మతులు చేయలేదు. 2001 ఫిబ్రవరిలో రాష్ట్ర దేవాదాయ, కేంద్రపురావస్తుశాఖ ఆధ్వర్యంలో మరమ్మతులు చేసి శివలింగాన్ని సరిచేసి ప్రాణప్రతిష్ట చేసి పునఃప్రతిష్ఠించినట్లు చరిత్ర చెబుతోంది. దీన్నే (జీర్ణోద్ధరణ) అని అంటారు. ఆ తరువాత ఆలయ గోపురంపై కలశం లేకపోవడంతో ఆదే మాసంలో ఆలయంలో కలశానికి ప్రత్యేక పూజలు చేసి గోపురంపై కలశం ఏర్పాటు చేశారు. అనంతరం 2007 నుంచి మొదలుకొని 2009 వరకు అప్పటి సర్పంచ్ ఆకిరెడ్డి రాంమోహన్‌రావు ఆధ్వర్యంలో రుద్రహోమాలు చేసినట్లు ఆయన తెలిపారు. అప్పటి నుంచి రామప్పలో ప్రతీ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తూ వస్తున్నట్లు ప్రస్తుత పూజారులు తెలిపారు.


2001లో గోపురంపై కలశం ప్రతిష్ఠించేందుకు పూజలు చేస్తున్న పురోహితులు (పాత చిత్రం)

ఐలాండ్‌లో రామప్ప

త్వరలో రామప్ప సరస్సు మధ్యలో నిర్మాణం


రామప్ప సరస్సులోని ఐలాండ్ (పాతచిత్రం)


ఈ తరహాలో భారీ శివుడి విగ్రహం ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం

వెంకటాపూర్(రామప్ప), ఆగస్టు 26: ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తించిన నేపథ్యంలో రామప్పను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర పర్యాటకశాఖ కృషిచేస్తోంది. ఇటీవల రామప్ప పర్యటనలో భాగంగా రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం రామప్ప అభివృద్ధిపై పర్యాటకశాఖ అధికారులతో చర్చించారు. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయం భావితరాలకు స్ఫూర్తిదాయకం కావాలన్న సంకల్పంతో రామప్పలో కనీస ఏర్పాట్లు చేస్తోందని వివరించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో రామప్ప సరస్సులోని ఐదెకరాల ఐలాండ్‌లో భారీ శివుడి విగ్రహాన్ని ఏర్పాటుచేసి పర్యాటకులకు కనువిందు చేసేలా సకల హంగులు కల్పించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేవిధంగా రామప్పను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దేందుకు పర్యాటకశాఖ అడుగులు వేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇది ఆచరణలోకి వస్తే మాత్రం ప్రపంచ పర్యాటక ముఖచిత్రంలో రామప్ప అగ్రస్థానంలో నిలువనుంది. ములుగు జిల్లా ఖ్యాతి విశ్వవ్యాప్తం కానుంది.

విధులకు భయం భయంగా..

(5వ పేజీ తరువాయి)



నరకయాతన పడాల్సి వస్తోందని మహిళా వైద్యులు ఆందోళన చెందుతున్నారు.

వేధింపుల బారిన..

రెండు రోజుల కిందట వరంగల్ ఎంజీఎంలో రాత్రి విధుల్లో ఉన్న డాక్టర్ దీపిక (పేరు మార్చాం) రాత్రి 10గంటల సమయంలో ఓపీ నుంచి జనరల్ వార్డులోని రోగులను పరిశీలించేందుకు వెళుతుండగా ఓ వ్యక్తి వెంబడించారు. ఎవరు..? అని ప్రశ్నించినా సమాధానం లేదు. చుట్టూ చీకటి, సెక్యూరిటీ లేదు. సీసీ కెమెరాలు లేవు. ప్రాణాలను అరచేతిలో పెట్టకుని భయంతో జన రల్ వార్డుకు పరు గెత్తాల్సి వచ్చింది. దీంతో ఆ ఆగంతకుడు పరారయ్యాడు" అని ఓ లేడీ మెడికో వాపోయారు. ప్రభుత్వ అస్పత్రిలో 36గంటలు సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, కానీ కనీస రక్షణ లేకపోతే ఎలా అని జూడాలు ప్రశ్నిస్తున్నారు. రాత్రిపూట రోగులతోపాటు వచ్చే వారిలో చాలామంది మద్యం సేవించి అస్పత్రికి వస్తున్నారని, చికిత్స చేస్తుండగా కొందరు, ఓపీ చూస్తుండగా మరికొందరు అసభ్యకరంగా ప్రవర్తిస్తుడటం ఇబ్బందిగా మారుతోందని జూడాలు వాపోతున్నారు. ఇది ఒక్క వరంగల్ ఎంజీఎంలోనే కాదు.. అన్ని ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు.

సీసీ కెమెరాలు, షీటీమ్స్ పెట్రోలింగ్ నిర్వహించాలి..

డాక్టర్ అయోషా, పీజీ విద్యార్థిని, వరంగల్ కేఎంసీ



ప్రతీ అస్పత్రిలో జూనియర్ మహిళా డాక్టర్‌కు రక్షణ కల్పించాలి. ఒక్కోసారి 36గంటలకుపైగా డ్యూటీ చేయాల్సి వస్తోంది. రాత్రిపూట అకతాయిల నుంచి వేధింపులను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఎంజీఎంతో పాటు అన్ని ప్రభుత్వ అస్పత్రుల వద్ద ఎక్కువ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. షీ టీమ్స్‌తో రాత్రిపూట పెట్రోలింగ్ నిర్వహించాలి. స్థానిక పోలీస్‌స్టేషన్‌కు అనుబంధంగా ఔట్‌పోస్టు ఏర్పాటు చేసి సిబ్బందిని పెంచాలి.

రెస్ట్‌రూమ్ కేటాయించాలి..

డాక్టర్ భవ్య, పీజీ విద్యార్థిని



ఒక్కోసారి 36గంటలు నిరంతరం డ్యూటీ చేయాల్సి వస్తోంది. డ్యూటీ చేసే ప్రదేశంలో జూనియర్ డాక్టర్లకు ప్రత్యేకంగా రెస్ట్‌రూమ్‌లు ఉండటం లేదు. కనీసం బాత్‌రూమ్స్, వాష్‌రూమ్‌లు ఉండటం లేదు. రాత్రి వేళ కనీసం తాగేందుకు నీళ్ల కూడా ఉండటం లేదు. బయటకు వెళ్లి నీళ్ల కోసం వెళ్లలేని పరిస్థితి.

మానసిక ఒత్తిడిలో..

జూనియర్ డాక్టర్లు ఎదుర్కొంటున్న ఒత్తిడి నేపథ్యంలో ఇటీవల జాతీయ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) ఆధ్వర్యంలో నేషనల్ టాస్క్‌ఫోర్సు ఫర్ మెంటల్ హెల్త్, వెల్ బీయింగ్ దేశవ్యాప్తంగా 25,590 మంది ఎంబీబీఎస్, 5,337 మంది పీజీ వైద్య విద్యార్థులు, 7,035 మంది ఫ్యాకల్టీని ఆన్‌లైన్ సర్వే చేసి నివేదికను తయారు చేసింది. వీరిలో 28శాతం మంది ఎబీబీఎస్, 15శాతం మంది పీజీ విద్యార్థులు మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు సర్వేలో పేర్కొన్నారు. సర్వేలో పాల్గొన్న పీజీ విద్యార్థుల్లో 45శాతం మంది తాము వారానికి 60గంటలకు పైగానే పని చేశామని, 56శాతం మంది వారాంతపు సెలవు లేకుండా పని చేస్తున్నామని వెల్లడించారు.

ఎన్ఎంసీ ఏం సూచించిందంటే..

- జూనియర్ డాక్టర్లపై ఒత్తిడితో పాటు పనిభారాన్ని కూడా తగ్గించాలి.
- రెసిడెంట్ డాక్టర్లు వారానికి 74 గంటల కంటే ఎక్కువ పని గంటలు చేయొద్దు. వారాంతపు సెలవు ఇవ్వాలి.
- వైద్య విద్యార్థులు మానసిక ఒత్తిడిని, ఇతర సమస్యలను తట్టుకునేందుకు యోగా, క్రీడలు, తదితర కార్యక్రమాలను మెడికల్ కాలేజీల్లో నిర్వహించాలి.

విద్యార్థులు ఏం కోరుతున్నారంటే..

- మెడికల్ కాలేజీ అస్పత్రుల్లో 60 నుంచి 70శాతం మహిళ డాక్టర్లే విధులు నిర్వహిస్తున్నారు. వీరికి కనీస సౌకర్యాలు కల్పించాలి.
- జూనియర్ మహిళ డాక్టర్లు విధులు నిర్వహించే అస్పత్రిలో వారికి ప్రత్యేకంగా మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు ఏర్పాటు చేయాలి.
- 36 గంటలు డ్యూటీ చేయాల్సి ఉన్నందున రాత్రిపూట విశ్రాంతి తీసుకునేందుకు ప్రత్యేకంగా రెస్ట్‌రూమ్ ఏర్పాటు చేయాలి.
- ఎంజీఎం అస్పత్రి, మెడికల్ కాలేజీ, కంటి అస్పత్రి, కేఎంసీ మహిళ వసతి గృహాల వద్ద ఎక్కువ సీసీ కెమెరాలతో పాటు అస్పత్రుల చుట్టూ విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయాలి.
- రాత్రిపూట అస్పత్రి చుట్టూ ఉన్న అన్ని గేట్లు మూసి, ఎమర్జెన్సీ గేటు, ఎగ్జిట్ గేటు మాత్రమే తెరిచి ఉంచాలి.
- ఔట్‌పోస్టులో ఎస్ఐ స్థాయి అధికారితో పాటు రాత్రిపూట కచ్చితంగా అస్పత్రి ప్రాంగణంలో పోలీస్ వాహనంలో షీటీమ్స్‌తో పెట్రోలింగ్ చేయాలి.
- రాత్రిపూట ఎంజీఎంతో పాటు మహిళ వైద్యుల హాస్టళ్ల వద్ద లేడీ సెక్యూరిటీ గార్డును నియమించాలి.
- ఎంజీఎం అస్పత్రి ఆవరణలో రాత్రిపూట నిద్రస్తున్నవారిని పరిశీలించాలి. వారు రోగులకు సంబంధీకులా..? కాదా? గుర్తించి చర్యలు తీసుకోవాలి.
- రాత్రి 10గంటలు దాటితే తాగేందుకు నీళ్ల కూడా అందుబాటులో ఉండటం లేదు. 24 గంటలు తాగేనీరు అందుబాటులో ఉంచాలి.
- రోగులతోపాటు లోపలికి వచ్చేవారు మద్యం తాగి ఉన్నారో లేదో పరీక్షించిన తరువాతే లోపలికి పంపించాలి. అది కూడా ఒక్కరినే పంపించాలి.
- రోగుల అటెండర్ ఐడీ కార్డులు, ఆధార్‌కార్డులను సేకరించాలి
- ఓపీ, ఐపీ విభాగాలను వేర్వేరుగా నిర్వహించాలి.



సంబరాల్లో రైల్వే కార్మిక నాయకులు

రైల్వే మజ్దూర్ నాయకుల సంబరాలు

కాజీపేట, ఆగస్టు 26: కేంద్ర యునైటెడ్ పెన్షన్ స్కీం ప్రకటించడంపై సోమవారం కాజీపేట డీజిల్‌లోకో షెడ్ ఎదుట మజ్దూర్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. రైల్వే కార్మికుల పోరాటాల ద్వారా ఈ స్కీమ్ సాధించామని రైల్వే కార్మిక నాయకులు తెలిపారు. బ్రాంచ్ అధ్యక్షుడు ఎస్‌కే.జానీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు జి. రాజేశ్వర్‌రావు, భాస్కర్‌రెడ్డి, తిరుపతి, నరేశ్, ఎ.సత్యనారాయణ, యాదగిరి, తోపాటు రైల్వే కార్మికులు పాల్గొన్నారు.

కూలీలకు బీమా పథకాలను అమలు చేయాలి

వడ్డెపల్లి, ఆగస్టు 26: జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు బీమా పథకాలను అమలు చేయడంతో పాటు వారికి ఆర్థిక సహాయం అందించాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి పి.శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చే శారు. సోమవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో నిర్వహించిన డీబీఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు ఏడాదికి రూ.12వేల ఆర్థిక సహాయం అందించాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా భూమి లేని రైతులకు, కూలీలకు రైతు బీమా పథకాన్ని అమలు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్, ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, వీసీకే పార్టీ అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, ప్రజా సంఘాల నాయకులు బొర్ర సంపూర్ణ, మేకల అనిత, రాధ, చెన్నయ్య, దేవేందర్, రాజాసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

వడ్డెపల్లి, ఆగస్టు 26: భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని యునైటెడ్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ అనుబంధం జిల్లా అధ్యక్షుడు బానోతు వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వడ్డెపల్లి చర్చి జంక్షన్‌లోని లేబర్ అడ్డా వద్ద నిర్వహించిన నిరసన ప్రదర్శన ధర్నాలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ లేబర్ క్లెయిమ్స్ నిర్వహణ, ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పే ప్రతిపాదనను వెంటనే ఉప సంహరించుకోవాలని అన్నారు. ఈ ధర్నాలో యూనియన్ నాయకులు కూస రాజేష్‌తో పాటు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణ కృషితోనే ఎస్సీ వర్గీకరణ


మంద కృష్ణ మాదిగకు చిత్రపటాన్ని అందజేస్తున్న నాయకులు

కేయూ క్యాంపస్, ఆగస్టు 26: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ కృషితోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని కేయూ ఎస్సీఎల్‌సీఈ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొట్టే భాస్కర్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో మందకృష్ణ మాదిగను న్యూశాయంపేట మాదిగ ఎంప్లాయీస్ సంఘం నేతలు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేసి, శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి రాజన్న, రాష్ట్ర నాయకులు ఆకారం మురళి మాదిగ, తోట శ్రీనివాస్ మాదిగ, కొట్టే భాస్కర్, కొట్టే ప్రవీణ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడి సత్యవాక్కులు అనుసరణీయం

వరంగల్ ఎంపీ కడియం కావ్య


డి కన్వెన్షన్ హాల్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యే రాజేందర్ తదితరులు

న్యూశాయంపేట: శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీతలో చెప్పిన సత్యవాక్కులు నేటికి మానవాళికి అనుసరనీయమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని డికన్వెన్షన్ హాల్‌లో సోమవారం రాత్రి యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ చెర్మన్, కుడా మాజీ ఛైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్య మాట్లాడుతూ.. మనం ఎంచుకున్న మార్గం మంచిదైతే విజయం మనదే అవుతుందన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గొల్ల, కురుమలు ఐక్యంగా ఉండి వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ ఛైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ మాట్లాడుతూ.. యాదవులను ఐక్యం చేసేందుకు కార్యక్రమం నిర్వహించామన్నారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌లు మాట్లాడారు. కళాకారుడు వరంగల్ శ్రీనివాస్ పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కోలాట నృత్యాలు, నాట్యాలు అలరించాయి. కవులు కళాకారులు ఆడిపాడారు. అనంతరం ఉట్టికొట్టారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ఈ వేడుకలు రాత్రి 12గంటలకు కొనసాగాయి. వేడుకలలో స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు యాదవ్, కార్పొరేటర్ జక్కుల రవీందర్‌యాదవ్, నాయకులు ఎల్లావుల లలితాయాదవ్, కన్నెబోయిన రాజయ్య యాదవ్, సాంబయ్యయదవ్‌తో పాటు పెద్ద సంఖ్యలో యాదవ, కురుమ కులస్థులు పాల్గొన్నారు.

● బాలసముద్రం: మహోన్నత వ్యక్తిత్వం కలిగిన శ్రీకృష్ణుడు ప్రవచించిన గీత బోధనలు నేటి కలియుగంలో గొప్ప ప్రేరణనిస్తాయని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ఎంపీ కడియం కావ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చిన్నారులతో ఎంపీ కావ్య ఉట్టికొట్టించి వారితో కలిసి కోలాటం ఆడారు. తన వివాహ వార్శికోత్సవం సందర్భంగా చిన్నారులతో కలిసి కేక్ కట్‌చేశారు చేశారు. అనంతరం కృష్ణుడి గోపికల వేషధారణలో అలరించిన చిన్నారులకు ఎంపీ డాక్టర్. కడియం కావ్య మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో ట్రెజరర్ డి. శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ ప్రో. పద్మ, ఇసీ మెంబర్ కూడెం కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

● కాళోజీ జంక్షన్: హనుమకొండలోని స్పందన మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, అనితారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలు శ్రీకృష్ణుడు గోపికల వేషధారులై ఆట పాటలతో అలరించారు. అనంతరం మానసిక దివ్యాంగులైన పిల్లలకు దేవేందర్‌రెడ్డి, అనితారెడ్డిలు మిఠాయిలు పంపిణీచేశారు. కార్యక్రమంలో ఇంకా ఆశ్రమ సిబ్బంది సుచరిత, రాజేందర్‌రెడ్డి, వసుధ, హరిత పాల్గొన్నారు.

● రాంనగర్: హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ ఆధ్వర్యంలో సోమవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. కృష్ణ, గోపిక వేషధారణలో హాజరైన చిన్నారులు చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వినయభాస్కర్ మాట్లాడుతూ.. కులమతాలు, ప్రాంతాలకు అతీతంగా కృష్ణాష్టమి వేడుకలు ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకుంటున్నారని తెలిపారు. శ్రీకృష్ణుడు సత్యం మార్గాన నడిచారని, ధర్మం వైపు నిలిచారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అశోక్, నర్సింగ్, నేతలు పులి రజనీకాంత్, జోరిక రమేశ్, కోటేశ్వర్‌రావు, రవిందర్‌రావు, రామ్మూర్తి, ప్రశాంత్, పావణి, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

● కాజీపేట: కాజీపేట సోమిడిలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ జక్కుల రమా రవీందర్ యాదవ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేడుకలు ప్రారంభించారు. ఈ వేడుకల్లో స్థానిక యువకులు ఉట్టికొట్టారు. పిల్లలు కృష్ణుని వేషధారణలతో స్థానికులను అలరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ మేరుగు రాజయ్య, నాయకులు అంకుస్, రాజమ్మ, ఒజ్జరాజు, ఒజ్జ కరుణాకర్, బొంద్యాల్, కిరణ్‌తో పాటు స్థానికులు పెత్తఎత్తున పాల్గొన్నారు.

● వడ్డెపల్లి: 57వ డివిజన్ పరిధిలోని గోకుల్ యాదవ సంఘం, శ్రీవేణుగోపాలస్వామి, పోచమ్మ దేవాలయ అభివృద్ధి సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం యాదవ సంఘం భవనం ఆవరణలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నేత్రపర్వంగా నిర్వహించారు. నిర్వహణ కమిటీ ప్రతినిధులు బంక రమేష్, బొంగు రాజు, బంక సంపత్ యాదవ్, మూగల కుమార్ యాదవ్ నేతృత్వంలో కృష్ణాష్టమిని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన ఉట్టిని చిన్నారులు కొట్టారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వేడుకల్లో పాల్గొని చిన్నారులకు బహుమతులను ప్రదానం చేశారు. ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన గ్రీస్‌పోల్ యువకులు అధిరోహించారు. ఈ కార్యక్రమంలో సీపీ అంబర్ కిషోర్‌ఝా, 57వ డివిజన్ కార్పొరేటర్ నల్ల స్వరూపరాణి, హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డితో పాటు యాదవ యువకులు, మహిళలు, వివిధ కాలనీల ప్రజలు పెద్ద సంఖ్యలోహాజరై గ్రీస్‌పోల్ అధిరోహణ పర్వాన్ని తిలకించారు.


వడ్డెపల్లిలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న సీపీ దంపతులు

విద్యా వ్యవస్థకు కోదండరామ్‌తో మంచి రోజులు

కేయూ రిటైర్డు అధ్యాపకుల సంఘం నేతల వెల్లడి


సమావేశంలో మాట్లాడుతున్న కుర్సా నేతలు

కేయూ క్యాంపస్, ఆగస్టు 26: కోదండరామ్ ఎమ్మెల్సీ కావడంతో రాష్ట్రంలో విద్యావ్యవస్థకు మంచి రోజులు వచ్చాయని కేయూ రిటైర్డు ప్రొఫెసర్ల సంఘం (కుర్సా) అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ ఎ.సదానందం, ప్రొఫెసర్ వడ్డె రవీందర్ అన్నారు. సోమవారం కేయూ గెస్ట్ హౌస్‌లో కుర్సా ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కోదండరామ్‌కు ఎమ్మెల్సీ పదవి ఇచ్చినందుకు రాష్ట్రప్రభుత్వానికి కుర్సా తరుపున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే విద్యాశాఖ మంత్రి పదవిని కూడా కేటాయించాలని విజ్ఞప్తి చేస్తూ కుర్సా కార్యవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు తెలిపారు.

టీఆర్ఎస్ హయాంలో ఉన్నత విద్య నిర్యక్ష్యానికి గురైందని చెప్పారు. వేలాది అధ్యాపక పోస్టులను నింపకుండా విద్యను కుంటుపడేసిందని చెప్పారు. హాస్టళ్ల విద్యార్థులకు కావాల్సిన నిధులను సమకూర్చలేదని చెప్పారు. ఉన్నత విద్యతోపాటు వర్సిటీ విద్యను ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యానికి గుచేసిందని అన్నారు. రాష్ట్రంలో కుంటుపడిన విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కోదండరామ్ సరైన వ్యక్తి అని చెప్పారు. ఈ సమావేశంలో కుర్సా ట్రెజరర్ ప్రొఫెసర్ జి.వీరన్ననాయక్, ప్రొఫెసర్ ఎం.ఎర్రగట్టుస్వామి, వి.కృష్ణారెడ్డి, సుధాకర్, సమ్మయ్యలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్-563కి సర్వీస్ రోడ్డు నిర్మించాలి

జాతీయ రహదారిపై రైతుల ఆందోళన


అనంతసాగర్ రెవెన్యూ శివారులో ఆందోళన చేస్తున్న రైతులు

హసన్‌పర్తి, ఆగస్టు 26: మండలంలోని అనంతసాగర్ రెవెన్యూ శివారులో నూతనంగా నిర్మిస్తున్న కరీంనగర్-హనుమకొండ ప్రధాన రహదారి ఎన్‌హెచ్-563కి సర్వీస్ రోడ్డు నిర్మించాలని కోరుతూ అనంతసాగర్ రెవెన్యూ శివారు రైతులు సోమవారం ఎన్‌హెచ్-563 ప్రధాన రహదారిపై 104వ సైట్ వద్ద రైతులు ఆందోళనకు దిగారు. సుమారు రెండు గంటల పాటు జాతీయ రహదారి పనులను అడ్డుకొని ఎన్‌హెచ్ అధికారులకు తమ గోడు వెళ్ళబోసుకున్నారు. అనంతసాగర్ రెవెన్యూ శివారులో అనంతసాగర్ గ్రామానికి చెందిన రైతులకు సంబంధించి వ్యవసాయ భూములు పెద్ద మొత్తంలో ఉన్నాయని అన్నారు. ఎన్‌హెచ్ నూతన రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం వల్ల ప్రధాన రహదారి దాటేందుకు ఇబ్బందులు తలెత్తడమే కాకుండా ప్రమాదాలు జరిగి రైతులు ప్రాణాలో పోయే పరిస్థితి దాపురించిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నేషనల్ హైవే అధికారులు తక్షణమే స్పందించి ఎన్‌హెచ్-563 ప్రధాన రహదారి నూతన నిర్మాణ పనులతో పాటు 104వ సైట్ వద్ద సర్వీస్ రోడ్డు నిర్మించి రైతులకు సౌకర్యం కల్పించాలని రైతులు అధికారులను, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో అనంతసాగర్ మాజీ ఉపసర్పంచ్ బండ చంటిరెడ్డి, రైతులు బండ రత్నాకర్‌రెడ్డి, బండ సాగర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజిరెడ్డి, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ యువజన సంఘం కమిటీ ఎన్నిక



ఐనవోలు, ఆగస్టు 26: కొండపర్తి గ్రామంలో ఆదర్శ యువజన సంఘం నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కట్కూరి రజినికాంత్, ఉపాధ్యక్షులుగా కట్కూరి సృజన్, పొలెపాక మహేష్, ప్రధాన కార్యదర్శి పోలెపాక రాజేష్, కోశాధికారి కట్కూరి వంశీ, మాదాసు హరిష్, ప్రచార కార్యదర్శి ఇల్లందుల ఆర్య, సభ్యులుగా గుర్రపు సాంబయ్య, కట్కూరి హరిష్, నెల్సన్, నాని, చక్రి, బొక్కల నరేష్, మాదాసు చెర్రీ, గౌరవ అధ్యక్షులుగా కట్కూరి రాజు, కట్కూరి సునీల్‌ను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. రెండేళ్ల పాటు ఈ కార్యవర్గం కొనసాగనుంది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, ఆగస్టు 26: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా మంగళవారం కలెక్టరేట్ సబ్‌స్టేషన్‌లోని ఆర్ట్స్ కళాశాల ఫీడర్ పరిధిలో సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ఆర్ట్స్ కళాశాల ఏరియా, జులైవాడ, రోహిణి ఆస్పత్రి ఏరియా, సుబేదారి మెయిన్ రోడ్డు, శ్రీకృష్ణ ఆస్పత్రి ఏరియాలో విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ జి. సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు జిల్లా స్థాయి క్రీడా పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 26: ఈనెల 29 హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవం వేడుకల్లో భాగంగా మంగళవారం వరంగల్ జిల్లా క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఆహ్వాన క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు వరంగల్ డీవైఎస్‌వో సత్యవాణి ప్రకటనలో తెలిపారు. వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదాదేవి ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా పరిధిలోని వివిధ మండలలకు చెందిన క్రీడాకారులకు కబడ్డీ, రెజ్లింగ్, జూడో, క్రికెట్ పోటీలను నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు.

జలేశ్వరాలయంలో పోటెత్తిన భక్తులు


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 26: హనుమకొండ కాకాజీ కాలనీ సమీపంలోని జలేశ్వరాలయంలో శ్రావణ సోమవారం పెద్ద ఎత్తున భక్తులు పోటెత్తారు. పరమశివుడిగా జలేశ్వరుడిని కొలుస్తూ ఆలయ అర్చకులు కేసరి ఆధ్వర్యంలో పూజాదికాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, నివేదన, మహాహారతిలను నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు వెంకట్‌రెడ్డి తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు.

టెస్కాబ్ ఛైర్మన్ పరామర్శ

ఐనవోలు, ఆగస్టు 26: మండలకేంద్రానికి చెందిన బొల్లపెల్లి రామస్వామిగౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు బాధిత కుటుంబసభ్యులను సోమవారం పరామర్శించారు. సంతాపం తెలిపారు. బొల్లెపెల్లి శేఖర్‌గౌడ్ అనారోగ్యానికి గురికాగా ఆయనను పరామర్శించారు. యోగక్షేమాలు తెలుసుకొని ధైర్యం చెప్పారు. ఆయన వెంట స్థానిక నాయకులు పాల్గొన్నారు. పంథిని మాజీ సర్పంచ్ భర్త కరిమిల్ల పూర్ణచందర్‌రావు సోమవారం రోడ్డు ప్రమాదంలో గాయపడగా రవీందర్‌రావు, మాజీ ఎంపీపీ మార్నేని మధుమతి ఆయనను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసున్నారు. వారి వెంట దేవస్థానం మాజీ ఛైర్మన్ మునిగాల సంపత్ కుమార్, సముద్రాల సమ్మయ్య, మాజీ సర్పంచ్ ఆడెపు దయాకర్, సొసైటీ ఛైర్మన్ కన్నయ్య ఉన్నారు.

ఫైనాన్స్ ఛైర్మన్ రాజయ్య పరామర్శ


సంతాపం వ్యక్తం చేస్తున్న ఛైర్మన్ రాజయ్య

ఐనవోలు, ఆగస్టు 26: ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన మజ్జిగ నారాయణ, మజ్జిగ రంజిత్‌లు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. రాష్ట్ర ఫైనాన్స్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య సోమవారం బాధిత కుటుంబాలను పరామర్శించి సంతాపం తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు నకరకంటి మోహన్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ మహ్మద్ యాకుబ్‌పాషా, గ్రామ పార్టీ అధ్యక్షుడు గిర్క రాజు, నాయకులు మజ్జిగ శ్రీకాంత్, ఆడెపు రమేష్, కడుదూరి తిరుపతి, మిర్యాల సమ్మయ్య, మహేందర్, రాజారపు రాజు, వెంకన్న, ప్రసాద్ తదితరులు పరామర్శలో పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థినికి చేయూత

వడ్డెపల్లి, ఆగస్టు 26: హనుమకొండ పట్టణానికి చెందిన కోమళ్ల భవ్యశ్రీ హైదరాబాద్‌లోని తీగల కృష్ణారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. పేద కుటుంబానికి చెందిన భవ్యశ్రీకి ఫీజు నిమిత్తం విద్యా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిల్ల మహేందర్, సీడబ్ల్యూసీ ఛైర్మన్ అన్నమనేని అనిల్‌చందర్‌రావు, సూరం కరుణాకర్‌రెడ్డి, మోత్కూరి రాకేష్‌లు రూ.35వేల చెక్కును సోమవారం వడ్డెపల్లిలోని ఒయాసిస్ అనాథాశ్రమంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఒయాసిస్ ఆశ్రమ నిర్వాహకులు వొద్దిరాజు చంద్రప్రకాష్, కలకోట్ల నరేందర్, శృతి, వసంత తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నిర్మూలనలో యువతే కీలకం


ఇన్‌స్పెక్టర్ చేరాలును కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ శివకుమార్

హసన్‌పర్తి, ఆగస్టు 26: మత్తు పదార్థాల నిర్మూలనలో యువత భాగస్వామ్యం కీలకమని ఇన్‌స్పెక్టర్ చేరాలు అన్నారు. హసన్‌పర్తి పోలీసుస్టేషన్‌లో సోమవారం ఇన్‌స్పెక్టర్ చేరాలును స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శివకుమార్ ఇన్‌స్పెక్టర్‌కు పలు సమస్యలను వివరించారు. మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసులు సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్‌ను కలిసిన వారిలో మాజీ ఎంపీటీసీలు తాళ్లపెల్లి కుమారస్వామి, పిట్టల కుమారస్వామి, హరిశంకర్, శివకళ్యాణ్, శ్రీనివాస్, మధు, పెద్దమ్మ తదితరులున్నారు.

సమాజానికి దిక్సూచి బౌద్ధమే..

వడ్డెపల్లి, ఆగస్టు 26: సమాజానికి దిక్సూచి బౌద్ధ మతమేనని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.చెన్నయ్య, మిద్దెపాక ఎల్లయ్య, జిల్లా అధ్యక్షుడు చిట్యాల బాబు అన్నారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని గౌత బుద్ధుడి విగ్రహం వద్ద బుద్ధ భూమి అనే మాసపత్రికను సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. గౌతమ బుద్ధుడి బోధనలను విశ్వవ్యాప్తం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు సింగారపు ఐలయ్య, జిలుకర శ్రీనివాస్, ఎర్ర శోభన్‌బాబు, మేకల ప్రవీణ్, దుర్గాప్రసాద్, నాగరాజు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మధర్ థెరిస్సా జయంతి వేడుకలు

కాజీపేట, ఆగస్టు 26: కాజీపేట 61వ డివిజన్ ఫాతిమాజంక్షన్‌లో సోమవారం మదర్ థెరిస్సా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఫాతిమా చర్చి ఫాదర్ కాసు మర్రెడ్డి, విగ్రహ కమిటీ కన్వీనర్, కమిటీ సభ్యులు టి.మత్త్యాఎరెడ్డి, అల్లం ప్రకాశ్‌రెడ్డి థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. థెరిస్సా పేదలకు చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో యం.జ్ఞానప్రకాశ్, భైరపాక ప్రభాకర్, డి. భిక్షపతి, ఫాదర్లు, సిస్టర్లు పాల్గొన్నారు.

కదులుతున్న డొంక

(5వ పేజీ తరువాయి)

వినిపిస్తున్నాయి. ఇప్పటికే సీఐడీ బృందాలు హనుమకొండకు చేరుకున్నాయి. మూడు బృందాలుగా విడిపోయి పలు ఆస్పత్రులపై తనిఖీలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవ హారంలో ఆస్పత్రి యాజమాన్యాలకు నేరుగా సంబంధం ఉందా, లేదంటే ఉద్యోగులు మాత్రమే నిధులు స్వాహా కోసం చేసిన పనా? అని విచారణలో తేలనుంది. కార్పొ రేట్ ఆస్పత్రిలో పనిచేసే కొందరు ఉద్యోగులు.. రోగులతో కుమ్మక్కై 50శాతం చొప్పున లావాదేవీలు మాట్లాడుకొని బిల్లులు సమర్పించి నిధులు స్వాహా చేసినట్లు ప్రాథ మికంగా వెలుగులోకి వచ్చింది. అయితే ఈ కుంభకో ణంలో ఎవరెవరూ ఉన్నారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ తతంగం వెనుక కొందరు ప్రజాప్రతినిధుల హస్తం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

గతంలోనూ..

నగరంలోని కొన్ని ఆస్పత్రుల్లో చిన్న చిన్న జబ్బులకు సైతం పెద్ద ఎద్ద రోగాలు అంటగట్టి ఆరోగ్యశ్రీ, ఇన్సూరెన్స్, సీఎం రిలీఫ్ ఫండ్‌లను దర్జాగా కొల్లగొడుతున్నారు. హనుమకొండ బాలసముద్రంలోని ఓ ఆస్పత్రిలో ఇన్సూరెన్స్ కుంభకోణం ఆంధ్రజ్యోతి కథనంతో బయటపడగా ఇన్సూరెన్స్ అధికారులు ఆస్పత్రిని బ్లాక్‌లిస్టులో పెట్టారు. 20 ఏళ్ల కిందట గర్భసంచి తొలగింపు ఆపరేషన్లు ఉమ్మడి వరంగల్ జిల్లాలో వివాదాస్పదంగా నిలిచాయి. అవసరం లేకున్నప్పటికీ కాసుల కక్కుర్తితో ఈ ఆపరేషన్లు చేశారని విచారణలో వెల్లడైంది. ఇలాగే నగరంలోని పలు కార్పొరేట్ ఆస్పత్రులు కాసుల కక్కుర్తితో పలు అక్రమాలకు పాల్పడుతున్నట్లు అనేక సందర్భాల్లో వెలుగులోకి వచ్చాయి. అధికారులు చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఆస్పత్రి యాజమాన్యాల్లో మార్పు రాకపోవడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇలాంటి ఆస్పత్రులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోకపోవడంవల్ల ఈ తరహా కుంభకోణాలు తరుచూ జరుగుతున్నట్లు రోగులు వాపోతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి కార్పొరేట్ ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏకాగ్రతకు తాడాసనం

మన శరీర ఆకృతికి.. మానసిక ఆరోగ్యానికి చాలా దగ్గర సంబంధం ఉంటుంది. మంచి శారీరక ఆరోగ్యం ఉన్న వారికి మానసికంగా ఒత్తిడి కూడా తక్కువగా ఉంటుంది. యోగాలో- ఇటు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంచే అనేక ఆసనాలు ఉన్నాయి. వీటిలో 'తాడాసనం' కూడా ఒకటి.



ఎలా వేయాలి?

జాగ్రత్తగా గమనిస్తే చాలా మంది నిటారుగా నిలబడరు. ఒక వైపు కొద్దిగా వంగి ఉంటారు. దీని వల్ల వెన్నెముక దగ్గర ఉండే కండరాలలో మార్పు వస్తుంది. శరీర సమతౌల్యం సరిగ్గా లేకపోతే ఆ ప్రభావం - ఏకాగ్రతపై కూడా పడుతుంది. అందువల్ల తాడాసనాన్ని వేసే సమయంలో శరీరపు బరువును రెండు అరికాళ్లపైన పడేవిధంగా నిలబడాలి. తర్వాత చేతులను పూర్తిగా పైకి చాపాలి. ఆ తర్వాత చేతులు రెండింటిని జోడించాలి. అలా జోడించిన తర్వాత నడుము కదలకుండా ఛాతి భాగాన్ని వెనక్కి వంచాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే శరీర ఆకృతి సరి అవుతుంది.

వాటర్ రెమిడీస్

నీళ్లతో నూరు లాభాలు

- **పుదీనా నీరు:** శరీరమంతా డిటాక్స్ అవుతుంది. జీర్ణ శక్తి పెరగడంతో పాటు, హైడ్రేషన్ కూడా వృద్ధి అవుతుంది. ఇందుకోసం కొన్ని పుదీనా ఆకులను నీళ్లలో వేసి కాచి, చల్లార్చి, వడగట్టి తాగాలి.
- **నిమ్మ నీరు:** పొట్ట చదునుగా మారుతుంది. చర్మం కాంతులీనుతుంది. వ్యాధినిరోధకశక్తి మెరుగవుతుంది. ఇందుకోసం గోరువెచ్చని నీళ్లలో నిమ్మరసం పిండుకుని పరగడుపునే తాగాలి.



- **జీలకర్ర నీరు:** జీర్ణశక్తి పెరుగుతుంది. బరువు తగ్గుతారు. నెలసరి నొప్పుల నుంచి ఉపశమనం దక్కుతుంది. ఇందుకోసం గ్లాసు నీళ్లలో టీస్పూను జీలకర్ర వేసి రాత్రంతా నానబెట్టి, ఉదయాన్నే పరగడుపున తాగాలి.
- **అల్లం నీళ్లు:** జలుబు, తలనొప్పి, కడుపుబ్బరానికి విరుగుడుగా పని చేస్తాయి. గ్లాసు నీళ్లలో చెంచా అల్లం రసం కలిపి తాగాలి.

అకలేసియా కార్డియా



కొన్ని ఆరోగ్య లక్షణాలు తప్పుదోవ పట్టిస్తాయి. మరొక సమస్యగా భ్రమపడేలా చేసి, వ్యాధి నిర్ధారణను ఆలస్యం చేస్తాయి. అలాంటి కోవకు చెందిన అన్నవాహిక సమస్యే 'అకలేసియా కార్డియా'! సకాలంలో గుర్తిస్తే, శులభమైన చికిత్సతో అదుపులోకొచ్చే ఈ సమస్య గురించి వైద్యులు ఏమంటున్నారంటే...

ముద్ద... మింగుడు పడకపోతే?

తిన్నది గొంతులోనే ఉండిపోయినట్టు అనిపిస్తూ, ఛాతీ మంట కూడా వేధిస్తుంటే ఎవరైనా దాన్ని అజీర్తి సమస్యగానే భ్రమపడతారు. దాంతో జీర్ణకోశ వైద్యులను సంప్రతించి మందులు వాడుకోవడం మొదలు పెడతారు. ఇంకొందరు ఛాతీలో మంటను గుండె నొప్పిగా పొరబడి గుండె వైద్యులను కూడా కలుస్తూ ఉంటారు. నిజానికి ఈ లక్షణాలతో పాటు మింగడంలో కూడా ఇబ్బంది ఉంటే, దాన్ని 'అకలేసియా కార్డియా'గా భావించాలి. సాధారణంగా మనం ఏం తిన్నా, తాగినా సెకన్ల వ్యవధిలో పొట్టలోకి చేరిపోతుంది. అన్నవాహికలోని కండరాలు కదులుతూ తిన్న పదార్థాన్ని పొట్టలోకి జారుస్తూ ఉంటాయి కాబట్టి ఏం తిన్నా, తాగినా అవన్నీ క్షణాల వ్యవధిలో పొట్టలోకి చేరిపోతూ ఉంటాయి. కానీ కొందర్లో అన్నవాహికలోని కండరాల కదలికల్లో లోపం ఉంటుంది. జీర్ణాశయానికి దగ్గర్లో ఉండే లోయర్ ఈసోఫేగల్ స్ఫింక్టర్ బిగుతుగా మారిపోవడం వల్ల, తిన్న ఘన, ద్రవపదార్థాలన్నీ అన్నవాహికలోనే ఎక్కువ సమయం పాటు ఉండిపోయి, నెమ్మదిగా కిందకు జారుతూ ఉంటాయి. దాంతో ఛాతీలో మంట, అసౌకర్యం వేధిస్తాయి. ఇదే పరిస్థితి ఎక్కువ కాలం పాటు కొనసాగితే ట్యూబులా ఉండవలసిన అన్నవాహిక బెలూన్‌లా ఉబ్బిపోతుంది. ఆహారం గొంతులో నుంచి పైకి ఎగదన్నడంతో ఈ సమస్యను గ్యాస్ట్రోఈసోఫేగల్ రిఫ్లక్స్ (జిఇఆర్‌డి)గా భ్రమపడతారు. నిజానికి జిఇఆర్‌డి సమస్యలో పొట్టలో నుంచి ఆహారం గొంతులోకి ఎగదన్నుతుంది. కానీ అకలేసియా కార్డియాలో అన్నవాహికలోని ఆహారమే గొంతులో నుంచి పైకి ఎగదన్నుతూ ఉంటుంది.

ఈ లక్షణాలు కీలకం

- **ప్రోగ్రెసివ్ డిస్ఫాజియా:** ఘన, ద్రవ పదార్థాలు రెండింటినీ మింగడంలో ఇబ్బంది
- **జీర్ణం కాని ఆహారం నోట్లోకి చేరుకోవడం:** పొట్టలోకి ఆహారం చేరుకోలేదు కాబట్టి, కొన్ని గంటల పాటు అన్నవాహికలో ఉండిపోయిన ఆహారమే నోట్లోకి తన్నుకొస్తుంది.
- **ఛాతీ నొప్పి:** ఛాతీలో నొప్పి, పట్టేసినట్టు ఉండడం
- **బరువు తగ్గడం:** తినడంలో ఇబ్బంది ఉండడం వల్ల పోషకాహార లోపంతో బరువు తగ్గుతారు

ఎందుకీ సమస్య

సాధారణంగా మనం ఆహారం తినేటప్పుడు, నీళ్లు తాగేటప్పుడు, అన్నవాహిక దిగువన, జీర్ణకోశం మొదలులో ఉండే లోయర్ ఈసోఫేగల్ స్ఫింక్టర్ కండరాల సహాయంతో సంకోచిస్తూ, వ్యాకోచిస్తూ తిన్న పదార్థాలను పొట్టలోకి పంపిస్తూ ఉంటుంది. కొందర్లో మెదడు నుంచి ఈ కండరాల కదలికలకు సంకేతాలు అందవు. ఈ నాడీ సమస్య వల్ల స్ఫింక్టర్ రిలాక్స్ అవకుండా బిగుతుగా ఉండిపోవడం వల్ల ఆహారం పొట్టలోకి చేరుకోలేక అన్నవాహికలోనే ఉండిపోతూ ఉంటుంది. ఇది అరుదైన సమస్యే అయినా, సాధారణంగా 30 నుంచి 60 ఏళ్ల వయస్కుల్లో బయటపడుతూ ఉంటుంది. ప్రారంభంలో దీన్ని అసిడిటీగా, జీర్ణ సంబంధ సమస్యగా పొరబడి రెండు, మూడేళ్ల పాటు అసలు సమస్యను గుర్తించడంలో ఆలస్యం చేస్తూ ఉంటారు. కానీ వీలైనంత త్వరగా గుర్తుపట్టగలిగితే సమస్యను సమర్థమైన చికిత్సతో అదుపులోకి తెచ్చుకోగలిగే వీలుంటుంది.

ఈ పరీక్ష కీలకం

ప్రారంభంలోనే గుర్తించగలిగితే ఎండోస్కోపీ ద్వారా పెరోరల్ ఎండోస్కోపిక్ మయోటమీ (పిఒఇఎమ్) ద్వారా చురుగ్గా ఉన్న స్ఫింక్టర్ కండరాన్ని కత్తిరించి, రిలాక్స్ చేయడం జరుగుతుంది. పూర్వం ఈ సమస్యను సర్జరీతో సరిదిద్దేవారు. కానీ ప్రస్తుతం ఎండోస్కోపీ ద్వారానే సమస్యను శాశ్వతంగా సరిదిద్దడం సాధ్యపడుతోంది. సాధారణంగా ఎండోస్కోపీతోనే గొంతు, అన్నవాహిక సమస్యలన్నీ తెలిసిపోతాయి అనుకుంటారు. కానీ ఈసోఫేజియల్ మ్యానోమెట్రీ అనే పరీక్షతో అన్నవాహికలోని కండరాల పని తీరును స్పష్టంగా, కచ్చితంగా తెలుసుకోవచ్చు. ఈ పరీక్షతో అకలేసియా కార్డియాతో పాటు అన్నవాహిక కండరాల కదలికల సమస్యలన్నిటినీ కనిపెట్టవచ్చు.



వాళ్లలో కూడా ఇవే లక్షణాలు

కొందరు పిల్లలు ఎంతసేపు నములుతూ ఉంటారే తప్ప నోట్లో పెట్టుకున్న ముద్దను మింగలేరు. ఇది జన్యుపరమైన డెవలప్‌మెంటల్ అబ్నార్మాలిటీ. పుట్టుకతోనే అన్నవాహికలో, స్ఫింక్టర్‌లో లోపాలే ఈ లక్షణాలకు కారణం. కానీ ఈ సమస్యకూ అకలేసియా కార్డియాకు సంబంధం ఉండదు. అలాగే కొందర్లో అన్నవాహికలో అల్సర్లు ఉండి, పదార్థాలను మింగలేక ఇబ్బంది పడుతూ ఉంటారు. అకలేసియా సమస్యను మరిపించే ఇంకొన్ని ఆరోగ్య సమస్యలు కూడా ఉన్నాయి. అవేంటంటే...

- **ఓరోఫారింజియల్ డిస్ఫాజియా:** బ్రెయిన్ స్ట్రోక్, పార్కిన్సన్స్ వ్యాధుల మూలంగా గొంతు, నోట్లో సమస్యలు తలెత్తి, మింగడానికి గొంతు సహకరించకపోవచ్చు.
- **ఈసోఫేజియల్ డిస్ఫాజియా:** గొంతులో లేదా ఛాతీలో ఆహారం ఇరుక్కుపోయినట్టు అనిపించడం. గ్యాస్ట్రోఈసోఫేగల్ రిఫ్లక్స్ డిసీజ్, స్ట్రిక్చర్స్ లేదా మొటిలిటీ డిజార్డర్ మూలంగా ఈ సమస్య తలెత్తవచ్చు

డిస్ఫాజియా కారణాలు ఇవే!

మింగడంలో ఇబ్బందిని డిస్ఫాజియా అంటారు. అందుకు భిన్నమైన కారణాలుంటాయి. అయితే ప్రతి కారణాన్నీ అకలేసియా కార్డియాగా ముడిపెట్టకూడదు. అలా జరగకుండా ఉండాలంటే డిస్ఫాజియాకు దారితీసే ఇతరత్రా సమస్యల పట్ల కూడా అవగాహన ఏర్పరుచుకోవడం అవసరం. అవేంటంటే...

- **న్యూరలాజికల్ డిజార్డర్స్:** స్ట్రోక్, మల్టిపుల్ స్క్లెరోసిస్ లేదా అమయోట్రోఫిక్ స్క్లెరోసిస్‌ల మూలంగా మింగడానికి తోడ్పడే కండరాల్లో లోపాలు ఏర్పడడం
- **స్ట్రక్చరల్ ప్రాబ్లెమ్స్:** ట్యూమర్లు, ఈసోఫేగల్ స్ట్రిక్చర్స్ లేదా అన్నవాహికలో వంపు ఉండడం, అన్నవాహిక ఇరుకుగా ఉండడం వల్ల మింగడంలో ఇబ్బందులు ఉండవచ్చు
- **జిఇఆర్‌డి:** గ్యాస్ట్రోఈసోఫేజియల్ రిఫ్లక్స్ డిసీజ్‌లో తీవ్రమైన యాసిడ్ రిఫ్లక్స్ వల్ల అన్నవాహిక ఇరుకుగా మారిపోయి, డిస్ఫాజియా ఏర్పడవచ్చు.
- ఇతరత్రా డిస్ఫాజియా సమస్యలను మెత్తని, ద్రవరూప ఆహారంతో సరిదిద్దుకోవచ్చు. అలాగే స్వాలోవింగ్ థెరపీతో అన్నవాహిక కండరాల పనితీరును మెరుగుపరచడం ద్వారా చక్కదిద్దుకోవచ్చు. కొన్ని మందులు కూడా ఉపయోగపడతాయి. పుట్టుకతోనే అన్నవాహికలో లోపాలుంటే వాటిని సర్జరీతో సరిదిద్దుకోవచ్చు.
- డిస్ఫాజియా, అకలేసియా కార్డియా... అన్నవాహికకకు సంబంధించిన ఈ రెండు సమస్యలూ ఒకే రకమైన లక్షణాలనే కలిగి ఉన్నప్పటికీ వాటి కారణాలు, చికిత్సా వ్యూహాలు భిన్నంగా ఉంటాయి. కాబట్టి సమస్యను ప్రారంభంలోనే గుర్తించి తగిన చికిత్సను ఎంచుకోగలిగితే పోషకాహారలోపం, ఆస్పిరేషన్ న్యుమోనియా లాంటి సమస్యలను ముందుగానే అడ్డుకోవచ్చు. డిస్ఫాజియాతో బాధపడేవారు మూల కారణాన్ని కనిపెట్టడం కీలకమైతే, అకలేసియా కార్డియా సమస్య కలిగిన వారు, సరైన, సమర్థమైన చికిత్సా విధానంతో లోయర్ ఈసోఫేగల్ స్ఫింక్టర్‌లో లోపాన్ని చక్కదిద్దుకోవడం అవసరం.

చికిత్స సులభమే

- **న్యుమాటిక్ డైలేషన్:** ఒక బెలూన్‌ను దగ్గరకు పంపించి లోయర్ ఈసోఫేగల్ స్ఫింక్టర్ వ్యాకోచింపచేయడం ద్వారా అన్నవాహికలోని ఆహారం తేలికగా పొట్టలోకి చేరుకోగలిగే వీలు కల్పించవచ్చు
- **పెరోరల్ ఎండోస్కోపిక్ మయోటమీ:** లోయర్ ఈసోఫేగల్ స్ఫింక్టర్ కండరాలను కత్తిరించి అవరోధాన్ని తొలగించవచ్చు
- **బోట్యులినమ్ టాక్సిన్ (బొటాక్స్):** లోయర్ ఈసోఫేగల్ స్ఫింక్టర్‌ను తాత్కాలికంగా బలహీనపరచవచ్చు. ఈ చికిత్స ఎక్కువ సార్లు అవసరం పడవచ్చు.
- **మందులు:** క్యాల్షియం ఛానల్ బ్లాకర్స్ లేదా నైట్రేట్స్ లోయర్ ఈసోఫేగల్ స్ఫింక్టర్‌ను రిలాక్స్ చేస్తాయి. అయితే ఇవి సర్జరీతో సమానమైన ఫలితాన్ని ఇవ్వకపోవచ్చు



డాక్టర్ సోమశేఖర రావు,
సీనియర్ కన్సల్టెంట్,
గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ అండ్ హెపటాలజిస్ట్,
యశోద హాస్పిటల్స్, హైటెక్‌సిటీ,
హైదరాబాద్.

అవేర్‌నెస్



ఇలా బరువు బలాదూర్

అవసరానికి మించిన క్యాలరీలతో పాటు, అసవ్యస్థ హార్మోన్లు శరీర బరువును పెంచుతాయి. కాబట్టి తినే ఆహారంతో పాటు, వేధించే ఆరోగ్య సమస్యలను కూడా అదుపులో పెట్టుకోవాలి.

చక్కెర ఎంత తీయగా ఉంటుందో శరీరానికి అంత చేటు చేస్తుంది. చక్కెర పేగుల్లోని చెడు బ్యాక్టీరియాకు ఆహారంగా ఉపయోగపడుతుంది. శరీరంలో నొప్పితో కూడిన వాపులు (ఇన్‌ఫ్లమేషన్), సోరియాసిస్, మొటిమలు, ఎగ్జిమా, చర్మం సాగిపోవడం లాంటి చర్మ సంబంధ సమస్యలకు కూడా కారణమవుతుంది. చర్మం అడుగున ఉండే కొల్లాజెన్ ఆకారం మారిపోయి చర్మం సాగే గుణం కోల్పోయి, బిగుసుకుంటుంది. కాబట్టి తీపి కోసం చక్కెర బదులు పళ్లు తినాలి. పళ్లు సహజసిద్ధ ప్రత్యామ్నాయాలు. తెల్లని చక్కెర, బ్రౌన్ షుగర్, సుక్రలోజ్, మేపుల్ షుగర్, మొలాసిస్, తేనెలు మానేయాలి. చక్కెరలా తీయగా తినాలనుకుంటే 'స్టీవియా' ఎంచుకోవచ్చు. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను పెద్దగా పెరగనివ్వదు.

- **ఇవి మానేయాలి:** సరళమైన పిండిపదార్థాలు అతి త్వరగా సింపుల్ షుగర్స్‌గా మారిపోతాయి. ఇలా రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగిపోకుండా ఉండాలంటే క్లిష్టమైన పిండిపదార్థాలు తినాలి. ఇవి చక్కెరగా మారే వేగం తక్కువ. కాబట్టి రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా ఉంటాయి. చిలకడదుంపలు, గుమ్మడి, క్వినోవా లాంటి, ఇన్సులిన్ పెరగకుండా ఉంచే నెమ్మదైన పిండిపదార్థాలనే ఎంచుకోవాలి.

హార్మోన్ల అసమతౌల్యాలు

గ్లూటెన్, ధాన్యాలు, పాల ఉత్పత్తులు... ప్రధానమైన హార్మోన్ అసమతౌల్యాల కారకాలు. శరీరంలో అసమతౌల్యానికి లోనవుతున్న ప్రధానమైన హార్మోన్లు, ఆ హార్మోన్ల వ్యవహార్శైలికి కారణమైన రుగ్మతలు కొన్ని ఉన్నాయి. అవేంటంటే....

- **ప్రొలాక్టిన్:** ఈ హార్మోన్ అసమతౌల్యానికి గురవడానికి కారణాలు... ఈటింగ్ డిజార్డర్లు, థైరాయిడ్ గ్రంథి పనితీరు తగ్గడం, కాలేయం పనితీరు అస్తవ్యస్తమవడం, పిట్యుటరీ గ్రంథిలో 'ప్రొలాక్టినోమా' అనే కణితి (ఫలితంగా అత్యధికంగా ప్రొలాక్టిన్ విడుదలవుతుంది). లక్షణాలను బట్టి వైద్యులను కలిసి చికిత్స తీసుకుని, ఈ హార్మోన్ స్రావాన్ని సరిచేసుకోవాలి.
- **ఎండోమెట్రియోసిస్:** ప్రొజెస్టరాన్ హార్మోన్ తగ్గుదల కారణంగా ఎండోమెట్రియోసిస్ వచ్చే వీలుంది. ఇందుకోసం ఈస్ట్రోజన్ హార్మోన్ ఒరవడిని తగ్గించే మందులు వాడి పరిస్థితిని అదుపు చేసుకోవచ్చు.
- **పిసిఒ, పిసిఒడి:** చక్కెరకు ఫుల్‌స్టాప్ పెట్టి, పీచును పెంచి, అత్యల్ప గ్లైసెమిక్ ఆహారం తీసుకుంటూ, అత్యధిక మాంసకృత్తులు, ఒమేగా 3 కొవ్వులు తీసుకోవాలి. దాంతో బరువు తగ్గుతారు. బరువు తగ్గడం వల్ల ఇన్సులిన్ రెసిస్టెన్స్, అత్యధిక యాండ్రోజెన్స్ సమస్య తగ్గుతుంది. ఫలితంగా పిసిఒ, పిసిఒడి సమస్యలు అదుపులోకి వస్తాయి. ఇదంతా క్రమం తప్పకుండా రోజుకు 20 నిమిషాల పాటు వేగంగా నడవడం వల్ల సాధించవచ్చు.

థైరాయిడ్ ఇబ్బందులు

పర్యావరణంలోని కాలుష్యాలు, విషాల ప్రభావం వల్ల థైరాయిడ్ గ్రంథి పనితీరు అస్తవ్యస్థమవుతుందని పరిశోధకులు చెబుతున్నారు. వాయు కాలుష్యం, సబ్బుల్లో ఉండే రసాయనాలు, ఆహారం నిల్వ కోసం ఉపయోగించే ప్రిజర్వేటివ్స్ థైరాయిడ్ గ్రంథిని దెబ్బతీస్తాయి. దాంతో భావోద్వేగాల్లో హెచ్చుతగ్గులతో పాటు, శరీర బరువూ పెరుగుతుంది. థైరాయిడ్ సమస్య వంశపారంపర్యంగా సంక్రమిస్తుందనీ, జన్యుపరంగా సంక్రమిస్తుందనీ అనుకుంటే అది అపోహ మాత్రమే! కొత్త కార్లు, కొత్త ఫర్నిచర్ తగలబడకుండా అడ్డుపడటానికి వాటి తయారీలో వాడే రసాయనాలు, ఆహారం నిల్వ కోసం వాడే ప్రిజర్వేటివ్స్ థైరాయిడ్ గ్రంథి మీద ప్రభావం చూపిస్తాయి.

మానసిక ఒత్తిడి కారణంగా థైరాయిడ్ పనితీరు దెబ్బతింటే నిస్సత్తువ, కుంగుబాటు ఆవరిస్తాయి. థైరాయిడ్ స్రావం తగ్గితే బద్ధకం, నీరసం, బరువు పెరగడం జరుగుతుంది. స్రావం పెరిగితే పొడి చర్మం, బరువు తగ్గడం, ఆందోళన లక్షణాలు కనిపిస్తాయి.

- **న్యూట్రియెంట్ థెరపీ:** కొన్ని ఖనిజలవణాలు థైరాయిడ్ గ్రంథి పనితీరును క్రమబద్ధీకరిస్తాయి. రాగి, జింక్, సెలీనియం, అయొడిన్‌లను నిర్దిష్ట పరిమాణల్లో అందిస్తూ చికిత్స చేస్తే థైరాయిడ్ సమస్య అదుపులోకి వస్తుంది. రాగి, జింక్‌ల పరిమాణాలు ఎంతో కచ్చితంగా ఉండాలి. లేదంటే హైపోథైరాయిడ్ తలెత్తుతుంది. అలాగే థైరాయిడ్ గ్రంథి సక్రమమైన పనితీరుకు విటమిన్ ఎ కూడా అవసరమే!

శుద్ధి వద్దు

ఆహారానికి శుచి, రుచి ఉండాలి. కానీ అదే శుద్ధి చేసిన ఆహారాన్ని ప్యాకెట్లలో తినడం సరికాదు. ఇలాంటి ప్రాసెస్‌డ్ ఫుడ్‌లో నిల్వ రసాయనాలు, కృత్రిమ రంగులు, రుచులు జోడించి ఉంటాయి. ఇవన్నీ ఆరోగ్యానికి హానికరం. ఎక్కువ మొత్తాల్లో ట్రాన్స్ ఫ్యాట్స్ ఉప్పు, చక్కెరలూ ఉంటాయి. కాబట్టి ప్యాకెట్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలి. వీటిలో ఇన్‌ఫ్లమేషన్‌కు కారణమయ్యే పదార్థాలు ఉంటాయి. ఇవి శరీరాన్ని మరింత సున్నితంగా మార్చేసి, పలు రకాల అలర్జీలకు తేలికగా గురయ్యేలా చేస్తాయి. గ్లూటెన్ లేని ప్యాకెట్ ఫుడ్స్ కూడా విపరీతంగా శుద్ధి చేయబడి, పీచు లేని పిండి కలిగి ఉంటాయి. ఇవన్నీ విషంతో సమానం. గ్లూటెన్ లేని పదార్థాలు తినాలనకుంటే పాలిష్ పట్టని గోధుమలు, బియ్యం, శిరి ధాన్యాలు, క్వినోవా తినాలి. ప్యాకెట్లలో దొరికే చిప్స్, కేక్స్ మానేయాలి. వీటితో పాటు ప్యాకెట్లు, ప్లాస్టిక్ డబ్బాలలో దొరికే శుద్ధి చేసిన నూనెలు (పొద్దుతిరుగుడు, వేరుసెనగ) కూడా మానేయాలి. ఇవన్నీ ఫ్రక్టోజ్, సుక్రోజ్, డెక్స్‌ట్రోజ్ చక్కెరల్లా, హార్మోన్ల పనితీరును దెబ్బతీసి స్థూలకాయులుగా మారుస్తాయి.

లవణం మరణం

ఉప్పు ఆహారంలో అత్యవసరం. ఆహారానికి రుచిని అందించడంతో పాటు నాడుల మధ్య ప్రసారాలు జరగడానికి, రక్తంలో చక్కెర స్థాయిలు సమంగా ఉండడానికీ, హార్మోన్ల స్రావాలు క్రమం అవడానికీ ఉప్పు అవసరమే! అయితే ఆ అవసరాలకు మించి ఉప్పు తీసుకుంటూ ఉంటాం. అది అనర్థాలను తెచ్చి పెడుతోంది. నిజానికి వైద్యులు రోజుకు 6 గ్రాముల ఉప్పునే తీసుకోమని సూచిస్తున్నారు. ఇది ఒక చెంచా కంటే తక్కువ. రోజుకు 13 గ్రాముల కంటే ఎక్కువ ఉప్పు తీసుకునేవారు 6.8 గ్రాముల ఉప్పు తీసుకునే వారి కంటే ఎక్కువగా గుండె సమస్యల బారిన పడే ప్రమాదం ఉన్నట్టు వైద్యులు చెబుతున్నారు.

ఆరోగ్యకరమైన ఉప్పు:

లవణాల్లో 'హిమాలయన్ పింక్ సాల్ట్' అనే లేత గులాబీ రంగు ఉప్పు మేలైనది. దీన్లో 84 రకాల ఖనిజ లవణాలు ఉంటాయి. అలాగే సముద్రపు ఉప్పులోనూ ఇన్సులిన్ హార్మోన్‌ను సమంగా ఉంచే శక్తి ఉంటుంది. ఈ సముద్రపు ఉప్పు కంటే నల్ల ఉప్పు మరింత మేలు. దీన్లో ఉండే కలుషితాల కారణంగా ఈ ఉప్పుకు నల్ల రంగు వస్తుంది. కాబట్టి భయపడవలసిన పని లేదు.

గుడ్ హెల్త్

ఉపవాసం పరమౌషధం!

కాలుష్యాలతో నిండిన వాతావరణంలో శరీరం నుంచి కలుషితాలు, విషాలను వెళ్లగొట్టడానికి మెరుగైన మార్గం ఉపవాసం పాటించడం. ఆధునిక యుగంలోని మనమంతా ఉదయం తీసుకునే అల్పాహారమే రోజంతటిలో అత్యంత ముఖ్యమైన ఆహారమని అనుకుంటాం. కానీ మధ్యాహ్న భోజనానికే ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వాలని వైద్యులు అంటున్నారు. మధ్యాహ్న సమయానికి జీర్ణ అగ్ని ఎక్కువ శక్తిమంతంగా ఉంటుంది. కాబట్టి మధ్యాహ్న భోజనం భారీగా ఉండాలి. కాబట్టి రోజంతా భోజనం మానేసి, ఉపవాసం ఉండే బదులు అడపా దడపా ఉపవాసం ఉండడం వల్ల ఫలితం ఉంటుంది. ఏదో ఒక పూట ఉపవాసం ఉండడం కాకుండా, చివరి భోజనానికి, తదుపరి భోజనానికీ మధ్య 14 నుంచి 18 గంటల విరామం ఉండాలి. ప్రతి రోజూ రెండు భోజనాలకు మధ్య కనీసం 16 గంటల విరామం ఇస్తే, శక్తి స్థాయిలు పెరుగడం స్పష్టంగా అనుభవంలోకి వస్తుంది. ఉదయం తీసుకునే టీ, కాఫీలో రెండు చెంచాల పాలు కలుపుకుని చక్కెర లేకుండా తాగాలి. రాత్రి తింటే, తిరిగి మధ్యాహ్న భోజనమే చేయాలి. ఈ నియమం పాటిస్తే రాత్రి భోజనానికీ, మధ్యాహ్న భోజనానికీ మధ్య 14 నుంచి 18 గంటల విరామం దక్కుతుంది. ఈ ఉపవాసంతో అధిక బరువు తగ్గుతాం. మరీముఖ్యంగా పొట్ట చుట్టూ ఉండే కొవ్వు కరుగుతుంది. కణ మరమ్మత్తు జరుగుతుంది. టైప్ 2 మధుమేహానికి గురయ్యే వీలు ఉండదు. హార్మోన్ల అవకతవలు తగ్గుతాయి.



ఇన్‌ఫ్లమేషన్

ఆహారంతో ఆలోచించి..

కొన్ని ఆరోగ్య సమస్యలకు సమాధానం ఆహారంలోనే ఉంటుంది. మరీ ముఖ్యంగా ఇన్‌ఫ్లమేషన్ లక్షణాలను ఆహారంతో మెరుగ్గా అదుపులోకి తెచ్చుకోవచ్చు.

నొప్పులు, వాపులు వ్యాధికి తొలి సూచనలు. కీళ్ల నొప్పులు (ఆర్థ్రయిటిస్), హృద్రోగ సమస్యలు, ఇరిటబుల్ బోవెల్ సిండ్రోమ్ (విరేచనాలు), మధుమేహం, కొన్ని రకాల కేన్సర్లలో కూడా ఇవే ప్రధాన లక్షణాలు. తింటున్న పదార్థాలు సరిపడకపోతే పేగుల్లో వాపు మొదలవుతుంది. ఈ సమస్యే మున్ముందు హార్మోన్ల మీద కూడా ప్రభావం చూపిస్తుంది. కొంతమందికి చుబుకం మీద మొటిమలు తలెత్తుతాయి. ఇందుకు కారణం పాల ఉత్పత్తులు సరిపడకపోవడమే. ఇలాంటి ఇన్‌ఫ్లమేషన్‌కు కలిగించే పదార్థాల్లో ప్రధానమైనవి... చక్కెర, ఎర్రని మాంసం, గ్లూటెన్. మాంసం, చక్కెరలు చర్మపు పిహెచ్ విలువలను మార్చేస్తాయి. అంతే కాదు, పెద్ద పేగుల్లోని ఉపయోగకరమైన బ్యాక్టీరియానూ మారుస్తాయి. పొట్టు తీయని, పాలిష్ పట్టించని ధాన్యాలు, సేంద్రీయ కూరగాయలు, పళ్లు, పసుపు, బ్రక్కోలి, నిమ్మ ఎక్కువగా తినగలిగితే ఇన్‌ఫ్లమేషన్ అదుపులోకొస్తుంది. మద్యపానం, ధూమపానం, తీపిపదార్థాలు ఇన్‌ఫ్లమేషన్‌ను పెంచుతాయి. కాబట్టి వీటికి దూరంగా ఉండాలి. ఉపవాసంతో కూడా ఇన్‌ఫ్లమేషన్ అదుపులోకొస్తుంది. కంటి నిద్ర కూడా కీలకమే!




మీకు తెలుసా?

చిట్టి చిట్కాలు

ఒత్తిడి వేధిస్తుంటే, యాలకులు నమలడం లేదా వాటితో టీ తయారుచేసుకుని తాగడం చేయాలి. ఇలా చేస్తే, మెదడులోని హార్మోన్ల విడుదల సమమై ఒత్తిడి అదుపులోకొస్తుంది.

- 8 బాదం పప్పులను రాత్రంతా నానబెట్టి మరుసటి ఉదయం తోలు తీసి మెత్తగా పేస్ట్‌లా తయారు చేసి, ఆ ముద్దను పాలల్లో కలుపుకుని తాగాలి. లో బిపితో బాధపడేవారికి ఇది చక్కని విరుగుడుగా పని చేస్తుంది.
- రాత్రి నిద్రకు 3 నుంచి 4 గంటల ముందు వరకూ పొట్టను ఖాళీగా ఉంచుకుంటే, గ్రోత్ హార్మోన్ వృద్ధి అవుతుంది. కొవ్వు కరుగుతుంది. పొట్ట చదును అవుతుంది. కంటి నిండా నిద్ర పడుతుంది.
- నిద్ర పట్టకపోతే మెగ్నీషియం తగ్గిందని అర్థం. కాబట్టి మెగ్నీషియం ఎక్కువగా ఉండే పాలకూర, అవకాడోలు తినాలి.
- ఉదయం నిద్రలేవగానే అలసటగా ఉంటే పొటాషియం లోపం ఉందని అర్థం. అరటి పండు, కొబ్బరినీళ్లు ఈ సమస్యకు విరుగుడు.
- తలనొప్పి తరచూ వేధిస్తుంటే, సోడియం లోపంగా భావించవచ్చు. కీర దోస రసం సోడియం లోపాన్ని భర్తీ చేస్తుంది.
- పచ్చ అరటిలో రెసిస్టెంట్ స్టార్చ్ సమృద్ధిగా ఉంటుంది. ఈ స్టార్చ్ రక్తంలో చక్కెర మోతాదు, ఇన్సులిన్ రెసిస్టెన్స్‌ను నియంత్రిస్తుంది. పేగుల్లోని మంచి బ్యాక్టీరియాకు కూడా స్టార్చ్ ఆహారంగా ఉపయోగపడుతుంది.



- గుమ్మడి విత్తనాలను దంచినప్పుడు టెట్రాసైక్లిక్ ట్రైటెర్పీన్స్ అనే కాంపౌండ్లు విడుదలవుతాయి. ఇవి శరీరంలోని పరాన్నజీవులను విసర్జించడానికి సహాయపడతాయి.
- రోజుకు మూడు ఖర్జూరాలు తింటే, జీర్ణశక్తి పెరిగి, శక్తి నిల్వలు వృద్ధి అవుతాయి. మెదడు చురుగ్గా మారుతుంది. ఎముకలు బలపడతాయి..

ఉమ్మడి పౌరస్మృతి 'ఒకే దేశం - ఒకే చట్టం'



గ్రూప్-1 మెయిన్స్ ప్రత్యేకం

ఇండియన్ పాలిటీ

టీజీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

(నిన్నటి దిక్సూచి తరువాయి)

ఉమ్మడి పౌరస్మృతి-చారిత్రక పరిణామం
(రాజ్యాంగ పరిషత్ నుంచి 17వ లోక్‌సభ వరకు)

H ఉమ్మడి పౌరస్మృతి అనే అంశం మన దేశానికి స్వాతంత్ర్యం రాకముం దు నుంచే చర్చనీయాంశంగా ఉంది. ఆనాటి కాలంలో హిందూ మహిళలకు విడాకులు తీసుకునే హక్కు ఉండేది కాదు. దాంతో ఉమ్మడి పౌరస్మృతి తేవాలనే డిమాండ్ తొలుత అఖిలభారత మహిళా కాన్ఫరెన్స్ నుంచి వచ్చింది. దీంతో రాజ్యాంగ కమిటీ విస్తృతంగా చర్చించింది. రాజ్యాంగ నిర్ణయసభలో సభ్యునిగా ఉన్న నజీరుద్దీన్ అహ్మద్ ఉమ్మడి పౌరస్మృతి కోసం డిమాండ్ చేశారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలోని సబ్ కమిటీ ఉమ్మడి పౌరస్మృతిని ప్రాథమిక హక్కుల్లో చేర్చాలా వద్దా అనే అంశంపై ఓటింగ్ నిర్వహించింది. 5-4 ఓట్ల తేడాతో అది వీగిపోయింది. దాంతో ఉమ్మడి పౌరస్మృతిని ప్రాథమిక హక్కులకు బదులుగా ఆదేశిక సూత్రాల్లో చేర్చారు. తదనంతర కాలంలో నెహ్రూ 'ఆధునిక పౌరస్మృతి' పేరిట కొత్త చట్టం తేవాలని ప్రయత్నించారు. కొన్ని వర్గాలు వ్యతిరేకించడంతో ఈ ప్రయత్నమూ ముందుకు సాగలేదు. 1964లో 'ముస్లిం పర్సనల్ లా'పై ఢిల్లీలో ఒక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దేశ, విదేశీ ప్రతినిధులు పాల్గొని విస్తృతంగా చర్చించారు. ఉమ్మడి పౌరస్మృతి అమలుకే మెజార్టీ సభ్యులు మొగ్గు చూపారు. మరోవైపు 1985లో షాబానో, 1995లో సరళా ముద్గల్ కేసుల్లో యూనిఫాం సివిల్ కోడ్(యూసీసీ)ను అమలు చేయాల్సిన అవసరం ఉన్నదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

H ఇదే అంశంపై 2018లో 21వ లా కమిషన్ ఒక నివేదికను సమర్పించింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఉమ్మడి పౌరస్మృతి అవసరం లేదని ఆ నివేదికలో పేర్కొంది. మరోవైపు 2023 జూలై 3న పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్ సుశీల్ మోదీ యూనిఫాం సివిల్ కోడ్(యూసీసీ) నుంచి గిరిజన తెగలను మినహాయించాలని సిఫార్సు చేశారు. ప్రస్తుతం 22వ లా కమిషన్ దీనిపై అధ్యయనం కొనసాగిస్తుంది.

H ఈ విధంగా ఉమ్మడి పౌరస్మృతికి సంబంధించి అనేక చర్చలు, వాదోపవాదాలు ముందుకు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో మన రాజ్యాంగంలోని నిబంధనలు ఉమ్మడి పౌరస్మృతికి సంబంధించి ఏం చెబుతున్నాయనే ఆసక్తి సహజంగానే అందరిలో కలుగుతుంది. ఇందుకు సామాజిక, రాజకీయ ఆసక్తులు ప్రధా న కారణం కావచ్చు. లేదా అనేక సందర్భాల్లో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు మరో కారణం కావచ్చు. 22వ లా కమిషన్ ఈ అంశంపై విస్తృత అధ్యయనం చేస్తుండడంతో.... గతంలో 21వ లా కమిషన్ చెప్పిన దానికి భిన్నంగా ప్రకటించే అవకాశముందా అనే సంశయం; ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉమ్మడి పౌరస్మృతిపై చేసిన చట్టం రాజ్యాంగంలోని 44వ ఆర్టికల్‌పై దృష్టి సారించేలా చేసింది.

H **ఆర్టికల్ 44:** 'The state shall endeavour to secure the citizen a uniform civil code through the territory of India'. దీని అర్థం 'భారతదేశంలోని పౌరులందరికీ ఒకేవిధమైన పౌరస్మృతిని తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నించాలి. ఇక్కడ మనం గుర్తించాల్సింది ఏమంటే ఈ వ్యాఖ్యల్లో యూనిఫాం(ఒకేవిధమైన) అనే పదం ఉంది. కామన్(ఉమ్మడి) అనే పదం లేదు. ఇండీవియర్- ప్రయత్నం, షల్ సెక్యూర్ అని కాకుండా 'షల్ ఇండీవియర్ టు సెక్యూర్' ఉండటాన్ని మనం గమనించాలి.

H వ్యక్తిగత జీవితంలో అనుసరించాల్సిన ధర్మాల గురించి అన్ని మతాలు పేర్కొంటున్నాయి. ఆ మేరకు వ్యక్తిగత చట్టాలనూ అవి రూపొందించుకుంటున్నాయి. వీటిలో వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత, పిల్లల సంరక్షణ గురించిన చట్టాలు ముఖ్యమైనవి. భారతీయ సమాజంలో ఉన్న భిన్న రీతుల నేపథ్యంలో భిన్న వ్యక్తిగత చట్టాలు రూపుదిద్దుకున్నాయి. వీటితో పాటు నాగరిక జీవనానికి దూరంగా ఉన్న ఆదివాసి(గిరిజనులు)ల సాంస్కృతిక, సామాజిక జీవనానికి నష్టం కలగని రీతిలో తీసుకొచ్చిన ప్రత్యేక చట్టాలు కూడా ఉన్నాయి. మరోవైపు గిరిజన ప్రాంతాల పరిపాలన నిమిత్తం రాజ్యాంగంలోని 5వ, 6వ షెడ్యూళ్లలో కొన్ని అంశాలను ప్రస్తావించారు. వీటి ప్రకారం ప్రత్యేక ప్రాంతాల్లో నివసించే గిరిజనుల వివాహ, విడాకుల, వారసత్వం... వంటి సాంఘిక ఆచారాలపై చట్టాలు చేసే అధికారాలను ఆయా జిల్లా మండళ్లు, ప్రాంతీయ మండళ్లకు కల్పించారు. అదేవిధంగా గిరిజనుల మత, సాంఘిక, ఆచార, కట్టుబాట్ల విషయంలో నాగాలాండ్‌కు సంబంధించి ఆర్టికల్ 371ఏను, సిక్కింకు సంబంధించి ఆర్టికల్ 371ఎఫ్, మిజోరాంకు సంబంధించి 371జీను మన రాజ్యాంగంలో ప్రత్యేకంగా చేర్చారు.

H ఈ సందర్భంగా ఇక్కడ మరో విషయాన్ని కూడా చెప్పుకోవాలి. అమలులో ఉన్న 'హిందూ మ్యారేజెస్ యాక్ట్ 1955; హిందూ సక్సేషన్, మైనారిటీస్, గార్డియన్‌షిప్ యాక్ట్ 1956; అడాప్షన్స్ అండ్ మెయింటెనెన్స్ యాక్ట్ 1956'ల్లోని కొన్ని నిబంధనలను మార్చాల్సిన అవసరం ఉందని కొంత మంది పేర్కొంటున్నారు. ఉదాహరణకు కొడుకులతో సమానంగా కుమార్తెలకు సమాన ఆస్తిహక్కులు కల్పించడం, గృహహింస నుంచి మహిళలకు రక్షణ చట్టం(2005); బాల్య వివాహాల రద్దు చట్టం(2006); తల్లిదండ్రుల సీనియర్ పౌరుల పోషణ చట్టం(2007) అనే మూడు వ్యక్తిగత చట్టాలను సవరించడం ఆహ్వానించదగ్గ విషయం. ఇంకా మరికొన్ని వ్యక్తిగత చట్టాలకు సవరణలు తీసుకురావాల్సిన అవసరం ఉంది. అయితే భారతదేశ వైవిధ్య సంస్కృతిని కాపాడుకుంటూ వ్యక్తిగత చట్టాలను సవరించాలి.



డాక్టర్ సుంకర రమాదేవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్

దిక్సూచి

ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజంలో కోర్సులు

హైదరాబాద్‌లోని ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజం(ఏపీసీజే)- వివిధ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు ఉన్నాయి. రెగ్యులర్, దూరవిద్య విధానాల్లో కోర్సులు చేయవచ్చు. ఆన్‌లైన్ మోడ్‌లో తరగతులు నిర్వహిస్తారు. తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాలు ఎంచుకోవచ్చు.

పీజీ డిప్లొమా ఇన్ జర్నలిజం: కోర్సు వ్యవధి ఏడాది. డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమా ఇన్ జర్నలిజం: కోర్సు వ్యవధి ఆర్నెల్లు. డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమా ఇన్ టీవీ జర్నలిజం: కోర్సు వ్యవధి ఆర్నెల్లు. డిగ్రీ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు.

సర్టిఫికెట్ కోర్స్ ఆఫ్ జర్నలిజం: కోర్సు వ్యవధి మూడు నెలలు. పదోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

- **ప్రాస్పెక్టస్, దరఖాస్తు ఫారం పొందేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 2
- **ఆన్‌లైన్ అడ్మిషన్ పొందేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 6
- **మొబైల్ నెం:** 98485 12767, 72860 13388
- **వెబ్‌సైట్:** www.apcj.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Vzdk8xxలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

40 రోజులు వైజాగ్‌లోనే...



సినీ నటుడు, తమిళ సూపర్‌స్టార్ రజినీకాంత్ సోమవారం నగరానికి విచ్చేశారు. మధ్యాహ్నం 1.30 గంటలకు చెన్నై-విశాఖ విమానంలో ఇక్కడకు చేరుకున్న ఆయన నగరంలోకి వెళ్లారు. కాగా విమానాశ్రయంలో రజినీకాంత్ కనిపించడంతో పలువురు తమ సెల్‌ఫోన్‌లతో ఫొటోలు, వీడియోలు తీశారు. ఆయన ప్రస్తుతం నటిస్తున్న 'కూలీ' చిత్రం షూటింగ్ 40 రోజులపాటు నగరంలోని ఫిషింగ్ హార్బర్, తదితర ప్రాంతాల్లో జరగనున్నట్టు తెలిసింది.

గోపాలపట్నం (విశాఖపట్నం)

నటుడు దర్శన్‌కు జైల్లో రాచమర్యాదలు



హత్య కేసులో నిందితుడిగా ఉన్న కన్నడ సినీనటుడు దర్శన్‌కు కర్ణాటకలోని పరప్పన అగ్రహార జైల్లో రాచమర్యాదలు అందుతున్న ఫొటో, వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. రిమాండ్ ఖైదీగా ఉన్న దర్శన్‌తోపాటు మరో ముగ్గురు జైలు ఆవరణలోని ఒక పచ్చిక మైదానంలో ప్లాస్టిక్ కుర్చీల్లో కూర్చొని జల్సాగా గడుపుతున్నట్టు ఆ ఫొటోలో ఉంది. దర్శన్ ఒక చేతిలో కాఫీ కప్పు, మరో చేతిలో సిగరెట్ ఉన్నాయి. దర్శన్ ఎదురుగా ఆయన మేనేజర్‌తోపాటు ఈ కేసులో సహనిందితులుగా ఉన్న రౌడీషీటర్లు విల్సన్ గార్డెన్ నాగ, కుల్ల సీన కూర్చుని ఉన్నారు. జైల్లో ఖైదీలకు రాచమర్యాదలు అందుతున్నాయని విమర్శలు వెల్లువెత్తడంతో కర్ణాటక ప్రభుత్వం ఘటనపై విచారణకు ఆదేశించింది. ఏడుగురు జైలు అధికారులను సస్పెండ్ చేసింది.

కొంప ముంచిన వీడియోకాల్

రౌడీషీటర్ జానీ అలియాస్ జనార్దన్ కుమారుడు సత్య మే 7న మార్కెట్ ధర్మ అనే రౌడీషీటర్‌కు వీడియో కాల్ చేశాడు. తన సెల్ పక్కనే నటుడు దర్శన్ ఉన్నాడని చూపించి.. దర్శన్‌తో హాయ్ చెప్పించాడు. ఈ వీడియోను రికార్డు చేసుకున్న సత్య.. తన దర్జాను చాటుకునేందుకు కలాసిపాళ్యలోని కొందరికి షేర్ చేశాడు. అదే దర్శన్ కొంప ముంచింది. మరోవైపు సత్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

అభిమాని కుటుంబానికి మెగా సత్కారం



మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా ఆయన అభిమాని ఈశ్వరయ్య తిరుపతి నుంచి తిరుమల కొండ వరకూ పొర్లు దండాలు పెట్టుకుంటూ వెళ్లి తన అభిమానాన్ని చాటుకున్నారు. ఈ విషయం చిరంజీవికి తెలిసి ఈశ్వరయ్యను, ఆయన కుటుంబ సభ్యులను హైదరాబాద్‌కు ప్రత్యేకంగా పిలిపించి, ఇంట్లో బట్టలు పెట్టి సత్కరించారు. ఈశ్వరయ్య కుటుంబానికి తను అండగా ఉంటానని మెగాస్టార్ మాట ఇచ్చారు. గతంలో కూడా ఈశ్వరయ్య తిరుపతి నుంచి హైదరాబాద్‌లోని మెగాస్టార్ ఇంటి వరకూ సైకిల్ యాత్ర నిర్వహించారు.

హీరోయిన్‌ను చూసి హీరో ఉరుకులు, పరుగులు



'హుషారు' చిత్రంతో ప్రేక్షకులను మెప్పించిన యువ కథానాయకుడు తేజస్ కంచర్ల నటించిన తాజా చిత్రం 'ఉరుకు పటేలా'. వివేక్ రెడ్డి దర్శకత్వంలో కంచర్ల బాలభాను నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబర్ 7న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ సినిమా గురించి వివరిస్తూ 'పెళ్లి వయసు వచ్చినా హీరోకి పెళ్లి కాదు. కారణం అతనికి చదువు అబ్బలేదు. కానీ బాగా చదువుకున్న పిల్లనే పెళ్లి చేసుకోవాలని అనుకుంటాడు. అతని ఆశలకు తగ్గట్టే హీరోయిన్ అతన్ని ప్రేమిస్తుంది. ఎవరికీ నచ్చని హీరోను ఈ హీరోయిన్ ఎలా ప్రేమించిందా అన్నదే కథలో ట్విస్ట్. హీరోయిన్‌లోని మరో కోణం బయటకు రావడంతో హీరో భయపడి పారిపోవాలని అనుకుంటాడు. ఆమెని చూసి ఎందుకలా పారిపోవాలని అనుకున్నాడన్నది తెలుసుకోవాలంటే సినిమా చూడాల్సిందే' అని చెప్పారు దర్శకనిర్మాతలు.



ప్రియదర్శి హీరోగా మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శ్రీదేవి మూవీస్ అధినేత శివలెంక కృష్ణప్రసాద్ నిర్మిస్తున్న చిత్రం 'సారంగపాణి జాతకం'. సోమవారం ప్రియదర్శి పుట్టినరోజు కావడంతో సెట్‌లో వేడుక నిర్వహించారు. చాలా రోజుల తర్వాత పుట్టిన రోజుని సెలబ్రేట్ చేసుకుంటున్నాననీ, గొప్ప వ్యక్తుల మధ్య ఇలా జరుపుకోవడం ఆనందంగా ఉందని ప్రియదర్శి అన్నారు.

హిందువులేనా అని అడిగారు



కృష్ణాష్టమి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేసుకునేందుకు మధురైలోని మీనాక్షి అమ్మవారి ఆలయానికి వెళ్లిన నటి నమిత దంపతులకు అవమానం ఎదురైంది. ప్రముఖుల దర్శన క్యూలైన్లో వెళ్ళిన వారిని ఆలయ సిబ్బంది అడ్డుకున్నారు. వీఐపీలు దర్శనానికి వస్తే వారి వివరాలను రిజిస్టర్‌లో పొందుపరచాల్సి ఉందని పేర్కొన్న సిబ్బంది.. 'మీరు హిందువేనా?' అని అడిగారు. తామిరువురమూ హిందువులమేనని, తమ కుమారుడికి శ్రీకృష్ణుడి పేరే పెట్టామని వారు వివరించారు. హిందువు అయితే నుదుట కుంకుమ పెట్టుకుని రావాలని ఆ సిబ్బంది నమితకు సూచించారు. ఆ మేరకు నమిత నుదుట కుంకుమ పెట్టుకుని ఆలయంలోకి వెళ్లి దైవదర్శనం చేసుకున్నారు. అనంతరం నమిత దంపతులు మీడియాతో మాట్లాడుతూ.. మీనాక్షి ఆలయ సిబ్బంది దురుసుగా వ్యవహరించారని, తాము హిందువులమని ధ్రువీకరించేందుకు సర్టిఫికేట్ అడిగారని తెలిపారు. నమిత మాట్లాడుతూ.. మొట్టమొదటిసారిగా తాను హిందూమతానికి చెందినదానిని నిరూపించుకోవాల్సిన అవసరం ఏర్పడిందని పేర్కొన్నారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

మీ టూ అంటూ ముందుకు వస్తున్న హీరోయిన్లు

● మలయాళ చిత్ర పరిశ్రమను కుదిపేస్తున్న జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్

ఒకప్పుడు మలయాళ చిత్ర పరిశ్రమ అంటేనే బూతు సినిమాలు.. చవకబారు సినిమాలు.. అనే తేలిక అభిప్రాయం ఉండేది. కేరళలోనే కాదు ఇతర భాషల్లోనూ మలయాళ చిత్రాలకు మంచి డిమాండ్ ఉండేది. భాష తెలియకపోయినా ఆ సినిమాల్లోని సీన్లకోసం ప్రేక్షకులు ఎగబడే వారు.. మమ్ముట్టి, మోహన్‌లాల్ వంటి హీరోలు ఉన్నా షకీలా లాంటి శృంగార తారలు అప్పట్లో ఒక వెలుగు వెలిగారు. వారి సినిమాల కంటే షకీలా సినిమాలే ఎక్కువ కలెక్ట్ చేసేవి. అయితే క్రమేపీ ఆ ముద్ర నుంచి బయటపడింది మలయాళ చిత్ర పరిశ్రమ. కొత్త రకం కథలతో.. సహజత్వం ఉట్టిపడే సినిమాలతో మిగతా అందరి దృష్టినీ ఆకర్షించగలిగింది. అంతే కాదు ప్రయోగాత్మక చిత్రాలు, కాన్సెప్ట్ ఓరియంటెడ్ ఫిల్మ్‌ కోసం మలయాళం సినిమాలే చూడాలి అనే స్థాయికి ఎదిగిందీ పరిశ్రమ. అవార్డులతో పాటు రివార్డులూ పొందింది. అయితే 2017లో జరిగిన ఓ సంఘటన మలయాళ చిత్ర పరిశ్రమ ప్రతిష్ఠను దెబ్బ తీసింది. తెలుగు వారికీ పరిచయమైన హీరోయిన్ భావనపై జరిగిన లైంగిక దాడి అందరినీ షాక్‌కు గురి చేసింది. ఈ దాడి దేశవ్యాప్తంగా అందరి దృష్టినీ ఆకర్షించింది. అదే సమయంలో బాలీవుడ్ నటి తనుశ్రీ దత్తా ముందుకు వచ్చి, 2008లో నటుడు నానా పాటేకర్ తనతో అసభ్యకరంగా ప్రవర్తించాడని వెల్లడించి ఇండియాలో 'మీ టూ' ఉద్యమానికి నాంది పలికింది. ఇక అప్పటి నుంచి ఈ ఉద్యమం మిగిలిన చిత్ర పరిశ్రమలకూ పాకింది. లైంగిక వేధింపులను బట్టబయలు చేసింది. ఉప్పెనలా ఎగసిన ఈ ఉద్యమం అప్పట్లో చాలా మందికి నిద్ర పట్టకుండా చేసింది,

అప్పటి నివేదిక ఇప్పుడు వెలుగులోకి..

మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందికర పరిస్థితులను ఏడేళ్ల పాటు పరిశీలించి, జస్టిస్ హేమ కమిటీ ఇటీవల ఇచ్చిన నివేదిక ఇప్పుడు ఆ పరిశ్రమను కుదిపేస్తోంది. మళ్లీ ధైర్యంగా హీరోయిన్లు ముందుకు వచ్చి, తమపై లైంగిక దాడికి ప్రయత్నించిన వారి చిట్టా బయట పెడుతున్నారు.

ఐదేళ్ల కెరీర్ కోల్పోయా



చిన్మయి

"ఉమెన్ ఇన్ సినిమా కలెక్టివ్ నిర్ణయం వల్లే ఈ కమిటీ నివేదిక సాధ్యమైంది. ఇప్పటివరకూ ఇలాంటిది ఏ పరిశ్రమలోనూ జరగలేదు. ప్రతీ ఇండస్ట్రీలో ఇలాంటి పరిస్థితులు ఉంటాయనేది బహిరంగ రహస్యం. సినీ పరిశ్రమలో లైంగిక వేధింపులు సాధ్యమని అందరూ భావిస్తుంటారు. ఇలాంటి ఘటన జరిగిందని చెప్పినా నిందితులపై వెంటనే చర్యలు తీసుకోవడం లేదు. కొన్నేళ్ల పాటు కేసు నడుస్తూనే ఉంటుంది. రాజకీయ బలం, డబ్బు వల్ల ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిని శిక్షించడం కష్టంగా మారింది" అని చిన్మయి ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె గతాన్ని గుర్తుచేసుకున్నారు. "తమిళ చిత్ర పరిశ్రమకు చెందిన ఓ ప్రముఖ వ్యక్తి నాతో అభ్యంతరకరంగా ప్రవర్తించాడు. ఆయన గురించి బయటకు వచ్చి ధైర్యంగా మాట్లాడినందుకు నాకు ఆ పరిశ్రమలో వర్క్ లేకుండా చేశాడు. కాగా, విదేశాల్లో ఓ సంగీత కార్యక్రమం నిమిత్తం వెళ్లినప్పుడు సీనియర్ గీత రచయిత వైర ముత్తు తనని వేధింపులకు గురి చేశారని 'మీటూ' ఉద్యమ సమయంలో ఆమె కామెంట్స్ చేశారు. ఆయన చెప్పిన మాటలు విననందుకు తన కెరీర్ పైనే దెబ్బ కొట్టారని చిన్మయి ఆరోపించారు. ఈ క్రమంలోనే తమిళ పరిశ్రమ చిన్మయిని దాదాపు ఐదేళ్లు బ్యాన్ చేసింది. నిషేధం తర్వాత ఆమె 'లియో' చిత్రంలో త్రిష పాత్రకు డబ్బింగ్ చెప్పారు.

నాతో అసభ్యంగా ప్రవర్తించాడు



శ్రీలేఖ



రంజిత్ బాలకృష్ణన్

బెంగాలీ నటి శ్రీలేఖ మిత్ర మలయాళ చిత్ర దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్‌పై ఆరోపణలు చేశారు. 2009లో రంజిత్ దర్శకత్వం వహించిన "పలేరి మాణిక్యం: ఒరు పతిర కోలపతకతింటే కథ" సినిమా ఆడిషన్ సందర్భంగా తనతో అసభ్యంగా ప్రవర్తించినట్లు వెల్లడించారు. "నాకు సినిమా అవకాశం ఇస్తానని, సినిమా గురించి చర్చించేందు దర్శకుడు రంజిత్ నన్ను హోటల్ గదికి రమ్మన్నారు. గదిలోకి వెళ్లిన తర్వాత నాతో అసభ్యంగా ప్రవర్తించడంతో షాక్ గురై అక్కడ నుంచి బయటకు వచ్చేశాను" అని ఆరోపించారు. ఈ ఆరోపణల నేపథ్యంలో మలయాళ దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్ కేరళ చలనచిత్ర మండలి అధ్యక్షుడి పదవికి రాజీనామా చేశారు. "నటి శ్రీలేఖ నాపై చేస్తున్న ఆరోపణలు వాస్తవం కాదు. నిజానికి ఈ విషయంలో అసలు బాధితుడ్ని నేను. నాపై వెల్లువెత్తుతున్న ఆరోపణల నేపథ్యంలో నేను ఈ పదవిలో ఉండటం సముచితం కాదు. నాపై వస్తున్న ఆరోపణలను నేను లీగల్‌గా ఎదుర్కొని.. నా తప్పు లేదని నిరూపించుకుంటా" అని ఓ టెలివిజన్ చానల్‌కు పంపిన ఆడియో రికార్డ్‌లో పేర్కొన్నారు.

వేధింపులు ఎదుర్కొన్నా



మీను మునీర్

మరో మలయాళి నటి మీను మునీర్ తనకు జరిగిన ఓ చేదు అనుభవాన్ని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. "మలయాళ పరిశ్రమకు చెందిన నటులు ముఖేశ్, మణియన్‌పిళ్ల రాజు, ఇడవేల బాబు, జయసూర్య, ప్రొడక్షన్ కంట్రోలర్ నోబల్, విచు వల్ల నేను ఎంతో మానసిక క్షోభ అనుభవించాను. వారు అసభ్యపదజాలంతో నన్ను దూషించేవారు. షూటింగ్ సమయంలో జయసూర్య నా వెనుకనుంచి బలవంతంగా హత్తుకుని, ముద్దుపెట్టుకున్నాడు. ఇవన్నీ తట్టుకోలేక నేను మలయాళ ఇండస్ట్రీని వదిలి చెన్నైకు వచ్చేశా. నాకీ విషయంలో న్యాయం జరగాలని కోరుకుంటున్నాను. వారు చేసిన పనికి తగిన శిక్ష పడాలి" అని పేర్కొన్నారు.

నా దృష్టిలో సిద్ధిఖీ.. ఓ క్రిమినల్



సిద్ధిఖీ



రేవతి సంపత్

మలయాళ నటుడు సిద్ధిఖీ తనతో అసభ్యంగా ప్రవర్తించారని మలయాళ నటి రేవతి సంపత్ ఆరోపణలు చేశారు. "కొన్నేళ్ల క్రితం నటుడు సిద్ధిఖీ.. ఓ సినిమా కోసం నన్ను కలవాలని ఫేస్‌బుక్‌లో మెసేజ్ పెట్టారు. కూతురనే అర్థం వచ్చేలా ఆయన పిలవడంతో నేను ఆయనని సంప్రదించా. ఆయన నన్ను శారీరకంగా, మానసికంగా బాధించారు. నా దృష్టిలో ఆయనొక క్రిమినల్. దీని వల్ల నా కెరీర్ కూడా దెబ్బతింది. ఇప్పటికి ఈ విషయంపై మాట్లాడ్డానికి ధైర్యం వచ్చింది" అని పేర్కొన్నారు. ఈ ఆరోపణల నేపథ్యంలో సిద్ధిఖీ మలయాళ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ పదవికి రాజీనామా చేశారు.

ఇండస్ట్రీలో లేకుండా చేస్తానన్నారు



గీతా విజయన్



తులసీ దాస్

నటి గీతా విజయన్ మలయాళ చిత్ర దర్శకుడు తులసీ దాస్‌పై ఆరోపణలు చేశారు. "చంచట్టం' సినిమా షూటింగ్‌లో తులసీ దాస్ నాతో అసభ్యంగా ప్రవర్తించారు. నేనుండే రూమ్ తలుపు కొడుతుండేవాడు. నేను ఆ పద్ధతిని తప్పుపట్టినందుకు షూటింగ్‌లో ఆయన నాకు డైలాగులు చెప్పేవారు కాదు. ఇండస్ట్రీలో లేకుండా చేస్తానని బెదిరించేవారు" అని గీత ఆరోపించారు.

ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు తప్పుకోవాలి



పృథ్వీరాజ్

హేమ కమిటీ నివేదికపై.. మలయాళ పరిశ్రమలోని ప్రముఖులపై వెల్లువెత్తుతున్న ఆరోపణలపై నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ స్పందించారు. "అధికారంలో ఉండి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు పదవుల నుంచి తప్పుకోవాలి. నిందితులపై విచారణ జరిపి.. దోషులని తేలితే కఠినంగా శిక్షించాలి. ఈ నివేదికలో వెల్లడించిన అంశాలు నాకు ఆశ్చర్యం కలిగించలేదు. ఎందుకంటే పరిశ్రమలో మహిళలకు సురక్షిత వాతావరణం కల్పించడం మన కనీస బాధ్యత. అందుకు నేను ముందుంటా. అయితే అది నా ఒక్కడి బాధ్యత కాదు. అందరూ ఈ పద్ధతిని అనుసరించాలి" అని పేర్కొన్నారు.

జస్టిస్ హేమ కమిటీ... నివేదిక

2017లో నటి భావనపై కొందరు దుండగులు కారులో లైంగిక దాడికి పాల్పడిన సంఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. కారులో ఆమెను పలు చోట్లకు తిప్పుతూ దుండగులు అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఆ ఘటనలో మలయాళ అగ్రహీరో దిలీప్ కీలక నిందితుడు. ఆ సంఘటన తర్వాత మలయాళ పరిశ్రమలో మహిళలపై వేధింపులకు సంబంధించి నివేదిక ఇవ్వాలని 2019లో అప్పటి ప్రభుత్వం జస్టిస్ హేమ కమిటీని ఏర్పాటు చేసింది. మాజీ హైకోర్టు న్యాయమూర్తి కే.హేమ ఈ కమిటీకి ఛైర్ పర్సన్‌గా ఉన్నారు. సీనియర్ నటి శారద, ఐఏఎస్ అధికారిణి కేబీ వల్సల కుమారి సభ్యులుగా ఉన్నారు. కమిటీ తమ నివేదికను నాలుగేళ్ల క్రితమే ప్రభుత్వానికి సమర్పించినా, సున్నితమైన అంశాలున్నాయనే సాకుతో అందులోని విషయాలు బయటక రాకుండా ఇన్నాళ్లూ ప్రభుత్వం తొక్కిపట్టింది. సమాచార హక్కు చట్టం కింద బయటకు వచ్చిన ఈ నివేదికలో పలు విస్తుగొలిపే విషయాలు బయటకు వచ్చాయి. నివేదిక ఇచ్చి నాలుగేళ్లయినా చర్యలు శూన్యమన్న ప్రతిపక్షాల విమర్శల నేపథ్యంలో కమిటీ సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. మహిళలపై వేధింపులను అడ్డుకునేందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకొస్తామని హామీనిచ్చారు. ఈ మేరకు ఓ స్పెషల్ కమిటీని కేరళ ప్రభుత్వం నియమించింది. ఈ స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)కు ఓ ఐ.ఏ.ఎస్ అధికారిణి ప్రాతినిధ్యం వహిస్తారు.



షార్క్ దాడిలో కాలు పోగొట్టుకొన్నా..!

పారిస్: షార్క్ దాడిలో కాలు కోల్పోయిన అమెరికా స్విమ్మర్ అలీ ట్రూవిట్ పారిస్ పారాలింపిక్స్‌లో సత్తాచాటేందుకు సిద్ధమైంది. 100 మీటర్లు, 400 మీటర్ల ఫ్రీస్టైల్‌తోపాటు 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో పారిస్ క్రీడలకు ట్రూవిట్ అర్హత సాధించింది. గతేడాది మే 24న సముద్రంలో ఈత కొడుతుండగా.. షార్క్ చేప భయానక దాడిలో ఆమె త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడింది. కానీ, తీవ్ర గాయాలవడంతో ఎడమ మోకాలి కింది భాగాన్ని కోల్పోవాల్సి వచ్చింది. క్రమంగా కోలుకొన్న ట్రూవిట్ మళ్లీ ప్రాక్టీస్ చేసి పారాలింపిక్స్‌కు క్వాలిఫై అయింది. తనలాంటి వారిలో మనోధైర్యం నింపడం కోసం ఓ స్వచ్ఛంద సంస్థను కూడా ఏర్పాటు చేసింది.

జూ.క్రికెట్‌లో ప్రైజ్‌మనీ

న్యూఢిల్లీ: దేశవాళీ క్రికెట్‌కు సంబంధించి బీసీసీఐ మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై మహిళలు, జూనియర్ క్రికెట్ పోటీలలో ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్, ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్ అవార్డు విజేతలకు నగదు ప్రోత్సాహకాలు అందజేయనున్నట్టు బీసీసీఐ కార్యదర్శి జై షా తెలిపాడు. ఈమేరకు విజయ్ మర్చంట్, కూచ్ బిహార్, సీకే నాయుడు టోర్నీల్లో ఆడే క్రికెటర్లకు లబ్ధి చేకూరనుంది.

జ్వెరెవ్, స్విటోలినా శుభారంభం

సక్కారి, థీమ్ అవుట్ | యూఎస్ ఓపెన్



న్యూయార్క్: యూఎస్ ఓపెన్‌లో అలెగ్జాండర్ జ్వెరెవ్, కసట్‌కినా, స్విటోలినా శుభారంభం చేయగా.. 9వ సీడ్ మరియా సక్కారి తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టింది. సోమవారం జరిగిన మొదటి రౌండ్‌లో ఏడో సీడ్ క్విన్వెన్ జాంగ్ (చైనా) 4-6, 6-4, 6-2తో అనిసిమోవా (అమెరికా)పై, 12వ సీడ్ డారియ కసట్‌కినా (రష్యా) 6-2, 6-4తో జాక్వెలిన్ (రొమేనియా)పై, 24వ సీడ్ డోనా వికిక్ (క్రొయేషియా) 6-4, 6-4తో కింబర్లీ బిరెల్ (ఆస్ట్రేలియా)పై, ఎరికా ఆండ్రీవ 6-3, 7-6(7)తో యు యువాన్‌పై, ఉక్రెయిన్ భామ స్విటోలినా 3-6, 6-3, 6-4తో మారియా కరిపై గెలిచి ముందంజ వేశారు. కాగా, 2-6తో తొలి సెట్‌ను కోల్పోయిన 9వ సీడ్ మరియా సక్కారి.. ప్రత్యర్థి వాంగ్ యఫాన్‌కు వాకోవర్ ఇచ్చింది. పురుషుల సింగిల్స్‌లో 4వ సీడ్ జ్వెరెవ్ (జర్మనీ) 6-2, 6-7(5), 6-3, 6-2తో మాక్సిమిలన్‌ను, ఫ్రాన్స్ ఆటగాడు యుగో హంబర్ట్ 6-3, 6-4, 6-4తో థియాగో (బ్రెజిల్)ను ఓడించారు. అయితే, డొమినిక్ థీమ్ (ఆస్ట్రియా) 4-6, 2-6, 2-6తో బెన్ షెల్టన్ (అమెరికా) చేతిలో కంగుతిన్నాడు.

పారిస్‌లో తెలుగు యోధులు

రేపటి నుంచే పారాలింపిక్స్

వైకల్యం వెక్కిరించినా కుంగిపోకుండా.. కాలం నేర్పిన గుణపాఠాలను సవాల్‌గా తీసుకొని.. అవరోధాలను అనుకూలంగా మార్చుకున్న పోరాట యోధులు వీళ్లు. ప్రోత్సాహం అంతగా లేకున్నా, అందుబాటులో ఉన్న వనరులను అందిపుచ్చుకొని తమ క్రీడల్లో సత్తా చాటిన విజేతలు వీళ్లు. ఇప్పుడదే ఆటల్లో దేశం తరపున పారాలింపిక్స్‌లో పతకాలు సాధించేందుకు సిద్ధమయ్యారు మన క్రీడాకారులు. పారిస్‌లో పోడియంపై నిల్చొని, జాతీయ పతాకాన్ని రెపరెపలాడించగలరన్న అంచనాలున్న ఈ తెలుగు వెలుగులపై ఓ లుక్కేద్దాం.



రవి

గౌరవం కోసం పోరాటం

అనకాపల్లి కె. కోటపాడుకు చెందిన షాట్‌పుట్ క్రీడాకారుడు రొంగలి రవి పుట్టుకతోనే మరుగుజ్జు. తన ఎత్తును చూసి మిత్రులతో పాటు చుట్టుపక్కల వాళ్లు గేలిచేసినా ఏనాడూ కుంగిపోలేదు. తాను ఏదైనా సాధిస్తే, ఇవాళ వెక్కిరించిన వాళ్లే రేపు గౌరవిస్తారని చిన్నతనంలోనే దృఢంగా నిశ్చయించుకున్న రవి.. చదువుతో పాటు ఆటల్లోనూ తనదైన ప్రతిభ చూపేవాడు. చిన్నప్పుడు ప్రభుత్వ హాస్టల్‌లో ఉండి చదువుకునే టప్పుడే తనకిష్టమైన షాట్‌పుట్ క్రీడను కెరీర్‌గా ఎంచుకున్నాడు. అనతికాలంలోనే అందులో రాటుదేలిన రవి.. ఈ ఏడాది పారిస్ క్రీడలకు ఎంపికై పారాలింపిక్స్‌కు అర్హత సాధించిన తొలి భారత షాట్‌పుట్ క్రీడాకారునిగా రికార్డు సృష్టించాడు. తన ఈవెంట్‌లో ప్రస్తుతం ప్రపంచ ఐదో ర్యాంకర్‌గా కొనసాగుతున్న రవి.. నిరుడు పారా ఆసియా క్రీడల్లో రజతం నెగ్గి అదరగొట్టాడు. బెంగళూరు సాయ్ కేంద్రంలో శిక్షణ తీసుకొన్న రవి.. ఇప్పుడు పారాలింపిక్స్‌లో ఏకంగా స్వర్ణమే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నాడు.



రిసెప్షనిస్టుగా మొదలై...

నంద్యాలకు చెందిన సైక్లిస్ట్ షేక్ అర్షద్ మొదట తైక్వాండో క్రీడాకారుడు. అయితే, పన్నెండేళ్ల వయసులో ఉన్నప్పుడు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎడమకాలిని మోకాలి దాకా కోల్పోయాడు. అయినా, ఓవైపు చదువు కొనసాగిస్తూనే, పారా క్రీడలపై దృష్టి సారించాడు. వైద్యుడు రవికృష్ణ ప్రోత్సాహంతో ఆర్చరీ, పర్వతారోహణ, ట్రయాథ్లాన్ లాంటి ఈవెంట్లలో జాతీయస్థాయిలో రాణించి పతకాలు కొల్లగొట్టాడు. ఈ క్రమంలో ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవడంతో కొన్నాళ్లు ఆసుపత్రిలో రిసెప్షనిస్టుగా పనిచేశాడు. అనంతరం ఆదిత్య మెహతా ఫౌండేషన్ సహకారంతో సైక్లింగ్ క్రీడను కెరీర్‌గా ఎంచుకొన్న అర్షద్.. ఇప్పటిదాకా నాలుగు ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో పాల్గొని స్వర్ణ పతకాలు సాధించాడు. సైక్లింగ్‌లో పారాలింపిక్స్‌కు ఎంపికైన తొలి భారత ఆటగాడిగా నిలిచిన 31 ఏళ్ల అర్షద్.. పారిస్ క్రీడల్లో పతకం నెగ్గాలన్న కసితో గతనెలలో లద్దాఖ్‌లో అత్యంత కఠినమైన హై ఆల్టిట్యూడ్ శిక్షణ తీసుకున్నాడు. పారాలింపిక్స్ సైక్లింగ్‌లో నాలుగు విభాగాల్లో పోటీపడుతున్న అర్షద్.. కచ్చితంగా పతకంతో తిరిగొస్తానని చెబుతున్నాడు.

పేదరికం నుంచి..



వరంగల్ జిల్లా కల్లెడ గ్రామానికి చెందిన జీవాంజి దీప్తికి పుట్టుకతోనే మానసిక వైకల్యం. బంధువులు, ఇరుగు పొరుగు వారి నుంచి హేళనలు. వీటికి తోడు పేదరికం. అయినా, అన్ని అడ్డంకులను అధిగమించి పరుగునే ఊపిరిగా చేసుకుంది. అంతర్జాతీయస్థాయిలో పతకాలు సాధించాలన్న లక్ష్యంతో ముందుకు సాగింది. అథ్లెటిక్స్ కోచ్ నాగపురి రమేశ్ శిక్షణలో రాటుదేలింది. కెరీర్ ఆరంభంలో కూతురి వైద్యం, శిక్షణ కోసం తమకున్న ఎకరం భూమిని అమ్మిన దీప్తి తల్లిదండ్రులు.. ఆమెకు వెన్నుదన్నుగా నిలిచారు. గతేడాది పారా ఆసియా క్రీడల్లో రికార్డు ప్రదర్శనతో పసిడి నెగ్గిన దీప్తి.. పారా వరల్డ్ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది. ఇప్పుడు పారాలింపిక్స్‌లో పతకం నెగ్గాలన్న పట్టుదలతో పారిస్‌లో అడుగుపెట్టింది. 400 మీటర్ల టీ20 రేసులో పోటీపడుతున్న దీప్తికి పతకం గెలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

ఆర్మీ విధుల్లో కాలు పోయినా..



కబడ్డీ ప్లేయర్‌గా జూనియర్ విభాగంలో జాతీయ స్థాయిలో రాణించిన నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన కొంగనపల్లి నారాయణ.. దేశానికి సేవ చేయాలన్న లక్ష్యంతో 17 ఏళ్ల వయసులో ఆర్మీలో చేరాడు. జమ్మూలోని ఎల్ఓసీ వద్ద విధులు నిర్వర్తిస్తుండగా మందుపాతర పేలి ఒక కాలు పోగొట్టుకున్నాడు. మానసికంగా, శారీరకంగా తీవ్రంగా కుంగిపోయిన దశలో కల్నల్ గౌరవ్ దత్‌తో ఏర్పడిన పరిచయం నారాయణ జీవితాన్ని మార్చేసింది. పుణె వెళ్లి కృత్రిమ కాలు అమర్చుకున్న నారాయణ.. గౌరవ్ సహకారంతో పారా క్రీడలను కెరీర్‌గా ఎంచుకున్నాడు. మొదట జావెలిన్‌లో ప్రయత్నించినా.. పరిగెత్తడం కష్టమని భావించి ఆ తర్వాత రోయింగ్‌కు మారాడు. జాతీయస్థాయిలో ఎన్నో పతకాలు నెగ్గిన అతడు.. గతేడాది పారా ఆసియా క్రీడల్లో మిక్స్‌డ్ స్కల్ రోయింగ్ విభాగంలో రాజస్థాన్‌కు చెందిన అనితతో కలిసి రజతం సాధించాడు. పారాలింపిక్స్‌లోనూ అనితతో కలిసి బరిలోకి దిగుతున్న నారాయణ.. పీఆర్ మిక్స్‌డ్-3 విభాగంలో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి)

బీసీసీఐ కార్యదర్శిగా రోహన్ జైట్లీ?



న్యూఢిల్లీ: బీసీసీఐ కార్యదర్శి జై షా అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) అధ్యక్ష పదవికి పోటీపడడం దాదాపు ఖాయమైంది. ఈనేపథ్యంలో ఖాళీ అవనున్న బీసీసీఐ కార్యదర్శి పదవి ఎవరికి దక్కుతుందనే చర్చ మొదలైంది. ఢిల్లీ డిస్ట్రిక్ట్ క్రికెట్ సంఘం (డీడీసీఏ) అధ్యక్షుడు రోహన్ జైట్లీ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. బీజేపీ ప్రముఖ నేత, దివంగత ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ కుమారుడే రోహన్. డీడీసీఏ చీఫ్‌గా 14 ఏళ్లు బాధ్యతలు నిర్వర్తించిన అరుణ్ జైట్లీ.. బీసీసీఐ ఉపాధ్యక్షుడిగానూ వ్యవహరించారు.

అక్టోబరు 6న ఇండో-పాక్ పోరు

మహిళల టీ20 ప్రపంచకప్

దుబాయ్: మహిళల టీ20 ప్రపంచకప్ షెడ్యూల్‌ను ఐసీసీ సోమవారం ప్రకటించింది. యూఏఈ వేదికగా అక్టోబరు 3న టోర్నీ మొదలవనుంది. వాస్తవానికి టోర్నీ బంగ్లాదేశ్‌లో జరగాలి. కానీ, ఆ దేశంలో రాజకీయ అనిశ్చితి నెలకొన్న కారణంగా టోర్నీ వేదికను యూఏఈకి తరలించారు. టోర్నీలోని మొత్తం 23 మ్యాచ్‌లకు దుబాయ్, షార్జాను వేదికలుగా నిర్ణయించారు. పది జట్లు రెండు గ్రూపులుగా విడిపోయి తలపడతాయి. గ్రూపులో తొలి రెండుస్థానాల్లో నిలిచిన జట్లు సెమీస్ చేరతాయి. గ్రూప్-ఎ నుంచి భారత్, డిఫెండింగ్ చాంప్ ఆస్ట్రేలియా, పాకిస్థాన్, న్యూజిలాండ్, శ్రీలంక ఉండగా.. గ్రూప్-బి నుంచి దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్, స్కాట్లాండ్ పోటీపడుతున్నాయి. భారత్ తొలి మ్యాచ్‌ను అక్టోబరు 4న న్యూజిలాండ్‌తో దుబాయ్‌లో ఆడనుంది. ఇక, టోర్నీకే హైలైట్‌గా నిలిచే భారత్, పాకిస్థాన్ మధ్య మ్యాచ్ అక్టోబరు 6న దుబాయ్‌లోనే జరగనుంది. ఆ తర్వాత 9న శ్రీలంకతో, 13న ఆస్ట్రేలియాతో భారత్ తలపడనుంది. అక్టోబరు 17, 18న దుబాయ్, షార్జా వేదికలుగా సెమీఫైనల్స్ జరుగుతాయి. అక్టోబరు 20న జరిగే ఫైనల్‌కు దుబాయ్ ఆతిథ్యమివ్వనుంది.

ప్రణయ్‌కు చికున్ గున్యా

న్యూఢిల్లీ: సీనియర్ షట్లర్ హెచ్ఎస్ ప్రణయ్ చికున్ గున్యా బారినపడ్డాడు. దాని నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో బ్యాడ్మింటన్ నుంచి విరామం తీసుకుంటున్నట్టు అతడు సోమవారం ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. ప్రణయ్‌కు పారిస్ ఒలింపిక్స్‌కు ముందు చికున్ గున్యా సోకింది. అయినా విశ్వక్రీడల్లో పాల్గొన్నా.. ఆ వ్యాధి ప్రభావం ప్రణయ్ ప్రదర్శనపై బాగా పడింది.

పాక్, బంగ్లా పాయింట్లలో కోత

రావల్పిండి: తొలి టెస్ట్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా పాకిస్థాన్, బంగ్లాదేశ్ జట్లకు వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ పాయింట్లలో కోత పడింది. నిర్ణీత సమయానికి ఆరు ఓవర్లు తక్కువగా వేయడంతో పాకిస్థాన్ 6 పాయింట్లు కోల్పోయింది. అలాగే జట్టు ఆటగాళ్లకు 30 శాతం చొప్పున జరిమానా విధించారు. ఇక బంగ్లాదేశ్ మూడు ఓవర్లు తక్కువగా వేయడంతో ఆ జట్టుకు 3 పాయింట్ల కోత పెట్టారు. 15 శాతం జరిమానా కూడా ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ మ్యాచ్‌లో పది వికెట్లతో ఓడిన పాకిస్థాన్.. తొమ్మిది జట్ల టెస్ట్ చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో ఎనిమిదో స్థానానికి పడిపోయింది. బంగ్లాదేశ్ రెండు ర్యాంకులు ఎగబాకి ఆరో స్థానానికి చేరింది.

గృహాల ధరలు మరింత పైకి

ఐదేళ్లలో భారీగా పెరుగుదల ● బెంగళూరులో అత్యధికం ● రెండో స్థానంలో కోకాపేట : అనరాక్



కోకాపేట మరింత కాస్ట్లీ

ఇళ్ల ధరల పెరుగుదలలో హైదరాబాద్ కూడా బెంగళూరుతో పోటీపడుతోంది. హైదరాబాద్‌లోని కోకాపేట ప్రాంతంలో గత ఐదేళ్లలో ఎస్ఎఫ్‌టీ సగటు ధర 89 శాతం పెరిగి రూ.9,000కు చేరింది. నగరంలోని బాచుపల్లి ప్రాంతంలోనూ ప్రస్తుతం రియల్టీ జోరందుకుంది. ఇక్కడ గత ఐదేళ్లలో ఎస్ఎఫ్‌టీ సగటు ధర 57 శాతం పెరిగి ప్రస్తుతం రూ.5,800 పలుకుతోంది. ఇక తెల్లాపూర్ ప్రాంతంలోనూ గత ఐదేళ్లలో నివాస గృహాల ధర సగటు 53 శాతం పెరిగి ప్రస్తుతం రూ.7,350 పలుకుతోంది.

న్యూఢిల్లీ: హైదరాబాద్‌తో సహా దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో నివాస గృహాల ధర చుక్కలంటుతోంది. ఇళ్ల ధరల పెరుగుదలలో బెంగళూరు అగ్రస్థానంలో ఉంది. గత ఐదేళ్ల (2019-24)లో బెంగళూరులోని బాగలూరులో చదరపు అడుగు (ఎస్ఎఫ్‌టీ) సగటు ధర ఏకంగా 90 శాతం పెరిగి రూ.8,151కి చేరింది. ఇదే సమయంలో బెంగళూరు వైట్‌ఫీల్డ్‌లో ఎస్ఎఫ్‌టీ సగటు ధర 80 శాతం పెరిగి ప్రస్తుతం రూ.8,600 పలుకుతోంది. ఇక బెంగళూరుకే చెందిన సర్జాపూర్ రోడ్ ప్రాంతంలో ఎస్ఎఫ్‌టీ సగటు ధర 58% పెరిగి రూ.9,300కు చేరింది. రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ అనరాక్ సోమవారం విడుదల చేసిన ఒక నివేదికలో ఈ విషయం తెలిపింది.

ఇతర నగరాల్లోనూ అదే పరిస్థితి

ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలోని ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే ప్రాంతంలో గత ఐదేళ్లలో నివాస గృహాల ధరలు చుక్కలంటాయి. 2019 డిసెంబరులో ఈ ప్రాంతంలో ఎస్ఎఫ్‌టీ సగటు ధర రూ.5,359 ఉండేది. ఈ ఏడాది జూన్ నెలాఖరుకు అది 79 శాతం పెరిగి రూ.9,600కి చేరింది. గురుగ్రామ్ ప్రాంతంలోనూ గత ఐదేళ్లలో ఎస్ఎఫ్‌టీ సగటు ధర 48 శాతం పెరిగి రూ.9,000కు చేరింది.

ముంబై మెట్రోపాలిటన్ ప్రాంతంలోని పన్వేల్‌లోనూ గత ఐదేళ్లలో ఇళ్ల ధరలు చుక్కలంటాయి. 2019 డిసెంబరులో ఈ ప్రాంతంలో ఎస్ఎఫ్‌టీ సగటు ధర రూ.5,520 ఉండగా ఈ ఏడాది జూన్ నాటికి అది 50 శాతం పెరిగి రూ.8,300కు చేరింది. ఇదే నగరంలోని డోంబివిల్ ప్రాంతంలో ఎస్ఎఫ్‌టీ సగటు ధర గత ఐదేళ్లలో 40 శాతం పెరిగి రూ.9,300కు చేరింది.

కలిసొచ్చిన తొలి త్రైమాసికం

కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సర తొలి త్రైమాసికం రియల్టీ మార్కెట్‌కు బాగా కలిసొచ్చింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో దేశంలోని 8 ప్రధాన నగరాల్లో ఇళ్ల ధరలు సగటున 12 శాతం పెరిగాయి. ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో మాత్రం సగటున 30 శాతం పెరిగినట్టు రియల్టీ రంగానికి ప్రాతినిధ్యం వహించే క్రెడాయ్, కన్సల్టెన్సీ సంస్థలు కోలియర్స్, లియాసెస్ ఒక నివేదికలో తెలిపాయి. ఈ నివేదిక ప్రకారం ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ముంబై మెట్రోపాలిటన్ ప్రాంతంలో ఇళ్ల ధరలు ఎస్ఎఫ్‌టీకి సగటున 6 శాతం పెరిగి రూ.20,275కు చేరాయి. ఇదే సమయంలో హైదరాబాద్‌లోనూ ఎస్ఎఫ్‌టీ సగటు ధర 7 శాతం పెరిగి రూ.11,290కి చేరింది.

బిజినెస్

ఆఫర్ లెటర్స్ ఇచ్చిన అందరికీ కొలువులు పక్కా..

చేరే తేదీలు మాత్రమే మారుతాయ్..

ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్



న్యూఢిల్లీ: ఆఫర్ లెటర్స్ ఇచ్చిన ఫ్రెషర్స్ అందరినీ ఉద్యోగాల్లోకి తీసుకుంటామని, ఈ విషయంలో వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని దేశీయ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్ ప్రకటించారు. ఆఫర్ లెటర్స్ ఉన్న 2022-23 బ్యాచ్‌కు చెందిన దాదాపు 2,000 మంది తాజా ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లను కంపెనీ ఇప్పటివరకు ఉద్యోగాల్లోకి తీసుకోకుండా ఆలస్యం చేస్తోంది. ఈ నేపథ్యంలో పరేఖ్ ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం. వీరు ఉద్యోగాల్లో చేరే తేదీలు మాత్రమే మారుతాయే తప్ప.. వారందరినీ ఉద్యోగాల్లోకి తీసుకోవడం మాత్రం ఖాయమని ఆయన స్పష్టం చేశారు. 'మా కంపెనీ నుంచి ఆఫర్ లెటర్స్ అందుకున్న ప్రతి ఒక్కరూ ఉద్యోగాల్లో చేరతారు. కాకపోతే వారు ఉద్యోగాల్లో చేరే తేదీలు మాత్రమే మారుతాయి. అంతకు మించి మా వైఖరిలో ఎలాంటి మార్పు లేదు' అని పరేఖ్ తెలిపారు.

ఇదే కారణమా?

ఇటీవల ఐటీ ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహించే నాస్సెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయీస్ సెనెట్ (ఎన్ఐటీఈఎస్) దీనిపై కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన మంత్రిత్వ శాఖకు ఫిర్యాదు కూడా చేసింది. ఈ నేపథ్యంలో ఇన్ఫోసిస్ సీఈఓ వీరందరినీ ఉద్యోగాల్లోకి తీసుకుంటామని ప్రకటించడం విశేషం. ఈ సంవత్సరం కొత్తగా మరో 15,000 నుంచి 20,000 మంది ఫ్రెషర్స్‌ను ఉద్యోగాల్లోకి తీసుకుంటామని కంపెనీ సీఎఫ్ఓ జయేశ్ సంఘ్రాజ్‌కా ఇటీవల చెప్పారు. అయితే ఇది కంపెనీ వృద్ధి అవకాశాల అవసరాలను బట్టి ఉంటుందన్నారు.

దేశంలోనూ అద్భుత అవకాశాలు

కంపెనీ అభివృద్ధికి మన దేశంలోనే అద్భుత అవకాశాలు ఉన్నట్టు సలీల్ పరేఖ్ చెప్పారు. మన ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతున్నంత వేగంగా మరే పెద్ద ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందడం లేదన్నారు. డిజిటల్ ఇండియా పథకం కూడా ముందు ముందు కంపెనీ వ్యాపార అభివృద్ధికి అద్భుత అవకాశమన్నారు. ఐటీ రిటర్న్‌ల ఫైలింగ్ కోసం తాము అభివృద్ధి చేసిన పోర్టల్‌కు అద్భుతమైన స్పందన వస్తోందన్నారు.

మెడ్‌ప్లస్ హెల్త్‌కు వార్‌బర్గ్ గుడ్‌బై

హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్‌కు ప్రముఖ పీఈ సంస్థ వార్‌బర్గ్ పింకస్ గుడ్‌బై చెప్పింది. సోమవారం ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా కంపెనీ ఈక్విటీలో తనకు ఉన్న 11.35 శాతం (1.35 కోట్ల షేర్లు) వాటాను రూ.836 కోట్లకు విక్రయించింది. మారిషస్ కేంద్రంగా పనిచేసే వార్‌బర్గ్ పింకస్ అనుబంధ సంస్థ లావెండర్ రోజ్ ఇన్వెస్ట్‌మెంట్ లిమిటెడ్ ఈ షేర్లను విక్రయించింది. ఒక్కో షేరును రూ.616.48 చొప్పున విక్రయించింది. కాగా సింగపూర్ ప్రభుత్వం, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్ ఈ షేర్లను కొనుగోలు చేశాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,000 ▼	66,900 ▼	92,800 ▼
ముంబై	72,042 ▲	65,991 ▲	86,191 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

27 వ తేదీ			
హైదరాబాద్	450	విజయవాడ	485
వరంగల్	452	గోదావరి	485
చిత్తూరు	508	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**

హైదరాబాద్	109	విజయవాడ	113
వరంగల్	109	గుంటూరు	110
కరీంనగర్	109	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	109	చిత్తూరు	95
కర్నూలు	109	నెల్లూరు	95
విశాఖపట్నం	109	అనంతపురం	110
గోదావరి	113		

మార్కెట్లలో ఫెడ్ జోష్



బజార్ స్టైల్ షేరు ధర శ్రేణి రూ.370-389

త్వరలో ఇష్యూకి రానున్న వాల్యూ ఫ్యాషన్ రిటైలర్ బజార్ స్టైల్ రిటైల్ లిమిటెడ్ షేరు ధర శ్రేణిని కనిష్ఠంగా రూ.370, గరిష్ఠంగా రూ.389గా ప్రకటించింది. ఈ ఇష్యూ ద్వారా రూ.835 కోట్లు సేకరించాలని కంపెనీ భావిస్తోంది. ఈ ఐపీఓ ఆగస్టు 30న (శుక్రవారం) ప్రారంభమై సెప్టెంబరు 3వ తేదీన (వచ్చే మంగళవారం) ముగుస్తుంది.

కొనసాగిన ర్యాలీ
సెన్సెక్స్ 612 పాయింట్లు అప్

ముంబై: అమెరికా ఫెడరల్ రిజర్వ్ త్వరలో వడ్డీ రేట్ల తగ్గింపు ప్రారంభించనుందన్న ఆశలతో స్టాక్ మార్కెట్ ర్యాలీని కొనసాగించింది. మెటల్, ఐటీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ షేర్లలో భారీగా కొనుగోళ్లు జరగడంతో సూచీలు పరుగులు తీశాయి. మార్కెట్లోకి విదేశీ నిధుల రాక తిరిగి ప్రారంభం కావడం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఆర్ఐఎల్ వంటి అగ్రగామి షేర్లలో కొనుగోళ్లు మార్కెట్ సెంటిమెంట్‌ను బలోపేతం చేశాయి. ఫలితంగా సెన్సెక్స్ 738.06 పాయింట్లు దూసుకుపోయి 81,824.27 పాయింట్ల ఇంట్రాడే గరిష్ఠ స్థాయిని నమోదు చేసింది. చివరికి 611.90 పాయింట్ల లాభంతో 81,698.11 వద్ద ముగిసింది. నిఫ్టీ 187.45 పాయింట్ల లాభంతో 25,010.60 వద్ద ముగిసింది. సెన్సెక్స్ లాభపడడం వరుసగా ఇది ఐదో రోజు. కాగా నిఫ్టీకి వరుసగా ఎనిమిదో రోజు. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.66 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.20 శాతం లాభపడ్డాయి. టెలికమ్యూనికేషన్స్ సర్వీసెస్ సూచీలు మినహా మిగతా విభాగాల వారీ సూచీలన్నీ లాభాల్లో ముగిశాయి.

ఇంటరార్క్ లిస్టింగ్ జోరు: నిర్మాణ రంగానికి అవసరమైన ఉత్పత్తులందించే ఇంటరార్క్ బిల్డింగ్ ప్రొడక్ట్స్ షేరు లిస్టింగ్ రోజున 34 శాతం ప్రీమియంతో ముగిసింది. రూ.900 ధరతో ఈ కంపెనీ ఇష్యూకి రాగా బీఎస్ఈలో సోమవారం 43.46 శాతం ప్రీమియంతో రూ.1,291.20 వద్ద లిస్టింగ్ అయింది. ఇంట్రాడేలో రూ.1,316 స్థాయిని తాకిన ఈ షేరు చివరికి 32.93 శాతం లాభంతో రూ.1196.45 వద్ద పటిష్ఠంగా క్లోజైంది. ఎన్ఎస్ఈలో కూడా ఇదే ధోరణిలో ట్రేడయిన ఈ షేరు చివరికి 33.67 శాతం లాభంతో రూ.1203.10 వద్ద ముగిసింది.

రామ్ ఇన్ఫో నుంచి కిసాన్ డ్రోన్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): టెక్నాలజీ సర్వీసులు అందించే రామ్ ఇన్ఫో రైతుల కోసం కిసాన్ డ్రోన్స్ పేరిట డ్రోన్ యాజ్ ఏ సర్వీస్‌ను ప్రారంభించింది. రాబోయే రెండేళ్లలో ఇలాంటివి 100 స్టోర్లు ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించింది. ఫీల్డ్ మ్యాపింగ్, ఎరువులు చల్లడం సహా వ్యవసాయ క్షేత్రాల్లో విభిన్న కార్యకలాపాలకు విస్తృతంగా డ్రోన్లను ప్రవేశపెట్టనున్నట్టు తెలిపింది. గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయదారులే కిసాన్ డ్రోన్ కార్యక్రమం లక్ష్యమని రామ్ ఇన్ఫో ఎండీ ఎల్ శ్రీనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులకు డ్రోన్లు అందుబాటులో ఉండడంతో పాటు వాటి సర్వీసింగ్, కొత్త డ్రోన్ పైలట్ల శిక్షణ వంటి కార్యక్రమాలు కూడా అమలులో ఉంటాయని అన్నారు.

తెలంగాణలో మరింత పటిష్ఠంగా నెట్‌వర్క్:వీఐ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్):వొడాఫోన్ ఐడియా (వీఐ).. తెలంగాణలో తన నెట్‌వర్క్ మౌలిక సదుపాయాల సామర్థ్యాన్ని మరింత విస్తరించింది. ఇందుకోసం 2500 మెగాహెట్జ్ బ్యాండ్‌లో స్పెక్ట్రమ్‌ను 10 మెగాహెట్జ్ నుంచి 20 మెగాహెట్జ్‌కు అప్‌గ్రేడ్ చేసింది. దీంతో రాష్ట్రంలోని 4,000కుపైగా సైట్ల ప్రాంతాల్లో డేటా స్పీడ్, కవరేజీ రెట్టింపవుతుందని తెలిపింది. ఇటీవల జరిగిన వేలంలో 900 మెగాహెట్జ్ బ్యాండ్‌లో కొనుగోలు చేసిన 2.4 మెగాహెట్జ్ స్పెక్ట్రమ్ సాయంతో తెలంగాణలో నెట్‌వర్క్ సామర్థ్యాన్ని మరింత విస్తరిస్తామని కంపెనీ ఏపీ, తెలంగాణ క్లస్టర్ హెడ్ ఆనంద్ డానీ తెలిపారు.

బ్యాంకు ఖాతా ఉంటేనే జీఎస్‌టీఆర్-1 ఫైలింగ్

సెప్టెంబరు 1 నుంచి అమలు

న్యూఢిల్లీ: జీఎస్‌టీ మోసాలను అరికట్టేందుకు జీఎస్‌టీ నెట్‌వర్క్ (జీఎస్‌టీఎన్) మరో కీలక చర్య తీసుకుంది. చలామణిలో ఉన్న బ్యాంకు ఖాతా వివరాలు నమోదు చేస్తేనే ఇక బయటికి పంపే సరుకులు/సేవల వివరాలతో కూడిన జీఎస్‌టీఆర్-1 రిటర్న్‌లను స్వీకరిస్తామని ప్రకటించింది. వచ్చే నెల 1 నుంచే ఈ కొత్త నిబంధన అమల్లోకి రానుంది. అంటే ఇక ఈ రిటర్న్ ఫైల్ చేసే వ్యాపారులు, సంస్థలు చలామణిలో ఉన్న తమ బ్యాంకు ఖాతా వివరాలను జీఎస్‌టీ పోర్టల్‌లో నమోదు చేయాలి. అప్పుడు మాత్రమే జీఎస్‌టీ పోర్టల్ జీఎస్‌టీఆర్-1 రిటర్న్‌ను స్వీకరిస్తుంది. జీఎస్‌టీ రూల్ 10ఏ ప్రకారం జీఎస్‌టీ కింద నమోదైన సంస్థలు, వ్యక్తులు నెల రోజుల్లోగా తమ బ్యాంకు ఖాతా వివరాలు లేదా బయటికి పంపే వస్తు, సేవల వివరాలను జీఎస్‌టీఆర్-1 లేదా ఇన్వాయిస్ ఫర్నీషింగ్ ఫెసిలిటీ (ఐఎఫ్ఎఫ్) ద్వారా జీఎస్‌టీ నెట్‌వర్క్‌కు తెలియజేయాలి. గత ఏడాది జూలైలో జరిగిన జీఎస్‌టీ మండలి భేటీ కూడా ఇందుకు ఆమోదం తెలిపింది. దీంతో ఈ నిబంధన అమలు ఈ ఏడాది ఆగస్టు రిటర్న్‌లతోనే ప్రారంభం కానుంది.

పేటీఎం చీఫ్‌కు సెబీ నోటీసులు

న్యూఢిల్లీ: పేటీఎం మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ ఎండీ, సీఈఓ విజయ్ శేఖర్ శర్మకు సెబీ నోటీసులు జారీ చేసింది. కంపెనీ ప్రమోటర్‌గా ఉండి, ఇతర ఉద్యోగుల్లా ఎంప్లాయీ స్టాక్ ఆప్షన్స్ (ఈ-సాప్స్) కింద శర్మ 2.1 కోట్ల షేర్లను కేటాయించుకోవడంపై మార్కెట్ నియంత్రణ మండలి సెబీ ఈ నోటీసులు జారీ చేసింది. అయితే ఇది పాత విషయమేనని, దీనికి సంబంధించి రెగ్యులేటరీ సంస్థలు అన్నిటితో తాము చర్చలు జరుపుతున్నట్టు పేటీఎం తెలిపింది. ఈ వార్తలతో బీఎస్ఈలో కంపెనీ షేర్లు డీలా పడ్డాయి. ఒక దశలో 8.8 శాతం వరకు నష్టపోయి రూ.505.25 స్థాయిని తాకాయి. చివరికి 4.41 శాతం నష్టంతో రూ.530.05 వద్ద ముగిశాయి.

పసిపిల్లల ప్రాణాలతో సర్కారు చెలగాటం

భువనగిరి అంగన్‌వాడీలో కుళ్లిన గుడ్ల పంపిణీపై కేటీఆర్ ట్వీట్



భువనగిరి టౌన్/హైదరాబాద్, ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం ముదిరాజ్ వాడ అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు కుళ్లిన కోడి గుడ్లు పంపిణీ చేయడం దారుణమని, అధికారులు వెంటనే స్పందించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ నెల 22వ తేదీన జరిగిన ఘటనకు సంబంధించి శరత్‌రెడ్డి అనే నెటిజన్ కుళ్లిన కోడిగుడ్డు వీడియోను 'ఎక్స్'లో పోస్టు చేయగా.. దాన్ని కేటీఆర్ సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌ను ట్యాగ్ చేస్తూ.. 'పసిపిల్లల ప్రాణాలతో సర్కారు చెలగాటం' అంటూ రీ ట్వీట్ చేశారు. కాగా, ఈనెల 22వ తేదిన అంగన్‌వాడీ టీచరు సెలవులో ఉండగా ఉడక బెట్టిన గుడ్లలో కుళ్లిన వాటిని గమనించిన ఆయా... వాటిని వెంటనే పారవేసినప్పటికీ, కొందరు ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని భువనగిరి సీడీపీవో(చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్) నర్మద తెలిపారు.

రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

రాష్ట్రంలో డెంగ్యూ మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేరుతున్న వారి సంఖ్య పెరగడంతో పడకలు దొరక్క జనం అవస్థలు పడుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ పరిస్థితిని సీరియస్‌గా పరిగణించి.. రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని సీఎస్ శాంతికుమారికి ఎక్స్ వేదికగా ఆయన విజ్ఞప్తి చేశారు. కాగా, కొండకల్‌లో ఏర్పాటు చేసిన మేధా కోచ్ ఫ్యాక్టరీ ఇప్పుడు వందేభారత్ ట్రైన్ కోచ్‌ల తయారీలో కీలకంగా మారిందని కేటీఆర్ తెలిపారు. మన రాష్ట్రానికి చెందిన ఫ్యాక్టరీ విజయవంతంగా ప్రయాణం సాగించడం అందరికీ గర్వ కారణమని పేర్కొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడిగుడ్ల పంపిణీపై ఎక్స్‌లో కేటీఆర్ చేసిన పోస్టు

కేటీఆర్ ట్వీట్ బాధ్యతారాహిత్యం: సీతక్క

భువనగిరి ఘటనపై ఆరోజే చర్యలు తీసుకున్నాం

తెలుసుకోకుండా ట్వీట్ చేయడం సరైంది కాదు



హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): భువనగిరి ఘటనలో వాస్తవాలను తెలుసుకోకుండా కేటీఆర్ ట్వీట్ చేయడం బాధ్యతారాహిత్యమని మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ముదిరాజ్‌వాడ అంగన్‌వాడీ కేంద్రం నుంచి పాడైపోయిన గుడ్లు సరఫరా అయిందని, దానిపై సంబంధిత కలెక్టర్ చర్యలు తీసుకోవాలంటూ కేటీఆర్ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేయడంపై ఆమె తీవ్రంగా మండిపడ్డారు. ఈ నెల 22న ఘటన జరుగగా... అదే రోజు చర్యలు తీసుకున్నామని కానీ ఆ విషయాన్ని తెలుసుకోకుండా కేటీఆర్ ట్వీట్ చేయడం సమంజసంకాదన్నారు. విషయం తెలిసిన వెంటనే అదే రోజు మహిళా, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిణితో విచారణ చేయించి, సంబంధిత కోడి గుడ్ల కాంట్రాక్టర్, సెక్టార్ సూపర్‌వైజర్, టీచర్‌తో పాటు ఆయాకు మెమో జారీ చేశామని తెలిపారు. ఈ విషయంపై ఆగస్టు 23న సెక్టార్ సూపర్‌వైజర్ ఆర్. నర్మద, టీచర్ స్వరూపారాణి, హెల్పర్ అరుణలు పాడైపోయిన గుడ్ల సరఫరాకు సంబంధించి లిఖిత పూర్వక వివరణ ఇచ్చారని, అయితే వారి వివరణ సరిగా లేకపోవడంతో, బాధ్యులను సస్పెండ్ చేసేందుకు అవసరమైన ప్రక్రియను 24 గంటల్లోపే జిల్లా అధికారులు ప్రారంభించారని తెలిపారు ఇలాంటి ఘటనలు మరెక్కడా జరగకుండా అంగన్ వాడీ సెక్టార్ సూపర్ వైజర్లకు కీలక ఆదేశాలు జారి చేసినట్టు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రతిరోజూ 18 లక్షలకు పైగా గుడ్లు సరాఫరా అవుతున్నాయని, ఏ చిన్న సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.



ఖమ్మం, మహబూబాబాద్ జేఎన్‌టీయూ కాలేజీల్లో నిండని సీట్లు

- రెండు కాలేజీల్లో సరైన వసతుల్లేక విద్యార్థుల్లో అనాసక్తి
- కౌన్సెలింగ్‌లో సీటు వచ్చినా కాలేజీల్లో పరిస్థితులను చూసి వేరే కాలేజీల వైపు మొగ్గు.. భారీగా సీట్లు ఖాళీ
- ఏడాది క్రితం ఆర్భాటంగా ఈ రెండు కాలేజీల ప్రారంభం
- తాత్కాలిక భవనాల్లో, తాత్కాలిక సిబ్బందితో తరగతులు

ఖమ్మం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జేఎన్‌టీయూ కాలేజీలో ఇంజనీరింగ్ సీటంటే ఏ విద్యార్థైనా ఎగిరి గంతేస్తాడు. కానీ, ఖమ్మం జిల్లా పాలేరు, మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన జేఎన్‌టీయూ కాలేజీల పరిస్థితి మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది. కౌన్సెలింగ్ సమయంలో ఈ కాలేజీలకు వెబ్ ఆప్షన్లు పెట్టి, సీట్లు పొందిన విద్యార్థులు, ఆయా కాలేజీలకు వెళ్లాక అక్కడి పరిస్థితులను చూసి మనసు మార్చుకుంటున్నారు. తర్వాతి దశల కౌన్సెలింగ్‌లో వేరే కాలేజీలను ఎంచుకుంటున్నారు. ఈ రెండు కాలేజీల్లో సరైన వసతులు లేకపోవడమే ఇందుకు కారణం. గత ప్రభుత్వ హయాంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు, ఎంసెట్ చివరి విడత కౌన్సెలింగ్ జరుగుతున్న సమయంలో ఈ రెండు కాలేజీలను ప్రారంభించారు. శాశ్వత భవనాలను ఏర్పాటు చేయలేదు. నిధులను కూడా కేటాయించలేదు. ఖమ్మం జిల్లా కేంద్రానికి మంజూరైన ఇంజనీరింగ్ కాలేజీని పాలేరు నియోజకవర్గ పరిధిలోని ఐటీడీఏ ఒకేషనల్ భవనంలో, మహబూబాబాద్ కాలేజీని అక్కడి పాత కలెక్టరేట్ భవనంలో ఏర్పాటు చేశారు. అప్పటికే ఎంసెట్ 3విడతల కౌన్సెలింగ్ పూర్తి కావడంతో నాలుగో విడత స్పెషల్ కౌన్సెలింగ్‌లో సీఎస్‌ఈ, డేటా సైన్స్ కోర్సులను మాత్రమే ప్రారంభించారు. పాలేరులో 48మంది, మహబూబాబాద్‌లో 42మందితో విద్యాసంవత్సరం ప్రారంభించారు. తాత్కాలిక సిబ్బందితోనే విద్యాబోధన జరుగుతోంది.

రెండు కాలేజీల్లోనూ వందకు పైగా సీట్లు ఖాళీ

ఈ ఏడాది ఈ రెండు కాలేజీల్లోనూ కోర్సులను పెంచారు. పాలేరు జేఎన్‌టీయూలో మొదటి విడత కౌన్సెలింగ్‌లో సీఎస్‌ఈలో 66 సీట్లకు 66 మంది, ఈసీఈలో 66కి 60మంది, డేటాసైన్స్‌లో 66 సీట్లకు 65, ట్రిపుల్ ఈలో 66కి 28మంది, మెకానికల్‌లో 66కి 11మంది చొప్పున మొత్తం 330సీట్లకు గాను 230మంది సీట్లు పొందారు. అయితే సీట్లు పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రిపోర్టింగ్ కోసం కాలేజీలకు వచ్చాక సరైన సౌకర్యాలు, పర్మినెంట్ ఫ్యాకల్టీ, ల్యాబులు లేవని తెలుసుకొని తర్వాతి దశల కౌన్సెలింగ్‌లో వేరే కాలేజీలను ఎంచుకున్నారు. దీంతో ఈ కాలేజీలో 143 మంది మాత్రమే చేరారు. మహబూబాబాద్ కాలేజీలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. నాలుగు కోర్సుల్లో మొత్తం 260 సీట్లకు గాను 126 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి.

బీసీ బిల్లుకు అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలి

- అణచివేత, వివక్షకు వ్యతిరేకంగా సంఘటితంగా పోరాడాలి: ఆర్.కృష్ణయ్య

కడ్తాల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి చట్టసభలలో 50% రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. కడ్తాల మండలం మైసిగండి గ్రామంలో సోమవారం రాష్ట్ర స్థాయి బీసీల సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీ బిల్లుకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించాలని కోరారు. బీసీల అభివృద్ధికి ఏటా బడ్జెట్‌లో 2వేల కోట్ల నిధుల కోసం దేశవ్యాప్తంగా ఉద్యమం చేపడుతామని తెలిపారు. బీసీలకు జాతీయ స్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలు చేయాలని, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పా టు చేయాలని డిమాండ్ చేశారు. బీసీల విద్య, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్లపై ఉన్న క్రీమిలేయర్‌ను తొలగించాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీ వ్యతిరేక విధానాలు విడనాడి అభివృద్ధికి కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు. అణచివేత, దోపిడి, వివక్ష, అన్యాయాలను ఎదురించడానికి బీసీలు సంఘటిత శక్తిగా ముందుకు సాగాల్సిన అవసరముందన్నారు.

తక్కెళ్లపల్లి బేషరతుగా క్షమాపణ చెప్పాలి

- సీఎంపై అక్కసుతోనే అనుచిత వ్యాఖ్యలు: కాంగ్రెస్

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 26: సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావుపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కాంగ్రెస్ పార్టీ అర్బన్ కమిటీ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిపై అక్కసుతో అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికైనా రవీందర్‌రావు చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని, ముఖ్యమంత్రికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

రాహుల్ ఇంటి ముందు యూట్యూబర్ల నిరసన

న్యూఢిల్లీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇంటి ముందు తెలంగాణకు చెందిన కొంతమంది యూట్యూబర్లు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో మహిళా యూట్యూబర్లపై జరిగిన దాడిని ఖండిస్తూ యూట్యూబర్లు లింగస్వామి, ప్రభాకర్, శంకర్, ప్రవీణ్ తదితరులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. రైతు రుణమాఫీ, రైతుబంధు గురించి గ్రౌండ్ రిపోర్టింగ్ చేయడానికి వెళ్లిన మహిళా యూట్యూబర్లపై దాడులు దారుణమని.. ప్రజా సమస్యలపై రిపోర్టింగ్ చేసే వారిపై దాడులు చేయడం సరికాదని అన్నారు.

స్పీకర్ 'ఎక్స్' ఖాతా హ్యాక్.. సరిచేసిన టీమ్

హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ 'ఎక్స్' ఖాతా సోమవారం కొద్దిసేపు హ్యాక్ అయింది. ఈ నేపథ్యంలోనే హ్యాకర్లు.. కొన్ని వీడియోలు, పోస్టులు పెట్టారు. దీన్ని గమనించిన స్పీకర్ టెక్నికల్ టీమ్.. వెంటనే ఖాతాను హ్యాకర్ల నుంచి విడిపించి తమ అధీనంలోకి తీసుకుంది. దీనిపై స్పీకర్ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. సోమవారం ఉదయం తన ఎక్స్ ఖాతా కొంత సమయం పాటు హ్యాక్ అయిందని, తమ టెక్నికల్ టీమ్ వెంటనే తగిన చర్యలు తీసుకుందని వెల్లడించారు. తన ఎక్స్ ఖాతా హ్యాక్ అయిన సమయంలో వచ్చిన పోస్టులు, వీడియోలతో తనకు సంబంధం లేదని స్పష్టం చేశారు.

72 సేవలపై స్టాంప్ డ్యూటీ!

(మొదటి పేజీ తరువాయి)



పొందాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఆ దిశగా కసరత్తు చేయాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు అందించే రిజిస్ట్రేషన్ల సేవల్లో మార్పు రావాలని, అదే సమయంలో సర్కారుకు రాబడినీ పెంచాలని స్పష్టం చేశారు. ఇందుకోసం ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను అధ్యయనం చేయాలని చెప్పారు. వాటిలో అత్యుత్తమమైన వాటిని రాష్ట్రంలో అమల్లోకి తీసుకొద్దామని అన్నారు. అంటే మరిన్ని సేవలకు రిజిస్ట్రేషన్ ఫీజు వసూలు చేసేందుకు సర్కారు సన్నద్ధమైందన్న మాట! ప్రస్తుతం 39 రకాల సేవలు వినియోగంలో ఉన్నా.. వాటికి స్టాంప్‌డ్యూటీ ఆశించిన మేర రావడం లేదు. ఆన్‌లైన్ సేవలు అందుబాటులో లేకపోవడం, కార్యాలయాల వరకు ఏం వెళతామనే ధోరణితో చాలా మంది స్టాంప్ డ్యూటీతో ప్రమేయం లేకుండానే ఒప్పందాలు చేసేసుకుంటున్నారు. ఇకపై ఈ పరిస్థితిని మార్చి, 72 రకాల డాక్యుమెంట్ల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు సర్కారు సిద్ధమవుతోంది. ఉదాహరణకు నైక్ అనే బహుళజాతి సంస్థ తన ఫ్రాంఛైజీ లీజ్‌కు ఇచ్చేందుకు ఒప్పందాలు చేసుకుంటుంది. అయితే ఈ ఒప్పందాల డాక్యుమెంట్లకు స్టాంప్ డ్యూటీ ఎక్కడ చెల్లిస్తారనేదానిపై స్పష్టత ఉండదు. ఇలాంటి కంపెనీలు నిత్యం భారీ సంఖ్యలో లీజు ఒప్పందాలు చేసుకుంటూనే ఉంటాయి. వీటన్నింటినీ చట్టం పరిధిలోకి తీసుకొస్తే ప్రభుత్వ ఖజానా కాసులతో కళకళలాడుతుందని భావిస్తున్నారు. అందులో భాగంగానే రిజిస్ట్రేషన్ శాఖ సేవల్లో మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

సేవల పరిధిని పెంచాలి..

రాష్ట్రంలో ప్రస్తుతం 72 రకాల డాక్యుమెంట్లు స్టాంప్ డ్యూటీ పరిధిలో ఉన్నా, రిజిస్ట్రేషన్ చార్జీలను మాత్రం కొద్ది మంది మాత్రమే చెల్లిస్తున్నారు. సేల్, గిఫ్ట్, మార్టిగేజ్, డెవలప్‌మెంట్, లీజు అగ్రిమెంట్లు వంటి పత్రాల ద్వారా స్టాంప్ డ్యూటీ ఎక్కువగా వస్తోంది. ఇందులో సుమారు 70 శాతం ఆదాయం విక్రయాలకు సంబంధించిన డ్యాక్యుమెంట్ల ద్వారానే సమకూరుతోంది. పుస్తకాల కాపీరైట్లు, ప్రకటనలు, హీరోల ఒప్పందాలు, కార్పొరేట్ ప్రకటనలు, రియల్ ఎస్టేట్ ప్రకటనల ఒప్పందాలు వంటివి అనధికారికంగా జరిగిపోతున్నాయి. ఇవేమీ స్టాంప్ డ్యూటీ పరిధిలో ప్రభుత్వానికి ఆదాయాన్ని తెచ్చిపెట్టడం లేదు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సబ్ రిజిస్ట్రార్లు సహకరించకపోవడం, అవినీతి వంటి కారణాల వల్ల చాలా మంది తమ డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి వెళ్లడం లేదు. ఈ పరిస్థితిని మార్చాలని, ఆన్‌లైన్ సేవలు తీసుకొచ్చి 72 రకాల డాక్యుమెంట్లకు స్టాంప్ డ్యూటీని రాబట్టాలని మంత్రి పొంగులేటి అధికారులకు స్పష్టం చేసినట్లు తెలిసింది. మరో వైపు కొందరు స్టాంప్ పేపర్లకు అనధికారికంగా ఫ్రాంకింగ్ చేసేస్తున్నారు. రూ.2000 పైన ఫ్రాంకింగ్ చేయాలంటే తప్పనిసరిగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లాలనే నిబంధన ఉంది. అంతకంటే తక్కువ మొత్తంలో స్టాంప్ పేపర్ల మీద ఫ్రాంకింగ్ చేయడంలో కొంత మంది చేతి వాటం ప్రదర్శిస్తున్నారు. రూ.100 స్టాంప్ పేపర్ మీద ఫ్రాంకింగ్ చేస్తే, సంబంధిత వ్యక్తులకు రూ.1.50 చెల్లిస్తుండగా.. మిగిలిన రూ.98.50 ప్రభుత్వానికి వెళుతోంది. కానీ, అనధికారికంగా ఫ్రాంకింగ్ చేయడంతో ఖజానాకు నష్టం వాటిల్లుతోంది. దీంతో సాధ్యమైనన్ని ఎక్కువ సేవలను ఆన్‌లైన్ ద్వారా అందించి, ఆదాయాన్ని పెంచుకోవాలని సర్కారు భావిస్తోంది.

విలువల పెంపు శాస్త్రీయంగా ఉండాలి

రాష్ట్రంలో భూముల విలువల పెంపు శాస్త్రీయంగా ఉండాలని మంత్రి పొంగులేటి ఆదివారం ఎంసీహెచ్ఆర్డీలో నిర్వహించిన సమావేశంలో అధికారులకు స్పష్టం చేశారు. విలువల పెంపు ప్రజలకు భారంగా పరిణమించకూడదన్నారు. అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యమైన విధానాలపై అధికారులు దృష్టిపెట్టాలని సూచించారు. కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలపై, మార్కెట్ విలువను ఏ ప్రాతిపదికన లెక్కిస్తారనే అంశాలపై అధ్యయనం చేసేందుకు అధికారుల బృందాలు ఆయా రాష్ట్రాల్లో పర్యటించనున్నాయి. 20 శాతం పెంచారు, 40 శాతం పెంచారు.. అనే అశాస్త్రీయ ప్రచారాలకు తావు లేకుండా భూముల విలువలను పెంచాలని మంత్రి సూచించారు. ఆయా ప్రాంతాలు, అక్కడ జరిగే క్రయవిక్రయాలు, బహిరంగ మార్కెట్‌లో భూముల ధరలు వంటి అంశాలను పరిశీలించి.. శాస్త్రీయంగా విలువలను పెంచాలని చెప్పారు. ఇదే అంశంపై మహారాష్ట్ర, కర్ణాటక వెళ్లి వచ్చిన బృందాలు ఇచ్చే నివేదిక ఆధారంగా మరోసారి సమావేశమై చర్చించాలని మంత్రి ప్రతిపాదించినట్లు తెలిసింది.

అప్పుడు ఫ్రీ.. ఇప్పుడు ఫీజులా?

ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయండి

సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్ బహిరంగ లేఖ



హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): 'నాడు గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ పేరిట దోపిడీ చేస్తోందని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఫ్రీ అన్నారు. ఇప్పుడు ఫీజులెలా వసూలు చేస్తారు?' అని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ఎల్ఆర్ఎస్ (భూముల క్రమబద్ధీకరణ) పథకాన్ని ఉచితంగా అమలు చేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి సోమవారం ఆయన బహిరంగ లేఖ రాశారు. 'బీఆర్ఎస్.. ఎల్ఆర్ఎస్ అయిపోయింది. ఎంఆర్ఎస్ (మ్యారేజ్ రెగ్యులరైజేషన్ స్కీం) కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొస్తుందేమో? అని మీరు వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల భారాన్ని ఎల్ఆర్ఎస్ పేరిట ప్రజలపై మోపే యత్నం చేస్తోందన్నారు. ఉచితంగా అమలు చేయాలంటూ.. మీతోసహా మీ కేబినెట్ సహచరులుగా ఉన్న భట్టి, ఉత్తమ్, సీతక్క, కోమటిరెడ్డి అన్నారు. గెలిస్తే ఎల్ఆర్ఎస్ ఉచితంగా అమలు చేస్తామన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం ఉచితంగా అమలు చేయాలి' అని సీఎంను ఆయన డిమాండ్ చేశారు. 'అంతే కాకుండా ఎల్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఏకంగా హైకోర్టులో పిల్ దాఖలు చేసారు. ఎన్నికల్లో గెలిచేందుకు ప్రజలను మభ్యపెట్టి రెచ్చగొట్టేలా బహిరంగ సభల్లో ఊదరగొట్టిన మీరు, మీ మంత్రులు.. ఇప్పుడు మాటమార్చి ఎల్ఆర్ఎస్ ఫీజు వసూలుచేయాలని నిర్ణయించడం మీ రెండు నాల్కల ధోరణికి నిదర్శనం. మాది ప్రజాపాలన అని డబ్బాకొట్టుకుంటున్న మీకు 25.44 లక్షల దరఖాస్తుదారుల కుటుంబాల ఆవేదన కనిపించడంలేదా?' అనిప్రశ్నించారు. మాట తప్పిన ప్రభుత్వానికి చెంపపెట్టుగా రాష్ట్ర ప్రజలెవరూ ఒక్కరూపాయి కూడా ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించొద్దని ఆయన పిలుపునిచ్చారు.



భూ బాధితులను తోసివేస్తున్న అనురాగ్ యూనివర్సిటీ ప్రతినిధులు

ఎమ్మెల్యే పల్లా భూ కబ్జా!

4 ఎకరాలు కబ్జా చేశారన్న బాధితులు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 26: చెరువు బఫర్‌జోన్‌లో అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు కేసు నమోదైన బీఆర్ఎస్ నేత, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి.. తమ భూమిని కూడా కబ్జా చేశారంటూ ఇద్దరు బాధితులు మీడియా ముందుకు వచ్చారు. కబ్జా చేసిన భూమిలోనే నీలిమ ఆస్పత్రి పార్కింగ్ ఏర్పాటు చేశారని వారు ఆరోపించారు. బాధితులు హయత్‌నగర్ మండలం కుంట్లూర్‌కు చెందిన మాజీ సర్పంచ్ కళ్లెం ప్రభాకర్‌రెడ్డి, రాజేశ్ సోమవారం మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లో నీలిమ ఆస్పత్రి సమీపంలోని తమ భూమిలో విలేకరులతో మాట్లాడారు. వెంకటాపూర్ పంచాయతీ కొర్రెముల రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 796లోని 11.20 ఎకరాల భూమిని తాము భాగస్వాములతో కలిసి 2008లో కొనుగోలు చేశామన్నారు. అనంతరం 7.20 ఎకరాల భూమిని పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చెందిన అనురాగ్ విద్యాసంస్థలు, గాయత్రి ఎడ్యుకేషన్ ట్రస్టుకు విక్రయించినట్లు తెలిపారు. అయితే రాజేశ్వర్‌రెడ్డి తాను కొనుగోలు చేసిన భూమిలోనే కాకుండా తమ భూమిని సైతం కబ్జా చేసి ప్రహరీ గోడ నిర్మించారని తెలిపారు. గత మూడేళ్ల నుంచి అధికార బలంతో తమను తమ భూమిలోకే రానివ్వకుండ తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని, ఎవరికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని అన్నారు. కాగా, వీరు మీడియాతో మాట్లాడుతుండగా అనురాగ్ యూనివర్సిటీ ప్రతినిధులు అడ్డుకొని దాడికి దిగారు. ఇరు వర్గాల వారు పరస్పరం దూషణలు, ప్రతిదాడులు చేసుకోవడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఇరు వర్గాల వారిని పంపించివేశారు. అనంతరం పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్‌లో రెండు వర్గాల వారు పరస్పరం ఫిర్యాదు చేశారు.

చట్ట ప్రకారమే భూమిని కొనుగోలు చేశాం: గాయత్రి ఎడ్యుకేషనల్ ట్రస్టు

అనురాగ్ విద్యాసంస్థలు, గాయత్రి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ పేరిట చట్టప్రకారమే భూమిని కొనుగోలు చేశామని ట్రస్టు ఎ.ఓ. మధుకర్‌రెడ్డి తెలిపారు. అన్ని ప్రభుత్వ విభాగాల నుంచి అనుమతులు పొందిన తరువాతే నిర్మాణాలు చేపట్టామన్నారు. కళ్లెం ప్రభాకర్‌రెడ్డి, రాజేశ్ తమ భూమిలోకి అక్రమంగా ప్రవేశించి తమ సిబ్బందిని దూషించారని తెలిపారు. తమ చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కావాలనే ఇబ్బందులకు గురి చేయాలని చూస్తున్నారని ఆరోపించారు.

సీఎంఆర్ఎఫ్ స్వాహా

(మొదటి పేజీ తరువాయి)

నేర పరిశోధన శాఖ (సీఐడీ) రంగ ప్రవేశం చేసి క్షుణ్ణంగా విచారణ చేస్తోంది. ఇందులో భాగంగా.. ఆయా ఆస్పత్రుల బయట బోర్డులపై ఉండే వైద్యుల పేర్లను వాడుకొని.. నిందితులు ఈ గోల్‌మాల్‌కు తెర లేపినట్లు తెలిసింది. ఏ మాత్రం అనుమానం రాకుండా నకిలీ బిల్లులు సృష్టించి, లక్షలాది రూపాయలు స్వాహా చేసినట్లు అధికారులు గుర్తించారు. సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్న పత్రాల్లో పేర్కొన్న ఆస్పత్రి పేరు, చిరునామా తమదే అయినప్పటికీ అందులో చికిత్స అందించిన పేర్కొన్న వైద్యుడు ఎవరో తమకు తెలియదని, ఆ పేరుతో తమ ఆస్పత్రిలో ఎవరూ పని చేయట్లేదని దర్యాప్తు అధికారులకు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. ఆస్పత్రి రికార్డుల్లోని ఇన్‌పేషెంట్ నంబర్లతో సంబంధం లేని వ్యక్తులు సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. అదే సమయంలో చిన్న చిన్న క్లినిక్‌ల్లోనూ శస్త్రచికిత్సలు చేసినట్లు బిల్లులు సృష్టించి, నిధులు డ్రా చేసుకున్నట్లు సీఐడీ గుర్తించింది. ఒకటి, రెండు మూత పడిన ఆస్పత్రుల పేరుతోనూ సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తులు వచ్చినట్లు తేలింది. తమ ప్రమేయం లేకుండానే కేస్ షీట్లు, మెడికల్ బిల్లులు ఎలా వచ్చాయో తెలియడం లేదని ఆస్పత్రులు వివరణ ఇచ్చినట్లు తెలిసింది. ఈ మేరకు ఆస్పత్రి యాజమాన్యం కళ్లుగప్పి సిబ్బంది ఎవరైనా బిల్లులు సృష్టించారా? ఎవరి ప్రాత ఎంత అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. మరోవైపు.. సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న తర్వాత నిధులు జమ అయిన బ్యాంకు ఖాతాలపైనా దర్యాప్తు అధికారులు దృష్టి సారించారు. రోగి ఆస్పత్రిలో చేరిన తేదీ, ఆపరేషన్ లేదా చికిత్స చేసిన తేదీ, డిశ్చార్జి అయిన తేదీ, సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్న తేదీ, నిధులు మంజూరైన తేదీ... ఇలా ప్రతి అంశంపైనా ఆరా తీస్తున్నారు. ప్రాథమికంగా పరిశీలించిన కొన్నింటిలో వైద్యం చేయించుకున్న తేదీకి సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్న తేదీకి మధ్య ఎక్కువ వ్యత్యాసం ఉండగా... నిధుల విడుదల మాత్రం తక్కువ సమయంలో జరిగినట్లు సీఐడీ దర్యాప్తులో బహిర్గతమైంది. శస్త్రచికిత్సల వివరాల నుంచి నకిలీ బిల్లుల తయారీ దాకా, దరఖాస్తు నుంచి ఆర్థిక సహాయం పొందే దాకా ప్రతి దశలో ఎక్కడిక్కడ ఈ ముఠాకు ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా సహకరించారా? అనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు. మరోవైపు.. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సీఐడీ అధికారులు విచారణ చేపట్టగా.. చాలా బిల్లులు నకిలీవని తేలినట్లు సమాచారం. కొన్ని కేసుల్లో వైద్యం కూడా పొందలేదని, వారి పేరిట వచ్చిన సీఎంఆర్ఎఫ్ బిల్లులో లబ్ధిదారులకు కొంత డబ్బులు అందజేసిన మధ్యవర్తులు మిగతా సొమ్ము కాజేసినట్లు తెలిసింది. మిర్యాలగూడలో మహేశ్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి పేరును నాలుగేళ్ల వ్యవధిలో మూడు సార్లు మార్చడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో వేరే పేరిట ఉన్న ఈ ఆస్పత్రికి సీఎంఆర్ఎఫ్ కింద నిధులు ఏమైనా అందాయా? అన్న కోణంలోనూ విచారణ సాగుతతోంది.

మిస్టరీ లవ్ స్టోరీ!

ఎన్నికల ముందు జరిగిన తతంగం.. ముంబై నటితో వైసీపీ నేత చెట్టాపట్టాల్

- ఆపై చీటింగ్ చేసిందంటూ ఫిర్యాదు
- ఆగమేఘాల మీద ముంబైకి పోలీసులు
- నటితోపాటు ఆమె తల్లి దండ్రులు అరెస్టు
- పెళ్లి ఊసెత్తబోమని రాసిచ్చాక కేసు క్లోజ్
- ఇదే ఎపిసోడ్‌లో మరో ఇండస్ట్రియలిస్టు!?

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

కృష్ణా జిల్లాకు చెందిన ఓ వైసీపీ నాయకుడి 'లవ్ స్టోరీ' ఒకటి తాజాగా బయటపడింది. ఆ మహిళ ముంబైకి చెందిన ఓ మోస్తరు నటి, సెలబ్రిటీ కావడం విశేషం. ఆ వైసీపీ నేతకు హైదరాబాద్‌లో ఓ వివాహ వేడుకలో సదరు నటితో పరిచయం ఏర్పడింది. ఈ నాయకుడి కుటుంబ నేపథ్యం చాలా పెద్దది. 2014 ఎన్నికల్లో విజయవాడకు చెంతనే ఉన్న నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఆయన తండ్రి ప్రముఖ పారిశ్రామికవేత్త. విశాఖపట్నం పోర్టులో ఎగుమతులు, దిగుమతుల వ్యాపారంతోపాటు ఉమ్మడి కృష్ణా జిల్లా కొండపల్లి, జగ్గయ్యపేటల్లో పెద్దఎత్తున భూములు ఉన్నాయి. తండ్రి బాగా సంపాదించారు. కుమారుడు చక్కగా ఎంజాయ్ చేస్తున్నారన్న మాట! ఇదే క్రమంలో ముంబై నటితో చాలాకాలం సన్నిహితంగా మెలిగారు. అయితే... తనను పెళ్లి చేసుకోవాలని ఆమె కోరడంతో కథ మలుపు తిరిగింది. ఇతను నసేమిరా అనడం, ఆమె 'బ్లాక్ మెయిల్' తరహా బెదిరింపులకు దిగడంతో ఈ నాయకుడు బెంబేలెత్తారు. ఆమెను వదిలించుకునేందుకు భారీ స్కెచ్ వేశారు. అప్పటి వైసీపీ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తున్న ఓ సలహాదారును సంప్రదించారు. ఆయన సూచన మేరకు ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్‌లో ముంబై నటిపైన, ఆమె కుటుంబ సభ్యులపైన ఈ ఏడాది ఫిబ్రవరిలో కేసు పెట్టారు. తనను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని, ఫోర్జరీ పత్రాలతో చీటింగ్ చేశారని ఆరోపించారు. సలహాదారుకు సంబంధించిన కేసు కావడంతో పోలీసులు ఆగమేఘాలపై స్పందించారు. దీనిపై ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్‌లో ఫిబ్రవరి రెండో తేదీన క్రైం నంబర్ 90/2024తో కేసు నమోదైంది. మాయమాటలతో వైసీపీ నేతను లోబరచుకుని నకిలీ డాక్యుమెంట్లను సృష్టించి రూ.5 లక్షలు డిమాండ్ చేసినట్లు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఆ వెంటనే విజయవాడ నుంచి ప్రత్యేక పోలీసు బృందం ముంబై వెళ్లింది. ఆ నటిని, ఆమె తల్లిదండ్రులను అరెస్టు చేసి ఇబ్రహీంపట్నం తీసుకొచ్చారు. వైసీపీ నేతను పెళ్లి చేసుకునే విషయం మరచిపోవాలని వారిని పోలీసులు తీవ్రంగా బెదిరించినట్లు సమాచారం. అనంతరం వారిని విజయవాడ 4వ అదనపు మెట్రోపాలిటన్ కోర్టులో హాజరుపరచి.. 14 రోజులపాటు విజయవాడలోని జిల్లా జైలులో రిమాండ్‌లో ఉంచారు. పోలీసుల తీరు.. అక్రమ కేసుల బనాయింపుతో ముంబై నటి కుటుంబం బెంబేలెత్తింది. తమ కుమార్తె మున్ముందు వివాహం విషయం ప్రస్తావించదంటూ లిఖితపూర్వకంగా హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఇరువర్గాలు రాజీపడ్డాయంటూ నటిపై నమోదైన చీటింగ్ కేసును పోలీసులు మూసివేశారు. ఈ మొత్తం వ్యవహారంలో సలహాదారుకు రూ.5 కోట్ల వరకు ముట్టినట్లు సమాచారం.

బాధితులు ముందుకొస్తే విచారణ

ముంబై నటి వ్యవహారంలో బాధితులెవరూ ఇంతవరకు మమ్మల్ని సంప్రదించలేదు. వారెవరైనా ముందుకొస్తే తగిన విచారణ చేసి న్యాయం చేస్తాం.

- రాజశేఖర్‌బాబు, విజయవాడ పోలీసు కమిషనర్

బడా పారిశ్రామికవేత్తకు సంబంధం ఉందా?

ఈ కేసుకు సంబంధించి మరో వాదన కూడా వినిపిస్తోంది. ముంబై నటిపై కేసు పెట్టిన వైసీపీ నేత ఈ మొత్తం ఎపిసోడ్‌లో ఓ పావు మాత్రమేనని.. అసలు వ్యక్తి ఇండియాలోనే పేరుమోసిన ఓ బడా పారిశ్రామికవేత్త అనే ప్రచారం జరుగుతోంది. ఆ బడా పారిశ్రామికవేత్త 2022 జనవరిలో తనను రేప్ చేశారని ఆమె 2023 డిసెంబరులో ముంబై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన తనకు సన్నిహితంగా ఉండే వైసీపీ ముఖ్యనేతను ఆశ్రయించారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యనేత సూచన మేరకే సలహాదారు రంగంలోకి దిగి... వైసీపీకి చెందిన కృష్ణా జిల్లా నేతతో ఫిర్యాదు చేయించి.. నటిని బెదిరించి దారిలోకి తెచ్చుకున్నారనే వాదన వినిపిస్తోంది. ఫిబ్రవరిలో ఈ తతంగం ముగియగానే... సదరు బడా ఇండస్ట్రియలిస్టుపై పెట్టిన కేసును ఆ నటి ఉపసంహరించుకోవడం గమనార్హం. అయితే... ఎవరో బడా పారిశ్రామికవేత్తను కాపాడేందుకు, కృష్ణా జిల్లా వైసీపీ నాయకుడు తాను స్వయంగా తెరమీదికి వస్తారా? ఎందుకంటే.. ఆయనదేం తక్కువ స్థాయి కాదు! 2014లో వైసీపీ అభ్యర్థిగా నిలిచిన నాయకుడు! తండ్రి నుంచి వచ్చిన కోట్ల రూపాయల ఆస్తులకు వారసుడు! ఎవరినో కాపాడేందుకు తన పేరు ఎందుకు బద్నామ్ చేసుకుంటారు? మరి... ఇవి రెండూ వేర్వేరు కథలా!? ఒకే కథలోని రెండు అధ్యాయాలా? ఈ మొత్తం ఎపిసోడ్‌లో ఏం జరిగిందో చెప్పాల్సింది పోలీసు అధికారులే!

పేదలకు ఇబ్బంది కలిగిస్తే ఊరుకోం

» వారికి న్యాయం ఎలా చేస్తారో చెప్పాలి

» హైడ్రా ఏర్పాటును స్వాగతిస్తున్నా:ఎమ్మెల్యే మాధవరం



హైదర్‌నగర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): చెరువుల పరిరక్షణ కోసం ఉద్దేశించిన హైడ్రా ఏర్పాటును స్వాగతిస్తున్నామని.. అయితే, హైడ్రా పేరుతో చిన్న, మధ్య తరగతి కుటుంబాల వారికి ఇబ్బందులు కలిగిస్తే సహించబోమని కూకట్‌పల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్న నిర్మాణాలను తొలగించటమే కాకుండా నాలాల ఆక్రమణలపైనా హైడ్రా దృష్టి పెట్టాలని సూచించారు. నగరంలో అనేక మంది నిర్మాణ అనుమతులను చూసుకున్నాకే ఇళ్లను కొనుగోలు చేశారని.. కొన్ని నిర్మాణాలు చెరువులో ఉన్నాయని ఇటీవల తేలడంతో.. వారంతా ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. గృహాలను కొనుగోలు చేసిన వారిలో పేద, మధ్య తరగతి, చిరుద్యోగులు ఉన్నారని.. వారికి ప్రభుత్వం ఏ విధంగా న్యాయం చేస్తుందో చెప్పాలని ప్రశ్నించారు. కూకట్‌పల్లి మైసమ్మ చెరువులో ఉన్న శ్మశాన వాటికకు, బోయినపల్లిలో చెరువు వద్ద 40 ఏళ్లుగా ఉన్న మందిరానికి సైతం అధికారులు నోటీసులు అందజేయడం శోచనీయమన్నారు. మైసమ్మ చెరువులో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే పేదలకు పట్టాలు ఇచ్చిందని.. దీంతో వారు రాజీవ్‌గాంధీనగర్ పేరుతో బస్తీ ఏర్పాటు చేసుకుని ఇళ్లు కట్టుకుని ఉంటున్నారని తెలిపారు. ఇప్పుడు వారి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. చెరువులు, నాలాల పరిరక్షణకు ఓ నోడల్ అధికారి, స్థానిక ప్రజాప్రతినిధులతో కమిటీలు ఏర్పాటు చేసి తదుపరి చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు.

హైడ్రా.. రాజకీయాలకు అతీతం: కోదండరెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి దూరదృష్టితో ఏర్పాటు చేసిన హైడ్రా.. రాజకీయాలకు అతీతంగా పనిచేస్తుందని కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి అన్నారు. రాష్ట్రానికి పదేళ్ల పాటు సీఎంగా ఉన్న కేసీఆర్.. చెరువుల పరిరక్షణకు ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. హైడ్రాను ఏర్పాటు చేసి ప్రజల మన్ననలు పొందుతున్న సీఎం రేవంత్‌రెడ్డిపైన బీఆర్ఎస్, ఎంఐఎం నేతలు అడ్డగోలు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో హైదరాబాద్‌లో విధ్వంసానికి గురైన చెరువులు, కుంటలను.. పర్యావరణాన్ని కాపాడుతున్న రియల్ హీరో సీఎం రేవంత్‌రెడ్డి అని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ అన్నారు. హైడ్రా కార్యకలాపాలను రాష్ట్రం మొత్తం విస్తరించాలని సీఎంను ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ కోరారు.

ప్రజల దృష్టి మరల్చేందుకే హైడ్రా డ్రామా:అరుణ

» వ్యక్తులే లక్ష్యంగా హైడ్రా ఉండొద్దు: బీజేపీ నేతలు



మక్తల్/హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ సర్కారు.. ప్రజల దృష్టిని మరల్చేందుకే హైడ్రా డ్రామా ఆడుతోందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఆరోపించారు. సోమవారం నారాయణపేట జిల్లా మక్తల్‌లో ఆమె మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు సహా ప్రజలకు ఇచ్చిన అనేక హామీల అమలులో కాంగ్రెస్ పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. కాగా, చెరువులు, ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణల తొలగింపులో హైడ్రా పక్షపాతం చూపవద్దని, వ్యక్తులే లక్ష్యంగా దీనిని కొనసాగించవద్దని బీజేపీ డిమాండ్ చేసింది. బీజేపీ మేడ్చల్ అర్బన్, రూరల్, రంగారెడ్డి రూరల్ పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు పార్టీ కార్యాలయంలో సమావేశమై ప్రభుత్వం చేపట్టిన ఆక్రమణల కూల్చివేతలపై చర్చించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. అనుమతులు తీసుకుని ఇళ్లు కట్టుకున్న వారు, అనుమతులున్నాయని గుర్తించి అపార్టుమెంట్లు కొనుగోలు చేసిన వారి విషయంలో ప్రభుత్వం ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లాల్లోనూ అక్రమ నిర్మాణాలను కూల్చేస్తాం: పొన్నం



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): చెరువుల పరిరక్షణే ధ్యేయంగా హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ అక్రమ నిర్మాణాలను కూల్చేస్తామని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ తర్వాత అన్ని జిల్లాల్లోనూ చెరువులు పునరుద్ధరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. హైడ్రా కార్యక్రమానికి మంచి స్పందన వస్తోందని, ప్రజలంతా హర్షిస్తున్నారన్నారు. ఎక్కడైనా అన్యాయం జరిగితే న్యాయస్థానాలు ఉన్నాయని, చెరువుల ఆక్రమణలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని వెల్లడించారు. హైదరాబాద్ ఒకప్పుడు లేక్ సిటీగా ఉండేదని, చెరువుల పరిరక్షకులు ఆక్రమణలపై ఆధారాలను సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించారు. ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.



నల్లగొండ జిల్లా కేంద్రంలోని వల్లభరావు చెరువులో ఆక్రమించి చేసిన నిర్మాణం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కబ్జా కోరల్లో చెరువులు

రాజకీయ నేతలు, అధికారుల అండతో యథేచ్ఛగా ఆక్రమణలు

కబ్జాలపై సీఎంకు నకిరేకల్ ఎమ్మెల్యే లేఖ

నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చెరువులు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. జాతీయ రహదారుల వెంబడే కాకుండా ప్రధాన పట్టణాల్లోని చెరువులు కబ్జాకు గురయ్యాయి. రాజకీయనేతలు, అధికారుల అండతో ఈ ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నాయి. నల్లగొండ పట్టణంలో 86 ఎకరాల్లో విస్తరించిన వల్లభరావు చెరువు చుట్టూ అక్రమ నిర్మాణాలు వెలిశాయి. బీఆర్ఎస్‌కు చెందిన ఒక చోటా నాయకుడు చెరువులో స్థలాన్ని ఆక్రమించి ప్రహరీ నిర్మించగా.. మరికొందరు సంఘాల నాయకులు స్థలాలను ఆక్రమించుకున్నారు. నార్కట్‌పల్లి, చిట్యాల, నకిరేకల్ మండలాల్లో చెరువులను కబ్జా చేశారనే ఆరోపణలు వస్తున్నాయి. మిర్యాలగూడలో పెద్దచెరువు ఆక్రమణలకు గురవుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడంలేదనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో నల్లగొండ జిల్లాలోనూ చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారించి ఆక్రమణలు స్వాధీనం చేసుకునేందుకు వీలుగా హైడ్రా తరహా వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతూ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సోమవారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాయడం సంచలనంగా మారింది. 65వ నంబరు జాతీయ రహదారి వెంబడి విస్తరించి ఉన్న నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని చిట్యాల, నార్కట్‌పల్లి, కట్టంగూరు, నకిరేకల్ మండలాల పరిధిలోని చెరువులు కబ్జాలకు గురయ్యాయని ఆయన లేఖలో పేర్కొన్నారు. ఇక యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో ఊర చెరువు, నాగులకుంట చెరువుల ఆక్రమణలు కొనసాగుతున్నాయి. రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నంబర్ 963లో ఊర చెరువు శిఖం 33.37 ఎకరాలు, సర్వే నంబర్ 322లో నాగులకుంట శిఖం భూమి 11.32 ఎకరాల మేర ఉంది. ప్రస్తుతం ఈ భూమి చాలా వరకు ఆక్రమణకు గురైంది. మోత్కూరు చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని రెండు, మూడు ఎకరాలు ఓ వ్యక్తి పేరున పట్టా ఉంది. దాన్ని ఆయన 20 ఏళ్ల క్రితమే విక్రయించగా, కొందరు చిన్న వ్యాపారులు కొని ఇళ్లు నిర్మించుకున్నారు. భువనగిరి పెద్ద చెరువు 200 ఎకరాల్లో ఉండగా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ నిబంధనలు అతిక్రమించారంటూ ఇరిగేషన్ అధికారులు మూడు రియల్ ఎస్టేట్ వెంచర్స్ నిర్వాహకులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇక సూర్యాపేట జిల్లాలోని కోదాడలో పెద్దచెరువు విస్తీర్ణం మొత్తం 720 ఎకరాల్లో 300 ఎకరాలు ఆక్రమణలకు గురైనట్లు సమాచారం. జిల్లా కేంద్రంలోని సద్దుల చెరువు ప్రాంతంలోని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో నిర్మాణాలు జరిగినట్టు గుర్తించారు. సూర్యాపేట జిల్లాలో 1,225కు పైగా చెరువులు ఉండగా 24కి పైగా చెరువులు 50శాతానికి పైగా, 100లోపు నీటి కుంటలు సైతం ఆక్రమణలకు గురయ్యాయని తెలుస్తోంది.

హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇంటివద్ద భద్రత





పంజాగుట్ట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇంటివద్ద పోలీసులు భద్రత పెంచారు. ఈ మేరకు వెంగళ్‌రావునగర్ డివిజన్ మధురానగర్ కాలనీ డీ-81లోని ఆయన ఇంటి వద్ద సోమవారం ఇద్దరు సెక్యూరిటీతో కూడిన ఔట్‌పోస్టును ఏర్పాటు చేశారు. నగరంలో చెరువులు, కుంటల్లో అక్రమ కట్టడాల తొలగింపును వేగవంతం చేసిన నేపథ్యంలో ఆయనకు ఏమైనా ముప్పు ఏర్పడవచ్చనే అనుమానంతో ప్రభుత్వం ప్రత్యేక భద్రతను ఏర్పాటు చేసింది. ఇటీవల సినీనటుడు నాగార్జునకు సంబంధించిన ఎన్- కన్వెన్షన్ కూల్చివేత తర్వాత బడా రాజకీయ నాయకులకు చెందిన అక్రమ నిర్మాణాలను తొలగించే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం రంగనాథ్ ఇంటి వద్ద భద్రత పెంచినట్లు తెలుస్తోంది.

హైడ్రా కూల్చివేతలు.. పులి మీద స్వారీనే

రేవంత్ పులి దిగితే.. అది ఆయన్ను తినేస్తుంది: నారాయణ



హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): హైడ్రా పేరుతో అక్రమ కట్టడాల కూల్చివేత పులి మీద స్వారీ లాంటిదని.. సీఎం రేవంత్ రెడ్డి భయపడి పులి మీద నుంచి దిగితే.. అది ఆయన్ను తినేస్తుందని.. అలాగే ముందుకెళితే ప్రజల మద్దతు ఉంటుందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో నారాయణ మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాలను కూల్చుతారా..? అని ఎంఐఎం నేత ప్రశ్నించడాన్ని నారాయణ తప్పు పట్టారు. ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించే ప్రభుత్వ కార్యాలయాలకు.. కబ్జాదారుల ఫాంహౌస్‌లు, ఫంక్షన్ హాళ్లు, విద్యా సంస్థలకు ఎలా ముడిపెడతారని ప్రశ్నించారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు వ్యతిరేకంగా సెప్టెంబరు 1 నుంచి 7 వరకు దేశ వ్యాప్తంగా నిరసనలు చేపడతామని నారాయణ ప్రకటించారు.

తప్పెవరిది.. శిక్ష ఎవరికి?

అన్ని అనుమతులూ ఉన్నాయన్న ధైర్యంతో.. ఇళ్లు, ప్లాట్లు కొనేవారి పరిస్థితేంటి?

హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు, ప్లాట్లు, స్థలాల కొనుగోలు అంటే డబ్బున్నోళ్లకు పెట్టుబడులేమోగానీ.. సామాన్యులు, మధ్యతరగతివారికి ఒక జీవితకాల స్వప్నం! అందుకే వాటిని కొనుగోలు చేయడానికి ముందు వారు చూసేది ఒక్కటే.. అన్ని అనుమతులూ ఉన్నాయా లేవా అని. హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ అనుమతులు ఉన్న లే-అవుట్లలో నిర్మించిన ఇళ్లు, రెరా అనుమతి ఉన్న అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లు కొనుగోలు చేస్తున్నామంటే.. వారికి ఒక భరోసా!! బ్యాంకులు సైతం ఆ అనుమతులు చూసే లోన్లు ఇస్తాయి. రూ.50 లక్షలో.. రూ.60 లక్షలో లోన్ తీసుకుని వాటిని కొనుగోలు చేసే వేతనజీవులు.. దాదాపు 20 ఏళ్లపాటు నెలవారీ కిస్తీల రూపంలో తాము తీసుకున్న రుణానికి రెట్టింపుపైగానే చెల్లిస్తారు!! తీరా.. తాము కొన్న ఇల్లు ఏ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోనో, బఫర్ జోన్‌లోనో ఉందంటూ ప్రభుత్వానికే చెందిన మరో విభాగం వచ్చి దాన్ని కూల్చేస్తే? ప్రస్తుతం హైదరాబాద్‌లో లక్షలాది మంది ఆందోళన ఇది! ఒకప్పుడు వందలాది చెరువులు, కుంటలతో కళకళలాడిన హైదరాబాద్ కాలక్రమంలో ఎన్నెన్నో ఆక్రమణలు, కబ్జాలకు గురైంది. నగరంలో ఇప్పుడు ఏ భవనం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉంది? ఏది బఫర్ జోన్? ఎక్కడ చెరువును ఆక్రమించి వెంచర్ వేశారు?.. తదితర ప్రశ్నలకు సమాధానం చెప్పడం కష్టం. ఏది సీలింగ్ ల్యాండ్? ఏది ప్రభుత్వ భూమి? ఎఫ్‌టీఎల్/బఫర్ జోన్ నిబంధనలేమిటి?.. లాంటి విషయాలు సామాన్యులకు తెలిసే అవకాశమే లేదు. అందుకే.. హెచ్ఎండీఏ/జీహెచ్ఎంసీ అనుమతుల ఆధారంగా గుడ్డిగా ఆయా ప్రాజెక్టుల్లో కొనుగోలుకు సిద్ధమవుతారు. కానీ, తాజా పరిణామాలు చూస్తుంటే ఆయా సంస్థలు ఇస్తున్న అనుమతులకు విలువ లేదా? అనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఏదో ఒక ఉల్లంఘన పేరుతో హైడ్రా అధికారులు భవనాలను కూల్చి వేస్తుండటంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఆ ఉల్లంఘనల సంగతి తెలియక.. రూ.లక్షలు, రూ.కోట్లు ఖర్చు పెట్టి ఇల్లు/ఫ్లాటు కొనుగోలు చేసిన వారికి కంటిమీద కునుకులేకుండా పోతోంది. ఉదాహరణకు.. రెండు దశాబ్దాల క్రితం ఒక రాజకీయ నాయకుడు వనస్థలిపురం పరిధిలో ఉన్న కప్పల చెరువును పూడ్చివేసి లే-అవుట్ వేసి స్థలాలు విక్రయించాడు. ఆ స్థలంలో ప్లాట్లు వేసి విక్రయాలు చేసిన వారు కొందరైతే.. ఇళ్లు నిర్మించి అమ్మకాలు చేసిన వారు మరికొందరు. నాడు అక్కడ ఇల్లు నిర్మించుకున్న వారు ఇప్పుడు అసలు విషయం తెలిసి తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అలాగే సరూర్‌నగర్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో జీహెచ్ఎంసీ అధికారులు యథేచ్ఛగా అనుమతులివ్వడంతో అక్కడ బిల్డర్లు పెద్ద ఎత్తున ఫ్లాట్లు, ఇళ్లు నిర్మించి విక్రయించారు. అలాంటి నిర్మాణాలు 1000కిపైగా ఉన్నట్టు సమాచారం. వాటిని కొన్నవారంతా ఇప్పుడు భయపడుతున్నారు. నిజానికి ఆ భూమిలో ఎలాంటి కట్టడాలకూ అనుమతి ఇవ్వొద్దని 2011 ఆగస్టు 20న అప్పటి హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ఎల్ఆర్ నంబర్ ఎ58/10057/2010/2631 ద్వారా జీహెచ్ఎంసీ కమిషనర్‌ను ఆదేశించారు. అయినా జీహెచ్ఎంసీ అధికారులు యథేచ్ఛగా అనుమతులు ఇచ్చేయడం గమనార్హం. ఆ రెండుచోట్లే కాదు.. రామాంతపూర్, మల్కాజ్‌గిరి, అత్తాపూర్, శేర్‌లింగంపల్లి.. ఇలా భాగ్యనగరంలో అనేక చోట్ల వందల చెరువులు కబ్జాకు గురై కనుమరుగయ్యాయి. వాటికి ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో అడ్డగోలుగా ఎన్‌వోసీలు ఇచ్చారు.

విలువ ఉందా?

సాధారణంగా పంచాయతీ అనుమతులతో నిర్మించే ఫ్లాట్లు/ఇళ్ల ధర తక్కువగా ఉంటుంది. అదే హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ అనుమతులతో నిర్మించేవాటిలో ధర ఎక్కువగా ఉంటుంది. అయినా ప్రభుత్వ అనుమతులున్నాయనే భరోసాతో సామాన్యులు వాటిని కొనుగోలు చేయడానికే మొగ్గుచూపుతారు. ఇదే అవకాశంగా.. పలువురు బిల్డర్లు తప్పుడు మార్గాల్లో, లంచాలు మేపి.. కావాల్సిన అనుమతులు పొంది భవనాలు కట్టి, అమ్మకాలు సాగిస్తున్నారు. నిర్మాణాలు మొదలు కాకముందే ప్రీలాంచింగ్ ఆఫర్ల పేరుతో భారీగా లాభాలు పొందుతున్నారు. కానీ తాజా పరిణామాలతో.. అసలు హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, రెరా ఇస్తున్న అనుమతులకు విలువ ఉందా? లేదా? అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారా? లేదా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధికారులే అడ్డదారి తొక్కితే కొనుగోలుదారులు ఇక ఎవరిని నమ్మాలి? అధికారులను నమ్మి కొన్నాక హైడ్రా కూల్చివేస్తే బ్యాంకు లోను దేని కోసం కట్టాలనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దీనివల్ల.. బ్యాంకులు కూడా తీవ్ర నష్టాలను మూటకట్టుకునే పరిస్థితి ఉందని ఓ అధికారి అభిప్రాయపడ్డారు. అంతేకాదు.. ఇలా వందలాది భవనాలను కూల్చేస్తే ఆస్తి పన్ను వసూళ్లపైనా ప్రభావం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

111 జీవో పరిధిలో నిర్మాణాలకు హైడ్రా దూరం

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపిస్తున్న హైడ్రా.. ప్రస్తుతానికి 111 జీవో పరిధిలోని నిర్మాణాల జోలికి వెళ్లే ఆలోచనలో లేనట్లు తెలిసింది. హైడ్రా పరిధికి సంబంధించి విధానపరమైన స్పష్టత రావాల్సి ఉండటంతో ఆ జీవో పరిధిలోని 84 గ్రామాల్లో ఉన్న నిర్మాణాలపై హైడ్రా ఇప్పుడు దృష్టి సారించే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు.

ఒవైసీ ఆక్రమణలను కూల్చే దమ్ముందా..?

సల్కం చెరువు అక్రమాలు దృష్టికి రాలేదా

చిత్తశుద్ధి ఉంటే ఆ నిర్మాణాలను కొట్టండి

ప్రభుత్వానికి మహేశ్వర్‌రెడ్డి సవాల్



హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సల్కం చెరువులో మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ కట్టిన అక్రమ భవనాలను కూల్చివేసే ధైర్యం ఉందా..? అని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వాటిని ఎప్పటిలోగా కూలుస్తారో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. చిత్తశుద్ధి ఉంటే పాతబస్తీలో ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని డిమాండ్ చేశారు. కొంత మందిని లక్ష్యంగా చేసుకుని హైడ్రా పని చేస్తున్నట్లుగా అనిపిస్తోందన్నారు. 'సల్కం చెరువులో మజ్లిస్ అధినేత ఒవైసీ కట్టిన అక్రమ నిర్మాణాలు మీ దృష్టికి రాలేదా..? వాటిని కూల్చివేసేందుకు మీ వద్ద యంత్రాలు లేవా?' అని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను ప్రశ్నించారు. ఒకవేళ యంత్రాలు అందుబాటులో లేకపోతే పక్క రాష్ట్రాల నుంచి తెప్పించి ఇస్తామని తెలిపారు. పాతబస్తీలోని చెరువులను ఇష్టారాజ్యంగా కబ్జా చేశారని ఆరోపించారు. "పాతబస్తీ గుర్రం చెరువు, జల్‌పల్లి చెరువులో అక్రమ నిర్మాణాల వివరాలు ఉన్నాయా..? పంపించాలా..? అక్రమ నిర్మాణాలకు పర్మిషన్ ఇచ్చిన అధికారుల మీద చర్యలు తీసుకుంటారా..? హైదారాబాద్‌లో ఎన్ని చెరువులు ఉన్నాయి..? ఎన్ని ఆక్రమణలకు గురయ్యాయి..? హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యల పట్ల చర్యలేవి..?" అని ఆయన ప్రశ్నించారు. కాగా, అక్రమంగా కట్టుకున్న భవనాలను ఉద్దేశించి మజ్లిస్ నేత అక్బరుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ఆయన ఒక ప్రజాప్రతినిధి అయితే, అక్రమ నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించాలని స్పష్టం చేశారు.

ప్రత్యామ్నాయం చూపిన తర్వాతే ఇళ్లు ఖాళీ చేయించండి

» తొలుత ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయో, లేవో తేల్చండి

» అసైన్డ్ పట్టాలు రద్దు చేయకుండా భూ స్వాధీనం తగదు

» వరంగల్ కార్పొరేషన్ అధికార్లకు హైకోర్టు ఆదేశం

» చిన్నవడ్డేపల్లి చెరువు పరిసరాల పేదలకు ఊరట

హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు లేని పేదలకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన అసైన్‌మెంట్ పట్టాలను రద్దు చేయకుండా తిరిగి ఆ భూములను ఎలా స్వాధీనం చేసుకుంటారని వరంగల్ కార్పొరేషన్ అధికారులను హైకోర్టు ప్రశ్నించింది. తొలుత చిన్న వడ్డేపల్లి చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), బఫర్‌జోన్ హద్దులు గుర్తించాలని, అనంతరమే తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించింది. దారిద్ర్య రేఖకు దిగువన (బీపీఎల్) కుటుంబాలకు కేటాయించిన 60-100 గజాల స్థలాలు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయా? లేవా? అని తొలుత నిర్ధారించాలని తెలిపింది. ఒకవేళ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయని తేలితే మాత్రమే చట్ట ప్రకారం నోటీసులు, తగిన సమయం ఇచ్చి చర్యలు తీసుకోవాలని పేర్కొంది. అసైన్‌మెంట్ పట్టాలు రద్దు చేసి ప్రత్యామ్నాయం చూపిన తర్వాతే భూస్వాధీన ప్రక్రియ చేపట్టాలని స్పష్టం చేసింది. ఈ మొత్తం ప్రక్రియ ముగిసే వరకు వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చిన్నవడ్డేపల్లి చెరువు పరిసర ప్రాంతాల్లోని దేశాయిపేట ఎంహెచ్ నగర్ బీపీఎల్ కుటుంబాలను ఖాళీ చేయించరాదని ఆదేశించింది.

చిన్న వడ్డేపల్లి చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో తాము లేమని, అయినప్పటికీ రెవెన్యూ, మున్సిపల్, నీటిపారుదలశాఖల అధికారులు తమ ఇళ్లు కూల్చేస్తున్నారని పేర్కొంటూ రేమకొంట్ల కొమురమ్మ మరో 126 బీపీఎల్ కుటుంబాలవారు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది శామల రవీందర్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లకు ప్రభుత్వం భూములు కేటాయించిన సర్వే నెంబర్, చెరువు సర్వే నంబర్ వేరని.. అయినప్పటికీ ఎఫ్‌టీఎల్‌లో ఉన్నారని అధికారులు కూల్చేస్తున్నారని పేర్కొన్నారు. చెరువుకు మరోవైపు ఉన్న ఎఫ్‌టీఎల్‌లో ప్రైవేటు వ్యక్తులు చేసిన కబ్జాలను తొలగించడం లేదని, దశాబ్దాలుగా అసైన్‌మెంట్ పట్టా భూముల్లో ఉన్న పేదల గుడిసెలను ఖాళీచేయిస్తున్నారని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రభుత్వ అసైన్‌మెంట్ పట్టాలు, కరెంట్ బిల్లులు, ఆస్తిపన్ను తదితర ఆధారాలు పిటిషనర్ల వద్ద ఉన్నాయని తెలిపింది. పట్టాలు రద్దు చేయకుండా భూములు ఎలా ఖాళీ చేయిస్తారని ప్రశ్నించింది. అన్ని నిబంధనలు పాటించాలని, మొత్తం ప్రక్రియ ముగిసే వరకు తొలగింపు చర్యలు చేపట్ట రాదని అధికారులను ఆదేశిస్తూ పిటిషన్‌ను ముగించింది.

లిడ్ క్యాప్ స్థలంలో ఇళ్ల కూల్చివేత

» సమాచారం ఇవ్వలేదంటూ అడ్డుకున్న బాధితులు

» రాయదుర్గం పరిధిలోని మల్కం చెరువు వద్ద ఉద్రిక్తత

» ఇది యూనిటీ మాల్‌కు ఇచ్చిన స్థలం: లిడ్ క్యాప్ ఎండీ



లిడ్‌క్యాప్ స్థలంలో నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం

రాయదుర్గం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(లిడ్ క్యాప్)కు చెందిన స్థలంలో ఇళ్ల కూల్చివేతలు చేపట్టడంతో ఉద్రిక్తత నెలకొంది. రాయదుర్గం పరిధిలోని మల్కం చెరువు వద్ద 42 ఎకరాలను సుమారు 50 ఏళ్ల క్రితం లిడ్‌క్యాప్ సంస్థకు కేటాయించారు. అదే సంస్థకు సర్వే నంబర్లు 1, 3, 4, 9లోనూ 5.16 ఎకరాల భూమి ఉంది. అయితే, ఈ భూమిలో 40 ఏళ్లుగా పలువురు నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారు. సోమవారం ఉదయం భారీ పోలీస్ బందోబస్తు మధ్య జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, టీజీటీపీసీ విభాగం అధికారులు సంయుక్తంగా ఇక్కడ కూల్చివేతలు చేపట్టారు. ఈ క్రమంలో నివాసగృహాలను కూల్చివేసి తమను రోడ్డుపాలు చేయొద్దని పలువురు అధికారులతో వాగ్వాదానికి దిగారు. దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో నివాసముంటున్నామని, ముందస్తు సమాచారం ఇవ్వకుండా, సామగ్రి బయట పడేసి, ఇళ్లు కూల్చివేయడం ఎంతవరకు న్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ స్థలంపై కోర్టులో స్టే ఉందని చెప్పినప్పటికీ వినకుండా అన్యాయంగా కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు పోలీసు బందోబస్తు మధ్య అధికారులు కూల్చివేతలు పూర్తి చేశారు. కాగా, సర్వే నంబర్ 1,3,4,9లో ఉన్న 5.10 ఎకరాల భూమిని ప్రభుత్వం యూనిటీ మాల్ కేటాయించిందని లిడ్‌క్యాప్ ఎండీ శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న యూనిటీ మాల్‌లో రాష్ట్రంలో తయారయ్యే అన్ని రకాల ఉత్పత్తులను విక్రయించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆయా భూముల్లో ఉన్న ఆక్రమణలను తొలగించి అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

రాజకీయం @ హైడ్రా!

కూల్చివేతలపై పార్టీల పరస్పర ఆరోపణలు.. తప్పుబట్టే సాహసం చేయలేని పరిస్థితి

» ఒకరి ఫాంహౌస్ రహస్యాలు మరొకరు.. బయట పెట్టుకుంటున్న నేతలు

» గందరగోళం సృష్టించేందుకు.. ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపణలు

» హైడ్రా చర్యలకు ప్రజల నుంచి ఆదరణ

హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): హైడ్రా రంగప్రవేశంతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఇతర అన్ని అంశాలూ పక్కకుపోయి.. హైడ్రా చుట్టూనే రాజకీయం నడుస్తోంది. ప్రధాన పార్టీలన్నీ ఒకరిపై మరొకరు ప్రశ్నలు, లీకులు సంధించుకుంటూ రాజకీయ డ్రామాకు తెరలేపుతున్నాయి. హైడ్రా చేపట్టిన కూల్చివేతలపై అన్ని పార్టీలు తేలుకుట్టిన దొంగలా వ్యవహరిస్తున్నాయి. కూల్చివేతలు తప్పు అనే సాహసం చేయలేక 'ఇది కూల్చారు సరే.. మరి అది కూలుస్తారా!' అంటూ పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నాయి. దీంతో అన్ని పార్టీల నేతలు తిలాపాపం తలా పిడికెడు అన్న చందంగా తమ లోపాలను బయటపెట్టుకుంటున్నారు. దీనికి అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎంలు ఏవీ మినహాయింపు కాదన్న రీతిలో పరిస్థితి ఉంది. జన్వాడ ఫాంహౌస్ పేరు తెరపైకి రాగానే బీఆర్ఎస్ ఇలాంటి విమర్శలు మొదలుపెట్టింది. జన్వాడ ఫాంహౌస్ తనది కాదని చెబుతూ కేటీఆర్ కాంగ్రెస్ నేతల ఫాంహౌస్‌లు కూడా నీళ్లలోనే ఉన్నాయన్నారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కేవీపీ, పట్నం మహేందర్ రెడ్డి, గుత్తా సుఖేందర్ రెడ్డి, వివేక్ వెంకటస్వామిల ఫాంహౌస్‌లు ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఉన్నాయనీ, ముందుగా వాటిని కూల్చాలని డిమాండ్ చేశారు. ఆయన సోషల్ మీడియా టీమ్.. కొందరు కాంగ్రెస్ నేతల ఫాంహౌస్‌లపై ప్రత్యేక కథనాలు చేసి మరీ, 'వీటిని కూడా కూలుస్తారా?' అంటూ ప్రశ్నించింది. తనపై చేసిన ఆరోపణలకు పొంగులేటి సమాధానం ఇస్తూ 'మీరే టేపు తెచ్చుకొని కొలుచుకోండి. అక్రమం అని తేలితే నేనే కూలుస్తా' అంటూ సవాల్ విసిరారు.

పోటాపోటీగా మీడియాకు లీకులు..

కేటీఆర్ ఆరోపణలతో కాంగ్రెస్ సోషల్ మీడియా టీమ్ అలర్ట్ అయింది. బీఆర్ఎస్, ఎంఐఎం నేతలకు సంబంధించిన కొన్ని నిర్మాణాల మ్యాపులను విడుదల చేసింది. దీంతో హైడ్రా అధికారులు తమకు సంబంధించిన కొన్ని కట్టడాలపై మీడియాకు కొన్ని లీకులిచ్చారని విపక్ష నేతలు ఆరోపించారు. మరోవైపు కొన్ని స్వచ్ఛంద సంస్థలు.. రాజకీయ నేతలకు చెందిన అక్రమ నిర్మాణాల శాటిలైట్ మ్యాపులను విడుదల చేశాయి. ఒక సంస్థ పాత నగరానికి చెందిన చెరువుల ఆక్రమణలపై మ్యాపులను ప్రదర్శించింది. దీనిపై బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి స్పందిస్తూ.. హైడ్రాకు చిత్తశుద్ధి ఉంటే ముందు పాత నగరంలోని చెరువుల్లో ఉన్న అక్రమ కట్టడాపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు స్పందిస్తూ.. బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు, కేటీఆర్, కవితకు 111 జీవో పరిధిలో ఫాంహౌస్‌లు ఉన్నాయనీ, వాటిని కూల్చాలని అన్నారు. రెండు దశాబ్దాలుగా జరుగుతున్న కట్టడాలన్నింటినీ కూల్చాలన్నారు. ఆ పార్టీ మరో ఎంపీ ఈటల రాజేందర్ మాత్రం సామాన్యుల జోలికొస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. మరోవైపు హైడ్రా పరిధిని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. కాగా, అక్రమంగా నిర్మించిన కట్టడాలు ఎవరివైనా కూలుస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అంటున్నారు. ఓవైపు ప్రజల నుంచి హైడ్రాకు ఆదరణ లభిస్తుంటే, రాజకీయ పార్టీల నేతలు మాత్రం పరస్పర ఆరోపణలతో మొత్తం వ్యవహారాన్ని గందరగోళపరిచే ప్రయత్నం చేస్తున్నాయని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అన్న క్యాంటీన్లకు రూ.26.25 లక్షల విరాళం

- జన్మదినం సందర్భంగా ఒక రోజు భోజనం ఖర్చు వితరణ
- ఏపీ సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేసిన సెల్‌కాన్ సీఎండీ వై.గురుస్వామి నాయుడు



చంద్రబాబుకు చెక్‌ను అందజేస్తున్న సెల్‌కాన్ సీఎండీ గురుస్వామి నాయుడు

హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్లకు సెల్‌కాన్ గ్రూపు సీఎండీ వై. గురుస్వామి నాయుడు రూ.26.25లక్షల విరాళాన్ని అందజేశారు. ఏపీ సీఎం చంద్రబాబును సోమవారం ఆయన నివాసంలో కలిసి.. సంబంధిత చెక్కును అందించారు. ఈ నెల 31వ తేదీన తన జన్మదినాన్ని పురస్కరించుకుని ఏపీ వ్యాప్తంగా ఉన్న 100 అన్న క్యాంటీన్లలో భోజనం పెట్టేందుకు ఈ మొత్తాన్ని ఖర్చు చేయాలని కోరారు. వేల మంది కడుపు నింపుతున్న పథకానికి తన వంతుగా ఈ విరాళం ఇచ్చినట్లు గురుస్వామి తెలిపారు. పేదలకు రూ.5కే అన్నం పెట్టాలనే మంచి ఉద్దేశంతో ప్రారంభించిన అన్న క్యాంటీన్ల నిర్వహణలో భాగస్వాములయ్యేందుకు వివిధ వర్గాల ప్రజలు, వ్యాపారులు ముందుకు రావడం అభినందనీయమని సీఎం చంద్రబాబు అన్నారు. పుట్టిన రోజు సందర్భంగా అన్న క్యాంటీన్లలో ఒక రోజు భోజనానికి అయ్యే ఖర్చును విరాళంగా ఇచ్చిన గురుస్వామిని చంద్రబాబు అభినందించారు.

జేఎన్‌టీయూ పీజీ విద్యార్థులకు ఆఫర్ల వెల్లువ

- 33 మందికి రూ.8.5లక్షల చొప్పున వార్షిక వేతనం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూ) హైదరాబాద్ ఇంజనీరింగ్ కాలేజీలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ల హవా సాగుతోంది. ఈ నెల రెండో వారంలో 9 మంది బీటెక్ విద్యార్థులకు రూ.16.5 లక్షల చొప్పున ప్యాకేజీతో ఒరాకిల్ సంస్థ ప్లేస్‌మెంట్స్ ఆఫర్ చేయగా... తాజాగా 33 మంది ఎంటెక్ విద్యార్థులకు ఫ్రాన్స్‌కు చెందిన ఆల్‌స్టోమ్ సంస్థ నుంచి ప్లేస్‌మెంట్స్ లభించాయి. వీరందరికి రూ.8.5 లక్షల చొప్పున వార్షిక వేతనంతో సంస్థ ప్రతినిధులు ఆఫర్ లెటర్స్‌ను అందజేశారు. కోర్ బ్రాంచ్‌లైన ఎలక్ట్రికల్, మెకానికల్ విభాగాలకు చెందిన ఎంటెక్ విద్యార్థులకు ఈ వేతనంతో ప్లేస్‌మెంట్లు లభించడం పట్ల విద్యార్థులు, ఆచార్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏటా పీజీ విద్యార్థుల కంటే యూజీ విద్యార్థులకు ఎక్కువగా ప్లేస్‌మెంట్లు ఉండేవని, ఈసారి పీజీ విద్యార్థుల్లోనూ ఎక్కువ మంది ప్లేస్‌మెంట్లు పొందడం మంచి పరిణామమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి.నర్సింహారెడ్డి పేర్కొన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

5372కు పెరిగిన డెంగీ కేసులు

హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డెంగీ తీవ్రత రోజు రోజుకు పెరుగుతోంది. రోగుల సంఖ్య అంతకంత పెరుగుతుండటంతో ఆస్పత్రుల్లో పడకలు కూడా దొరకని పరిస్థితి నెలకొంది. ఈనెల 25 నాటికి తెలంగాణ వ్యాప్తంగా 5372 డెంగీ కేసులు వచ్చినట్లు ప్రజారోగ్య సంచాలకుల కార్యాలయం తెలిపింది. ఈ మేరకు సోమవారం మీడియా బులిటెన్‌ను విడుదల చేసింది. ఈనెల 21 వరకు 4648 ఉన్న కేసులు ఉండగా... నాలుగు రోజుల్లోనే భారీగా పెరిగిందని పేర్కొంది. మొత్తం 81,932 మందిని పరీక్షించామని, పాజిటివ్ రేటు 6.5 శాతంగా నమోదైందని వెల్లడించింది. డెంగీ అత్యధిక కేసులు నమోదయ్యే జిల్లాల వరుసలో హైదరాబాద్ (1852), సూర్యాపేట (471), మేడ్చల్ మల్కాజ్‌గిరి (426), ఖమ్మం (375), నల్గొండ (315), నిజామాబాద్ (286), రంగారెడ్డి (232), జగిత్యాల (185) సంగారెడ్డి (160), వరంగల్ (110) ఉన్నట్లు పేర్కొంది. ఇక చికున్ గున్యా కేసుల సంఖ్య 152కు పెరిగిందని, దాని పాజిటివ్ రేటు 5 శాతానికి చేరిందని పేర్కొంది. మలేరియా కేసుల సంఖ్య 191కు చేరిందని తెలిపింది. ఇక తెలంగాణ వ్యాప్తంగా ఈనెల 25 వరకు 1.42 కోట్ల గృహాలను సందర్శించి, దాదాపు 4.40 కోట్ల మందికి జ్వర సర్వే చేసినట్లు వివరించింది. అందులో 2.65 లక్షల మంది జ్వర బాధితులున్నట్లు గుర్తించామని తెలిపింది. కాగా ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో డెంగీ కేసుల సంఖ్య పతాక స్థాయికి చేరుకుంటాయి. ఈ ఏడాది కేసుల సంఖ్య రెట్టింపు అయ్యే అవకాశం కనిపిస్తోంది.

హుజూర్‌నగర్‌లో డెంగీతో బాలుడి మృతి

హుజూర్‌నగర్, ఆగస్టు 26: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన బాలుడు డెంగీతో మృతి చెందాడు. స్థానిక పాత గోదాం బజార్‌లో నివసిస్తున్న చీకటి మల్లేష్, శోభ దంపతుల ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు వర్షిత్(13) ఆరో తరగతి చదువుతున్నాడు. వారం రోజుల క్రితం జ్వరం రావడంతో కోదాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వర్షిత్‌కు చికిత్స చేయించారు. వైద్య పరీక్షల్లో డెంగీగా నిర్ధారణ కాగా, ఖమ్మం తీసుకువెళ్లాలని వైద్యులు సూచించారు. అక్కడ రెండు రోజులు చికిత్స చేసినా జ్వరం తగ్గకపోవడంతో... వైద్యుల సలహా మేరకు సోమవారం ఉదయం హైదరాబాద్ తీసుకువెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు.

8.5 కోట్ల విలువైన డ్రగ్స్ సీజ్

(మొదటి పేజీ తరువాయి)

ఆశగాని వినోద్ కుమార్ గౌడ్, కుంతి శ్రీశైలం హైదరాబాద్‌లో ఆమ్‌ఫెటమైన్ విక్రయానికి సిద్ధమైనట్లు హెచ్-న్యూ బృందాలకు ఉప్పందింది. దీంతో వారు బోయిన్‌పల్లి పోలీసులతో కలిసి.. బోయిన్‌పల్లి వద్ద కాపుకాచి, నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి 8.5 కిలోల ఆమ్‌ఫెటమైన్ డ్రగ్స్‌ను సీజ్ చేశారు. తదుపరి దర్యాప్తులో.. గోసుకొండ అంజిరెడ్డి అనే వ్యక్తి వద్ద ముగ్గురు నిందితులు ఈ డ్రగ్స్‌ను తీసుకున్నట్లు చెప్పారు. అంజిరెడ్డి రెండు నెలల క్రితం టీజీ-న్యాబ్, సంగారెడ్డి పోలీసులు అరెస్టు చేయడంతో జైలులో ఉన్నాడు. కుంచాల నాగరాజు నగరంలోని బతుకుదెరువు కోసం షాపూర్‌నగర్‌కు వచ్చి, తాపీమేస్త్రీగా పనిచేసేవాడని సీపీ వివరించారు. ఈ క్రమంలో అంజిరెడ్డితో పరిచయం ఏర్పడిందని, ఆయన ద్వారా తాపీ కాంట్రాక్టులు వచ్చేవని చెప్పారు. ఆ తర్వాత గుమ్మడిదలకు మకాం మార్చిన నాగరాజు.. అంజిరెడ్డి తన ఫ్యాక్టరీల్లో తయారు చేసే అల్ప్రాజోలం అనే మత్తు పదార్థాన్ని కల్లు దుకాణాలకు సరఫరా చేసేవాడు. మత్తు పదార్థాల సరఫరాలో ఎక్కువ లాభం వస్తుండడంతో.. పూర్తిస్థాయిలో పెడ్లర్‌గా మారాడు. అంజిరెడ్డి ఈ ఏడాది జూన్‌లో మూడు ప్యాకెట్లలో ఉన్న ఆమ్‌ఫెటమైన్ డ్రగ్స్‌ను దాచిపెట్టాలని పేర్కొంటూ నాగరాజుకు ఇచ్చాడు. ఆ తర్వాత అంజిరెడ్డి అరెస్టయి.. జైలులో ఉన్నాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు ఎదురవ్వడంతో నాగరాజు ఆమ్‌ఫెటమైన్‌ను అమ్మడానికి ప్లాన్ చేశాడు. తన అనుచరులు వినోద్‌కుమార్, శ్రీశైలంతో కలిసి.. 8.5 కిలోల ఆమ్‌ఫెటమైన్‌ను విక్రయించేందుకు నగరానికి వచ్చి, పోలీసులకు చిక్కాడు. జైలులో ఉన్న అంజిరెడ్డిని పీటీ వారెంట్‌పై కస్టడీకి తీసుకుని, విచారిస్తే.. మరిన్ని వివరాలు తెలుస్తాయని సీపీ వెల్లడించారు.



కొండలు, గుట్టలు ఎక్కడానికి వాడే వాహనం



ఐఐటీహెచ్ టీ-హాన్ పరిశోధకులు అభివృద్ధి చేసిన డ్రైవర్ రహిత కారు



ఈ-సైకిల్, ఈ-బైక్

మన రోడ్లపైనా డ్రైవర్‌లెస్ కార్లు

దేశానికి ఆదర్శంగా ఐఐటీహెచ్ పరిశోధనలు.. కొనియాడిన ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

- ఆయనతో కలిసి ఐఐటీహెచ్‌ను సందర్శించిన జగ్గారెడ్డి

కంది, ఆగస్టు 26: ఐఐటీ హైదరాబాద్ (ఐఐటీహెచ్)లో జరుగుతున్న పరిశోధనలు దేశానికే ఆదర్శమని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సంగారెడ్డి జిల్లా కంది పరిధి ఐఐటీహెచ్‌లోని టీహాన్ (టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ ఇన్ అటానమస్ నావిగేషన్) విభాగంలో.. సుజుకి మోటార్ కార్పొరేషన్(జపాన్) భాగస్వామ్యంతో నిర్వహించిన డ్రైవర్ రహిత వాహనాల పనితీరును సోమవారం ఆయన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డితో కలిసి పరిశీలించారు. టీహాన్ ఆధ్వర్యంలో తయారుచేసిన అటానమస్ నావిగేషన్ వాహనాలు, డ్రోన్లు, ఈ సైకిళ్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఐఐటీహెచ్ ప్రాంగణంలో చోదకరహిత (డ్రైవర్‌లెస్ టెక్నాలజీతో నడిచే) వాహనంలో మంత్రి ప్రయాణించారు. విదేశాల్లో జరుగుతున్న పరిశోధనలకు దీటుగా.. ఐఐటీహెచ్ పరిశోధకులు తయారుచేసిన డ్రైవర్‌లెస్ టెక్నాలజీ అద్భుతంగా ఉందని కొనియాడారు. ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి సలహాలతో.. టీహాన్ అధినేత రాజ్యలక్ష్మి నేతృత్వంలోని పరిశోధకులు గ్రామీణ రోడ్లు, పట్టణాల్లోని ట్రాఫిక్‌పై మూడేళ్లపాటు అధ్యయనం చేసి, జీపీఎస్, సెన్సర్లు అమర్చి ఈ వాహనాలను అభివృద్ధి చేసినట్టు తెలిపారు. త్వరలోనే మన రహదారులపై చోదక రహిత వాహనాలు పరుగులు తీయడాన్ని చూస్తామని ఆయన పేర్కొన్నారు. ఐఐటీహెచ్ పరిశోధనలు రాష్ట్రంలో సాంకేతిక విప్లవాన్ని తీసుకొస్తాయని వ్యాఖ్యానించారు. పరిశ్రమలు, వాణిజ్య రంగాల్లో ఐఐటీహెచ్ శాస్త్రవేత్తల సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. సాంకేతికతను ఉపయోగించి హెల్త్‌కేర్, రెవెన్యూ, ట్రాన్స్‌పోర్ట్, వ్యవసాయ రంగాల్లో మెరుగ్గా ప్రజలకు సేవలు అందిస్తామని తెలిపారు. ఐఐటీహెచ్ శాస్త్రవేత్తలకు, పరిశోధకులకు తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని మంత్రి హామీ ఇచ్చారు. ఐఐటీ హైదరాబాద్ కోసం భూమి కావాలని కోరగా.. అప్పటి ప్రభుత్వ విప్ జగ్గారెడ్డి కందిలోని రైతులను ఒప్పించి దాదాపు 600 ఎకరాలు సేకరించి ఇచ్చారని గుర్తుచేశారు.



ఐఐటీ హైదరాబాద్‌లో డ్రైవర్ రహిత వాహనంలో శ్రీధర్ బాబు, జగ్గారెడ్డి

ఇప్పుడు మన దగ్గరా..

డ్రైవర్‌లెస్ కార్లంటే పాశ్చాత్యదేశాలే గుర్తొచ్చే పరిస్థితి. కానీ, ఐఐటీహెచ్ పరిశోధకుల కృషితో ఇప్పుడు ఆ సాంకేతిక పరిజ్ఞానం మనకూ అందుబాటులోకి వచ్చింది. 'టీ-హాన్'లో డ్రైవర్‌రహిత వాహనాలు రూపుదిద్దుకుంటున్నాయి.సోమవారం ఈ వాహనాలను ప్రయోగాత్మకంగా పరీక్షించారు. ఇందుకోసం టీ-హాన్ వద్ద ట్రాఫిక్ సిగ్నళ్లు, స్పీడ్ బ్రేకర్లు, గుంతలు, మూలమలుపుల రోడ్లను ఏర్పాటు చేశారు. ఈ వాహనాలు..దారిలో ఎదురొచ్చే పశువులు, మనుషులు, ఇతర వాహనాలను 40మీటర్ల దూరం నుంచే పసిగడతాయి. 15 మీటర్ల దూరంలో వాటంతటవే ఆగిపోతాయి. కాగా.. ఈ వాహనాలను ఐఐటీహెచ్ విద్యార్థులు, అధ్యాపకులు మెయిన్‌గేట్ నుంచి ఐఐటీహెచ్‌లోని అన్ని విభాగాలకూ చేరుకోవడానికి వినియోగిస్తున్నారు. ఇవే కాక..వినూత్న డ్రోన్లు, ఈ సైకిల్, ఈ బైక్‌లు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి వెల్లడించారు.

15 రోజుల్లోగా నియామకాలు!

- 2008 డీఎస్సీ బాధితులకు సీఎం కార్యాలయ అధికారుల హామీ
- డీఎస్సీ 2008 సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్ వెల్లడి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2008 బాధితులకు 15 రోజుల్లోగా నియామక ప్రక్రియను పూర్తి చేస్తామని సీఎం కార్యాలయ అధికారులు హామీ ఇచ్చినట్టు డీఎస్సీ 2008 సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు సభావాట్ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గత మార్చిలో తీసుకున్న నిర్ణయం మేరకు తమకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని 2008 డీఎస్సీ బాధితులు సోమవారం జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి వచ్చారు. డీఎస్సీ 2008 సాధన సమితి నేతృత్వంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 200మందికిపైగా అభ్యర్థులు సీఎం ఇంటి వద్దకు చేరుకోగా, వారితో సీఎం వ్యక్తిగత కార్యదర్శి జైపాల్ రెడ్డి చర్చలు జరిపారు. ఈ సందర్భంగా బాధితుల పక్షాన శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ.. డీఎస్సీ 2008 బాధితులకు ఉద్యోగాలు ఇవ్వాలని హైకోర్టు ఈ ఏడాది ఫిబ్రవరి 8న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అయితే తమకు ఉద్యోగాలు ఇవ్వలేదని, తెలంగాణ అడ్వకేట్ జనరల్ హైకోర్టు ధర్మాసనానికి తెలిపిన గడువు మంగళవారంతో ముగుస్తుందని తెలిపారు. ప్రభుత్వం తమకు ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. బాధితుల నుంచి వివరాలు సేకరించిన అనంతరం ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశంతో మాట్లాడి వివరాలు తీసుకున్నారు. సంబంధిత ఇతర అధికారులతోనూ చర్చలు జరిపారు. వచ్చే వారం రోజుల్లో క్యాబినెట్ సబ్ కమిటీ నుంచి నివేదిక తీసుకొని 15 రోజుల్లో డీఎస్సీ 2008 బాధితులకు నియామక ప్రక్రియ పూర్తి చేస్తామన్నట్లు తెలిసింది.

హైదరాబాద్ కిమ్స్‌లో నాందేడ్ ఎంపీ వసంతరావ్ చవాన్ కన్నుమూత



హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నేత, నాందేడ్ లోక్‌సభ ఎంపీ వసంతరావ్ చవాన్ (70) సోమవారం కన్నుమూశారు. శ్వాసకోశ, మూత్రపిండాల సమస్యలతో బాధపడుతున్న ఆయన పదిరోజులుగా గచ్చిబౌలిలోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం పరిస్థితి విషమించి తుదిశ్వాస విడిచినట్లు డాక్టర్లు ప్రకటించారు.

అక్టోబరులో బీజేపీకి కొత్త నాయకత్వం

- సంఘ్‌తో సన్నిహితుడికే అధ్యక్ష పదవి!
- ఈ సారి రాంమాధవ్‌కు కీలక బాధ్యతలు?

న్యూఢిల్లీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీకి నూతన అధ్యక్షుడి నియామకంపై కసరత్తు దాదాపు పూర్తయింది. కానీ, హరియాణా, జమ్మూకశ్మీరు అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాతే బీజేపీ కొత్త నాయకత్వం బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. సెప్టెంబరు 1 నుంచి 27 వరకు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం, అక్టోబరు మొదటివారంలో హరియాణా, కశ్మీర్ ఎన్నికల ప్రక్రియ పూర్తికానున్నాయి. జేపీ నడ్డా స్థానంలో కొత్త అధ్యక్షుడి నియామకంపై పార్టీ అగ్రనేతల కసరత్తు దాదాపు పూర్తయినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అయితే రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాతే నూతన అధ్యక్షుడిని నియమిస్తారని తెలుస్తోంది. పార్టీ అధ్యక్షుడిగా యూపీ డిప్యూటీ సీఎం కేశవ్‌ప్రసాద్ మౌర్యను మోదీ, అమిత్ షా ప్రతిపాదించినప్పటికీ సంఘ్ నాయకత్వం తిరస్కరించినట్లు తెలిసింది. సంఘ్‌తో బలమైన సంబంధాలున్న నేతకే బీజేపీ అధ్యక్ష పదవి కట్టబెట్టాలని, ఈ సారి ఉత్తరాది నుంచి కాకుండా దక్షిణాది వారికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆరెస్సెస్ పెద్దలు భావిస్తున్నట్లు సమాచారం. అయితే మధ్యేమార్గంగా మళ్లీ రాజ్‌నాథ్ సింగ్ వంటి నేతకు అవకాశం ఇవ్వాలని, ఆయన మిత్రపక్షాలతో కూడా స్నేహ సంబంధాలు నెలకొల్పగలరని మోదీ, అమిత్ షా సూచించినట్లు తెలిసింది. కాగా, గత కొన్నేళ్లుగా బీజేపీకి దూరం పెట్టిన ఆరెస్సెస్ నేత రాంమాధవ్‌ను మళ్లీ జమ్మూకశ్మీర్ ఇన్‌చార్జిగా నియమించడంపై రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కొత్త టీంలో భాగంగా రాంమాధవ్‌కు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

యువకుడి కడుపులో కత్తి, నెయిల్ కట్టర్, కీచెయిన్

- సర్జరీ చేసి బయటికి తీసిన వైద్యులు

మోతిహరి, బిహార్, ఆగస్టు 26: మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న బిహార్‌కి చెందిన ఓ యువకుడు... కొన్నాళ్లుగా లోహ వస్తువులను మింగటం అలవాటు చేసుకున్నాడు. తీరా తీవ్ర కడుపునొప్పి వచ్చి ఆస్పత్రిలో చేరడంతో... అతని కడుపులో ఓ కత్తి, నెయిల్ కట్టర్లు, తాళం చెవులు ఉన్నట్లు గుర్తించిన వైద్యులు సర్జరి చేసి వాటిని బయటికి తీశారు. ఈ ఘటన బిహార్‌లోని తూర్పు చంపారన్ జిల్లాలో జరిగింది. కొన్ని రోజుల క్రితం 22 ఏళ్ల యువకుడు తీవ్రమైన కడుపు నొప్పితో మోతిహరిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. ఎక్స్‌రే తీసిన వైద్యులు అతని కడుపులో పలు లోహ వస్తువులున్నట్లు గుర్తించారు. దీంతో ఆదివారం సర్జరీ చేసి వాటిని తొలగించారు. "ఎక్స్‌రే రిపోర్టు ద్వారా అతని కడుపులో వస్తువులున్నట్లు తెలిసింది. ముందుగా ఒక కీచెయిన్ రింగ్‌ను తీసేశాం. తర్వాత రెండు తాళంచెవులు బయటపడ్డాయి. ఆ తర్వాత నాలుగు అంగుళాల పొడవున్న కత్తి, రెండు నెయిల్ కట్టర్లు వెలికితీశా"మని ఆపరేషన్‌కు నేతృత్వం వహించిన డాక్టర్ అమిత్ కుమార్ వివరించారు.

బాబు భద్రత గాలిలో దీపమా?

ఏపీ సీఎంకు కేటాయించిన హెలికాప్టర్‌పై సందేహాలు.. పనితీరు అంచనాలో వైఫల్యం.. పుణె వద్ద ప్రమాదం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత శనివారం ముంబై నుంచి విజయవాడకు వస్తూ పుణె వద్ద ఓ హెలికాప్టర్ కుప్పకూలిన విషయం గుర్తుందా? అదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో ప్రాణనష్టం జరగలేదు. అయితే దిగ్భ్రాంతి కలిగించే విషయం ఏంటంటే... ఈ హెలికాప్టర్‌ను ఏవియేషన్ అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబు కోసం తెప్పిస్తున్నారు. ఒకవేళ చంద్రబాబు ప్రయాణించే సమయంలో ప్రమాదం జరిగి ఉంటే...? ఈ ఊహే తీవ్ర భయాందోళనను రేకెత్తిస్తోంది! జెడ్‌ప్లస్ కేటగిరి రక్షణ ఉన్న ముఖ్యమంత్రి, సీనియర్ నాయకుడి భద్రత విషయంలో అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. సాధారణంగా ముఖ్యమంత్రి స్థాయి నాయకులకు భారీ భద్రత ఉంటుంది. జెడ్ ప్లస్ కేటగిరిలో ఉన్నవారికైతే మరింత పటిష్ఠమైన భద్రత కల్పిస్తారు. ముఖ్యమంత్రి ప్రయాణించే వాహనాల కాన్వాయ్ నుంచి హెలికాప్టర్ వరకు ప్రతిదీ పరిశీలించి, సురక్షితమని నిర్ధారించుకున్న తర్వాతే వినియోగిస్తారు. కానీ చంద్రబాబుకు కేటాయించిన హెలికాప్టర్ విషయంలో ఉన్నతాధికారుల ఉదాసీనతపై తీవ్ర విమర్శలొస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అద్దెకు తెచ్చుకున్న హెలికాప్టర్‌కు స్టాండ్‌బైగా ముంబై నుంచి వచ్చిన హెలికాప్టరే పుణె వద్ద ప్రమాదానికి గురైంది. గత ప్రభుత్వం అద్దెకు తెచ్చుకున్న హెలిక్యాపర్‌నే చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత కొనసాగిస్తున్నారు. ప్రతి వెయ్యి గంటలు ప్రయాణం చేశాక దాన్ని సర్వీసు చేయాల్సి ఉంటుంది. హెలికాప్టర్ ప్రొవైడ్ చేసే జీఎంఆర్ సంస్థ సర్వీసు కోసం ముంబైకు పంపింది. సర్వీసు పూర్తి అయ్యే లోపు స్టాండ్‌బై కోసం మరో హెలికాప్టర్‌ను ఆంధ్రప్రదేశ్‌కు పంపించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే హెలికాప్టర్ సామర్థ్యం, పనితీరు అంచనా వేయడంలో అధికారులకు నైపుణ్యం లేకపోవడంతో పాటు నిబంధనలు పాటించలేదనే విమర్శలు ఉన్నాయి. సరైన హెలికాప్టర్‌ను ఎంపిక చేసుకోవడంలో విఫలమయ్యారు. వాస్తవానికి 10 ఏళ్ల కంటే ఎక్కువ సర్వీసు ఉన్న హెలికాప్టర్‌ను అద్దెకు తీసుకోరాదన్న నిబంధనలున్నాయి. అయితే ఏవియేషన్ అధికారులు వీటిని విస్మరించి గ్లోబల్ వెక్ట్రా అనే సంస్థ నుంచి వీటీ-జీవీఐ, ఏడబ్ల్యూ 139 2008 మోడల్ హెలికాప్టర్‌ను విజయవాడలో ల్యాండ్ చేసుకునేందుకు ఈ నెల 24న అనుమతి తీసుకున్నారు. అదే రోజు ముంబై నుంచి హైదరాబాద్‌కు వచ్చి ఆ తర్వాత విజయవాడకు రావాలని నిర్ణయించారు. అయితే ముంబై నుంచి వస్తున్నప్పుడు పుణె జిల్లా పౌడ్ గ్రామం వద్ద హెలికాప్టర్ అతి తక్కువ ఎత్తులో నుంచి కూలిపోయింది. ఇంత తక్కువ ఎత్తులో నుంచి కూలినప్పుడు హెలికాప్టర్ పూర్తిగా ధ్వంసం కావడంపై నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



భద్రత చర్యలపై అనుమానాలు

వాస్తవానికి చంద్రబాబు ప్రయాణించే రెగ్యులర్ హెలికాప్టర్ ప్రమాదానికి గురి కాకపోయినప్పటికీ, స్టాండ్‌బై కోసం తెచ్చిన హెలికాప్టర్ కూలిపోవడంతో ఏవియేషన్ అధికారుల భద్రత చర్యలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఐఅండ్‌ఐ సంస్థలో పనిచేసే ఓ జాయింట్ డైరెక్టర్ స్థాయి అధికారి ఏవియేషన్ బాధ్యతలు చేపడుతున్నారు. ఏవియేషన్‌పై పెద్దగా అవగాహన లేని అధికారులు బాధ్యతలు చేపట్టడంతో ఈ పరిస్థితి నెలకొందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. వాస్తవానికి ప్రొటోకాల్, ఏవియేషన్ ఎండీగా ఒకే అధికారి వ్యవహరిస్తున్నారు. గతంలో చంద్రబాబు హయాంలో ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేసే కల్నల్ ఈ బాధ్యతలు నిర్వర్తించేవారు. అప్పట్లో వాతావరణంలో ఏమాత్రం తేడా ఉన్నా హెలికాప్టర్‌లో ప్రయాణానికి అనుమతించే వారు కాదు. ప్రతికూల వాతావరణం కారణంగా మూడుసార్లు ముఖ్యమంత్రి నెల్లూరు పర్యటనకు హెలికాప్టర్‌లో వెళ్లడానికి అనుమతించలేదు. అప్పట్లో అధికారులు అంత అప్రమత్తంగా ఉండేవారు. వైఎస్ హెలికాప్టర్ ప్రమాదం తర్వాత రాష్ట్ర అధికారులు హెలికాప్టర్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకునేవారు. అయితే వైసీపీ సర్కార్ వచ్చిన తర్వాత నియమించిన అధికారులకు అంతగా అవగాహన లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. జెడ్‌ప్లస్ కేటగిరి ఉన్న సీఎం చంద్రబాబు విషయంలో అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏంటని టీడీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఏవియేషన్‌లో సీనియర్ అధికారులను నియమించాల్సిన అవసరముందని అభిప్రాయపడుతున్నారు.

కృష్ణా బేసిన్‌లో పెరుగుతున్న వరద

- శ్రీశైలానికి లక్ష క్యూసెక్కులకుపైగా ఇన్ ఫ్లో
- నేడు, రేపు అక్కడక్కడా మోస్తరు వర్షాలు
- 29, 30న పలు జిల్లాల్లో భారీ వానలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

కృష్ణా, భీమా నది ఎగువ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కృష్ణా నదికి మళ్లీ వరద పెరుగుతోంది. కర్ణాటకలోని ఆల్మట్టి జలాశయానికి సోమవారం 1,32,324 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 1,30,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 129.72 టీఎంసీలకుగాను 127.1 టీఎంసీల నీరు ఉంది. నారాయణపూర్ జలాశయానికి 1,23,596 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో.. 1,30,000 క్యూసెక్కుల ఔట్ ఫ్లో నమోదైంది. జలాశయం సామర్థ్యం 37.64 టీఎంసీలు కాగా 36.9 టీఎంసీల నీరు ఉంది. గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టుకు 1,20,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. జలాశయం నుంచి 1,21,978 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 9.66 టీఎంసీలకు గాను 7.85 టీఎంసీల నీరు ఉంది. శ్రీశైలం ప్రాజెక్టుకు 1,32,281 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా విద్యుత్ ఉత్పత్తి ద్వారా 76,052 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 215 టీఎంసీలు కాగా నీటి నిల్వ 210.03 టీఎంసీలకు చేరింది. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 66,051 క్యూసెక్కుల నీరు చేరుతోంది. రిజర్వాయర్ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా ప్రస్తుతం 311.4 టీఎంసీల నీరు ఉంది. సాగర్ నుంచి 49,338 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. ఇక, గోదావరి బేసిన్‌లో కాళేశ్వరం వద్ద గల మేడిగడ్డ బ్యారేజీలోకి 3.10 లక్షల క్యూసెక్కుల ఇన్ ఫ్లో చేరుతుండగా.. 85 గేట్లను ఎత్తి అంతే నీటిని వదులుతున్నారు. నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 24వేల క్యూసెక్కుల వరద వస్తోంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మిడ్ మానేరుకు నాలుగు మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు.

31దాకా రాష్ట్రానికి యెల్లో అలర్ట్..

రాష్ట్రంలో మంగళ, బుధ వారాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ నెల 31 వరకు రాష్ట్రానికి యెల్లో అలర్ట్ జారీ చేసింది. 29, 30న భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. 29న ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. 30న ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- పోస్ట్ గ్రాడ్యుయేట్(పీజీ), పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. పీజీలో ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎంటెక్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. పీజీ కోర్సుల వ్యవధి రెండేళ్లు. పీహెచ్‌డీ వ్యవధి మూడేళ్లు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

ఎన్‌జీ రంగా వర్సిటీలో పీజీ పీహెచ్‌డీ



క్యాంపస్‌లు

- అగ్రికల్చరల్‌కాలేజ్(బాపట్ల/నైరా/మహానంది)
- ఎస్వీ అగ్రికల్చరల్ కాలేజ్, తిరుపతి
- అడ్వాన్స్‌డ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ సెంటర్, లాం, గుంటూరు
- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్, తిరుపతి
- డా.ఎన్‌టీఆర్ కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, బాపట్ల

పీజీ ప్రోగ్రామ్‌లు

ఎమ్మెస్సీ(అగ్రికల్చర్): ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 137 సీట్లు ఉన్నాయి. వీటిలో ప్లాంట్ సైన్సెస్ 45, ఫిజికల్ సైన్సెస్ 11, ప్లాంట్ బయోటెక్నాలజీ 12, ఎంటమాలజీ అండ్ నెమటాలజీ 15, అగ్రానమీ 25, సోషల్ సైన్సెస్ 25, స్టాటిస్టికల్ సైన్సెస్ 4 సీట్లు ఉన్నాయి. అగ్రికల్చర్ విభాగంలో నాలుగేళ్ల వ్యవధిగల బీఎస్సీ/బీఎస్సీ ఆనర్స్ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. బీఎస్సీ(హార్టికల్చర్/సెరికల్చర్/ఫారెస్ట్రీ/సీఏ&బీఎం) పూర్తి చేసినవారు కూడా అర్హులే.

ఎమ్మెస్సీ(కమ్యూనిటీ సైన్స్): మొత్తం 14 సీట్లు ఉన్నాయి. వీటిలో ఫుడ్ అండ్ న్యూట్రిషన్ 6, హ్యూమన్ డెవలప్‌మెంట్ అండ్ ఫ్యామిలీ స్టడీస్ 3, రిసోర్స్ మేనేజ్‌మెంట్ అండ్ కన్స్యూమర్ సైన్స్ 3, ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్ మేనేజ్‌మెంట్ 2 సీట్లు ఉన్నాయి. నాలుగేళ్ల వ్యవధిగల బీఎస్సీ(హోంసైన్స్)/బీఎస్సీ ఆనర్స్(హోం సైన్స్/కమ్యూనిటీ సైన్స్) పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్): మొత్తం 14 సీట్లు ఉన్నాయి. వీటిలో సాయిల్ అండ్ వాటర్ ఇంజనీరింగ్ 5, ప్రాసెసింగ్ అండ్ ఫుడ్ ఇంజనీరింగ్ 6, ఫాం మెషినరీ అండ్ పవర్ ఇంజనీరింగ్ 3 సీట్లు ఉన్నాయి. అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ విభాగంలో నాలుగేళ్ల బీటెక్/బీటెక్ ఆనర్స్ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

ఎంటెక్(ఫుడ్ టెక్నాలజీ): ఈ ప్రోగ్రామ్‌లో 3 సీట్లు ఉన్నాయి. బీటెక్(ఫుడ్ టెక్నాలజీ)/బీటెక్ ఆనర్స్ ఫుడ్ టెక్నాలజీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంబీఏ(అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్): మొత్తం 18 సీట్లు ఉన్నాయి. నాలుగేళ్ల వ్యవధిగల(బీఎస్సీ/బీఎస్సీ ఆనర్స్)(అగ్రికల్చర్)/బీఎస్సీ(హార్టికల్చర్/ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ/సీఏ అండ్ బీఎం)/(బీటెక్/బీటెక్ ఆనర్స్)(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్)/బీవీఎస్సీ అండ్ ఏహెచ్/బీఎఫ్ఎస్సీ/బీహెచ్ఎస్సీ/బీసీఎస్సీ/బీటెక్ (డెయిరీ/ఫుడ్ టెక్నాలజీ) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు

అగ్రికల్చర్: ఈ విభాగంలో మొత్తం 39 సీట్లు ఉన్నాయి. వీటిలో జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్ 7, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ 1, ప్లాంట్ పాథాలజీ 5, ఎంటమాలజీ 4, ప్లాంట్ ఫిజియాలజీ 2, మాలిక్యులర్ బయాలజీ అండ్ బయోటెక్నాలజీ 3, మైక్రోబయాలజీ 1, అగ్రానమీ 5, సాయిల్ సైన్స్ 3, అగ్రికల్చరల్ ఎకనామిక్స్ 3, అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్ 3, అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్ 2 సీట్లు ఉన్నాయి.

అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ: ఇందులో సాయిల్ అండ్ వాటర్ కన్జర్వేషన్ ఇంజనీరింగ్ 1, ప్రాసెసింగ్ అండ్ ఫుడ్ ఇంజనీరింగ్ 1, ఫాం మెషినరీ అండ్ పవర్ ఇంజనీరింగ్ 2 చొప్పున మొత్తం 4 సీట్లు ఉన్నాయి.

కమ్యూనిటీ సైన్స్: ఇందులో ఫుడ్ అండ్ న్యూట్రిషన్ 1, హ్యూమన్ డెవలప్‌మెంట్ అండ్ ఫ్యామిలీ స్టడీస్ 1, ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్ మేనేజ్‌మెంట్ 2 చొప్పున నాలుగు సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: సంబంధిత స్పెషలైజేషన్‌తో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసిన వారు పీహెచ్‌డీకి అప్లయ్ చేసుకోవచ్చు. పీజీ స్థాయిలో కనీసం 60 శాతం మార్కులు ఉండాలి.

ఎంపిక వివరాలు

- ఐకార్ నిర్వహించే ఆలిండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(ఏఐఈఈఏ)/ఆలిండియా కాంపిటీటివ్ ఎగ్జామినేషన్(ఏఐసీఈ) స్కోర్, అకడమిక్ ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.
- పీజీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి ఏఐఈఈఏ స్కోర్‌కు 70%, అకడమిక్ ప్రతిభకు 30% వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- ఎంబీఏ ప్రోగ్రామ్‌నకు మాత్రం అకడమిక్ ప్రతిభకు 30%; ఏఐఈఈఏ స్కోర్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలకు 70% వెయిటేజీ ఇస్తారు.
- డాక్టోరల్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి డిగ్రీ మార్కులకు 10%, పీజీ మార్కులకు 30%, ఐకార్ ఏఐసీఈ స్కోర్‌కు 50%, ఇంటర్వ్యూకి 10% వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- అభ్యర్థుల వయసు 2024 జూలై 1 నాటికి 40 ఏళ్లు మించకూడదు.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.1500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.750
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 13
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 17
- **సర్టిఫికెట్ల వెరిఫికేషన్:** సెప్టెంబరు 18 నుంచి 23 వరకు
- **అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల:** సెప్టెంబరు 24
- **పీహెచ్‌డీ ఇంటర్వ్యూలు:** సెప్టెంబరు 24 నుంచి 27 వరకు
- **ఎంబీఏ ప్రోగ్రామ్‌నకు గ్రూప్ డిస్కషన్స్, ఇంటర్వ్యూలు:** అక్టోబరు 8
- **ఫిజికల్ కౌన్సెలింగ్:** అక్టోబరు 9
- **చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్.జీ.రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు-522034
- **వెబ్‌సైట్:** angrau.ac.in

నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్‌లో పీజీ డిప్లొమా



హైదరాబాద్-పంజాగుట్టలోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్)- పారా మెడికల్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ న్యూక్లియర్ మెడిసిన్ టెక్నాలజీ(పీజీడీఎన్ఎంటీ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొత్తం 8 సీట్లు ఉన్నాయి. తెలంగాణ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి బీఎస్సీ(ఏదేని సైన్స్ సబ్జెక్ట్‌లు/లైఫ్ సైన్సెస్) ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 20 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు వర్తిస్తుంది.

ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 60 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. బయలాజికల్ సైన్సెస్ నుంచి 20 మార్కులకు; ఫిజికల్ సైన్సెస్ నుంచి 20 మార్కులకు; కమ్యూనిటీ మెడిసిన్, బయో స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్సెస్ జనరల్ నాలెడ్జ్, ఇంగ్లీష్ అంశాల నుంచి 20 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. డిగ్రీ సిలబస్ ఆధారంగా ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. పరీక్ష సమయం గంట. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే జనరల్, బీసీ అభ్యర్థులకు కనీసం 50 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు రావాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.5000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.4,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 2
- **దరఖాస్తు హార్డు కాపీ చేరేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 5
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** అక్టోబరు 18 నుంచి
- **ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ తేదీ:** అక్టోబరు 23
- **ఫలితాలు విడుదల:** అక్టోబరు 25
- **అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల:** అక్టోబరు 29
- **కౌన్సెలింగ్ లెటర్స్ విడుదల:** నవంబరు 1
- **కౌన్సెలింగ్ తేదీ:** నవంబరు 5
- **తరగతులు ప్రారంభం:** నవంబరు 11 నుంచి
- **చిరునామా:** అసోసియేట్ డీన్, అకడమిక్-2, రెండో అంతస్తు, పాత ఓపీడీ బ్లాక్, నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, హైదరాబాద్-500082.
- **వెబ్‌సైట్:** www.nims.edu.in

ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజంలో కోర్సులు

హైదరాబాద్‌లోని ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజం(ఏపీసీజే)- వివిధ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు ఉన్నాయి. రెగ్యులర్, దూరవిద్య విధానాల్లో కోర్సులు చేయవచ్చు. ఆన్‌లైన్ మోడ్‌లో తరగతులు నిర్వహిస్తారు. తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాలు ఎంచుకోవచ్చు.

పీజీ డిప్లొమా ఇన్ జర్నలిజం: కోర్సు వ్యవధి ఏడాది. డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమా ఇన్ జర్నలిజం: కోర్సు వ్యవధి ఆర్నెల్లు. డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమా ఇన్ టీవీ జర్నలిజం: కోర్సు వ్యవధి ఆర్నెల్లు. డిగ్రీ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు.


సర్టిఫికెట్ కోర్స్ ఆఫ్ జర్నలిజం: కోర్సు వ్యవధి మూడు నెలలు. పదోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **ప్రాస్పెక్టస్, దరఖాస్తు ఫారం పొందేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 2
- **ఆన్‌లైన్ అడ్మిషన్ పొందేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 6
- **మొబైల్ నెం:** 98485 12767, 72860 13388
- **వెబ్‌సైట్:** www.apcj.in

గ్రూప్-1 మెయిన్స్ ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ

ఉమ్మడి పౌరస్మృతి
‘ఒకే దేశం - ఒకే చట్టం’



టీజీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

(నిన్నటి దిక్సూచి తరువాయి)

ఉమ్మడి పౌరస్మృతి-చారిత్రక పరిణామం
(రాజ్యాంగ పరిషత్ నుంచి 17వ లోక్‌సభ వరకు)

★ ఉమ్మడి పౌరస్మృతి అనే అంశం మన దేశానికి స్వాతంత్ర్యం రాక ముందు నుంచే చర్చనీయాంశంగా ఉంది. ఆనాటి కాలంలో హిందూ మహిళలకు విడాకులు తీసుకునే హక్కు ఉండేది కాదు. దాంతో ఉమ్మడి పౌరస్మృతి తేవాలనే డిమాండ్ తొలుత అఖిలభారత మహిళా కాన్ఫరెన్స్ నుంచి వచ్చింది. దీంతో రాజ్యాంగ కమిటీ విస్తృతంగా చర్చించింది. రాజ్యాంగ నిర్ణయసభలో సభ్యునిగా ఉన్న నజీరుద్దీన్ అహ్మద్ ఉమ్మడి పౌరస్మృతి కోసం డిమాండ్ చేశారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలోని సబ్ కమిటీ ఉమ్మడి పౌరస్మృతిని ప్రాథమిక హక్కుల్లో చేర్చాలా వద్దా అనే అంశంపై ఓటింగ్ నిర్వహించింది. 5-4 ఓట్ల తేడాతో అది వీగిపోయింది. దాంతో ఉమ్మడి పౌరస్మృతిని ప్రాథమిక హక్కులకు బదులుగా ఆదేశిక సూత్రాల్లో చేర్చారు. తదనంతర కాలంలో నెహ్రూ ‘ఆధునిక పౌరస్మృతి’ పేరిట కొత్త చట్టం తేవాలని ప్రయత్నించారు. కొన్ని వర్గాలు వ్యతిరేకించడంతో ఈ ప్రయత్నమూ ముందుకు సాగలేదు. 1964లో ‘ముస్లిం పర్సనల్ లా’పై ఢిల్లీలో ఒక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దేశ, విదేశీ ప్రతినిధులు పాల్గొని విస్తృతంగా చర్చించారు. ఉమ్మడి పౌరస్మృతి అమలుకే మెజార్టీ సభ్యులు మొగ్గు చూపారు. మరోవైపు 1985లో షాబానో, 1995లో సరళా ముద్గల్ కేసుల్లో యూనిఫాం సివిల్ కోడ్(యూసీసీ)ను అమలు చేయాల్సిన అవసరం ఉన్నదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

★ ఇదే అంశంపై 2018లో 21వ లా కమిషన్ ఒక నివేదికను సమర్పించింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఉమ్మడి పౌరస్మృతి అవసరం లేదని ఆ నివేదికలో పేర్కొంది. మరోవైపు 2023 జూలై 3న పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్ సుశీల్ మోదీ యూనిఫాం సివిల్ కోడ్(యూసీసీ) నుంచి గిరిజన తెగలను మినహాయించాలని సిఫార్సు చేశారు. ప్రస్తుతం 22వ లా కమిషన్ దీనిపై అధ్యయనం కొనసాగిస్తుంది.

★ ఈ విధంగా ఉమ్మడి పౌరస్మృతికి సంబంధించి అనేక చర్చలు, వాదోపవాదాలు ముందుకు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో మన రాజ్యాంగంలోని నిబంధనలు ఉమ్మడి పౌరస్మృతికి సంబంధించి ఏం చెబుతున్నాయనే ఆసక్తి సహజంగానే అందరిలో కలుగుతుంది. ఇందుకు సామాజిక, రాజకీయ ఆసక్తులు ప్రధాన కారణం కావచ్చు. లేదా అనేక సందర్భాల్లో సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలు మరో కారణం కావచ్చు. 22వ లా కమిషన్ ఈ అంశంపై విస్తృత అధ్యయనం చేస్తుండడంతో... గతంలో 21వ లా కమిషన్ చెప్పిన దానికి భిన్నంగా ప్రకటించే అవకాశముందా అనే సంశయం; ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉమ్మడి పౌరస్మృతిపై చేసిన చట్టం రాజ్యాంగంలోని 44వ ఆర్టికల్‌పై దృష్టి సారించేలా చేసింది.

★ **ఆర్టికల్ 44:** 'The state shall endeavour to secure the citizen a uniform civil code through the territory of India'. దీని అర్థం ‘భారతదేశంలోని పౌరులందరికీ ఒకేవిధమైన పౌరస్మృతిని తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నించాలి. ఇక్కడ మనం గుర్తించాల్సింది ఏమంటే ఈ వ్యాఖ్యల్లో యూనిఫాం(ఒకేవిధమైన) అనే పదం ఉంది. కామన్(ఉమ్మడి) అనే పదం లేదు. ఇండీవియర్- ప్రయత్నం, షల్ సెక్యూర్ అని కాకుండా ‘షల్ ఇండీవియర్ టు సెక్యూర్’ ఉండటాన్ని మనం గమనించాలి.


★ వ్యక్తిగత జీవితంలో అనుసరించాల్సిన ధర్మాల గురించి అన్ని మతాలు పేర్కొంటున్నాయి. ఆ మేరకు వ్యక్తిగత చట్టాలనూ అవి రూపొందించుకుంటున్నాయి. వీటిలో వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత, పిల్లల సంరక్షణ గురించిన చట్టాలు ముఖ్యమైనవి. భారతీయ సమాజంలో ఉన్న భిన్న రీతుల నేపథ్యంలో భిన్న వ్యక్తిగత చట్టాలు రూపుదిద్దుకున్నాయి. వీటితో పాటు నాగరిక జీవనానికి దూరంగా ఉన్న ఆదివాసీ(గిరిజనులు)ల సాంస్కృతిక, సామాజిక జీవనానికి నష్టం కలగని రీతిలో తీసుకొచ్చిన ప్రత్యేక చట్టాలు కూడా ఉన్నాయి. మరోవైపు గిరిజన ప్రాంతాల పరిపాలన నిమిత్తం రాజ్యాంగంలోని 5వ, 6వ షెడ్యూళ్లలో కొన్ని అంశాలను ప్రస్తావించారు. వీటి ప్రకారం ప్రత్యేక ప్రాంతాల్లో నివసించే గిరిజనుల వివాహ, విడాకుల, వారసత్వం... వంటి సాంఘిక ఆచారాలపై చట్టాలు చేసే అధికారాలను ఆయా జిల్లా మండళ్లు, ప్రాంతీయ మండళ్లకు కల్పించారు. అదే విధంగా గిరిజనుల మత, సాంఘిక, ఆచార, కట్టుబాట్ల విషయంలో నాగాలాండ్‌కు సంబంధించి ఆర్టికల్ 371ఏను, సిక్కింకు సంబంధించి ఆర్టికల్ 371ఎఫ్, మిజోరాంకు సంబంధించి 371జీను మన రాజ్యాంగంలో ప్రత్యేకంగా చేర్చారు.

★ ఈ సందర్భంగా ఇక్కడ మరో విషయాన్ని కూడా చెప్పుకోవాలి. అమలులో ఉన్న ‘హిందూ మ్యారేజెస్ యాక్ట్ 1955; హిందూ సక్సెషన్, మైనారిటీస్, గార్డియన్‌షిప్ యాక్ట్ 1956; అడాప్షన్స్ అండ్ మెయింటెనెన్స్ యాక్ట్ 1956ల్లోని కొన్ని నిబంధనలను మార్చాల్సిన అవసరం ఉందని కొంతమంది పేర్కొంటున్నారు. ఉదాహరణకు కొడుకులతో సమానంగా కుమార్తెలకు సమాన ఆస్తిహక్కులు కల్పించడం, గృహహింస నుంచి మహిళలకు రక్షణ చట్టం(2005); బాల్య వివాహాల రద్దు చట్టం(2006); తల్లిదండ్రుల సీనియర్ పౌరుల పోషణ చట్టం(2007) అనే మూడు వ్యక్తిగత చట్టాలను సవరించడం ఆహ్వానించదగ్గ విషయం. ఇంకా మరికొన్ని వ్యక్తిగత చట్టాలకు సవరణలు తీసుకురావాల్సిన అవసరం ఉంది. అయితే భారతదేశ వైవిధ్య సంస్కృతిని కాపాడుకుంటూ వ్యక్తిగత చట్టాలను సవరించాలి.



డాక్టర్ సుంకర రమాదేవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్

లిటిల్స్



దుప్పి తెలివి

అనగనగా ఒక అడవిలో రాకీ అనే దుప్పి ఉండేది. అది చాలా తెలివైనది మరియు చురుకైనది. ఒక రోజు రాకీ ఆహారం కోసం వెతుక్కుంటూ చాలా దూరం పోయింది. అంతలోగా వర్షం రావడంతో దగ్గరలో కనిపించిన గుహలోకి వెళ్లి తల దాచుకుంది.


కాసేపయ్యాక గుహ బయటకు తొంగి చూస్తే, బయట ఒక పులి నించుని గుహవైపే చూస్తూ కనిపించింది. గుహ లోపల చీకటిగా ఉండటంతో తాను పులికి కనిపించే అవకాశం లేదని కొంత ధైర్యం తెచ్చుకున్న దుప్పి ఏదో ఒకలాగా అక్కడి నుండి బయట పడితేగానీ తన ప్రాణాలు దక్కవు అనుకున్నది. గుహ లోపలికి జరిగి, గంభీరంగా గొంతు మార్చి ఇలా అన్నది. మన ముగ్గురం పులిని వేటాడి తిని చాలా కాలమైంది ఈ సమయంలో పులి ఏదైనా కనపడితే, మన పంట పండినట్టే. అన్నట్టు పులి గుండె మాత్రం నేనే తింటాను, ఇప్పటికి తొంభై తొమ్మిది పులుల గుండెలు తిన్నాను. ఇవాళ వంద పూర్తి చేస్తాను’ అన్నది. ఆ మాటలన్నీ గుహ బయట ఉండి విన్న పులి గుహ లోపల తనను వేటాడి తినగల పెద్ద జంతువు ఏదో ఉందనుకుని భయపడింది.

మరికొంత సేపటికి అక్కడికి ఒక తోడేలు వచ్చి, ఏమిటి అలా భయపడుతూ నించున్నావు అని అడిగింది, దానికి పులి జవాబు చెప్పే లోపలే గుహ లోపలనుండి దుప్పి మళ్లీ గొంతు మార్చి, ‘మీరిద్దరూ ఇక్కడే ఉండండి ఇవాళ పులి దొరక్కపోతే ఒక తోడేలు దొరికినా మన ఆకలి తీరినట్టే’ అన్నది. ఆ మాటలు వినగానే పులి, తోడేలు రెండూ కలసి అక్కడినుండి అడవిలోకి పరుగు తీశాయి. అలా తెలివైన దుప్పి రాకీ తన ఉపాయంతో ఆ రోజు పులి మరియు తోడేలు బారినుండి తన ప్రాణాలను కాపాడుకుంది.

10 తేడాలను కనిపెట్టండి




దారి కనుక్కోండి



సరైన నీడను గుర్తించండి



ఒకేలా ఉన్న బొమ్మలు ఎన్ని?



డైలీ సుడోకు - 394

					5			
		6				1		8
	8				7		2	3
7	5				6			
2			9		8			6
			2				7	1
5	3		7				9	
6		2				8		
			3					

సుడోకు - 393 సమాధానం

1	6	4	3	2	5
5	2	3	1	6	4
3	1	6	5	4	2
4	5	2	6	3	1
6	4	1	2	5	3
2	3	5	4	1	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.